


మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue. 6 - June 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
   (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics
   and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# నాయని కృష్ణకుమారి

జానపద వాఙ్మయానికి

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. నల్లగొండ జిల్లా నవలా సాహిత్యం | - పంతంగి వెంకటేశ్వర్లు | 5 |
| 2. జానపద సాహిత్యం - సామాజిక చైతన్యం | - డా॥. డి. విజయకుమారి | 8 |
| 3. మూలమలుపు - ఒక ప్రతీకాత్మక దృశ్యమానం | - డా॥. వి. త్రివేణి | 14 |
| 4. జానపదుల 'భాషా సారస్వతములు' | - డా॥. పాలెం వేణుగోపాల్ | 25 |
| 5. అతి నవ్య కవిత్వానికి కళాదీపిక పత్రిక దోహదం | - బి. శ్రీనివాసులు | 34 |
| 6. తెలుగులో పౌరాణిక నవల - సామాజిక చైతన్యం | - సిహెచ్. పూర్ణచంద్రరావు | 40 |
| 7. అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిమ్నతీకరణంలో | - డా॥. పి.ఎ. సత్యనారాయణ | 44 |
| 8. తెలుగు గిరిజన నవలలు - హక్కుల నిరాకరణ | - డా॥. వై. సుభాషిణి | 47 |
| 9. జగిత్యాల జిల్లా జాతరలు | - జె. లక్ష్మీనర్సయ్య | 51 |
| 10. తెలంగాణ ఉద్యమం - సంఘీభావ కథ | - జె. శంకర్ | 54 |
| 11. ఓల్గా కథలు - స్త్రీ అణచివేత ధోరణి చిత్రణ | - కె. నరేష్ | 59 |
| 12. కొలకలూరి ఆకలి కథ - సమాలోచనం | - కొండయ్య కోసూరు | 62 |
| 13. జానపద సాహిత్యము - పరిణామము | - సైదయ్య మల్లెపాకుల | 64 |
| 14. కథల్లో కుటుంబ జీవన చిత్రణ | - మామిడి విజేత | 68 |
| 15. తెలంగాణ సాహితీ ఉద్యమ నిర్మాత వట్టికోట ఆళ్వారుస్వామి | - మేరోజు బ్రహ్మచారి | 72 |
| 16. విద్యార్థి కవిత్వంలో పదచిత్రాలు | - ఎస్. గోదావరి | 76 |
| 17. సంస్కృత సాహిత్యానికి శ్రీభాష్యం విజయసారథి చేసిన కృషి | - నాగరాజు నాగజాహ్నవి | 79 |
| 18. జాషువా - దళిత కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి | - సూరేపల్లి పద్మావతి | 82 |
| 19. వింధ్యవాసినీ దేవి కవిత్వంలో నానీల వసంతం | - డా॥. పి. విజయకుమార్ | 87 |
| 20. విశ్వనాథవారి వీరవల్లుడు - ఒక సమాలోచన | - డా॥. కొమ్మనబోయిన సుజాత | 90 |
| 21. యువత - ఆధ్యాత్మికత | - డా॥. బి.యం.యం.ఆర్.యస్.టి.కె | 93 |
| 22. అపురూప కళారూపాల విధ్వంస దృశ్యం యక్షగానం | - డా॥. కందిమళ్ల సాంబశివరావు | 95 |
| 23. ఈతకోట సుబ్బారావు కవిత్వంలో విభిన్న దృక్పథాలు | - దేవరపల్లి రాజు | 100 |
| 24. శ్రీమద్భాగవతం - కృష్ణతత్వం | - డా॥. కొప్పు సుభాష్ చంద్రబోస్ | 105 |
| 25. జాషువా కవిత్వం - మానవత్వం | - సైదయ్య మల్లెపాకుల | 109 |
| 26. ఆధునిక సాహిత్యంలో ప్రసిద్ధ ధోరణులు - వాదాలు | - పి. ఉమా భార్గవి | 112 |
| 27. అంబటిపూడి వెంకటరత్నం గారి-'వనవాటి' కావ్య పరామర్శ | - డా॥. దోనెపూడి రామాంజనేయశర్మ | 116 |
| 28. The Necessity of Effective English Communication | - Dr. Gudige Chandraiah | 120 |

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# నల్లగొండ జిల్లా నవలా సాహిత్యం

- పంతంగి వెంకటేశ్వర్లు అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాయం, వరంగల్.

నల్లగొండ జిల్లా నవలా సాహిత్యాన్ని గురించి మాట్లాడుకోవాల్సి వచ్చినపుడు తెలుగులో వచ్చిన మొట్ట మొదటి నవలల గురించి కూడా మాట్లాడుకోవాల్సిన అవ సరం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వచ్చిన నవలా సాహిత్యాన్ని ఇందులో పరిశీలిస్తాను. కందుకూరి వీరేశ లింగం పంతులు 1878లో రాసిన "రాజశేఖర చరిత్రము" మొదటి తెలుగు నవలగా మనం చాలా కాలం భావించాం. తెలుగులో మొదటి వచన ప్రబంధాన్ని నేనే రాసితిని అని కందుకూరి చెప్పుకోవడం కూడా అట్లా భావించాల్సి వచ్చిన కారణాల్లో ఒకటి. ఆ తరువాత 1872లో నరహరి గోపాలకృష్ణమ శెట్టి రాసిన రంగరాజు చరిత్రము (సోనాబాయి పరిణయము) తెలుగులో మొదటి నవలగా కొంతకాలం భావించాం. తెలంగాణ స్పృహ పెరిగిన తరువాత తడకమల్ల వేంకట కృష్ణారావు రాసిన కంబుకంధరచరిత్ర, కామరూపకథ మొదటి స్వతంత్ర నవలలుగా వెలుగులోకి వచ్చాయి. వేంకటకృష్ణా రావు నల్లగొండ జిల్లా మునగాల మండలం బేతవోలులో 1830లో జన్మించారు. "నల్లగొండ- జిల్లా కవులు - పండితులు" అన్న గ్రంధంలో శ్రీరంగాచార్య ఈ విషయాన్ని రేఖామాత్రంగా చెపితే డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి తన 'ముంగిలి'లో ఈ విషయాన్ని కొంత విస్తరించి చెప్పారు. కంబుకంధర చరిత్ర 1866లో వచ్చింది. ఇందులో పద్యాలు, వచనం కలిసి ఉన్నాయి.

"కామరూపకథ' కు 1937లో క్యాటలాగు రాస్తూ సంపాదకులు దీన్ని 'నా వెలును బోలిన రచన' అని పేర్కొన్నారు. "అందుబాటులో ఉన్న ఆధారాలను లోతుగా పరిశీలించినట్లయితే తొలి తెలుగు నవల కంబుకంధర చరిత్ర అని తేలుతుంది. అయితే కామరూప కథ పూర్తి స్థాయి నవలగా భావించవచ్చు' అంటారు సంగిశెట్టి శ్రీనివాస్ (తెలంగాణ తెలుగు నవల) తడకమల్ల వేంకటకృష్ణారావు రాసిన మరో గ్రంథం "తెలుగు వెలుగు ముగుద కథ" 1879లో ముద్రించబడిన ఈ గ్రంథానికి శ్రీమదాంధ్ర కవితావేదిని విలాసం అన్న పేరు కూడా ఉంది. రచయిత దీన్ని చంపూ కావ్యమని చెప్పినప్పటికీ ఇందులో వచనమే ఎక్కువగా ఉంది. ఇది కూడా నవలా రూపంలో ఉన్నదని బోడపాటి కుటుంబరావు తన "ఆంధ్ర నవలా పరిణామంలో పేర్కొన్నారు. (డా॥ రావి ప్రేమలత- తెలంగాణ నవలా సాహిత్య వికాసం గ్రంథం).

కంబుకంధర చరిత్రను మొదటి తెలుగు నవలగా భావిస్తే అది తెలంగాణ ప్రాంతం నుంచి ముఖ్యంగా నల్లగొండ జిల్లా నుంచి వచ్చిందనడానికి అవకాశం ఏర్పడుతుంది.

శేషభట్టర్ వేంకట రామానుజాచార్యులు 'ప్రాకృత దాంపత్యం' పేరిట 1922లో నవల రాసాడు. ఈ నవల నల్లగొండలోని ఉస్మానియా ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించ బడింది. రామానుజాచార్యులు నల్లగొండ జిల్లా మోతుకూరు మండలం దత్తప్ప గూడెంలో జన్మించారు. ప్రకృతిని కథాంశంగా, పాత్రలుగా తీసుకొని ఈ నవల రాసాడు. ఇందులో చెట్లు, చేమలు, నదులే పాత్రలు. 'లోకజ్ఞుడు' అనే కలం పేరుతో రచనలు చేసిన ఈ రచయిత 'బ్రహ్మనూరు' అనే మరో నవలను రాసాడు. అయితే ప్రస్తుతం ఇది అలభ్యం. తెలంగాణాలో ఒక మహిళ రాసిన మొట్టమొదటి నవల 'శోభావతి' - 1924లో అచ్చయిన ఈ నవల నల్లగొండ జిల్లా కవుల సంచికలో ప్రస్తావించబడింది. నల్లగొండ జిల్లా అన్నెపర్తికి చెందిన పైడిమర్రి వేంకటసుబ్బారావు కథలు, పద్యాలు, నాటకాలే కాకుండా 'కాలభైరవుడు' అనే నవల రాసిండు. దేవరకొండకు చెందిన సయ్యద్ ఆజ్మతుల్లా 1930-40 మధ్యకాలంలో స్త్రీ పాత్రలను ప్రధానంగా చేసుకొని నవలలు రాశాడు. జాహ్నవి, సుశీల, సుజాత,

అంపరాకాసి, మణి పేర్లతో ఆయన నవలలు వెలువరించాడు. సంస్కృతాంధ్ర, ఉర్దు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న అజ్మతుల్లా పద్యాలు, నాటికలు, నాటకాలు కూడా రాశాడు. ఈయన నవలలన్నీ సాంఘిక ఇతివృత్తాలే.

నల్లగొండ జిల్లా వలిగొండ గ్రామానికి చెందిన భిన్నూరి నరసింహశాస్త్రి (బి.ఎన్.శాస్త్రి) గొప్ప చారిత్రక పరిశోధకుడు, మూసీ పత్రిక వ్యవస్థాపక సంపాదకుడు. ఈయన మూడు నవలలు వెలువరించాడు. శ్రీ కృష్ణదేవ రాయల భార్య తుక్కాదేవి పేరుతో మొదట ఒక నవల రచించారు. రెండవది 'వాకాటక మహాదేవి'. విష్ణు కుండినుల కాలపునాటి చారిత్రక నేపథ్యంతో రాసిన నవల ఇది. మూడవది 'విప్లవజ్వాల' నవల. తెలంగాణ సాయుధ పోరాటం ఈ నవలకు నేపథ్యం. ఆనాటి ప్రజల్లో వెల్లువెత్తిన చైతన్యాన్ని విప్లవజ్వాలగా ఆయన చిత్రించాడు. నల్లగొండ జిల్లావాడే అయినప్పటికీ ఖమ్మంలో స్థిరపడ్డ పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు కథలే కాకుండా 1945-50 మధ్యకాలంలో, సముద్రఘోషలు, రాధ అనే నవలలు రాశాడు. 1951లో ఆయన రాసిన 'మా ఘంటం' నవల అనేక సార్లు ముద్రించబడింది. ఇదే కాలానికి చెందిన పెండెం వాసు దేవరావు 'గుసగుసలు' అన్న నవల రాసినట్లు తెలుస్తుంది.

తెలంగాణ నవలా కారుల్లో వట్టికోట ఆళ్వారుస్వామి ప్రత్యేకమైనవారు. వట్టికోట నల్లగొండ జిల్లా మాదారం గ్రామానికి చెందినవారు. ఆయన కొన్ని కథలతోపాటు మూడు నవలలు రాశాడు. మొదటి నవల 'ప్రజలమనిషి'. ఇది 1955లో వచ్చింది. అయితే ఇందులో 1938లో స్టేట్ కాంగ్రెస్ పుట్టక ముందు తెలంగాణ వాతావరణాన్ని చిత్రించిన నవల ఇది. ఈ నవలలోని కంఠీరవం పాత్రలో ఆళ్వారుస్వామి కనిపిస్తాడు. ఆ తరువాత ఆయన గంగు అన్న మరో నవలను రాశాడు. ప్రజలమనిషికి కొనసాగింపు నవలే గంగు నవల. అయితే ఇది అసంపూర్తి నవల. 1940-45 మధ్యకాలం నాటి తెలంగాణ సామాజిక, రాజకీయ పరిస్థితులను ఈ నవల చిత్రించింది. సాయుధ పోరాట తదనంతర పరిణామాలను చిత్రిస్తూ 'గిర్దావార్' అనే నవలను కూడా వట్టికోట రాశాడు. స్త్రీ, దళిత వాదాలు రాకముందే అణచివేతకు గురయ్యే వర్గాలవారి బతుకు తీరుతెన్నులను చిత్రించిన నవలలు బోయ జంగయ్య రాసిన నవలలు. నల్లగొండకు చెందిన జంగయ్య జాతర, జగడం అనే నవలలను రాశాడు. 'జాతర స్త్రీలు ఏ విధంగా మోసానికి గురవుతున్నారో తెలుపుతుంది. బోధించు, సమీకరించు, ఉద్యమించు అన్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ భావజాలం పునాదిగా ఆయన 'జగడం' అనే మరో నవలను రాశాడు. దళితులపై జరుగుతున్న అకృత్యాలను, అన్యాయాలను ఈ నవల ఎండగడుతూ దళిత సమస్యలకు దళితులందరు చదువుకోవడమే పరిష్కారమని ఈ నవల చెపుతుంది. రాజ్యాధికారంతోనే దళితుల విముక్తి సాధ్యమన్న సందేశాన్ని కూడా ఈ నవల ఇస్తుంది. మొత్తానికి దళితుల జీవితాన్ని విభిన్న దృష్టికోణాల నుండి చిత్రించిన నవల ఇది.

నల్లగొండ జిల్లాకు చెందిన మరో ప్రసిద్ధ రచయిత డా॥ ముదిగంటి సుజాతారెడ్డి. సుజాతారెడ్డి సృజనాత్మక రచయితే కాకుండా విమర్శకురాలిగా కూడా పేరు పొందారు. ఆమె కథలు, నవలలు, విమర్శావ్యాసాలు రచించారు. సంకెళ్ళు తెగాయి, మలుపు తిరిగిన రథ చక్రాలు, ఆకాశానికి విభజన రేఖల్లేవు అన్న మూడు నవలలు రాశారు. కులవైరుధ్యాలను చిత్రిస్తూ రాసిన నవల సంకెళ్ళు తెగాయి. బి.సి కులానికి చెందిన ఒక యువకుడు కుల సంకెళ్ళను తెంచుకొని ఒక ఐ.ఏ.ఎస్ స్థాయికి ఎదగడం ఇందులోని కథాంశం. 'మలుపు తిరిగిన రథచక్రాలు' తెలంగాణ సాయుధ పోరాటం ప్రభావంతో వచ్చినటువంటిది. సుజాతరెడ్డి తన 8 సంవత్సరాల వయసులో నల్లగొండ జిల్లాలో చూసిన సాయుధపోరాట అనుభవాలు, చిన్న వయసులో ముద్రపడిన జ్ఞాపకాలను నవలగా మలిచారు. ఆమె ఆకాశంలో విభజన రేఖల్లేవు' నవల స్త్రీ పురుషుల మధ్య మిత్ర వైరుధ్యాలే తప్ప శత్రువైరుధ్యాలు ఉండవని చెపుతుంది. స్త్రీ పురుషుల మధ్య ప్రజాస్వామిక విలువలతో కూడిన, సంబంధాలు ఉండాలని, పురుషాధిపత్యాన్ని నిరసించాలే తప్ప మొత్తం

పురుష ప్రపంచాన్ని కాదని చెబుతుంది. కందిమళ్ల ప్రతాప రెడ్డి నల్లగొండ జిల్లా జొన్నలగడ్డ గ్రామంలో జన్మించారు. 2006లో బందూక్ నవలను రాశారు. భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటే ఇందులోని ప్రధానాంశం.

దిగంబర కవుల్లో ప్రసిద్ధుడైన చెరబండరాజు నల్లగొండ జిల్లా అంకుశాపురం గ్రామంలో జన్మించాడు. మార్క్సిజం ప్రభావంతో విప్లవ రచయితగా, విప్లవ కవిగా మారాడు. 1965-85 మధ్య కాలంలోని తెలంగాణ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను ఆయన తన నవలల్లో చిత్రించాడు. ఆయన రాసిన నవలలు మొత్తం నాలుగు. మా పల్లె, ప్రస్థానం, నిప్పురాళ్లు, దారిపొడుగునా. నిఖిలేశ్వర్ సాహచర్యంతో దిగంబర కవిగా ప్రసిద్ధుడయ్యాడు. మిర్యాలగూడేనికి చెందిన కోలాహలం లక్ష్మణరాజు 25 నవలలు రాశాడు. ఈయన రాసిన నవలల్లో పసిపాప, గాయత్రి, పరిష్కారం, ప్రతీకారం -ముఖ్యమైనవి. బోయని పల్లి వెంకటరామారావు అందని శిఖరాలు, జీవిత బంధాలు అనే నవలలు రాశాడు. సాంఘిక సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ రచనలు చేశాడు. స్వాతంత్ర్యోద్య మానికి పూర్వం పరిస్థితులను చిత్రస్తూ కొండపల్లి వేంకటశేషగిరిరావు 'చీకటి వెలుగులు' అన్న నవల రాశాడు.. నల్లగొండకు చెందిన నోముల సత్యనారాయణ చైనాదేశపు నవలను నాకుటుంబం పేరుతో అనువదించారు.

మొట్టమొదటి సారిగా తెలుగులో మాదిగల జీవితాన్ని చిత్రిస్తూ నల్లగొండకు చెందిన వేముల ఎల్లయ్య 'కక్క' అనే నవలను రాశాడు. ఈ నవల మాదిగల జీవితంలోని విభిన్న పార్శ్వాల్ని చిత్రించింది. దళిత సంస్కృతిని చిత్రిస్తూ ఆయన రాసిన మరో నవల 'సిద్ధి'.నల్లగొండకు చెందిన మరో దళిత రచయిత భూతం ముత్యాలు సూర, పురుడు అనే నవలలు రాశాడు. ఇవి కూడా దళిత జీవన సంస్కృతులను అభివ్యక్తం చేసేవే. వేముల ఎల్లయ్య తన నవలల్లో మాదిగల జీవితాన్ని చిత్రిస్తే, భూతం ముత్యాలు మాలల జీవితాన్ని చిత్రించాడు.

గౌడ్‌ల అస్తిత్వంపై సూర్యాపేటకు చెందిన కె. వెంకటేశ్వర్లు 'కల్లుమండవ' రాశాడు. 2006లో ఈ నవల వచ్చింది. గీత కార్మికుల సంఘం నాయకుడు ధర్మభిక్షం చేసిన పోరాటం ఈ నవలలో చిత్రించాడు. ముస్లిం మైనారిటీల జీవితాన్ని చిత్రిస్తూ స్కైబాబా 2015లో 'అధా' నవల రాశాడు. ముస్లింల జీవితం మీద వచ్చిన మంచి నవలగా ఇది గుర్తింపు పొందింది.

అంపశయ్య నవీన్ పుట్టింది నల్లగొండ జిల్లాలో. స్థిరపడింది వరంగల్‌లో. ఆర్థికశాస్త్రం అధ్యాపకుడైన ఆయన 30 నవలలదాకా రాశాడు. చైతన్య స్రవంతి శిల్పంతో అంపశయ్య, అంతస్రవంతి, ముళ్లపొదలు అనే నవలలు రాశాడు. ఈ మూడు సీక్వెల్ నవలలు. ఆయన రాసిన మొదటి నవల 'అంపశయ్య' ఆయనకు ఇంటి పేరుగా మారింది. ఆయన రాసిన 'చీకటి రోజులు' ఎమర్జన్సీ కాలంనాటి పరిస్థితులను చిత్రించింది. తెలంగాణ సాయుధపోరాట జ్ఞాపకాలను ఆయన 'కాలరేఖలు' అన్న నవలగా రాశాడు. దీనికే కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

ఈ విధంగా తెలంగాణ నవలా సాహిత్యంలో నల్లగొండ జిల్లా తనవంతు కృషిని అందించింది. 'కంబుకంధర చరిత్ర' మొదటి నవలగా విమర్శకులు భావిస్తే తెలుగులో మొదటి నవలను నల్లగొండ జిల్లానే అందించింది అవుతుంది. మొదటి దళిత నవలను అందించిన గుర్తింపు కూడా నల్లగొండ జిల్లాకే దక్కుతుంది.

# జానపద సాహిత్యం - సామాజిక చైతన్యం

- డా॥. డి. విజయకుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**ఉపోద్ఘాతం:**

నన్నయ్యకు పూర్వం నుండి మౌఖిక సాహిత్యం ప్రచారంలో ఉంది. మౌఖిక సాహిత్యమనగా జానపద సాహిత్యం. ఈ సాహిత్యం మౌఖికంగా ప్రచారం పొందడం వల్ల అతి త్వరగా ప్రజలను చేరుకుంటుంది. లిఖిత సాహిత్యం కేవలం అక్షరాస్యులకు మాత్రమే పరిమితమవుతుంది. కాని మౌఖక సాహిత్యం నిరక్షరాస్యులను, అక్షరాస్యులను కూడ చైతన్యం చేస్తుంది. లిఖిత సాహిత్యం లక్షణ ప్రధానమైనది. మౌఖిక సాహిత్యం లక్ష్య ప్రధానమైనది. లిఖిత సాహిత్యం ఒక వ్యక్తి ఇచ్చాను సారంగా లక్షణబద్ధంగ రచిస్తాడు. కాబట్టి ఈ సాహిత్యం ఆ లక్షణం తెలిసిన వారిని మాత్రమే అలరింపజేస్తుంది. కాని మౌఖికసాహిత్యం విద్యకు, విజ్ఞానానికి, దూరంగా ఉండి, ఆచారాలు నమ్మకాలతో కూడిన స్థానికమైన జీవితాన్ని గడిపే జానపదులను కూడా అలరింపజేస్తుంది.

ఈ సాహిత్యాన్ని ఆచార్య నాయని కృష్ణకుమారి గారు మూడు రకాలుగా విభజించారు. అవి 1. గేయశాఖ. 2. వచనశాఖ. 3.దృశ్యశాఖ. గేయశాఖ కథారహితము, కథాసహితము అని రెండు రకాలుగా విభజింపబడింది. కథారహితంలో శ్రామిక గేయాలు, పారమార్థిక గేయాలు, కౌటుంబిక గేయాలు, క్రీడాత్మక గేయాలు ఉంటాయి. పారమార్థిక గేయాలు మరల స్తుతిగేయాలు, తాత్త్విక గేయాలు మార్మిక గేయాలుగా విభజింపబడాయి. కౌటుంబిక గేయాలు రెండు రకాలు ఆచార ప్రదర్శక గేయాలు, బంధుత్వ ప్రదర్శక గేయాలు. ఈ బంధుత్వ ప్రదర్శక గేయాలు పెద్దలకు సంబంధించినవి, పిల్లలకు సంబంధించినవి అని రెండు రకాలు. పిల్లలకు సంబంధించిన గేయాలు మరల రెండు రకాలు జోల పాటలు, చేష్టాత్మక గేయాలు. ఇవన్ని కథారహితశాఖకు చెందినవి. కథాసహితంలో శ్రామికులు పాడేవి, స్త్రీలు పాడేవి, వృత్తిగాయకులు పాడేవి ఉంటాయి. స్త్రీలుపాడే గేయాలు వ్రత కథలు, పౌరాణిక కథలు, అనే రెండు రకాలు. వృత్తిగాయకులు పాడేగేయాలు మరల వీర అద్భుత గేయాలు, మతసంబంధ గాథలు, చారిత్రక గాథలు, స్త్రీసంబంధి గాథలుగా విభజింపబడ్డాయి. మతసంబంధ గాథలు పురాణ కథలు, గ్రామదేవతల కథలు అని రెండు రకాలుగా విభజింపబడ్డాయి. రెండవది అయిన వచనశాఖ మరల కథాసహితము, కథారహితము అని రెండు రకాలుగా విభజింపబడింది. కథా సహితములో నాలుగు రకాలున్నాయి. పురాకథలు, పురాకల్పిత కథలు, వీరకథలు, అద్భుత కథలు అని నాలుగు రకాలుగా విభజింపబడ్డాయి. పొడుపు కథలు, సామెతలు, నుడికారాలు కథారహితం కిందికి వస్తాయి. చివరిగా మూడవశాఖ దృశ్యశాఖ. ఈ శాఖ మనుష్య పాత్రలుగల శాఖ, మనుష్యేతర పాత్రలు గల శాఖ అని రెండు రకాలుగా విభజింపబడింది. మనుష్య పాత్రలులగల శాఖలో నృత్యం, పగటివేషాలు, వీధినాటకం, యక్షగానం చేరతాయి. నృత్యం వ్యష్టి, సమష్టి అని రెండు రకాలు. వాలకం, గరగ, నామాల సింగడు వ్యష్టి తెగ కిందికి వస్తాయి. కోలాటం, బతుకమ్మ, గొబ్బి, భజన, తప్పెట గుళ్ళు, గొరవ, ఖడ్గ సమష్టి కళ కిందికి వస్తాయి. ఇక దృశ్య శాఖలో రెండవది మనుష్యేతర పాత్రలు గల శాఖ బొమ్మలాటలు, జంతువుల ఆటలు అని రెండు రకాలు. బొమ్మలాటలు తోలుబొమ్మలాట, గుడ్డబొమ్మలాట, చెక్కబొమ్మలాట అని మూడు రకాలున్నాయి. జంతువుల ఆటలు కోతి, ఎలుగుబంటి.(కృష్ణకుమారి, నాయని. 2007. పుట.19)

పైన చెప్పిన శాఖలలో అన్ని విభాగాలలోని జానపద సాహిత్యం సమాజాన్ని చైతన్య వంతం చేస్తుందని చెప్పవచ్చు.

జానపద సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం ఏవిధంగా కలుగుతుందో తెలియజేయడమే ఈ పత్రం ముఖ్య ఉద్దేశం.

**జానపద గేయాలలో సామాజిక చైతన్యం :**

గ్రామాలలో వివిధ వృత్తుల వారు తాము తయారు చేసిన వస్తువులను వీధులలో తిరిగి అమ్ముకోవడమనేది సర్వసాధారణం. ఒక ఎరుకల స్త్రీ తాను అల్లిన బుట్టలను అమ్ముకోడానికి వెళుతుంది. అపుడు ఒక రెడ్డి యువకుడు ఆమెను తన మేడకు రమ్మని పిలుస్తాడు. అపుడా స్త్రీ అతనికి ఈ కింది విధంగా సమాధానం చెబుతుంది.

యేటిమీద బొయ్యేటి యెరకల్ల సానీ
యీన దీసల్లింది యిసనకర్రల్లు
..................................
..................................
మలిగేలి రెడ్డి కొడుకు మేడనున్నాడు
యీదీన బొయ్యేటి వోఎరుకల సానీ
శాటగంపల వెల చెప్పవెరకాలీ
శాటాకు నీయాలి చెవుల కమ్మల్లు
గంపాకు నీయాలి గొంతులో నరము
గుండుపుటాలకు గుండ్ల అడ్డీగ
మెచ్చితిని మేదారి మేడెక్కి రావే
మేడకన్న చక్కనిది మేదారి గుడిసే
నీకన్న చక్కనోడు నా మేనమామ
(త్రివేణి: 2006. పుట. 150)

పై గేయంలో ఎరుకల స్త్రీ ధనవంతుడైన రెడ్డి కొడుకుకి ఏవిధంగా బుద్ధి చెప్పిందో తెలుస్తుంది. సహజంగా ఎరుకల స్త్రీలు తాము అల్లిన చాట, విసనకర్ర, గంప మొదనైన వస్తువులకు కొంత వెలను నిర్ణయించి వాటిని అమ్ముకుంటూ ఉంటారు. కాని పై గేయంలో పురుషుడి ప్రవర్తనను గమనించి, అతనికి బుద్ధి చెప్పాలి అనే ఉద్దేశంతో చాటకు నీయాలి చెవుల కమ్మలు అని, గంపకు నీయాలి గజ్జెల దావూ అని సమాధానమిస్తుంది. అయినా సరే అతడా స్త్రీని మేడెక్కి రమ్మంటాడు. అపుడామె అతని మేడకంటే తన మేదరి గుడిసె బాగుంటుందని, అతనికన్న ఆమె భర్త అయిన చక్కని వాడని సమాధానమిస్తుంది.

పై గేయంలో పురుషుడు పురుషాధిక్య భావజాలంతో ధనాన్ని ఆశగా చూపించి స్త్రీని లోబరుచుకోడానికి ప్రయత్నిస్తాడు. కాని స్త్రీ మాత్రం అతనికి లొంగిపోకుండా తన వ్యక్తిత్వాన్ని, శీలాన్ని కాపాడుకుంటుంది. ఈ సంఘటన సమాజంలో శ్రామిక స్త్రీలందరికి చైతన్యాన్ని కలిగిస్తుంది. శ్రమించి జీవించే స్త్రీలు ఎటువంటి ప్రలోభాలకు లొంగిపోరని పై గేయం ద్వారా వ్యక్తమవుతుంది. శీలవతి అయిన స్త్రీ తన ఇల్లు పూరిగుడిసె అయిన తన భర్త ధనవంతుడు కాకపోయిన ఉన్న దానితో సంతృప్తి చెంది ఆనందంగా జీవితాన్ని గడుపుతుంది. ఆమె ధనాన్ని కంటె తన శీలానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. ఈ గేయం నిరుపేదలైన స్త్రీలను లోబరుచుకోవాలనే పురుషులకు గుణపాఠంగా నిలుస్తుంది.

స్త్రీలు వరి నాటడానికి వస్తే తూమెడు జొన్నలు మొదలైనవి ఇస్తామని రైతులు ఆశ చూపిస్తారు. అపుడు స్త్రీలు ఈ కింది విధంగా సమాధానమిస్తారు.

తూమడతూమడ జొన్నాలిస్తము
జొన్నాపువ్వుల సీరాలిస్తము
వస్తారేమ్మమ్మ పైరు నాటికి నాయక్కల్లార
వస్తారేమమ్మ పైరు నాటికి

అని స్త్రీలకి భూస్వామి ఆశచూపిస్తాడు. కాని స్త్రీలు వాటికి లోబడకుండ శ్రమకు తగిన వేతనాన్ని చెల్లించమని ఈ కింది విధంగా అడుగుతారు.

తూమడ తూమడవడ్లూ ఇచ్చి
సాలికి తగినపైరే ఇస్తే
వస్తావన్నా పైరునాటికి నాయన్నలారా
వస్తామన్నా పైరు నాటికి - అని
(సీతారాం. 1998. 40,41)

శ్రమచేసి జీవించే ప్రతివ్యక్తి దానికి తగిన ప్రతిఫలాన్ని ఆశిస్తాడు. పై గేయంలో ఆ విషయం ప్రస్ఫుటంగా వ్యక్తమవుతుంది. ఇక్కడ యజమాని స్త్రీలకు కూలికి

బదులుగా చీరలు. జొన్నలు ఇస్తానంటాడు. ఆ స్త్రీలు వాటిని తిరస్కరించి, వారు శ్రమకు తగిన పైరు ఇస్తేనే కూలికి వస్తామని అంటారు.

పై గేయంలో స్త్రీలు చైతన్యవంతమైన ఆలోచనా విధానాన్ని కలిగి ఉన్నారు. ఈ విధమైన సాహిత్యం వల్ల ప్రజలు మరింత చైతన్యవంతులు కావడానికి అవకాశ ముంది. భూస్వాములు చేతిలో శ్రమజీవులెవరు మోస పోవద్దనే హెచ్చరిక కూడా ఈ గేయం ద్వారా వ్యక్తమవు తుంది.

జానపద గేయాలలో స్వాతంత్ర్యయోధుల గురించి కూడ ప్రస్థావించబడింది. పొట్టి శ్రీరాములు, గాంధీజీ, సర్థార్ వల్లభాయ్ పటేలు గురించి కూడ జానపదులు పాటలు పాడుకుంటున్నారు.

ఆంధ్రమాత తనయుడావు
ఆశలన్నియు తీర్చినావు
నాలుగు కోట్ల జనాళి కోసం
నీతనువునే అర్పించినావా !

(పల్నాటికోలాటం,1998, పుట:471)

మరియు

అస్తమించ గాంధీ దేవుడు
అస్తమించె గాంధీదేము
డస్తమించెనూ నేడస్తమించెనూ
.........................
................................
భూత చరితుడైన బాపూజీ
కూలిపోయేనేడు
వల్లభాయిపటేల్ గుండె
తల్లడిల్లెరా నేడు

(పల్నాటి కోలాటం, 1998. పుట: 374, 375.)

పై గేయాలను జానపదులు పాడడం వల్ల, అవి మౌఖికంగా ఒక వ్యక్తి నుండి వేరొక వ్యక్తికి, ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి ప్రచారం పొందుతాయి. ఈ గేయాలను విన్న భావితరాల వారు స్వాతంత్ర్య సమర యోధుల గురించి తెలుసుకుంటారు. అంతేగాక ఇవి వినడం వల్ల వారిలో దేశభక్తి పెంపొందుతుంది. ఈ విధంగా మౌఖిక సాహిత్యం స్వాతంత్ర్యయోధుల గురించి సమాజానికి పరిచయం చేసి, వారిని చైతన్యవంతులను చేయడానికి దోహదం చేస్తుంది.

## వీరగాథలు సామాజిక చైతన్యం :

సమాజంలోని ప్రజలు ఈ వీరకథావాఙ్మయం ద్వారా మరింత ఎక్కువగా చైతన్యవంతులవుతారని చెప్పవచ్చు. "అల్లూరి సీతారామరాజు కథ" సాహసిక వీరకథగా ప్రసిద్ధి చెందింది. దీనిని శ్రీ సుంకర సత్యన్నారాయణ గారు గ్రంథీకరించారు. ఈ కథ ప్రకృతి అందాలతో మొదలవు తుంది. దీనిలో తెలుగుదేశం గొప్పతనం, అల్లూరి సీతా రామరాజు ధైర్యసాహసాలు వర్ణంపబడ్డాయి. మన్నెం ప్రజలను బాస్టియన్ అనేక హింసలకు గురిచేస్తాడు. అపుడు అల్లూరి సీతారామరాజు అతణ్ణి మందలిస్తాడు. మన్నెం ప్రాంతంలో ప్రజలకు నాయకత్వం వహించమని సీతారామరాజుని గంటందొర అడుగుతాడు. ఆ ప్రాంతంలో స్త్రీలపై రోజురోజుకి అత్యాచారాలు మితి మీరడంచేత, సీతారామరాజు బ్రిటిషు ప్రభుత్వం మీద సాయుధ విప్లవం చేస్తాడు.

అరి భీకరుడా రాజుని గన్గొను అందరి గుండెచెదరి
బిరబిర తుపాకులెత్తి కాల్చిరా పిరికి పందలంతా
క్రూరులు గాల్చడి గుండ్ల దెబ్బలను వీరుడు తట్టుకొని
వీరావేశంబుననిట్లనియా శూరాగ్రణి పలికె
ఆంధ్రదేశమా వందన మిదిగో అందుకొనవమ్మ
ఆంధ్రులారా! గైకొనుడు నా విప్లవాభివందనముల
రాలినదొక నక్షత్రంబవనిక రారాజు ఒరగె
తలచిరాజు నామన్యసోదరులు వలవల ఏడ్చారు
జలజల కన్నీరొలక బోసె మన తెలుగుదేశమంత

(జానపద గేయవాఙ్మయ పరిచయము. పుట : 59-69).

మన్నెం ప్రజలు బ్రిటిషు పాలనలో ఏ విధంగా తిరగ బడ్డారో వెల్లడి అవుతుంది. అల్లూరి సీతారామరాజుకి గల దేశభక్తి ఈ కథ వల్ల తెలుస్తుంది. బ్రిటిషు వారి పరిపాలనలో

తెలుగు తల్లి తన సహజ గుణమైన వీరత్వాన్ని కోల్పోలేదని వ్యక్తమవుతుంది. తెలుగు ప్రజలు తమ శౌర్యపరాక్రమాలను ఏ విధంగా ప్రదర్శించాడో ఈ కథ విన్న తెలుగు ప్రజలందరికి తెలుస్తుంది.

అదే విధంగా సర్వాయిపాపడు కథ, దేశింగురాజు కథ, బొబ్బిలియుద్ధం, వీరవనిత గున్నమ్మ కథ మొదలైన కథలన్ని ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. సామాజిక చైతన్యాన్ని కలిగించాయని చెప్పవచ్చు. బొబ్బిలి యుద్ధ కథలో బొబ్బిలి రాజుభార్య మల్లమ్మదేవి యుద్ధానికి ముందే తాను శత్రువులకు చిక్కడం ఇష్టంలేక చివరికి తన భర్తచేత గొంతు కోయించుకుని మరణిస్తుంది. భారతీయ స్త్రీలు తమ ప్రాణానికంటే శీలానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని, అవసరమైతే వారు తమ ప్రాణాలను కూడ కోల్పోయి, శీలాన్ని కాపాడుకుంటారని ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

1940లో విశాఖపట్టణం జిల్లా యందలి మందసా ఎస్టేట్‌లో జరిగిన వాస్తవిక ఘటన ఆధారంగా వెలువడిన "వీరవనిత గున్నమ్మ" వీరగాథ కూడ స్త్రీలను చైతన్యవంతం చేస్తుంది. పల్నాటి వీరచరిత్రలోని మాంచాల పాత్ర కూడ ఆదర్శవంతమైన స్త్రీగా పేర్కొనదగినది.

### జానపదకళారూపాలు - సామాజిక చైతన్యం :

ఒగ్గుకథ, తప్పెట గుళ్ళు, వాలకం మొదలైన జానపద కళారూపాలలోని సాహిత్యం సామాజిక చైతన్యానికి తోడ్పడుతుంది. ఆయా కళారూపాలను ప్రదర్శించేటప్పుడు, కళాకారులు ఆయా ప్రాంతాలలోని సమస్యలను ఆధారంగా చేసుకుని ప్రదర్శనలను ఇచ్చినచో వాటిని నిర్మూలించి ప్రజలలో చైతన్యాన్ని కలిగించవచ్చు.

కరీంనగర్ జిల్లాలో ఒగ్గుకథ ప్రదర్శకులు తమ ప్రదర్శనకు ముందు గాంధీ మహాత్ముని ఈ కింది విధంగా ప్రార్థిస్తారు. ఆ తరువాత ఒగ్గుకథను ప్రదర్శిస్తారు.

### గాంధీ తాత ప్రార్థన :

తాత నిన్ను తలతునా గాంధీ మహాత్మా నిన్ను తలతునా
పోరు బందరులో పుట్టితివి ఓతాత
పుట్ట నీపేరు మోహన్ దాసందురూ
పెరుగంగ నీపేరు గాంధీయని తలతురు
కత్తి కొడవలి లేక తెస్తివి రాజ్యంబు
(కరీంనగర్ జిల్లా ఒగ్గుకథకులు)

ఏదైనా కళను ప్రదర్శించేటప్పుడు ఆయా కళాకారులు తమ ఇష్టదైవాన్ని ప్రార్థిస్తారు. కాని కరీంనగర్ జిల్లాలోని ఒగ్గుకథ కళాకారులు గాంధీ మహాత్ముడి గొప్పతనాన్ని గుర్తించారు. అందువల్లే వారు ఆ కథను ప్రారంభించే ముందు పై గేయాన్ని పాడుకుంటున్నారు. ఈ విధంగా చేయడమే సమాజంలో వచ్చిన అనిర్వచనీయమైన చైతన్యంగా భావించవచ్చు. అంతేగాక సమాజంలో ప్రజలు అహింసా మార్గాన్ని అవలంభించడానికి కూడ ప్రేరణ కలిగించవచ్చు.

### రైతుపాట :

రామబాణం వంటి రైతన్న రాజ్యం ఏలి చూడన్న
రైతుకూలిపోయే రామబాణం ఇరిగి పోయే
నిన్న మొన్నదాకా నిద్రలో ఉన్నావ్
నేడు మేలుకొని చూడర దేశం
ఈ బూజు పట్టిన రాజ్యమో
ఈ రాజ్యమే నీదిరా కూలన్నా
భారతదేశం మనదే తమ్ముడా
కలిగిన సంపదలు గల్లా దేశమురా
వలసతో వచ్చి దోసక వెల్లిపో
త్యాగమూర్తుల గల్లా దేశమురా
(కరీంనగర్ జిల్లా ఒగ్గుకథకులు)

పై గేయాన్ని కరీంనగర్ జిల్లా ఒగ్గుకథకులు పాడుతున్నారు. ఈ గేయంలో దేశం గొప్పతనం గురించి, రైతుపడే కష్టం గురించి తెలుస్తుంది. ముఖ్యంగా ఈ "COVID-19" సమయంలో ప్రజలందరు ఇంటికే పరిమితమై ఉన్నారు. కాని రైతులు మాత్రం తమ ప్రాణాలకు తెగించి, ఏ కరోనా వైరస్‌కి భయపడకుండా పంటలు పండించి ప్రజలకు ఆహార పదార్థాలను అందిస్తున్నారు. ఈ విషయంలో ప్రపంచమంతా వారికి తలవంచి

నమస్కరించవలసిందే. అంతేగాక వర్షాభావం చేత వలస కూలీలుగా పట్టణాలకు చేరిన రైతులందరు తిరిగి వారి గ్రామాలకు చేరుకున్నారు. వారందరు మరల భూమిని సాగుచేసుకుని జీవనోపాధిని పొందవచ్చు. భూమిని నమ్మినవారు నష్టపోరన్న విషయం ఋజువవుతుంది. పై గేయాలు ప్రచారంలోకి రావడం వల్ల రైతులకు కొత్త ఉత్తేజాన్ని కలిగిస్తాయి.

**పొడుపు కథలు - సామెతలు సామాజిక చైతన్యం:**

పొడుపు కథలు, సామెతలు మనిషి ఆలోచనాశక్తిని బుద్ధికుశలతను పెంచుతాయి. ఇవి ప్రజల జీవితంతో ముడిపడి ఉంటాయి. వరంగల్, కరీంనగర్, ఇందూరు జిల్లాలలో పొడుపు కథలను "శాస్త్రాలని" అంటారు. అనగా శాస్త్రమెంత కష్టమో వీటిని విడదీయుట కూడ అంత కష్టమని ఈ పేరు పెట్టి ఉండవచ్చు.

సదూశాస్త్రం నేర్పిన సాకలి వాడా
రెక్కలు మడవని పక్షిపేరేమి
(జొన్నకోల)

(వెంకటరెడ్డి, కసిరెడ్డి. 1990. పుట: 30-31)

పై పొడుపు కథలో జొన్నకంకిని రెక్కలు మడవని పక్షితో పోల్చారు. ఇందులో ఎటువంటి వ్యంగ్యార్థమూ లేదు. శాస్త్రబద్ధంగా ఉంది. మనిషి మెదడుకి పదును పెట్టే విధంగా ఉంది.

బంగారంకంటే
సింగారమైంది తెమ్మంది భార్య
అంగడి తిరిగ్
గొంగడి సంకనేసుకొచ్చిండు భర్త
భార్యపక్కుమంది
మర్మం విప్పి చెప్పింది
ఏందది

(కుంకుమ)

పై పొడుపు కథలో భారతీయుల సంప్రదాయం మనకు తెలుస్తుంది. భారతీయ స్త్రీ బంగారం కంటే, చీరల కంటే ఐదోతనానికే ఎక్కువ విలువనిస్తుంది. అందుకే భర్తను బంగారం కంటే సింగారమైంది తెమ్మంటుంది. ఒక స్త్రీ ఎంత ఖరీదైన చీర కట్టుకున్నా ఎన్ని బంగారం నగలు పెట్టుకున్నా నుదుటిన నగలు లేకపోతే అవన్నీ వెలవెలబోయినట్టుంటాయి. చేనేత చీర కట్టుకుని, మెడలో పసుపుతాడు వేసుకున్నప్పటికి, నుదుటిన కుంకుమ బొట్టు పెట్టుకుంటే చాలు ఆమె అందం ఇనుమడిస్తుంది. ఆమెకు నిండుదనం చేకూరుతుంది. అందువల్లే పై పొడుపు కథలో స్త్రీ భర్తను కుంకుమ తెమ్మని అడుగుతుంది. భారతీయ సంప్రదాయం, స్త్రీ మనస్తత్వం, ఐదోతనానికి ఉన్న గొప్పతనం, ఇక్కడ వ్యక్తమవుతుంది. అంతేగాక బంగారం మీద ఎక్కువ మక్కువ గల స్త్రీలకు, నాగరికత పేరుతో నుదుటిన బొట్టును మరచిన స్త్రీలకు ఈ పొడుపు కథ కనువిప్పు కలిగిస్తుంది. ఇటువంటి పొడుపు కథలు ప్రచారంలో ఉండడం వల్ల సమాజంలో కొంతమార్పు రావడానికి అవకాశముంది. భారతీయుల సంస్కృతీ సంప్రదాయాలు కనుమరుగవకుండా ఇవి దోహదపడతాయని చెప్పవచ్చు.

**సామెతలు :**

మానవుని జీవితం సమాజంతో ముడిపడి ఉంటుంది. అతడు తన చుట్టూ ఉన్న వాతావరణానికి అనుగుణంగా తన వ్యక్తిత్వాన్ని మలచుకుంటాడు. అందువల్ల అతడు సంఘజీవిగా మనుగడ సాగిస్తాడు. అటువంటి మానవుని జీవితానికి సామెతలు కూడ ఎంతగానో ఉపకరిస్తాయి.

"తొలకరి వాన మొలకలకు తల్లి"
"ఆరుద్ర కురిస్తే దారిద్ర్యం లేదు"
"ఆరుద్ర లో అడ్డెడు చల్లితే పుట్టెడు పండును"

(మోహన్, జి.యస్. 2010. పుట: 121.)

పై సామెతలు మానవుని జీవన గమనానికి సంబంధించినవి. తొలకరి వానలు పడగానే రైతులు వ్యవసాయపు పనులు మొదలు పెడతారు. ఆయా కాలాలలో వర్షాలు పడడం వల్ల పంటలు బాగా పండుతాయని ప్రజలకు తెలుస్తుంది. రైతులు వాతావరణ అనుకూలాన్ని

బట్టి వ్యవసాయం చేయడానికి ఇవి ఉపయోగ పడ తాయి.

"ఉంటే ఉగాది, లేకపోతే ఏకాసి"

(మోహన్, జి.యస్. 2010.పుట: 108)

పై సామెత మానవుని ఆర్థిక పరిస్థితిని తెలియ జేస్తుంది. మానవుడు ధనం ఎక్కువగా ఉన్నపుడు అనేక రకాల వంటలను చేసుకుని తిని, లేనపుడు ఉపావాసం ఉంటాడని తెలుస్తుంది. ధనం ఉన్నపుడు అతిగా ఖర్చుచేసి, లేనపుడు లేమిరికాన్ని అనుభవించే వ్యక్తుల జీవన విధానాన్ని తెలియజేస్తుంది.

వ్యాస పరిధిని దృష్టిలో పెట్టుకుని కొన్ని అంశాలను మాత్రమే చర్చించడం జరిగింది. ఇంకా అనేక అంశాలను ఉదాహరించవచ్చు.

**ముగింపు :**

జానపద సాహిత్యంలోని గేయ, వచన గద్యశాఖలలో గల వివిధ విభాగాల ద్వారా సాహిత్యం ప్రచారం పొందు తుంది. ఒగ్గుకథ, తప్పెట గుళ్ళు, కోలాటం మొదలైనవి ప్రదర్శించేటప్పుడు సామాజిక సమస్యలను ప్రదర్శ నాంశంగా తీసుకుని ప్రదర్శించి ప్రజలలో వాటి పట్ల అవగాహన కలిగించవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో 'కరోనా' వల్ల ఏమి జరుగుతుంది. ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ఈ కళల ద్వారా ప్రజలకు తెలియ జేయవచ్చు. ఈ సందర్భంగా అనేక గేయాలు, సామెతలు, పొడుపు కథలు వెలవడుతున్నాయి. ఈ సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం కలుగుతుంది. భవిష్యత్తులో ఎదురై నపుడు ప్రజలు అధైర్య పడకుండా సమస్యను అధిగ మించడానికి ఈ సాహిత్యం ఉపయోగపడుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కృష్ణకుమారి, నాయని. 2000. తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి - సాహిత్యం. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
2. కృష్ణకుమారి, నాయని. 2007. తెలుగు జానపద గేయగాథలు. తెలుగు అకాడమి, హైదరాబాదు.
3. రామరాజు, బిరుదురాజు. 1990. జానపద గేయ సాహిత్యము. జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు.
4. మోహన్, జి. యస్. 2010. జానపద విజ్ఞానాధ్యాయం. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
5. వెంకటరెడ్డి, కసిరెడ్డి. 1990. తెలుగు పొడుపు కథలు. జాతీయ సాహిత్య పరిషత్, హైదరాబాదు.
6. సీతారాం,....1998. తెలుగు జానపద కవిత్వం. కోలారు జిల్లా, కర్ణాటక.
7. ఒగ్గుకథకులు కరీంనగర్ జిల్లా.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# మూలమలుపు - ఒక ప్రతీకాత్మక దృశ్యమానం

- డా॥. వి. త్రివేణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

"Symbolism"కు సమానార్థకంగా తెలుగులో 'ప్రతీకాత్మకత' అనే వ్యవహారనామం ఉంది. పాశ్చాత్య సాహిత్యంలో దీని ప్రాధాన్యత అత్యధికం. తెలుగులో కూడా ఆధునిక సాహిత్య విమర్శా పద్ధతుల్లో నేడు ప్రతీకవాదం స్థానం కల్పించుకుంది. కవిత్వంలో వీటి ప్రయోగం అనివార్యమవుతుంది. కవిత్వ ప్రయోజనాన్ని చేకూర్చడానికి కవులు ప్రతీకలను అనుసంధానం చేస్తున్నారు. అందులో భాగంగానే సామాజిక ప్రతీకలు, వ్యష్టి ప్రతీకలు విభజింపబడ్డాయి. వెలుతురు - జ్ఞానానికి, చీకటి - అజ్ఞానానికి, వసంతం - జన్మకు, శిశిరం - మృత్యువుకు, అఖండజ్యోతి - ఆదర్శానికి ప్రతీకలుగా చెప్పబడుతున్నాయి. తాత్త్విక దృక్పథంతో పురాతన కాలం నుండి సాహిత్యంలో ఇవి చోటుచేసుకుంటు వస్తున్నాయి. నీలం - కార్మిక శక్తికి, ఎరుపు - విప్లవ భావానికి, ఆకుపచ్చ - మేధావి తనానికి ప్రతీకలుగా సైద్ధాంతిక నేపథ్యంలో ఏర్పడ్డాయి. ఇనుము - ధనిక వర్గానికి, రాగి - మధ్య తరగతికి, తుత్తునాగం - శ్రామిక వర్గానికి విప్లవ సంకేతాలుగా వ్యవహరింపబడ్డాయి. ఇవన్నీ సామజిక, వ్యష్టి ప్రయోజన నేపథ్యంలో కవిత్వ గాఢతకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఈ ప్రతీకలు మూడు విధాలుగా కవిత్వంలో ప్రయోగింపబడుతున్నాయి. 1. పదాలు, పద బంధాలకు ప్రతీకలను ఎన్నుకోవడం, 2. కవితా శీర్షికకు, కవితా సందేశానికి ప్రతీకలను ఎన్నుకోవడం, 3. దీర్ఘ కవితా శీర్షికకు, దీర్ఘ కవిత సూచించే సందేశానికి ప్రతీకలను సమూహంగా ఎన్నుకోవడం. అదేవిధంగా వస్తు ప్రాధాన్యతను బట్టి పురాగాథా, చారిత్రక సాంస్కృతిక సామాజిక ప్రతీకలు కవిత్వంతో కూడి వస్తున్నాయి. భావాత్మక పరవశంలో కవి ప్రకృతి ప్రతీకలకు ఆకర్షితుడవుతున్నాడు.

As commonly used in discussing Literature, symbol is applied only to a word or set of words that signifies an object or event which it self signifies something else, that is the words refer to something which suggests a range of reference beyond it self.

*- A Glossary of literature Terms -
MH Abrams.*

ఏదైనా ఒక వస్తువునుగాని, భావాన్ని గాని సూచించే మరో వస్తువు గాని, భావం గాని ప్రతీక అనుకోవచ్చు. ఈ దృష్టితో చూస్తే శబ్దాలు అన్నీ ప్రతీకలే. ప్రతీకలతోనే ఆలోచనను సాగించవచ్చు. ఉదాహరణకు బీజగణితంలో వట్టి అక్షరాలనే ఉపయోగించి ఆలోచనను సాగిస్తాం. అందుకే బీజ గణితాన్ని 'ప్రతీకాత్మక తర్కం' అనవచ్చు. సాహిత్యంలో ప్రతీకకు మౌలికంగా ఉన్న అర్థం ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది. ఒక శబ్దం కాని, శబ్ద సముదాయం గాని, ఒక వస్తువునో, క్రియనో, సంఘటననో సూచిస్తూ, అది తిరిగి వేరొక అంశాన్ని సూచించినప్పుడు అది ప్రతీక అవుతుంది. ఆ శబ్దాలు ఏ సాధారణార్థాన్ని సూచిస్తాయో ఆ ఆవరణను దాటి ఉన్న అంశాలను అది ధ్వనింపజేస్తుంది.

**పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర - సిద్ధాంతాలు : వడలి మందేశ్వరరావు**

తెలుగులో మొదట ఈ ప్రతీకవాదం శ్రీశ్రీ, ఆరుద్ర, నారాయణ బాబు కవిత్వంలో తాత్త్విక నేపథ్యంలోనే ప్రదర్శింపబడింది. అనంతరం గుంటూరు శేషేంద్ర శర్మ, ఆర్.ఎస్.సుదర్శనం, జి.వి.సుబ్రహ్మణ్యం, ముదిగొండ వీరభద్రయ్య కవిత్వంలో కళాత్మకతను సంతరించుకుంది. తెలంగాణలో తొలితరంలో పొట్లపల్లి రామారావు, మలితరంలో సినారె కవిత్వంలో ఆయా దేశ కాల సామాజిక గతి తర్కానికి అనుకూలంగా నిలిచింది. ప్రశస్తి పొందిన ఆధునిక కవులనెందరినో ఈ ప్రతీకాత్మకత

ప్రభావితం చేసింది. ఆ వరుసలోనే డా॥ ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'మూల మలుపు' కవితా సంపుటిని ప్రతీకల దృశ్యమానంగా పరిశీలించవచ్చా! అనే ఆలోచన, సందేహం, సంశయం కలిగింది. ఆలోచన ఎందుకంటే మూలమలుపు - చదువుతుంటే అపారంగా కనిపించిన పద భావ చిత్రికలు. వాస్తవిక, అధివాస్తవిక కలిగిన ఆయన కవిత్వంలో ప్రతీకల స్థానం సందేహ స్థితిలో ఉంటుందని. ఇక సంశయం అసలు పరిశీలిస్తే కదా! ప్రతీకల విలువలను తూచ గలిగేది. ఈ రీతిగానే తలపోస్తూ 'మూల మలుపు'ను విమర్శనాత్మక దృష్టితో అధ్యయనం చేశాను.

నరసింహారెడ్డి కవితా సాంద్రత తెలిసినవారు. కవిత్వం, విమర్శ, సమీక్ష, సంపాదకత్వం, పరిష్కరణ, పరిశోధన, ప్రచురణ వంటి సాహిత్య రచనా వ్యాసంగ బాధ్యతలను మోస్తూనే ప్రభుత్వాధికారిగా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ 'మట్టి పాట'తో పల్లె సిరులను అందించారు. శ్రమ సౌందర్యాన్ని నివేదించారు. 'కొత్తపలక' తెలంగాణ అస్తిత్వ మూలాల నుండి పుట్టుకొచ్చింది. తెలంగాణ భాష, భావం, సొంపు, వ్యవహారం, జీవన కదలికలకు తెలంగాణ రుబాయిలు తెలిపి ప్రత్యేక ఒరవడిని చేకూర్చాయి. 'మట్టి పాట', 'కొత్త పలక' నోస్టాలజీ స్మృతులతో అలరించాయి. 'సమాంతర స్వప్నం', 'నేనే' వైయక్తిక భావ సరణి నుండి ఉద్భవించాయి. ఏది ఏమైనా కవిత్వానికి కామన్ అడ్రస్‌గా డా॥ ఏనుగు నరసింహారెడ్డి నిలవడం అని వార్యమే. అది తెలుగు కవితా శాఖకు పుష్టిని కలిగిస్తుంది. నూతన కవిత్వ ధోరణులకు ఆయువు పట్టుగా నిలుస్తుంది.

'మూల మలుపు' తెలంగాణ ఆత్మీయతలను పలక రించింది. 'మలుపు' అంటే మార్పు. మనిషి జీవితంలో మార్పును కోరుకోవడం సహజం. మార్పు మంచిదే, కష్టాల నుంచి సుఖానికి, బాధల నుండి ఆనందానికి, కాలే కడుపు నుండి నాలుగు మెతుకులకు, ఎడారి బతుకుల నుండి తడారిన సంతోషాల కోసం మార్పు పొందాల్సిందే. సమాజం కోరుకునేది ఇదే. 'మూలం' ఒక ఆధారం. మూలం లేని వస్తు రూపాలు నిలువలేవు. మూలాధారం లేని ప్రాణి జీవించలేదు. ఈ పదాల కూర్పులో ఉన్న నిసర్గ, సంసర్గ అర్థయుక్తి సమస్త జీవకోటికి ఆధారంగా నిలిచింది. 'మూల మలుపు' ఒక సామాన్య వ్యవహార నామమైనా; నిగూఢార్థంలో బేధం ఉంది. నరసింహారెడ్డి నడిచిన బాటలో ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో బంధనాలు. అడుగు అడుగులో ఒప్పారిన బాంధవ్యాలను నెమరేసు కుంటూ సాగిపోయిన మలుపు ఇది. ఒక జీవితకాల గమనానికి స్థిర పరిచిన మూలం ఇది. సమాంతర మానవ సమూహాల సంకేతంగా ఎవరికి వారు ఈ వలయంలో నిలువరించవచ్చు. అంతేకాదు తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని మూల మూలన నిగ్రహింపవచ్చు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించడానికి ముందు, అనంతర కాలాల బేరీజును స్పష్టంగా పరిగణించవచ్చు. అందుకే ఈ 'మూల మలుపు' ఒక వ్యక్తికే కాదు; ఒక సమూహ మనుగడకు, ప్రాంతీయ ఒరవడికి నిర్దేశించబడింది.

పేదల పట్ల పక్షపాతం కలవారు, శ్రమ శక్తిని తెలిసిన వారు, అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించినవారు కవి నరసింహారెడ్డి. వీరి కవిత్వం నిండా అణచబడిన సమాజంపై చూపబడుతున్న అధికార వాంఛ పట్ల నిరసన క్రూర స్వార్థపు రాజకీయ ధోరణి మీద ఖండన ప్రదర్శింప బడింది. అందుకోసం ప్రక్షాళన దిశగా ఎంచుకున్న కవితలన్నింటిలో ప్రతీకల ప్రయోగం చైతన్యాన్ని, స్ఫూర్తిని కలిగించాయి. 'ఒకర్నొకరం తప్పిపోతూ' కవితలో నగర స్వరూపం తెలిపారు. మానవత్వం లేని పరుగుల మయంతో కూడిన జీవన గమనాన్ని కవి బాహాటంగానే ఖండించారు. నగరంలో నూతనత్వం వికృతత్వంతో, నునుపుదనం సంరంభంలో ఎంతకీ అంతుపట్టకుందని అంటారు. 'కుబుసం', 'నగ్నం', 'పూనకం' వంటి ప్రతీకలు ప్రయోగించి నగరంలోని రోడ్లు, రాత్రులు, కూడళ్ళ నిజ స్వరూపాలను బట్టబయలు చేశారు. నగరం అధునాతన మైంది. ప్రపంచీకరణ ప్రభావంతో మార్కెట్ మాయా జాలాన్ని, యాంత్రిక ఉగ్ర కోరల్ని పులుముకుంది. ఆకాశ హర్మ్యాలతో, బహుళ అంతస్తులతో పునాదిని చూడలేని

సౌధాల స్థితిని ఆయన అత్యంత వేదనా భరితంగా వ్యక్తపరిచారు. మార్కెట్ ప్రపంచంలో లోకం వచ్చిన దారిని మర్చిపోతూ, మనుషులందరూ మాల్స్‌లో చిక్కుకు పోతూ ఉండే వైనాన్ని తెలిపారు.

'ప్రాచీలోకంలోకి తొంగి చూసి
వ్యత్యాసాల వేదనని తట్టుకోలేక
వర్తమానంలోకి దూకేస్తుంటారు
ఉక్కు కవచాన్ని ధరించామని భ్రమిస్తూ
మాయా వాయువుల్ని
మజా చేస్తుంటారు' (పుట.24)

నగరం ఒక విష వలయం. అది ఎరుగని పట్టణ వాసులు ధనం, దర్పం, ఆడంబరం, అధికారం ప్రదర్శి స్తుంటారు. వీటినే ఉక్కు కవచాలుగా భ్రమిస్తారు. కాని కాలుష్య ప్రపంచంలో ఉన్న సంగతి మరిచి విలాసాలకు బానిస అవుతారు. కవి ప్రయోగించిన 'ఉక్కు కవచం', 'మాయా వాయువులు' ప్రతీకలు పట్టణ భ్రాంతిని మాయం చేస్తుంది. 'ప్రాచీన లోకం', 'వర్తమానం' ప్రతీకలు మానవ అంతరంగ స్పృహను కలిగిస్తుంది. ఆప్యాయతాను రాగాలు గల 'ప్రాచీ లోకం' ప్రేమ పాశానికి నిదర్శనం. 'వర్తమానం' మమతను మరిచిన వైయక్తిక ప్రలోభానికి తార్కాణం. ఇవి రెండు పల్లె - పట్టణాలకు ప్రతీకలుగా కవి నర్సింహారెడ్డి భాసింప జేయడం సముచితంగా ఉంది. చౌరస్తాలు, బ్యాంకులు, ఏటిఎంలు, కమర్షియల్ కాంప్లెక్సులు, కాలేజీలు కొండ గుర్తులుగా పెట్టుకున్న నగరమంతా ఒక్క తీరుగానే ఉంటుందంటారు కవి.

ఆనవాళ్ళ ఆత్మ ఎక్కడా కనిపించదు
కదిలించే ప్రేమ వాక్యం
ఎక్కడా పలకరించదు
కనుమరుగైన ఊరి గురుతులు
ఎంతకీ అంతు పట్టవు
అంతా సిమెంటు కీకారణ్యం
డబ్బు జెండాలెత్తిన
నిలువు బంగళాలు
ఎన్ని సంకేతాలు చెప్పినా
ఇప్పుడు పోల్చుకోవడం
తరం కాదు. (పుట.24)

'సిమెంటు కీకారణ్యం', 'డబ్బు జెండాలు' మానవత్వం గడ్డ కట్టుకుపోయిన జనారణ్యానికి, ధనాహంకారాన్ని ఎగరేస్తున్న బంగళాలకు ప్రతీకలుగా ప్రయోగించడంలో ఆయన సమాజ రచనా శైలికి దర్పణం పడుతుంది. నగర జీవితంలో అనుబంధాలను తప్పిపోయే స్థితిని ఈ కవిత మొత్తంలో ప్రకటించారు.

'మనం లేపిన గోడల నీడలు ఎంత కురుచవి!' అంటూ అధికార ప్రతీకలతో నరసింహారెడ్డి 'సరిహద్దుల్ని ధిక్కరిస్తూ' అనే కవిత రచించారు. దేశాల మధ్య అంతర్యుద్ధం అనివార్యమవుతుంది. దేశ సమగ్రతను కాపాడుకోవడంలో మతాన్ని ప్రపంచ పుటంపై పరివ్యాప్తం చేయడంలో, శక్తియుక్తుల ప్రాబల్యంతో ఆధిపత్యాన్ని ప్రదర్శించడంలో, అణు విస్ఫోటనాల ప్రకల్పనలతో భయోత్పాతాన్ని కలిగించడంలో రాజ్యాలు పోటీపడు తున్నాయి. వాయువు, ఊపిరి, శ్వాస ప్రపంచ మానవ మనుగడకు ఒకటే అయినప్పుడు ఈ అంతరాలు నశిం చాలనే వాంఛ ఆయన ఈ కవితలో వ్యక్తపరిచారు.

సరిహద్దులను ధిక్కరిస్తూ
శీతవాయువు విస్తరిస్తుంది
ఆవరణాన్ని దాటుకుంటూ
వెలుగురేఖ పుడమిని చేరుతుంది
మైదానాన్ని, కొండల గుంపునూ
సాగర తీరాన్ని, కీకారణ్యాన్ని
ఏకం చేస్తుంది జడివాన (పుట.74)

'శీతవాయువు', 'వెలుగురేఖ', 'జడివాన' ప్రతీకలతో జగతినంతటిని సమైక్య పరిచారు కవి. ఈ ప్రతీకలన్నీ సరిహద్దులను ధిక్కరించే గుణాన్ని కలిగి ఉన్నాయి. మానవత్వం, అభ్యుదయం, చైతన్యం వంటివి ఆయా ప్రతీకలకు అర్థాలుగా పేర్కొనవచ్చు.

'చివరి భోజనం' కవితలో అగ్రరాజ్య ఆధిపత్య క్రౌర్యాన్ని, శౌర్యాన్ని కవి చీల్చి చెండాడారు. అంతర్జాతీయ

వ్యాపార విస్తరణలో ఏక ఛత్రాధిపత్యం, సామ్రాజ్య భావజాలం రాజ్యాల్లో చోటు చేసుకుంటుంది. ప్రపంచం అంతా తమ కబంధ హస్తాల్లోకి మార్చుకుంటుంది. ఆ జన్మ బందీలుగా సమస్త దేశాలు మారిపోతాయి. దేశీయ నైపుణ్యాలకు ఆదరణ కరువవుతుంది. విదేశీ మారకం చెలామణిలోకి వస్తుంది. అగ్ర రాజ్యం తమ ఉక్కు పిడికిళ్ళలో ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకుంటుంది. మానవ సమూహం జీవన్మరణ సమస్యలో పడిపోతుంది. కవి నరసింహారెడ్డి నిఖిల లోకాల విద్వేషాలకు, విధ్వంసాలకు కారణమయ్యే బూర్జువా రాజ్యాధికార సిద్ధాంతాలు ఏవిధంగా ఉంటాయో ఈ కవితలో తెలిపారు. 'నరాల దిరిసెన తీగలు', 'రక్త దాహపు రాచక్రీడ' వంటి ప్రతీకలు మరణశిక్ష పడిన వ్యక్తి ఆత్మఘోషను తెలుపుతాయి. జీవన వేదనలన్నీ సంవేదన మరణంతో కలిసి అంతర్ధానమవుతాయి. ప్రకటించినప్పటినుండే ఆ వ్యక్తికి నరకం ప్రారంభమవుతుందని, అదే అత్యున్నత శిక్ష అని కవి అంటారు. ఈ సందర్భంలోనే 'జారిపోయిన బండి ఇరుసులు', 'చెదిరిపోయిన జ్ఞాపక శకలాలు', 'పరుచుకున్న తల్లి ఒడి', 'తుడిచే ప్రియురాలి స్పర్శ', 'ఊయల లూపిన కుక్కి మంచం' ఎప్పటికి దరిచేరవని కవి హార్ద్రంగా స్ఫురింపజేశారు. వీటన్నింటికి ప్రతీకగా 'ఒంటరి దు:ఖం' ప్రయోగించారు. సమస్తం కోల్పోయి జీవచ్ఛవమైన అమాయకత్వం శిక్షకు సిద్ధమవుతుంది. అక్కడ బందీ అయింది వ్యక్తి కాదు. శిక్ష అమలయింది వ్యక్తికి కాదు. వ్యక్తిగల జాతికి. జాతి గల దేశానికి...

దు:ఖం
ఒంటరి దు:ఖం
పంచుకోలేని నిర్వచించుకోలేని దు:ఖం
నలువైపులా ఆవరించుకున్న
నల్లని రాతి గోడలకు అలవికాని దు:ఖం
preplanned cruel murder
Resulted in capital punishment

(పుట.28)

నల్లని రాతి గోడలను విషాద ఛాయలకు, అంధకార బంధురానికి, జీవితపు చివరి ఉనికికి ప్రతీకగా కవి ప్రయోగించారు. దైవం విధించవలసిన శిక్ష రాజ్యం శాసించడాన్ని కవి ధిక్కరించారు. మరణ శిక్షను రాజ్యం దించే 'ప్రకటిత గునపం'గా, మధ్యయుగాల 'రాక్షస దాహం'గా పేర్కొంటూ రాజకీయ ప్రతీకలను అనుసంధానించారు.

సామాన్యులకు రాజ్యం కైవసం అయితే ఎలా ఉంటుందో కేజ్రీపూల పరిమళం ప్రబోధిస్తుంది. కవి నిరాడంబరతకు, స్వచ్ఛతకు, స్వేచ్ఛకు పట్టం గట్టిన గెలుపుగా కేజ్రీవాల్ విజయాన్ని అభివర్ణించారు. కాని అప్పటి స్వార్థపు రాజకీయ పార్టీలను, అవినీతిని మోస్తున్న నాయకులను నిరాఘాటంగా ఖండించారు. వారిని కరెంటు తీగల మీద చిరిగి కొట్టుకుంటున్న గాలి పటాలుగా, వాడి పారేసిన దూది ముద్దల్లా రెపరెపలాడుతున్న ప్లాస్టిక్ కవరులుగా అభివర్ణించారు. 'గాలిపటాలు', 'ప్లాస్టిక్ కవరులు' ఇందులోని ప్రతీకలు. ఆశలు, కోరికలకు 'గాలిపటాలు', ఆకర్షణ, ప్రలోబాలకు 'ప్లాస్టిక్ కవరులు' ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఇవి రాజకీయ పార్టీలు పొడసూపుతున్న ఎరలు. వీటి మాయలో పడి కొట్టుకుంటున్న జనం. ప్రజలకు కవి 'గొర్రె పిల్లలను' ప్రతీకగా నిలిపారు. 'ఆకుపచ్చని దర్వాజ', 'కషాయం ఖంగుతిన్నది' ఇవన్నీ రాజకీయ ప్రతీకలుగా గుర్తింపబడతాయి. 'నిజాయితీ నిప్పు' చైతన్య ప్రగతి వాద ప్రతీక. సామాన్యుడైన కేజ్రీ గెలుపుకిది ఊతం.

అధికార ప్రతీకలను నరసింహారెడ్డి ప్రయోగించి రాజస గర్వాన్ని నిరసించారు. 'నటన దాని నైజం' కవితలో సామాన్యులను అత్యంత సులువుగా మోసం చేసే అధికారుల అసలు స్వరూపాలను వెలువరించారు. పేదల కోసం ప్రవేశపెట్టే పథకాలు, సంక్షేమాలు స్వార్థపు ప్రయోజనాల లబ్దిలో కూరుకుపోతున్నాయి. ప్రజలకు దరిచేరనంత దూరంలోనే వాటి కాలం చెల్లిపోతుంది. నిజం మాట్లాడే స్వేచ్ఛ సామాన్యుడికి లేదు. సామాన్యుడు ఎప్పుడూ గొప్పవాడు కాడు. గొప్పవాడు అధికార పీఠం

ఎక్కినంత మాత్రాన అధముడే. సంస్కారం, మంచితనం ఉన్నత భావాలు. అవిలేని నేటి రాజకీయ స్థితిని ఆయన వ్యతిరేకించారు. 'కుర్చీలు నగిషీలు పొదిగిన మణులు / మకుటాల మెరుపుల్ని ద్విగుణీకృతం చేసే కెంపులు / దూరం పెరిగినందున ప్రతిఫలించే నునుపు / మేలిమిగా మెరుస్తుంటాయి / నిజానికి / గొప్పదేదీ పైన ఉండదు' (పుట. 42)

దేశంలో ఇటీవల నోట్ల రద్దు జరిగింది. దీని ద్వారా భారత ఆర్థిక వ్యవస్థలో ఒక సమూల మార్పును సామాన్య ప్రజానీకం ఆశించింది. రిజర్వు బ్యాంక్ సారథ్యంలో భారత ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద నిర్ణయం ఇది. కాని అవినీతి పరులను, అక్రమంగా ధనం సంపాదించిన వారిని, బ్లాక్ మనీగా విదేశ బ్యాంకుల్లో డబ్బు దాచిన వారిని ఈ పెద్ద నోట్ల రద్దు ఏమి చేయలేకపోయింది. భారత ఆర్థిక భాండాగారాన్ని పునర్వ్యవస్థీకరించడానికి ఇటువంటి విధానాలు నిష్ఫలమే అయ్యాయని ఆర్థిక నిపుణులు సూచించారు. సంపన్న కుటుంబాలలో నిలిచిపోయిన నల్ల ధనాన్ని వెలికితీయడానికి అనుసరించిన ఈ విధానం హాస్యాస్పదం కావడం పట్ల కవులు ప్రతికూలంగా స్పందించారు. కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, రిలయన్స్ కంపెనీలలో పేరుకుపోయిన వ్యాపార సంస్కృతికి భిన్నంగా ఈ విధానం ఒక నూతనత్వాన్ని సంతరించుకొని ఉంటే బాగుండేదని కవి ఆలోచన

అడ్డూ అదుపూ లేని
ఆర్యావర్తపు బాహుబలి
మంత్రాల వల విసిరిండు
ఏ తిమింగలమూ పట్టుబడలే
రోజువారీ బాణాలు గురిపెట్టిండు
ఒక్క పెద్ద పులీ రక్తమోడలే
హనుమంతుడనుకున్నాం కానీ
ఏ లంకనూ కాలబెట్టలే
చిటికె వేసి చిదంబర రహస్యాలన్నీ
విప్ప బోయిండు
చిత్రంగా
భేతాళుడు మళ్ళీ చెట్టెక్కి కూసుండు

(పుట.101)

ఈ పంక్తులు 'రద్దు కాయిదం' కవితలోనివి. ఇందులో పౌరాణిక జంతు ప్రతీకలు అనేకం ఉన్నాయి. 'బాహుబలి', 'హనుమంతుడు' ఈ ప్రతీకలు ప్రధానికి వర్తిస్తాయి. 'తిమింగలం', 'పెద్దపులి', 'లంక' వంటి ప్రతీకలు ధన దాహంతో విపరీతంగా సంపాదిస్తున్న బడాబాబులకు వ్యవహరింపబడ్డాయి. 'బేతాళుడు' అంటే రిజర్వు బ్యాంక్. రద్దు కాయిదంలో ఏమాత్రం లాభాల సరణి సూచి కిందికి రాని కమర్షియల్ మార్కెట్ సంస్థలను, వ్యక్తులను కవి ప్రతీకలతోనే ప్రతిఘటించారు.

మరొక కవిత 'అతడు, బోరు, పాప' విషాద ఛాయలను అలుముకుంది. బోరుబావిలో పడిన పాప మరణించిన సన్నివేశాన్ని కవితాత్మకంగా హృదయ సంవేదనతో నరసింహారెడ్డి ఆవిష్కరించారు. చుక్కనీరు పడక బోర్లు నోర్లు తెరుచుకొని భయానక కుహూరాన్ని తలపిస్తుంది. ఇది వ్యక్తి తప్పిదమా? రాజ్యం తప్పిదమా? ఆకలి కష్టాల వేటలో రైతులకు ఎల్లవేళలా చుక్కెదురవుతున్న తీరు కన్నీటిని తెప్పిస్తుంది. ఈ కవితా పంక్తుల్లో కూడా పౌరాణిక ప్రతీకలు ఉన్నాయి.

పచ్చదనం మీద
పిచ్చి పట్టిన అతడు
జల తపస్సు చేసినట్టు
కలలో కొచ్చిన
బేతాళుడి అప్పు మీద
మరొక బోరు బొమ్మ గీసుకుండు
తాపసి గమ్యం చేర్చే
ఏ శివుడూ రాలే

(పుట. 114)

ఇక్కడ 'తాపసి' రైతుకు ప్రతీక. 'జలతపస్సు' అంటే నీటి కోసం బావిని తవ్వడం. 'బేతాళుడు' రైతును కష్టాల ఊబిలో దించే అప్పులవారు. ఇంతా చేసి బోరు వేసిన బావిలో ఒక్క చుక్కనీరు ఊరలేదు. అందుకే కవి ఏ

శివుడూ రాలేదంటాడు. శివుడు గంగను తన జటా జూటంలో బంధించి నేలకు విడిచే దయను కనికరించ లేదని భావం.

'మెమెంటో' కవిత జ్ఞాపకాల పూదోటలో జ్ఞాపికలను ఏరుకుంటున్నట్టుగా ఉంది. ఆయన రచనా నేర్పుకు అద్దం పడుతుంది. అనేక జ్ఞాపకాలతో పొదిగిన జ్ఞాపికలు గుర్తుకు వస్తాయి. బాతిక్ బొమ్మ, మాడరన్ ఆర్ట్, కవి జాషువా, సంగీతకారుడు మంగళంపల్లి, ఆర్టిస్టు రాజయ్య, బార్ కౌన్సిల్, పాంచ్‌తరా భవన్, సత్య దేవత వంటి కళా సారధుల జ్ఞాపికలు ఈ కవితలో తారసపడతాయి.

జైత్రయాత్రకు అంటిన నెత్తుటి మరకల్లా
అక్కడ ఖరీదైన మెమెంటోలు
లోగిలి నిండా పటాటోపాల్ని
ప్రదర్శించే వింత రంగుల ప్రేములు
వీర భక్తికి దొరికిన లైసెన్సుల్లా
తాపడం చేసిన విగ్రహాలు
పదవులకు చెక్కిన నగిషీలలా
చిత్రవిచిత్రమైన షీల్డులు

(పుట.44)

'జ్ఞాపిక' అధికార దర్పాన్ని ప్రదర్శిస్తుంది. కవి వీటిని 'వీర భక్తికి దొరికిన లైసెన్సులు', 'పదవులకు చెక్కిన నగిషీలు'గా అభివర్ణించారు. ఖరీదైన మెమెంటోకు 'నెత్తుటి మరక' అనే ప్రతీకను చేర్చడం రక్త దాహాన్ని స్ఫురింప జేస్తుంది. అందుకే ఆయన ఈ కవితలోనే జ్ఞాపిక అంటే కాలం వెనక్కి తిరిగి ప్రేమాత్మకంగా చేసే మువ్వల శబ్దంగా ఉండాలంటారు.

'జూన్ 2' కవితలో కవి అభినివేశం ప్రతీయమానంగా నిలుస్తుంది. సుదీర్ఘ పోరాటం తరువాత తెలంగాణ స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంది. నిరంతర దు:ఖం నుండి విముక్తి దొరికింది. నీళ్ళు, నిధులు, నియామకాలు, పంటలు, గనులు, సిరులు, కాలువలు, చదువులు, కరెంట్ మనకోసమే నిలిచాయి. ఉద్యమాల పురిటి గడ్డగా తెలంగాణ పిడికిలి బిగించి ప్రత్యేక రాష్ట్రాన్ని జూన్ 2న సాధించింది. వలస ఆధిపత్యం అంతరించిపోయింది. ప్రగతి పథాన్ని, అభ్యుదయ వాదాన్ని నిలుపుకున్న కవిత ఇది.

భళ్ళున తెల్లవారుతున్నట్లున్నది
నల్లని కాళరాత్రి
నూతన వెలుగురేఖల ముందు
తెల్ల బోతున్నట్లున్నది
ఊపిరి బిగబట్టిన గాలి
మలయ మారుతమై వీస్తున్నట్లున్నది

(పుట. 89)

'తెల్లవారడం' అంటే రాష్ట్రం అవతరించడం. 'వెలుగు రేఖలు' అంటే ప్రజలందరిలో సంతోషాలు ప్రసరించడం. 'నల్లని కాళరాత్రి' అంటే గాఢాంధకార బానిస సంకెళ్ళ జీవనం. 'మలయ మారుతం' అంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యా లను సాధించడం. ఇవన్నీ చైతన్య ప్రతీకలు. వీటితో కవితను శక్తివంతం చేశారు కవి. ఇదే కవితలో నాడు తెలంగాణను వ్యతిరేకించే రాజకీయ నాయకుల స్వార్థపు బుద్ధిని ఖండించారు. 'మెదళ్ళు తిరగేసుకున్న గబ్బిలాలు', 'కళ్ళుండి చూడలేని గుడ్ల గూబలు' అనే పంక్తుల్లో పక్షి ప్రతీకలను నిలిపి వారి అసలు స్వరూపాన్ని వ్యక్తపరిచారు. కవి ఈ నవ తెలంగాణను 'కాలం యవనిక మీద సప్త వర్ణాల అద్దకం దిద్దినట్లున్నది' అని కీర్తించారు.

తెలుగు భాష మీద రాసిన కవిత 'తెలుగుపూలు'. ప్రపంచ తెలుగు మహాసభలు ప్రపంచ దేశాలలో భావ ప్రాప్తిని కలిగించాయి. తెలుగు భాషా గౌరవాన్ని నిల బెట్టాయి. తెలంగాణ అస్తిత్వంలో తెలుగు భాషా ప్రాధాన్యాన్ని కొనియాడాయి.

కాంక్రీటు జంగల్ మీద
భయం భయంగా
ద్రవిస్తున్న నింగి
గ్లోబల్ ఖడ్గం నరుక్కొస్తుంటే
కంతాలర్పిస్తున్న బలహీన భారతుల దృశ్యం మీదుగా
ఒక చిరురక్షణ కవచం పరుచుకుంటోంది.

(పుట.128)

'కాంక్రీటు జంగల్', 'గ్లోబల్ ఖడ్గం' అత్యాధునిక మార్కెట్ యుగానికి ప్రతీకలు. ప్రపంచీకరణ నేపథ్యంలో భాషా సంస్కృతులు కోల్పోతున్న తరుణంలో ఇటువంటి మహాసభలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'బలహీన భారతులు' అంటే అణిచివేయబడుతున్న భారతీయ భాషలు. వాటికి 'రక్షణ కవచమే' ప్రపంచ తెలుగు మహాసభలు.

జీవితం నిరంతర గాయాల సుడిగుండం. ఒడుపు, జాగ్రత్తను పాటించినా గాయాలు ఎదురవుతూనే ఉంటాయి. కవి గాయాల మాటున నిలిచి 'గాయపడ్డాకే' కవిత రచించారు. 'కనిపించని బాణాలు', 'మాటల తూటాలు' ఇందులోని ప్రతీకలు. ఇవి మనసును నిలువెల్లా గాయం చేస్తుంటాయి. 'పెద్ద పెద్ద అభాండాల జడివాన / అమాంతంగా మీద కురిసిపోతుంది / తేరుకోక ముందే / తేనె పట్టునుండి కందిరీగలు లేచినట్లు' ఈ కవితా పంక్తుల్లో 'అభాండాల జడివాన' అనే ప్రతీక అబద్ధాల ప్రపంచాన్ని మోసుకొస్తుంది. 'కందిరీగలు' సమస్యల ముసురును తలపిస్తాయి. 'కనిపించని పొగలు', 'వెక్కిరించే నొసళ్ళు' అణిచివేతకు ఊతంగా ఉన్నాయి. ఇందులోనే యుద్ధ ప్రతీకలు ప్రయోగించారు. 'యుద్ధ రంగం', 'బాంబుల మోత', 'ఆయుధాలు', 'ఎజెండాలు', 'చురకత్తులు' పొంచి ఉన్నాయి. గాయం కాకుండా తప్పించుకోలేరనే భావనను నరసింహారెడ్డి కలిగించారు.

'అవతలి తీరం'లో స్థల మాతృకను గమనించవచ్చు. నడిచొచ్చిన జీవితంలోకి మరల తరచి చూచుకోవడమే ఈ కవిత ప్రధాన ధ్యేయం.

నడిచొచ్చిన నేలలో
తిరగాడు తున్నాను
పాట జారిపోయిన వేదిక మీద
స్వరాల్ని ఏరుకుంటున్నాను
రెప్ప దాటిన కలల మీద
మెరుపుల్ని చిత్రిక పడుతున్నాను
అప్పుడు ఆగిపోయిన గుసగుసల్ని
ఇప్పుడు పదాల మాల కడుతున్నాను

(పుట.21)

'నేల' స్థల మాతృక. ప్రకృతి ప్రతీకల పరవశంగా కవి ఈ కవితను ధ్వనింపజేశారు. జీవన జ్ఞాపకాల పూదోటలోకి అనేక ప్రతీకలను ఏరుకొచ్చారు. 'వేదికమీద స్వరాలు', 'మెరుపు చిత్రికలు', 'పదాల మాల' అనేవి గతించిన స్మృతుల అవలోకన స్థితిని తెలుపుతాయి. జీవితం కష్ట సుఖాల కలవరం. కవి 'మెరుపురాయి' అనే ప్రతీకను ప్రయోగించి, దాని వెనుక ఉన్న శ్రమశక్తికి గుర్తుచేశారు. పలుగురాళ్ళు పరుచుకున్న బాటమీద మండుటెండల మధ్య మెరుపురాయిగా మెరుస్తుంటాడు కవి. ఆత్మాశ్రయ ధోరణిలో భావ గర్భితమైన పద ప్రయోగాలు ఈ కవితలో కనిపిస్తాయి.

'గూట్లో దీపం' కవిత ప్రతీకలమయం. మరణాన్ని ఆస్వాదించే తీరు ప్రతీకాత్మకంగా వర్ణింపబడింది. జీవితం మొత్తం ఒడికట్టి ధారపోసిన భారం, బాధ, కష్టం, కడ గండ్లు వృద్ధాప్యంలో ఎవరూ బేరీజు వేయరు. వాటి ప్రతిఫలంగా వచ్చిన ఆస్తి, అంతస్తు, లాభం, ధనం వంటివి మాత్రమే గణనలోకి వస్తాయి. అవి కూడా పాలు పంచుకోవడంలోనే గాని; మురిపాలను పంచుకోవడంలోకి రావు. మానవీయత మంట గలిసిపోయిన బాంధవ్యాల తీరును కవి అత్యంత అర్థయుక్తితో ప్రదర్శించారు. వయసుడిగిన తర్వాత కీళ్ళ నొప్పులు, గుండెపోటు వస్తాయి సహజమే కాని వాటికి మించిన 'గాయాల మాటలు', 'గునపాలు' గొంతుల్లో దిగుతాయనడం నేటి కుటుంబ మానవ సంబంధాల లేమికి అద్దం పడుతుంది. అందుకే కవి అంటాడు -

పొద్దు గూకక ముందే
గూట్లో దీపం పెట్టడం మంచిది
హుషారుగా ఉన్నప్పుడే
పిట్ట ఎగిరిపోవడం ఉత్తమం

(పుట.58)

'జలదృశ్యం' కవితలో అద్భుతమైన ప్రతీక ప్రయోగింప బడింది. 'ఇక్కడొక నాకలోకపు నఖలుండేది', 'నాకలోకం'

చెరువుకు, ఉప్పొంగిన అలుగుకు ప్రతీక. దేవలోకం దిగివచ్చిన పరవశం ఊరిలో నర్తించేవి. నిండుకుండలా ఉన్న నాటి జలదృశ్యం నాకలోకాన్ని తలపించేది. కవి ప్రయోగించిన దైవ ప్రతీక ఆ కవితను మొత్తం సుందరమయం చేసింది. పద భావ చిత్రికను ప్రదర్శించింది.

నీటి అద్దం మీద కొంగలు
సింగారించుకునే దృశ్యం
శత సహస్రాలుగా విస్తరించే
జీవరాశి పరిమళం
తీతువు పిట్టలకు
చాకిరీ చేసే తుమ్మ కొమ్మలు
లంగరేసిన ఒక జెండాలా
గాలికి ఎదురీదే చెట్ల సమూహం
దీపం చుట్టూ మెరిసే వెలుగు రేఖల్లా
జారుతున్న పంట కాలువ గట్ల మీద
పూల తీగల పులకరింతలు
తల్లి ఒడిలో ఖుషీ చేసే పిల్లవాడిలా
జలదృశ్యం ముంగిట ఊరు

(పుట. 41)

'ఆకుపచ్చ తివాచీ', 'నీటి అద్దం' వంటి ప్రతీకల ప్రయోగం కవితకు సౌందర్యాన్ని కలిగించింది. కాని నేడు వాటి గుర్తులు చెరిగిపోయిన దౌర్జన్య రూపం పట్ల కవి ఆవేదన ప్రకటించారు. పునర్నిర్మాణం కోసం పరితపించారు.

పసివాడి 'నిద్ర నవ్వు'ను కవి అత్యంత సుందరంగా చిత్రించారు. వాడు మేలుకుంటే వెలుగు, నిద్రిస్తే వెన్నెల అంటూ కవి ప్రతీకల వర్షం కురిపించారు. వెలుగు-వెన్నెల జీవితపు ఆనంద సంతోష సన్నివేశాలను తెలుపుతాయి. ఇవి రెండు లేకపోతే 'ఇంటిలోకమంతా చీకటి' అని కవి నిర్లిప్తతను ప్రకటించారు. ఇంటిలో పసిపిల్లల బోసి నవ్వులు ఎంత ఆహ్లాదాన్ని కలిగిస్తాయో కవి పేర్కొన్నారు. సంతానం లేని ఇల్లు అంధకారమయమవుతుంది. 'చీకటి'ని విషాదానికి ప్రతీకగా కవి నిర్వచించారు. నిద్ర నవ్వు రహస్యాన్ని కవి ఛేదించారు. 'నిద్ర నది', 'జాగరూకపు గట్టు' అనే ప్రతీకలు పసివాడి ఆంతరంగిక స్పర్శను తెలుపుతాయి. అందులోనే కలవరపడి కదలినప్పుడు బయటి ప్రపంచమంతా ఉలిక్కిపడుతుందంటారు కవి. నిద్రాణమైన లోకానికి అతని కలవరం ఒక చరుపుగా కవి భాసింపజేశారు. ప్రకృతి ప్రతీకల ప్రయోగంలో సిద్ధహస్తుడైన కవి పౌరాణిక ప్రతీకల కల్పన కలిగిన పంక్తులను ఈ కవితలోనే ప్రదర్శించారు.

అభ్యాసం లేని యోగం అతడి నిద్ర
తటాల్ని రెప్ప వేయడమూ
చిత్రంగా కన్ను తెరవడమూ
పుట్టగానే నేర్చిన ఏకలవ్యుడు

(పుట. 31)

ఏకలవ్యుడికి గురువు లేడు. శిశువుకు కూడా. కాని అభ్యాసం లేని యోగం నేర్చాడు. అతని ధ్యాన ముద్రికలకు కూడా సాధన లేదు. ఈ కవితలో కవి కాల మాత్రుకను ప్రయోగించాడు. 'కాలం గీసిన తొలిగీత'. కాలం ఆకాశానికి సూచిక. నక్షత్రాలు, రాశులు, గతులు ఆకాశ సందేశాన్ని బట్టి చరిస్తుంటాయి. పుట్టుక కాలం నిర్ణయిస్తుంది. జీవనం స్థలం నిర్ణయిస్తుంది. స్థలం భూమికి సూచిక. కవిత్వంలో కాల మాత్రుకలు అప్రయత్నంగానే సిద్ధిస్తుంటాయి.

'నాన్న' కవిత ఔదార్యాన్ని చూపుతుంది. పిల్లలకు నాన్న భరోసా ఎంతగా ఉంటుందో కవి తెలిపారు. అమ్మ ఆత్మను అందిస్తే నాన్న రూపం కలిగిస్తారు. ఆత్మస్థైర్యం, గుండె నిబ్బరం నాన్న నేర్పిన జీవిత పాఠాలు. శరీరంలోని సమస్త శక్తులకు నాన్న ఒక ఆధారం. నిరంతర కాల గమనంలో ఎదురయ్యే 'ఇజాల' భావజాలపు గుర్తులను విడమరిచి చెప్పేవారే నాన్న. అందుకే కవి 'ఆత్మ చుట్టూ అల్లుకుపోయే ప్రాకృతిక ప్రేమ కవచం నాన్న' 'భావ జాలపు ఇనుప గుగ్గిళ్ళను ద్రాక్ష పండ్లలా అలవాటు చేస్తాడు' అంటాడు. 'ఇనుప గుగ్గిళ్ళు' కఠినమైన బంధనాలకు, సంకెళ్ళకు ప్రతీక. వాదాలు, ఉద్యమాలు, ధోరణుల

భావజాలపు విష వలయాలు 'ఇనుప గుగ్గిళ్లు'గా ప్రతీక మానమవుతాయి.

'పాలపిట్ట' ప్రతీకలో నందిని సిధారెడ్డిని వర్ణించారు కవి నరసింహారెడ్డి. సిధారెడ్డి స్వరూపం, స్వభావం, స్వచ్ఛత, నిబద్ధతలకు ఆలంబనగా ఈ కవిత రచించారు. కవితా వస్తువుతోనే శీర్షిక నిర్వచించబడింది. మాటకు, మను గడకు, కవిత్వానికి, జీవితానికి; ప్రేమకు, కోపానికి వ్యత్యాసాలు చూపని వ్యక్తి నిరాడంబరత, స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. 'మార్క్సిజం గీటురాయి', 'తెలంగాణ ఆచరణ సోయి'గా కవి ప్రకటించడంలో సిధారెడ్డి నైజం తారసపడుతుంది. పల్లె తల్లిని, శ్రమజీవులను ప్రేమిస్తారు. కర్తవ్య దీక్షలో కంకణబద్ధుడవుతాడు. ఆడిన మాట తప్పక ఆచరిస్తారు. అటువంటి సిధారెడ్డి వ్యక్తిత్వ నిర్మాణంలో కూడా కవి ప్రతీకలు ప్రయోగించారు.

కాలంగాని కాలంలో
రానేరని గాలిని నమ్మి
తూర్పార బట్ట గూడదని
క్రాంత దర్శనం చేస్తాడు

(పుట.66)

'వాయుముద్ర'ను ఒక నిస్తంత్రీ స్పర్శ (మొబైల్)గా అభివర్ణించారు. కవి భావ పటిమకు తార్కాణం. పంచ భూతాలలో 'వాయువు' వేసే ముద్ర అధికం. వాయువు ప్రాణనాడి. అనంత ఘోషకు ఆయువుపట్టు. అగ్ని, ఆకాశం, జలం, పృథివి వాయువులో సంకలితమవుతాయి. ప్రియురాలి నిసర్గ స్వరం కూడా.

ఆ స్వరం కర్ణభేరి ద్వారా హృదయాన్ని హత్తుకుం టుంది
దుమ్ము పట్టిన వీణ తీగను అదే పనిగా మీటి పోతుంది
జ్ఞాపకాల సీమ సరిహద్దుల్ని తట్టిలేపి
ప్రమత్తపు లోక పరిమళంలో వింత అలజడి చెలరేగు తుంది
ఇక ఎప్పుడూ ఆ వాయు ముద్ర కోసమే
మనసు సూదంటురాయై ఎదురు చూస్తుంది

(పుట.51)

'సూదంటురాయి' ప్రకృతి ప్రతీక. మనసు పరవశాన్ని తూచ గలిగేది. వాయు సందోహంలో ప్రకృతిని మన ముందు పెట్టారు కవి. పక్షులు, లేళ్ళు, అశ్వాల విన్యాస ప్రతీకలను వాయు ముద్రలో ప్రదర్శించి ప్రియురాలి పిలుపు కోసం కోరికలతో కూడిన మనసు వేగాన్ని అభివర్ణిం చారు.

'హార్ట్ టు డీలిట్' నేటి తాత్కాలిక ప్రేమానుబంధాలకు తార్కాణంగా నిలిచిన కవిత. చెదిరిపోతున్న ఊహలకు దృశ్యమానమైన అనేక సంకేతాలు ఇందులో ఉన్నాయి. అత్యాధునిక నానో యుగాన్ని తలపిస్తున్న సాంకేతిక ప్రతీకల వాడకం అధికంగానే చేశారు ఆయన. మెసేజ్‌లు డిలీట్ చేసినా, వాట్సాప్‌ను డిస్కార్డ్ చేసినా, ఫేస్‌బుక్ నుండి ఎగ్జిట్ అయినా, మోబైల్ డేటాను వదిలించుకొన్నా, వైఫై నుండి దూరంగా జరిగినా... అవన్నీ తాత్కాలికమే అంటాడు కవి.

గ్రావిటిలో భాగమైన
జ్ఞాపకాన్ని ఏం చేద్దాం!
మెమోరీని కూడా డిలీట్ చేయదగ్గ
ఒక యాప్ ఉంటే ఎంత బాగుండు

(పుట. 86)

'గ్రావిటీ', 'మెమోరీ' సాంకేతిక ప్రతీకలు. కాని అవి మనసు అర్రలో భద్రంగా ఉన్నాయి. వేగవంతమైన జీవితంలో ఆనందాలు, సంతోషాలు యాంత్రికతలో కూరుకు పోయాయి. కాని భగ్న ప్రేమికుల అంతరంగంలో వలపు రాగాల హృదయ పరిమళం శ్వాసిస్తూనే ఉంది.

నాటి జ్ఞాపకాలతో నేడు చెదిరిపోయిన ప్రేమ ఆనవాళ్ళ కోసం కవి అన్వేషిస్తున్నారు. సాంస్కృతిక ప్రతీకలు నిండిన కవిత ఇది మచ్చుకు...

ఎంతకి అందని
సింధూ నాగరికతలో
చిత్రలిపిలా నువ్వు

పాఠకుల్ని చేరని నేను మహా కావ్యంలా
సమాంతరంగా

(పుట. 86)

'తైలం' అనే వస్తు ప్రతీకను స్త్రీకి, 'అమీబా' అనే జీవ ప్రతీకను శత్రువుకు ప్రయోగించారు. జీవజాలంలో దైవ ప్రకతీకలు శుక్రుడు, స్వర్గం వంటివి అభివర్ణించారు.

'కవిత్వం! ఎలా ఉండాలనే దానికి కవులు అనేక రకాలుగా సిద్ధాంతీకరణ చేశారు. కవిత్వ నిర్మాణ పద్ధతులను విడమరిచి చెప్పారు. అందులో కవి డా॥. ఏనుగు నరసింహారెడ్డి చెప్పిన 'చెక్కడం' కవిత రచనా శైలిని తెలుపుతుంది. లలిత కళలలో శిల్పం, చిత్రలేఖనం కంటే విభిన్నమైన నైపుణ్యం కలదిగా వర్ణించారు. వాక్యాలను పదాలుగా, పదాలను అక్షరాలుగా, అక్షరాలను స్వరాలుగా ప్రాణప్రతిష్ఠ చేయదగ్గ విన్యాసమొకటుందని కవి పేర్కోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. 'కర్రసాములో జైత్రయాత్ర చేసినట్లు / అక్షరాలలో ఆనందభైరవి ఆలాపించినట్లు' కవిత్వం ఉండాలనడంలో కవి క్రీడా, సంగీత ప్రతీకలకు స్థానం కల్పించారు. 'కర్రసాము' ఎంత చాకచక్యంగా ప్రదర్శింపబడుతుందో; 'ఆనంద భైరవి' రాగం ఎంత పరవశ హృదయం గావిస్తుందో కవిత్వం అలా ఉండాలంటారు. తిలక్‌ను తలపింపజేశారు.

'మలుపుల దగ్గరి దు:ఖం' కవిత కూడా జీవితం కష్టాలబాటను ఏవిధంగా దాటుకుంటూ వస్తుందో ఆట ప్రతీకల ద్వారా ఆయన వివరించారు. 'మొదలు నిచ్చెన్లు బాగనే ఎగరేస్తయి గని / పరమ పదం / చాలా దూరమెళ్ళి పోతుంది / పాములు మింగడానికి నోళ్ళు తెరుచుకొని కాచుకుంటయ్' (పుట. 123). కాని మనిషి సుఖాలనే కోరుకుంటాడని కవి అంటారు. జీవితంతో ఎదురయ్యే ఎండమావులను తలపోయడని అంటారు. 'నిచ్చెన్లు', 'పరమపదం', 'పాములు' ఆటల్లోని పావులు. ఈ ప్రతీకల మధ్య ఎన్నో మలుపులుంటాయని; ఆ మలుపుల దగ్గరి దు:ఖం దింపుకోవడం గుండెకోతను కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కవితా సంపుటి శీర్షిక 'మూల మలుపు'. ఈ కవితలో కూడా నరసింహారెడ్డి ప్రతీకల వర్షం కురిపించారు. ఇది వ్యక్తి శరీరం, ఆరోగ్యం, వ్యాధి సమస్యల నుండి బయట పడడానికి ఆశావహ దృక్పథంలో రచించినది. ఈ మలుపును ఛేదించడమే మనిషి లక్ష్యం. మలుపు అనంతర బాటలో పయనించాలి. దానికెంతో ఆత్మ నిబ్బరం కావాలి. శరీరంలో సత్తువ కావాలి. అందుకే కవి అంటారు 'ఎంతో యుద్ధం నడిచిన కారుణ్య భూమి కదా!' అని. 'యుద్ధం' సంఘర్షణ జీవితానికి ప్రతీక. 'కారుణ్య భూమి' సుక్కిన దేహానికి ప్రతీక. 'చీకటి ముసుగు మీద' వెలుగురేఖ విరబూస్తుందా' చీకటి వెలుగులు ఎన్నింటికో ప్రతీకలుగా చెప్పబడ్డాయి. ఈ కవితలో 'చీకటి' నిస్తేజ అవయవాలకు ప్రతీక 'వెలుగు' పరీక్షల్లో నెగ్గిన ఉత్తేజిత అవయవాలకు ప్రతీక. జీవితం ఆనందమయం చేసుకోవాలనే ఆకాంక్ష కవిది.

### 'మూలమలుపు'లో మరికొన్ని ప్రతీకలు :

- శిలా సదృశ చిక్కుముళ్ళను గోరంతైనా చిత్రిక పట్టలేని కలాలకు కొత్త దృక్కులుంటే ఎంత బాగుండేది. (పుట.32)
- లోక సంద్రంలో మునకేసి తడిసి తుడుచుకోరాని నెమలి పిల్లలా నిలబడుతుంది (పుట. 37)
- విమానం ఎక్కిన ప్రతిసారి ఎన్నడూ పనికిరాని లైఫ్‌జాకెట్ పాఠం శ్రద్ధగా వింటాం (పుట.38)
- మునిగిన కొద్దీ మణి దీపాల వెలుగులో నివ్వెరపోయే సముద్రం లాంటి ప్రపంచం (పుట.50)
- పెనుమర్రి లాంటి భావ లోకంలో సరిహద్దుల్ని తుత్తునియలు చేసే వింత ప్రపంచం (పుట.50)
- గోడకేసిన సున్నంలా కవి మాట ఇలా అంటుకు పోవలసిందేనా! (పుట.59)
- ప్రజా కేతనం రెపరెపలకేనా కాలం లిట్మస్ పేపర్ తెరచి చూడనుంది (పుట.63)
- శిలమీద చెక్కిన చిత్తరువులా బహు భాషల లుప్త వాక్కుల మహాతపో దీక్షలో మునిగింది (పుట.64)

- వేదికల మీద ప్రణాళికలు పరిచిన హార్టిలెస్ శాస్త్రీయ క్రీడ (పుట.80)
- కళ్ళతో కరచాలనం చేసి అపార్థాల చిత్తరువు మీద ఎప్పుడైనా నీరొంపుదామా (పుట.87)
- కురుస్తున్న జడివాన మీద అదనపు వడగళ్ళ రాయిలా (పుట.93)
- కార్యాలయం కదలదు. జనం రాక మానదు. కీలుగుర్రం నర్తిస్తూనే ఉంటుంది. (పుట.95)
- పీఠభూమి సింహాసనం మీదికి సాలభంజికను మెప్పించి వేసిన అడుగు (పుట.96)
- కొయ్యగుర్రం ఉన్న చోటనే పరుగెత్తీ పరుగెత్తీ అలసిపోతది (పుట.129)
- వసుదైక కుటుంబం ఏకధృవ ప్రపంచానికి సాగిల పడుతున్న అనూహ్య స్వప్నం (పుట.135)

డా॥ ఏనుగు నరసింహారెడ్డి ప్రతి కవితలోను ఒక మలుపును ఆశించారు. మార్పు అనంతర కాలాన్ని ఆహ్వానించారు. అది వ్యక్తిగత జీవితం కావచ్చు. ఉద్యోగ జీవితం కావచ్చు. స్నేహం, ఆత్మీయులు కావచ్చు. సంబంధ బాంధవ్యాలు కావచ్చు. ఊరు, చెరువు కావచ్చు. దేశ పరిస్థితులు, అంతర్జాతీయ వైపరీత్యాలు కావచ్చు. కుట్రలు, కుతంత్రాలు కావచ్చు. అగ్రరాజ్యాల అధికార దాహం కావచ్చు. వికృత సమాజంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలు, అత్యాచారాలు కావచ్చు. ఈ 62 కవితల్లో వైవిధ్యమైన వస్తు శిల్పాదులను ప్రదర్శించారు. అంది వచ్చిన ప్రతీకలెన్నింటికో ప్రాధాన్యం కల్పించారు. పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక, సామాజిక ప్రతీకలతో పాటుగా స్థలకాల మాత్రుకలు, ప్రకృతి, యుద్ధ, దైవ, సాంకేతిక వస్తు, అధికార ప్రతీకలను సందర్భానుసారంగా ప్రయోగించారు. సామూహిక ప్రయోజనాన్ని చేకూర్చారు.

## ఆధార గ్రంథాలు :

1. నరసింహారెడ్డి.ఏనుగు, 2018,మూలమలుపు- కవిత్వం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
2. నరసింహారెడ్డి.ఏనుగు, డా॥,2018,అంతరంగం- ఆధునిక కవిత్వ విమర్శ,పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
3. నారాయణరెడ్డి.సి.డా॥, నవంబర్ 2011, ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు -ప్రయోగాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. మందేశ్వరరావు, వడలి.,1994, పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర - సిద్ధాంతాలు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
5. లక్ష్మణచక్రవర్తి. సిహెచ్ (సం)., 2004, ఆధునిక సాహిత్య విమర్శ రీతులు, ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ, హైదరాబాద్.
6. వెంకటేశ్వరరెడ్డి. కొండ్రెడ్డి, జూన్ 2019, ఏనుగు నరసింహారెడ్డి సాహిత్యాంతరంగం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# జానపదుల 'భాషా సారస్వతములు'

- డా॥. పాలెం వేణుగోపాల్

ప్రస్తుత వ్యాసం ఆచార్య బిరుదురాజు రామరాజు గారి 'తెలుగు జానపద గేయసాహిత్యం', ఆచార్య జి.ఎస్. మోహన్ గారి 'జానపద విజ్ఞానాధ్యయనం', ఆచార్య ఆర్వీ ఎస్.సుందరం గారి 'జానపద విజ్ఞానం' గ్రంథాల ఆధారంగా రూపొందించబడింది.

**పరిచయం :**

''జానపదుల్ పురీజనులు సంతసముంబ్రమదం బెలర్ప నీ
దైన శుభోదయంబు హృదయంబుల గోరుచునున్న వారు స
మ్మానమునొంది కౌరవ సమాజము నిన్ను భజింప భూరి తే
జోనిధివై వెలింగెదవు సూర్యుని చాడ్పున నీవ యిమ్మహిన్'

(ఆంధ్రమహాభారతం-అరణ్య పర్వం-5.346)

ఆంధ్రమహాభారతంలో జానపద శబ్దం గ్రామీణులనే అర్థంతో మొదటిసారిగా వాడినట్లు అంచనా. జనపద మనగా పల్లెటూరు. జనపదములందుండువారు జాన పదులు. 'కృతయజ్ఞశ్చ మేధావీ బుధో జానపదశ్శుచిః' అని వ్యాసుడు జానపదులను యజ్ఞము చేసినవారితోను, పండితులతోను సమానులుగా వ్యాఖ్యానించారు. వారి సాహిత్యాన్ని జానపదసాహిత్యమంటారు. జానపదులు పాడుకొను పాటలను జానపదగేయములు అంటారు. ఆంగ్లంలో వీనినే Folk Literature, Folk Songs అంటారు. ఈ పదాలు ఎశీశ్రీనింశ్రీఱవ అనే జర్మను భాషా పదానికునువాదం, మరికొందరు జానపద విజ్ఞానం (Folk lore) అనికూడా ఈ వాఙ్మయాన్ని పిలుస్తారు. కాబట్టి Folk-songs, Folk-Literature, Folk-lore అనే పదాలకు జానపదగీతాలు, జానపదసాహిత్యం లేదా జానపద సారస్వతం, జానపదవిజ్ఞానం అనే మాటలను వాడుచుండుట పరిపాటి. కొందరు జానపద సాహిత్య, జానపద వాఙ్మయాలకభేదం పాటిస్తున్నారు. అయితే వాఙ్మయ శబ్దం సాహిత్యశబ్దంకన్నా విస్తృతమైనదని గమనించాలి. ఇక జానపదవిజ్ఞానంలో జానపదులకు సంబంధించిన విజ్ఞాన మంతయు చేరుతుంది. అనగా జానపద కథావాఙ్మయం, మూఢ విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, మంత్ర తంత్రాలు, శాస్త్ర విజ్ఞానం (భౌతిక, పారమార్థిక విషయాల పరిజ్ఞానం), వారిభావాలు, పొడుపుకథలు, సామెతలు, వినోదాలు, వేడుకలు, ఆట - పాటలు మున్నగునవి పై వానిని సాహిత్యసంబంధి, భాషాసంబంధి, వైజ్ఞానిక సంబంధి, క్రియాసంబంధి యని నాలుగు భాగాలుగా విభాగించవచ్చు. పురాణం, జానపద కథ, గేయం మొదటి విభాగమైతే; మాట, పొడుపుకథ, సామెత రెండవ విభాగం. మందు, చికిత్స, ఇంద్రజాలం, జ్యోతిష్యం, వివిధ నమ్మకాలు, వైజ్ఞానికవిభాగం, నృత్యం, సంగీతం, ఆట, వినోదం, నాటకం, దుస్తులు, వంట, కళ మొదలైనవి చివరిదైన క్రియాత్మకంలో చేరుతాయి. సాహిత్యవర్గానికి కావలసింది కళాత్మక భాష. భాషావర్గంలో వ్యక్తమయ్యేది భాషా సామాన్య స్వరూపం. కార్యకారణా లను వైజ్ఞానికవర్గం వివరిస్తే, క్రియాత్మక వర్గానికి కావలసింది దేహం యొక్క కళాత్మక కదలికలు. ఈ అన్నిటి సమిష్టి సాంప్రదాయాన్నే 'జానపద విజ్ఞానం' అంటాం. దీనినే వాగ్రూప జానపదవిజ్ఞానం, సాంఘిక జానపదాచారం, వస్తుసంస్కృతి లేదా భౌతిక సంస్కృతి, జానపదకళలు అని మరొక విధంగా వర్గీకరించవచ్చు. ఇలా వర్గీకరింపబడిన జానపదవిజ్ఞానం కేవలం జనపదాల్లో మాత్రమే ఉందని అనుకోరాదు. నగర వాసులలో సైతం జానపదత్వం ఉందన్న సత్యాన్ని మనం గమనించాలి. ఈ అంశం జానపద విజ్ఞాన ప్రక్రియలైన కళలు, వైద్యం, నమ్మకాలు, సంప్రదాయాలను గమనిస్తే

స్పష్టమవుతుంది. ప్రతిరోజూ నాగరికుడు తన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకవిధంగా పై జానపద విజ్ఞానాంశాల్ని అలవరచుకుంటూనే ఉన్నాడనేది విస్పష్టం.

## జానపద సాహిత్యం:

ఇంత విశాలమైన జానపదవిజ్ఞానంలో జానపద వాఙ్మయం ఒకభాగం మాత్రమే. ఎక్కువగా దీనిలో వాగ్రూపవిజ్ఞానం మాత్రం చేరుతుంది. ఈ జానపద వాఙ్మయంలో జానపదసారస్వతం ఒకభాగం, జానపదుల ఆధ్యాత్మిక, ఆదిభౌతిక భావవ్యాప్తికి లక్ష్యభూతమైనదీ జానపదసారస్వతం. తెనుగునాట వెలసిన దేశి సార స్వతాన్ని 'నిబద్ధదేశి, అనిబద్ధదేశి' అని రెండుగా విభజించ వచ్చు. నిబద్ధదేశి శిష్టుల రచన కాగా అనిబద్ధదేశి జాన పదుల సామూహిక రచన. దీనినే జానపదదేశి యన వచ్చును. ఆయా జనుల సంస్కారాల అనుసరించి 'ఆటవికదేశి, పామరదేశి, జాతిదేశి' అని మూడురకాలుగా వింగడించవచ్చు. ఆటవికులకు, గిరిజనులకు సంబంధిం చిన సారస్వతం ఆటవికదేశి. చదువుసంధ్యలు రాని పల్లీయులకు చెందినది పామరదేశి. కొంచెం అక్షరాస్యు లైనను కాకున్నను అగ్రవర్ణాల వారికి, ప్రత్యేకంగా స్త్రీలకు సంస్కారవంతులకు సంబంధించినది జాతిదేశి. జానపద సారస్వతం కన్నా పరిమితమైనది జానపదసాహిత్యం. ఇది రసానందం, భావసౌకుమార్యం, భాషాసౌందర్యాలు ముఖ్యాంగాలుగా కలది.

## జానపదుల భాష :

జానపదసారస్వతానికి, జానపద వాఙ్మయానికి జాన పద భాషయే మూలధారం. వారి భావాల వలెనే వారి భాష కూడా జీవకళ ఉట్టిపడునదిగా ఉంటుంది. చెప్ప దలచిన విషయాన్ని సూటిగా హృదయానికి తాకునట్లు చెప్పబడునేకానీ, కవి ప్రౌఢోక్తులవలె కఠినావబోధంగా ఉండదు. వ్యాకరణపు మూసలో యిముడదు. అందుచే వారిభాషను శిష్టులు గ్రామ్యమని ఎద్దేవాచేస్తారు. కారణం తెలుగు భాషా,సాహిత్యాల క్రమపరిణామ వికాస చరిత్రపై నిబద్ధతతో కూడిన అవగాహన లేకపోవడమే. ఒక్క మాటలో చెప్పాలంటే పట్టభద్రుడగు పండితునకు బాలశిక్ష చదువు నవస్థ పునాదియైనట్లే శిష్టసాహిత్యానికి కూడా జానపదసాహిత్యమే పునాది. అందులోని ఛందో లయ, ధ్వన్యనుకరణపదం, ప్రాస, అనుప్రాసలు, అనుసరణం మొదలగునవి భాషకి సౌందర్యాన్ని చేకూర్చే అంగాలు. అందువలననే K. Vossler అనే పాశ్యాత్య పండితుడు 'Its phonetic body is equivalent to its poetic capacity' అని పేర్కొన్నాడు. ఈ మాట జానపదభాషకు కూడా పూర్తిగా అన్వయిస్తుంది. ఆ కారణంచేతనే ఎమర్సన్ అనే పండితుడు కూడా 'As this is the first language, so it is the last' - అనగా 'జానపదుల భాషే ప్రాచీనమైంది, మొదటిది' అన్నాడు.

జానపద గేయ సాహిత్యమందుండు భాష వాడుకభాష కనుక యిది కావ్యభాషా వ్యాకరణానికి లొంగదు. వ్యాకరణ విరుద్ధాలగు భాషావిశేషాలు బహుమెండుగ ఉంటాయి. వ్యవహారిక పదరూపాలు, దుష్టసంధులు, దుష్ట సమాసాలు, భ్రష్టరూపాలు, శివకవులుపయోగించినట్టి పదసముదాయం ఎక్కువగా కనిపిస్తాయి. వైయా కరణులకు సమ్మతంకాకున్నా భాషాశాస్త్రజ్ఞులకింపు గొలుపుతాయి. మరియు కోట్ల జనుల నిత్య వ్యవహారంలో ప్రయోగింపబడుటచేనివి తమ వ్యాకరణాన్ని తామే నిర్మించుకొన్నట్లు కనిపిస్తాయని కీ.శే. ఆచార్య బిరుదురాజు రామరాజు గారభిప్రాయపడినారు.

దినవెచ్చము, ప్రాణగొడ్డము వంటి శబ్దములను శిష్టసాహిత్యంలో ప్రయోగించిన శ్రీనాథుడు జానపదులకై రచించిన పలనాటి వీరచరిత్రలో అట్టి శబ్దాలు ప్రయోగిం చారు. కొలువులో నాయుడు కొనరెట్టవట్టి, కులపగదీర్ప నీకొడుకితడంచు" అనేచోట 'కులపగ' మిశ్రమ సమాసం. అలాగే 'ఘనమైన పంజలు, కనకతప్పెటలు'. ఇది కూడ మిశ్రమసమాసాలే. ఇలా వ్యాకరణమంగీకరింపకున్నను శిష్టకవిప్రయోగమునను, ప్రయోగబాహుళ్యము చేతను సాధువైనది. అట్లే 'ఇతరవస్తులు మోసి యేతెంచునట్టి' - వస్తువులనుటకు మారుగా వస్తులనుటచే ప్రథమావిభక్తి ప్రత్యయం లోపించింది. ఇట్టి ప్రయోగాలు శివకవుల

ధికంగా చేశారు. 'దేశింగురాజుకథ'లో 'ఘనగుఝము' వంటి మిశ్రమ సమాసాలు అధికం. కోళ్ళ (కొల్లగొట్టుట), ఒళ్ళుకు (ఒడలికి) వంటి వ్యవహారికరూపాలున్నాయి. 'బొబ్బిలిపదం'లో తయారుగన్నండి. భేటికి రన్నండి, తెన్నండి వంటి రూపాలు తయారుగండు, భేటికి రండు, తెండు అనుటకు మారుగా వాడబడినాయి. గొల్లున, భల్లున నవ్వులనుటకు మారుగా ఫుల్లు నవ్వులు అనినాడు. ఉల్వాయ, ఉలుఫా (కానుక) శబ్దానికి వ్యవహారికరూపం. 'అలంగారము యెక్కినారు భేరీస్త్రీలు' అనుచోట 'అలంగము'శబ్దం అలంగారముగా మారింది. అలంగము అంటే కోట ప్రాకారపు గోడకు మట్టిచేతగాని, రాళ్ళచేతగాని ఏర్పరుపబడిన కొఅడు. అలాగే రవిడిగుండ్లు దొరలించినారు భేరీస్త్రీలు'. శత్రువులపై కోటమీద నుండి దొరలించెడి గుండ్లు. రావడిగుండ్లు రవిడిగుండ్లైనాయి. ఈ విధంగా బొబ్బిలిపదంలో అధికంగా వ్యావహారిక ప్రయోగాలున్నాయి. ఇది సిసలైన జానపదగేయం కాబట్టి భాషయంతయూ వ్యావహారికమే ఉదాహరించుట అనవసరం; మరొక పదమైన 'కాంభోజరాజుకథ'లో బ్రాహ్మణుడు రాజుగారిని, 'స్వయంపాకము ఇప్పుడియ్యుము సదావర్తి ఇప్పుడియ్యుము' అంటాడు. సదావృత్తి అనేది సదావర్తిగా మారింది. 'సదావృత్తి' అనగా బైరాగులు లోనగు వారికిచ్చెడి వంటసామాగ్రి. మాణిక్యాల దేవిని 'శరాబందికాన' లో ఉంచిరి. చెరమరియు బందిఖానా శబ్దాలుకలిసి 'కత్తిచాకు; 'గేటుతలుపు' వలె శరాబందికాన యైంది. తల్లి చెరలో నుండగా పుట్టినవాడు కాబట్టి 'శరాబందిరాజు' అయినాడు. ఇలాంటివే క్షత్రియ గొడుగు (ఛత్రము గొడుగు) మరియు బారాపన్నెండు వంటివి. 'అట్లే శ్రీవరాహ చరిత్రంలోని మృగజంతువు, సప్తయేడులోకాలు, రణయుద్ధం మొదలగునవి. ఇక స్త్రీల పాటలన్నీ సాధారణంగా వ్యవహారిక రూపాన వుంటాయి. పాడుకొనునప్పుడు శబ్దాలు దీర్ఘాలు హ్రస్వాలుగా, హ్రస్వాలు దీర్ఘాలుగా ఎగుడుదిగుడు లవుతుంటాయి. వాటినన్నిటినీ పరిశీలిస్తే జానపదులభాషలోని సొగసుదనం వ్యక్తమవుతుంది. అట్లే కాలజ్ఞానతత్త్వాలలో కూడా విభక్తులులేని ప్రయోగాలు, వ్యాకరణవిరుద్ధ ప్రయోగాలు, సమాసాలు ఎక్కువగా కనిపిస్తాయి. వాటిన్నింటినీ ఆయా గేయసాహిత్య పరిశీలనలో గ్రహించవలసిందే.

**అన్యదేశ్యాలు :**

భాషాభావాలు, ఛందస్సులు, వర్ణనలు, అనుభూతులు కాలానుగుణంగా మారుచూ క్రమపరిణామ వికాసము లందుచుండుట సహజం. అన్యభాషల సంపర్కంచే క్రొత్తమాటలు, క్రొత్త సంప్రదాయాలు, క్రొత్త కవిసమయాలు సాహిత్యంలో చేరిపోతూంటాయి. ఇట్టివి జానపద(గేయ) సాహిత్యంలో అధికంగా కనిపిస్తాయి. ఎన్నియో ఉర్దూ, ఆంగ్లపదాలు, వాని అనువాదాలు వ్యవహారికభాష యందు ప్రవేశించాయి. వానిని కాదనుటకు వీలులేదు. సంస్కృతాంధ్రాంగ్లాది ప్రౌఢసాహిత్యాల పుక్కిట బట్టిననూ దేశీయ పలుకుబడులతో, దేశీయ ఛందములందు సూటియగుమాటలతో అల్పాక్షరాల అనల్ప భావసంపదను వెలార్చు జానపదగేయాలు సహృదయహృదయాహ్లాదకరాలై పండితపామర జనరంజకాలై ఒప్పుచున్నాయి.

నదికి, భాషకు అవినాభావ సంబంధముంది. జనన నది ఎంతో చిన్నదిగ ఉండి, పోనుపోను పెద్దదైనటులే ప్రతి జీవద్భాష దాని పుట్టుక సమయాన అల్పంగా వుండి, క్రమంగా ఒకచోటునుండి, మరొకచోటునకు, ఒక నోటి నుండి మరొక నోటికెక్కినపుడు అన్యభాషా సంపర్కంచేతను, అన్యవిషయాలచేతను శబ్దసంఖ్య పెరిగి వికాసం జరుగును. ఇది ప్రపంచభాషలన్నింటికీ వర్తించుసూత్రం. అన్యభాషా పదములు లేనట్టి మడికట్టుకున్న భాష ప్రపంచంనందొక్కటైననూ లేదు. వ్యవహారదూరమైన భాషలు దీనికి అపవాదు. దేవభాషయగు సంస్కృత పదాలెన్నో ఇతరభాషలలో కలిసిపోయాయి. తెలుగులో నున్న సంస్కృత పదజాలం అనల్పం. సాధారణులకివి చెప్పినప్పుడు ఆశ్చర్యపడుదురేకానీ వాడుకలో సంస్కృతాలని గుర్తింపలేనంతగా కలిసిపోయాయి. అలాగే మన దేశంపై, మనభాషలపై ఇతరుల ప్రభావం అధికంగా ఉండడంచే మనభాషలలోని అన్యభాషాపదాలను

విడదీయడం చాలాకష్టం. భారతేశంలోగల భాషలన్నింటి లోనూ పుట్టుకననుసరించి ఉర్దూభాష కనిష్ఠసోదరి వంటిది, అరబ్బీ, పారశీ, సంస్కృత, ప్రాకృత దేశభాషా పదాలచే పరిపుష్టమై వెలలేని అందచందాలను, వేగవంతమగు వికాసాన్ని కూర్చుకుంది. తెలుగులో, అందులోనూ వ్యావహారిక భాషాకవిత్వమగు జానపద గేయాలలో ఉర్దూ, ఆంగ్లపదాలు ఎన్నో చేరినాయి. కేవలం జానపదమందేకాక శిష్టసాహిత్యమందు కూడా అన్య దేశ్యాలు అధికంగా కనిపిస్తాయి. జానపదగేయాలలో కూడా ఉర్దూ పదాలు ప్రవేశించాయి.

ఉదాహరణకు శ్రీనాథకర్తృత్వమనబడు పల్నాటివీర చరిత్ర యందు 'మఖమల్లుగుడ్డలు వలనుకొని తెచ్చి' అనే ప్రయోగాన్ని పరిశీలిస్తే 'మఖ్మల్' అనే ఉర్దూపదం 'మఖమల్లుగా'గా మారింది. 'అన్నపుఖర్చున కాకుపోకలకు' అన్నప్పుడు 'ఖర్చు'ఉర్దూపదం, కాటమరాజుకథలో' చీట్లు వ్రాయించుమీ శీఘ్రూన తిక్క', చిఠ్ఠీ ఉర్దూపదం. 'వారి యాటోపంబు వారి ముస్తీబు' అన్నప్పుడు 'ముస్తాబు' అని వాడుక. ఇది ముస్తయిాద్ > ముస్తీదు > ముస్తీబు > ముస్తాబుగా మారిన ఉర్దూపదం. అట్లే సర్‌దార్ శబ్దం సరదారైంది. అట్లే 'తోకకు తగిన బందెయును' అన్నప్పుడు బందిఖానా నుండి బందె వచ్చింది. చేలు మేసిన పశు వులను 'బందె'లో తోలుతోలుతారు. అలాగే దేశింగురాజు కథలో బాచ్చా, పాదూషా, ఫకీరు, డేరా, తఖ్తు, ఖైదు, జల్దీ, అచ్చా, సలాం, నమ్మకహరాం, వజీరు, దర్వాజా, మహలు, దర్బారు, మసీదు, నవాబు, సుబేదారు వంటి ఉర్దూ పదాలు; గ్లోబు, ఫైర్, మేజర్, సిగ్నల్ వంటి ఆంగ్ల పదాలు కనిపిస్తాయి. బొబ్బిలి యుద్ధంలో 'కంబైటో కంబైటో విజయరామరాజు' అని బూసీ (బుస్సీదొర) అంటారు. ఇందులో 'కం' ఆంగ్లపదం (ఓశిఎవ) 'బైఠో' ఉర్దూపదం, కలిసి 'కంబైటో' అనగా వచ్చికూర్చోమని అర్థం. కాలజ్ఞాన తత్త్వాలలో బందు, ముసద్దీలు, సదరు, లుచ్చా, ధూత్తెరి మొదలైన శబ్దాలు వేదాంతులనోట వెలువడ్డాయి. అలాగే 'రామదాసు చరిత్ర'లో కూడా హుజూరు, అర్జీ, కిస్తీ, ఖర్చు, ఫిర్యాదు, ఖైదు, బందిఖాన వంటి పదాలున్నాయి. 'తెప్పోత్సవ ఓడపాట'లో రయిలౌసు (Rail House), గులోబులు, వాలుషేడు (Shed) వంటి ఆంగ్ల పదాలున్నాయి.

ఈ విధంగా ఎన్నియో పరభాషాపదాలు తెలుగు వలువలు ధరించి అచ్చం తెలుపదాలైపోయాయి. ఎంతమడి కట్టుకున్నా కనీసం ఒకటి రెండు మాటలనైనా నిత్యదైనందినవ్యవహారంలో పలుకని తెలుగువాడు లేడనుట నిత్యసత్యం.

**జాతీయాలు (Idioms):**

మానవుడు పరిమిత ప్రయోజనం గలవాడై నిర్జన స్థలాలందున్నప్పుడు భాష పెరుగదు. ఉన్నభాష అవసరా లకు సరిపోతుంది. అలాకాక మానవుని అవసరాలు పెరిగినపుడు, సాంఘిక విషయాలందు మార్పు జరిగి నప్పుడు, వ్యవహారాలధికమైనప్పుడు, కొత్త విషయాలు దిగుబడి అయినప్పుడు, వానిని గూర్చి మాట్లాడ వలసివచ్చినప్పుడు, తమభావాలకు వాగ్రూపమియ్య వలసి వచ్చినపుడు తనభాషయందు కొన్ని శబ్దాలను కల్పించుకోవలసివస్తుంది. ఆవిధంగా ప్రగతిశీలమగు జాతి తన భాషను కొత్త శబ్దకల్పనంచే పరిపుష్టం గావించుకొని భాషావికాసానికి దోహదపడుతుంది. ఈ నూతన పద, లేదా శబ్దసృష్టి కేవలం శిష్టులకే కాదు, భావవ్యక్తీకరణానికి పూనుకున్న ప్రతిఒక్కరికీ సంబంధించినదే.

"ఒకప్రత్యేక జాతికి సంబంధించిన ప్రత్యేక విషయా లను వ్యక్తీకరించేవే జాతీయాలు. అవి భాషలో బలమైన స్థానాన్నాక్రమిస్తాయి. జాతీయాలు లేని భాష పేలవంగా ఉండడమేకాక, జాతీయాలు లేని జాతి పూర్వచరిత్రకూడా పేలవంగా ఉంటుందనుకోవా"లని అంటారు నేదునూరి గంగాధరం గారు. కొత్తశబ్దాలతోపాటు భాషయొక్క జాతీయ సంపద యనబడు మారుమూల పదాలు, నానుడులు, జాతీయాలు, మాండలికాలు భాషావికాసానికి తోడ్పడుతాయంటారు రామరాజుగారు. సాధారణంగా ఈ సంపద అనువాదాలకు లొంగదు. ఇట్టివాని మూలంగానే ఒకభాష ప్రత్యేకత మరొకభాషకు రాదు. అయితే ఈ జాతీయాలలో భాషకు సంబంధించిన అంశాలేకాక,

సాహిత్యాంశాలు కూడా చోటుచేసుకుంటాయి. పదాలకున్న సహజార్థాన్ని మరుగు పరచి, చెప్పవలసిన విషయాన్ని నేరుగా చెప్పక విలక్షణార్థంలో వ్యంగ్యంగా ప్రతిపాదించబడేవి జాతీయాలనవచ్చు. వీనికే 'నుడికారాలు' అని మారుపేరు. ఉదాహరణకు 'అడవి గాచిన వెన్నెల, కత్తిమీదసాము, గుండెలు తీసిన బంటు,నీళ్ళునములు, మూగనోము, పడకేయు, మీసాలపై తేనియలు' మొదలగునవి. ఈ జాతీయాలను భాషాసంబంధాలు, వస్తునిష్ఠాలు, పురాణసంబంధాలు, చారిత్రక సంబంధాలు, కులసూచికాలు, స్థలసూచకాలు, సంకీర్ణాలు అని ఏడు విభాగాలుచేయవచ్చు.

**జానపదులు ప్రయోగించిన జాతీయాలు :**

కాకిముక్కుకు దొండపండు (గంగావివాహం), మున్నాళ్ళముచ్చట, పాలవంటికాపురం (మార్కండేయ జననం).

కొన్నిసామెతలు సందర్భానుసారంగా జాతీయాలుగా చెలామణి అవడం గమనిస్తాం. ఉదాహరణకు 'లోగుట్టు పెరుమాళ్ళకెరుక, అరణ్యరోదన, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం, శ్రీరంగనీతులు,ఉత్తరకుమార ప్రజ్ఞలు మొదలైనవి.

స్త్రీల పాటలలోకూడా లెక్కలేనన్ని జాతీయాలు కనపడతాయి. 'గుండెనీరయిపోయి, చేటంతమొగము, కత్తికొక కండ, కడుపు చల్లగా, చిలుకలకొలికి తలలో నాలుక' ఇత్యాదులు'

కీ.శే. ఆచార్య బి.రామరాజుగారు తన జానపదగేయ సాహిత్యంలో కొన్నిటిని పేర్కొన్నారు.

నువ్వులు చల్లుట (బొబ్బిలియుద్ధం), పంచదార ములుకులు (కుశలవ యుద్ధం), ఉడుకు మనసు (విరాటపర్వం), వన్నెల విసనకర్ర (వీరరాజమ్మకథ), దుమ్ముదులుపు (గాంధారికథ), ముంజేతి మీసం (బొబ్బిలిపదం).

ఈవిధంగా భాషలో ఇలాంటి వైశిష్ట్యపూర్ణ పదబంధాలు భాషకు ఇంపును సొంపును అందించి జాతీయభాషగా రూపొందిస్తాయి.

**సామెతలు (Proverbs) :**

కవితాకళకు పతాకస్థాయి సామెత. సామెతలన్ని భాషలందు ఉంటాయి. జీవితమే కవిత్వంగా అంగీకరించినచో సామెతలు జీవితానుభవాల సూత్రప్రాయమైన నగ్నస్వరూపాలుగా భావింపవచ్చు. పలువురు పలు విధాలుగా తమఅభిప్రాయాలను సామెతగురించి వ్యక్తం చేశారు. నానుడి, లోకోక్తి, శాస్త్రం, జనశ్రుతి అని సామెతకు పర్యాయపదాలు, రాయలసీమలో 'శాస్త్రం' అని అంటారు.

'అల్పాక్షరముల అనల్పార్థరచన కల్పించుటయె కాదె కవివివేకంబు' అనిన పాల్కురికి సోమన మాటలు దీనికి అన్వయించుకోవచ్చు. కొన్ని సామెతలు సూటిగా ఉంటాయి. కొన్ని ధ్వన్యాత్మకంగా ఉంటాయి. కొన్ని అలంకార యుతంగా ఉంటాయి. దీనిని బట్టి సామెతకు కొన్ని లక్షణాలు చెప్పవచ్చు. అవి-సంక్షిప్తత, వాక్యరూపంలో ఉండడం, అనుభవపూర్వకంగా ఉండడం, తీక్ష్ణత, సార్వజనీనత, వివేకయుతం, ఉపదేశాత్మకత, వ్యంగాత్మకం. ఈ లక్షణాలననుసరించి Thomas Fuller అనే పాశ్చాత్యుడు much matter decoted idea few words అన్నాడు. వీటన్నింటి ఆధారంగా "అనుభవయుక్తం, నీతి బోధాత్మకం, ఉపదేశాత్మకం, సూత్రబద్ధంగా ఉండి సంక్షిప్తవాక్య రూపంలో ఉండే లోకుల చమత్కారోక్తియే సామెత" అని నిర్వచించవచ్చు.

సామెతలలో సునిశితహాస్యం చోటుచేసికొని ఉంటుంది. ఈ సామెతలు స్త్రీలకువచ్చినట్లుగా పురుషులకు రావు. కేవలం జానపదులేకాక శిష్టులు కూడా సామెతలను పయోగించారు. విషయప్రాధాన్యాన్ని బట్టి సూత్రపు సామెతలు, ఉపమానరూపకాలు, నీతిబోధకాలు, పౌరాణికాలు, ప్రశ్నోత్తర, ప్రశ్నార్థరూపకాలు, సాంఘికాచార రూపకాలు, వ్యక్తిగతాలు, హాస్యపరాలు, వ్యవసాయిక సంబంధాలు అని ప్రధానంగా విభజించవచ్చు. ఇవేకాక అశ్లీలమైనవి, న్యాయపరమైనవి, వైద్యపరమైనవి, స్థలపరమైనవి, గృహజీవనపరమైనవి అని కూడా సామెతలను వింగడించవచ్చు. తెలుగుభాషలో చెప్పుకోదగ్గ సామెతల గ్రంథాలు లేవు. కీ.శే. చిలుకూరి నారాయణ

రావుగారు సుమారు లక్ష సామెతలను సేకరించి ప్రకటిం చారు. అవన్నీ గ్రంథరూపం దాల్చలేదు. కీ.శే. బిరుదురాజు రామరాజు గారు తమ 'జానపదగేయసాహిత్యం'లో కొన్ని జానపద గేయాలలోని సామెతలను తెలిపియన్నారు. అందులో కొన్ని -

గుర్రు మనగలేని కోపమెన్నటికి - బాలచంద్రుని యుద్ధం.

గొల్లమీది పుల్లరి గోగుమీద బచ్చులు, ఉలవలెత్తా మంటె ఊళ్ళనడిగెదవు

తెడ్డడిగినప్పుడే కొయ్యడిగినట్లు, పేదవానికోపం పెద వుల తీట

రక్షించువారిని రమ్మని పిలిచి-భక్షింపజూచినపని యింతలేదు - కాటమరాజుకథ

చల్లకోసంవచ్చి ముంత దాచగనేల, ముంజేయికంకణ మరయుటకు ముకురముగావలెనా - దేశింగురాజు కథ

తనుగట్టుటకు త్రాళ్ళు తాదెచ్చుకొన్నట్లు - నలచరిత్ర తానొకటితలచితే దైవమొకటి తలచు

క్రొవ్వుచేతనుబోయి కొరత బడ్డట్లు - శశిరేఖా పరి ణయం

ఇల్లు ఇరకటమంచు ఆలిమరకటమంచు

ఉడుమునకేలా ఊరి పెత్తనము వీరయ్య - వీర రాజమ్మ కథ

ఇలా జానపదగేయాలలో ఎన్నో ప్రసిద్ధమైన సామెతలు చోటుచేసికొన్నాయి. ఇక సామెతలలో ముఖ్యంగా చెప్పు కోవలసినది వ్యవసాయిక పరమైన సామెతలు. కారణం నూటికి తొంబదిశాతం గ్రామాలుండటమే. ఆకారణంచే అనేక వ్యవసాయిక సామెతలు మన జీవితంలో చోటు చేసికొన్నాయి. మచ్చునకు కొన్ని : రైతు దున్నితే రాజులకు అన్నం, నాగలి ఉన్న ఊళ్ళో ఆకలి చేరదు. కోటి విద్యలు కూటికోసం, కృషితో నాస్తి దుర్భిక్షం, దొరలు ఇచ్చిన పాలు కన్నా ధరణి యిచ్చిన ధాన్యంమేలు, జననిని, ధరణిని నమ్మినవాడు చెడడు, వానరాకడ ప్రాణం పోకడ తెలి యవు, పెట్టుబడిలేని సేద్యం చద్దిలేని పయనం, ఎంతచెట్టుకంతగాలి, కాపులకష్టం భూపతిసంపద, సొమ్ముఒకడిది సోకొకడిది.

ఇలా ఈ సామెతలన్నింటినీ పరిశీలిస్తే ఇవి సమాజ అధ్యయానికి అభ్యుదయానికి సాధనాల వంటివని అంగీకరించక తప్పదు.

**పొడుపుకథలు (Riddles) :**

జానపద గేయ ప్రక్రియలాగే పొడుపుకథలు కూడా మానవుల ప్రయత్నపూర్వక మేధాశక్తితో జనించాయి. శుద్ధమైన పొడుపుకథ జానపదుల హృదయాంతరాళాల నుండి ఉద్భవించింది. సామెతలు ఒకవిధంగా ఏక కర్తృకమై, పిమ్మట సామూహికముద్రను వేసుకోగా, పొడుపుకథలు సామూహిక కర్తృత్వంచేత ఏర్పడి జానపద గేయాలవలె అప్రధానకర్తృకమైనాయి. అయితే భారత దేశంలోని పలు ప్రాంతాల పొడుపుకథలకు వేదాలలోని పొడుపు కథలే మాతృకలని పలువురు విద్వాంసుల అభిప్రాయం. 'పొడిచేలా ప్రశ్నించు' అనే అర్థంలో పొడుచు లేదా పొడుపుకథ అనవచ్చు. 'కథ' అనడంలో ఇక్కడ 'విషయం' అని అన్వయించవచ్చు. సమాధానం చెప్పలేని వ్యక్తి దానికి మారుగా మరొక విషయాన్ని (కథ) వాడడం పరిపాటి. అందుచే దీనిని 'మారుకథ' అని కూడా అన వచ్చు. రాయలసీమలో, ముఖ్యంగా చిత్తూరు మండలంలో దీన్ని 'మారుకథ' అంటారు. అనంతరపురం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో అడ్డుకథ, అడ్డుకత అంటారు. కడపజిల్లాలో పొడుపుకథ, విచ్చుకత, విప్పుకత అని అంటారు. తెలంగాణాలోని కొన్ని ప్రాంతాల్లో 'శాస్తం' అంటారు. శాస్త్రార్థమెంత కఠినమో వీనిని విడదీయడం అంత కష్టమని కాబోలు పొడుపుకథలకు 'శాస్త్ర'మని పేరొచ్చింది. ఆంగ్లంలో వీనిని (Riddles) రిడిల్స్ అంటారు.

సాధారణంగా పొడుపుకథ ప్రశ్నరూపంలో ప్రత్యక్షం గానో, పరోక్షంగానో, సంపూర్తిగానో, అసంపూర్తిగానో సంప్ర దాయబద్ధంగా ఉంటుంది. చూడటానికి అసంబద్ధంగా, పరస్పరవిరుద్ధంగా కనిపిస్తుంది. కానీ ఒక విశిష్టదృష్టితో పరికిస్తే అది కేవలం సత్యాన్నే వెల్లడిస్తుంది. ఈ

పొడుపుకథల గురించి అనేక నిర్వచనాలున్నాయి. వాటినన్నింటిని పరిశీలిస్తే తేలిన అంశమేమంటే 'ఊహచే సమాధానాన్ని వెదకి, వినోదాశ్చర్యాలతోపాటు గూడార్థాన్ని వెలువరించే, సవాలు చేసే ప్రశ్నార్థక రూపకాతిశయోక్తి ప్రక్రియ పొడుపుకథ". ఈ పొడుపుకథల్లో ఉపమాన వాచ్యంగాను, ఉపమేయం సూచ్యంగాను ఉంటుంది. అంటే వాచ్యమైన ఉపమానంతో సూచ్యమైన ఉప మేయాన్ని గుర్తించటం సమాధానమనిపించుకుంటుంది. ఇది యిందులోని ప్రధానాంశం.

జానపదవిజ్ఞానం 'వివరణాత్మకాలు, పరిహాసాలు, వివేకయుతాలు, విడికథలు, అనుకరణ కథలు అని విభజింపబడినా, భాషాశాస్త్రాధ్యయానానుగుణంగా రూప ప్రధానాలు, క్రియా ప్రధానాలు, అర్థప్రధానాలు అని ప్రధానంగా వర్గీకరింపబడినాయి. ఒక సరళవాక్యంలో కానీ, ఎక్కువ సరళవాక్యాలలో కానీ లేదా గొలుసు రూపంలో ఒకదానిలో మరొకటి ఇమిడిపోయిన శబ్దాలతో కూడినవి రూప ప్రధానాలు (former based) అంటే వర్ణనాత్మకనామవాచకం యిందులో ప్రధానం. ఉదా హరణకు- 'పెద్దయిల్లు-పెద్ద యింట్లో చిన్నయిల్లు - చిన్నయింటిలో గుంట- గుంటలో స్తంభం మీద రాజు కూర్చొని తపస్సు చేస్తాడు. సమాధానం : గ్లోబు (Globe). ఇక సరళమైన, సమానమైన, నిషేధాత్మకమైన క్రియా పదాలతో కూడినవి క్రియా ప్రధానాలు (action based). ఉదాహరణకు 'దేహమెల్లకండ్లు దేవేంద్రుడు కాడు, నరవాహనమెక్కి నడచిపోతాడు, నిండుప్రాణంలేదు. తాను జీవులచంపు. సమాధానం-'వల'.

ఇక ముక్తపదగ్రస్తంలా వుండి, అర్థప్రాధాన్యంకలిగి మొదట చెప్పిన విషయంలోని చివరిశబ్దం, రెండోసారి చెప్పిన విషయానికి ముందు చేర్చబడి వుండే (Sementicaly controlled) అర్థంప్రధాన పొడుపుకథలు మూడవరకం. ఉదాహరణకు 'అంభాలు- అంభాలు మీద కుంభాలు (కాళ్ళు, పిరుదులు)- కుంభాలుమీద కుడితి బాన (కడుపు)- కుడితిబానమీద ఈరపలక (రొమ్ము)- ఈరపలక మీద ఇనుప గుండు (తల), ఇనుప గుండు మీద ఇద్దరు జవానులు (కళ్ళు), ఇద్దరు జవాన్ల మీద సీకుపొద (వెంట్రుకలు) సీకు పొదలో పది రేసు కుక్కలు (పేన్లు). ఇలా పొడుపు కథలను మూడు విధాలుగా విభజించినా, కథలోని విషయాన్ననుసరించి ప్రశ్నించే పద్ధతే సరియైన పొడుపుకథ అనిపించుకుంటుంది.

చివరిగా పొడుపుకథలను విషయ ప్రాధాన్యాన్ని బట్టి కూడా వర్గీకరించవచ్చు. అవి-

**1. ప్రశ్నార్థక పొడుపు కథలు** : ప్రశ్నల్లా వుండి, సమా ధానాన్ని కోరేవి. ఉదాహరణకు - 'ఒక్క అడుగు పోయిన కొద్ది కొంచెం తగ్గుతుంది. దాని పేరేమి? సూది, దారం.

**2. వినోదాత్మకాలు** : హాస్య ప్రధానమైనవి. ఉదా హరణకు - చాపను చుట్టలేం, చక్కబెట్టలేం - ఆకాశం; రూకలెంచలేం, చాపచుట్టలేం - నక్షత్రాలు, ఆకాశం

**3. కథాత్మకాలు** : కథను ఇముడ్చుకొన్నవి.

ఉదాహరణకు - ఒక వ్యాపారి తిరిగి తిరిగి అలసి పోయాడు. ఆకలి మండిపోతోంది. తిండి దొరకలేదు. ఒక యిల్లాలు చింతగుజ్జు వేసి, విడి ఆకుల్లో అన్నం వడ్డించి నెయ్యివేసింది. అప్పుడా వ్యాపారి దానికను గుణంగా ఇలా అన్నాడు. పంగలా పంగలా ఆకులు, సీనులాసీకులా అన్నం, చుక్కల చుక్కల చారు, పైగా గొర్రె సీమిడి వేసి తిను అంటే ఎలాతినేదమ్మా!

**4. వృత్తి సంబంధాలు** : వ్యవసాయానికి సంబంధిం చినవి.

**ఉదాహరణకు -**

ఇంటిగొల్లవాడు యిద్దర్ని పొడుచు - ముల్లుకర్ర
ఏడుబారలమాను వంగి నీళ్ళుతాగు - కపిలెమోకు.

**5. సంఘ జీవన సంబంధాలు** : శరీరావయవాలు, నగానట్రా మొదలైన రూపకాలంకారంతో వుండేవి.

**ఉదాహరణకు -**

రెండు మిద్దెలకు ఒకటే దూలం - ముక్కు.
మిద్దెమీద మిరపచెట్టు, నీళ్ళు లేక ఎండిపోయె - దీపం.

**6. చిత్రశబ్దాత్మకాలు** : ఒక పదం లేదా అక్షరాల్లో వస్తువును గుప్తంగా వుంచడం.

**ఉదాహరణకు -**

వంకరటింకర 'శొ' - శొంఠి; వానితమ్ముడు 'అ' - అల్లం;

నల్లని పిల్లా 'మి' - మిరియం ; నాకేమిస్తావు 'తే' - తేనె,

**7. అశ్లీలార్థకాలు :** పైకి అశ్లీలంగా కనిపించి, కథ విప్పినప్పుడు చమత్కారంగా ఉండడం.

**ఉదాహరణకు -**

ఆలూ మొగుడు వాటేసుకుంటే అల్లీ సాయిబొచ్చి విడిపించాడు.

సమాధానం : బీగం

ఇలా పొడుపు కథల కాలక్షేపంకోసం సృజింపబడ్డ ప్రక్రియేయైనా పెద్దలు, పిన్నల మధ్య ఒక విధమైన సామాజిక విషయసామాగ్రిగా వుంటూ వినోదం, విజ్ఞానం ప్రసాదించే లక్షణం కలిగి వుంటాయనడంలో సందేహం ఏమాత్రం లేదు.

**తిట్లు (Folk Abuses) :**

తిట్లకు పట్టుకొమ్మలు మన పల్లెసీమలు. తమ హృదయాలను గాయపరచినప్పుడు ఎటువంటి తిట్టునైనా తిట్టడానికి వెనుకాడరు మానవులు. జానపదులలో ఈ అంశం మరీ ఎక్కువ. అందులో కొందరి తిట్లు మరీ ఘోరంగా ఉంటాయి. ఎక్కువగా ఆడవాళ్లే తిట్లను ఉదయం ఇంటి ముంగిట కసవు తోయడం దగ్గర మొదలుపెట్టి ఎక్కడో అంతం చేస్తారు. మాటలతో ఆరంభమైన జగడం చేతులదాకా పోవడం సంభవిస్తుంది. ఇతరులు వినలేనంత కర్ణకఠోరంగా, అసహ్యంగా, అసభ్యంగా నోటిదురద తీరేదాకా కొనసాగుతాయి. అందుకే 'నోరు మంచిదైతే ఊరుమంచిదవుతుందనే' సామెత పుట్టింది. సాధారణంగా బలహీనులే తిట్లను అధికంగా ఉపయోగిస్తుంటారు. నాలుగు తన్నులు తిన్నా నోటి దురదను మాత్రం తీర్చుకోకుండా ఉండలేరు. అలాగే దబాయించుకు తిరిగే వాళ్ళుకూడా తిట్లనధికంగా ప్రయోగిస్తుంటారు. అందువల్ల తేలినదేమంటే ఎప్పుడో ఒకప్పుడు, ఏదోవిధంగా సభ్యంగానో, అసభ్యంగానో 'తిట్టు'ను అస్త్రంగా ప్రయోగించే వారే అధికం. కాబట్టి 'మనకు ఆప్తులైన వారు పెడదారిని పట్టినప్పుడు గానీ, లేక యెందులో నైనా కల్తీ, వెలితి కనిపించినప్పుడు గానీ సహజంగా మనకు కోపం వస్తుంది. అందువల్ల వాగ్రూప మైన కోపాన్ని 'తిట్టు' అని చెప్పవచ్చు" నని డా॥ తూమాటి దొణప్పగారు తెలిపారు.

తిట్టును ఆంగ్లంలో Abuse అంటారు. Abuse అంటే to make a wrong use of, to ill treat, to violate, to <u>revile</u> అనే క్రియాపద రూపాలు, ill use, improper treat insulting అనే నామవాచక రూపాలున్నాయి. హిందీలో 'గాలియా', ఉర్దూలో 'గాలీగలీచ్' అని తెలుగులో దూరు , నిందించు, శపించు అనే అర్థాలు న్నాయి. (తిట్టు + లు = తిట్లు). తెలుగు భాషలో తిట్లు ఎక్కువగా కనిపించినా తెలుగుభాషపై ప్రభావంచూపిన ఉర్దూ, హిందీ, ఆంగ్లభాషలలో కూడా ఎక్కువగా కనిపిస్తాయి. ఉదాహరణకు 'సువ్వర్-హిందీ; బాంచోద్, మాదర్‌చోద్-ఉర్దూ; ఫూల్, రాస్కెల్, ఇడియట్, డాంకీ, మంకీ, పోర్ట్వంటి, మఫ్- ఆంగ్లం; నాయాలు, నమక్ హరాం-అన్యభాషాసంపర్కం.' ఈ విధంగా ఉన్న తిట్లు లేదా తిట్టు యొక్క పరమార్థం ఇతరులకు హానికలగాలని ఆశించడం. తిట్టేవారు మాన మర్యాదలను లెక్కచేయరు. సమాజంలో ఇవి అసభ్యమని తెలిసినా, లేదా, నిషిద్ధమని తెలిసినా వాటిని ఉల్లంఘించి ఉచ్చరించడం అలవాటు చేసుకున్నాడు మానవుడు.

అయితే అన్ని తిట్లు చెడ్డవే అని చెప్పలేం. కొన్ని ప్రీతిపాత్రంగా, విశ్వాసపాత్రంగా ఉంటాయి. ఉదాహరణకు 'ఏరా వెధవా ఇంత ఆలస్యం' అన్నప్పుడు ఎదుటివాడు సమాధానంగా 'పోరా నా కొడకా' అనడం. అట్లే ఇద్దరు పోట్లాడుకుంటున్నప్పుడు ఒక పెద్దమనిషి కలుగజేసుకొని 'దొంగనాకొడుకుల్లారా! తిని ఎక్కువైందిరా మీకు. పనిపాట్లు లేవురామీకు. పోంగ్రా పొండి' అనడం వంటివి. ఈ తిట్లను కూడా పలురకాల భేదాలతో సూచించ వచ్చు. డా.రావూరి దొరస్వామి శర్మగారు 'తెలుగులో తిట్టుకవిత్వం' అనే గ్రంథం ద్వారా శాపరూపమైన తిట్టు;

అసహ్యం, అసభ్యమైన తిట్టు, అన్యాపదేశతిట్టు, వాదరూప తిట్టు, వ్యంగ్యరూప తిట్టు, ఆదిగా పలు విభజనలు చేసియున్నారు. ఇంకా ఆచార్య తూమాటి దొణప్ప గారి 'తెలుగులో కొత్త వెలుగులు' , డా॥ జి.ఎస్.మోహన్ గారి 'జానపదుల తిట్లు', నేదునూరి గంగాధరం గారి 'పసిడి పలుకులు' మొదలైన గ్రంథాల ద్వారా చర్చించిన తిట్ల పురాణాల ద్వారా పలురకాలుగా తిట్లను విభజించవచ్చు. అవన్నీ జానపదుల వ్యవహారాల్లో నిత్యం ఏదోఒక విధంగా ప్రయోగింపబడేవే. అవి-

| | |
|---|---|
| 1. అంగవైకల్య సూచకాలు | : గూనోడు, కుంటోడు, గుడ్డోడు |
| 2. జాతి కుల సూచకాలు | : కోమటోడు, కోమటి నాయాళ్ళు, ఎర్రి నాయాలు. |
| 3. వృత్తి సూచకాలు | : పాకీముండ, దొంగ సన్నాసి, |
| 4. జంతువాచకాలు | : అడ్డగాడిద, దున్నపోతు నాయాలు, గాడిదనా కొడుకు, |
| 5. లైంగిక సంబంధాలు | : నాయాల్ది, నీతల్లి |
| 6. రోగసూచకాలు | : నీకు పెద్దరోగం రాను, నీ నోరుపడిపోను |
| 7. శాసనార్థాలు | : నీకొంపకూల, నీకు పిండంపెట్ట, నీయిల్లు తగలడ,నీ నోట్లోమట్టి పడ.. |
| 8. శీలసంబంధాలు | : బోగంలంజ, రంకు ముండ |
| 9. స్త్రీ ఐదవతనం పోవాలనుకోవడం | : నీ తాడుతెగ, నీ దుంప తెగ, నీ ముండ మొయ్య.... |
| 10. మానవస్వభావ సూచకాలు | : జిడ్డునాయాల, బండనా కొడక... |
| 11. అమ్మవారికి ఆగ్రహం కలగాలని తిట్టడం | : నిన్నమ్మోరెత్తుకెళ్ళ, నిన్ను గంగానమ్మ ఎత్తుకెల్ల. |

ఈ విధంగా సామెతలవలె, పొడుపుకథలవలె, తిట్లు కూడా జానపదుల నిత్యజీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

పైన తెలిపిన నిర్ధారణలకు సహకరించిన ఆచార్య బిరుదురాజు రామరాజు గారి 'తెలుగు జానపద గేయసాహిత్యం', ఆచార్య జి.ఎస్.మోహన్ గారి 'జానపద విజ్ఞానాధ్యయనం', ఆచార్య ఆర్వీ ఎస్.సుందరం గారి 'జానపద విజ్ఞానం' గ్రంథాలకు, గ్రంథ కర్తలకు ధన్యవాదాలు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు జానపద గేయసాహిత్యం : ఆచార్య బిరుదురాజు రామరాజు
2. జానపద విజ్ఞానాధ్యయనం : ఆచార్య జి.ఎస్.మోహన్
3. జానపద విజ్ఞానం : ఆచార్య ఆర్వీ ఎస్.సుందరం.

❀ ❀ ❀

# అతి నవ్య కవిత్వానికి కళాదీపిక పత్రిక దోహదం

**– బి. శ్రీనివాసులు,** పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగులో నవ్యకవిత్వం ఆవిర్భావం జరిగి దాదాపుగా నూటిఇరవై ఏళ్ళు కావస్తూ ఉన్నాయి. వచనకవిత్వం ఆవిర్భవించి డెబ్భై అయిదేళ్ళు కావస్తూ ఉన్నాయి. వచనకవిత్వంలో వచన కవితలు, వచనకవితా కథా కావ్యాలు, దీర్ఘ వచన కవితలు, వచనకవితా నాటకాలు, వచనకవితా నాటికలు, వచనకవితా లేఖలు, మినీ కవిత్వం లాంటివి వచనకవిత్వ ప్రారంభ వికాసాలు కాలాల్లో వెలువడ్డాయి. కానీ గత ఇరవై ఇరవై అయిదు సంవత్సరాల నుంచి వచనకవిత్వంలో ఆంగ్ల కవిత్వ ప్రభావంతోనూ జపనీస్ కవిత్వ ప్రభావంతోనూ కొత్తతరం కవితలు వెలువడుతూ ఉన్నాయి. అలాంటి వాటిల్లో హైకూలు, నానీలు, రెక్కలు, మైక్రోకవితలు, తంకాలు ఇవన్నీ కూడా వచన కవిత్వంలో లాగా సంపూర్ణ స్వేచ్ఛను కాకుండా పాక్షిక స్వేచ్ఛను కొనసాగిస్తూ కొన్ని నియమ నిబంధనలతో కూడినవిగా వెలువడ్డాయి. వెలువడుతూ ఉన్నాయి. వీటిల్లో పాదాల పరిమితి, ఒక్కో పాదంలో అక్షరాల పరిమితులు పాటింపబడుతూ ఉన్నవే అధికం. వీటిల్లో కళాదీపిక పత్రిక హైకూలకు, నానీలకు కొంత ప్రాధాన్యాన్నిచ్చిందిగా మనకు కనిపిస్తూ ఉంది.

## హైకూల ప్రచురణ :

కళాదీపిక పత్రిక హైకూలకు సంబంధించిన వ్యాసాల్ని, కొందరు కవులు రాసిన హైకూ కవితల్ని ప్రచురించింది. వీటిని గురించి తెలుసుకోబోయే ముందు హైకూలంటే ఏమిటో మనం కొంత తెలసుకొందాం. జపాన్ భాషలో నుంచి ఆంగ్లభాషలోకి ఆంగ్ల భాష నుంచి తెలుగులోకి ఈ హైకూలు వచ్చి చేరాయి. జపాన్ భాషలో 'హొక్కు' లు అని పిలువబడే హైకూలు ఆంగ్లంలో 'హైకూలు' గాను, తెలుగులో కూడా హైకూలుగానే వ్యాప్తిలోకి వచ్చాయి. హైకూల్లో సహజంగా మూడు పాదాలుంటాయి. మొదటి పాదంలో ఐదు అక్షరాలు రెండవ పాదంలో ఏడు అక్షరాలు మూడవపాదంలో ఐదు అక్షరాలు ఉండడం 'హైకూ' లక్షణం. జపనీస్ హైకూల్లో వస్తువులుగా తాత్వికపరమైన అంశాలు, ప్రకృతిపరమైన అంశాలు మాత్రమే చోటు చేసుకొని ఉంటాయి. కానీ ఆంగ్లంలోని, తెలుగులోని అంశాలు వీటితోపాటు ప్రేమ, సామాజికాంశాలు ప్రధానంగా చోటు చేసుకొని ఉంటాయి.

## హైకూ కవితలకు దోహదం :

ఇక్కడ కళాదీపిక పత్రికలో ప్రచురితమైన కొన్ని హైకూలను పరిశీలిద్దాం.

ఆచార్య ఎస్జీడి. చంద్రశేఖర్ గారు రచించిన 'నేటి హైకూలు' లో ఆకాశంలో కారు మబ్బులు కమ్మేసినపుడు తూనీగలు గుంపులు గుంపులుగా ఒక వైపుకు వెళ్ళుతుంటాయి. అవి వానవచ్చే సూచనగా మనకు గుర్తు చేస్తూ ముందుకు వెళ్ళుతుంటాయి. దీనినే కవి తన కవితా సంపుటిలో ఇలా ఆవిష్కరిస్తూ -

"ఆకాశంలో కారుమబ్బులు
భూమ్మీద తూనీగలు
వర్ష సూచికలు" - అని చెప్పాడు.

ఇక్కడ చాలా భావుకతతో నిండిన ప్రకృతి హైకూలని చిత్రీకరించాడు. ఇలాగే సాలెపురుగు తన గూటికోసం దారప్పోగుల్ని సృష్టించుకొనే విధానాన్ని గూర్చి చెప్తూ -

"ఎన్ని దారప్పోగుల్ని
సృష్టిస్తున్నాడో సాలీడు
ఒక్క గూటికోసం" - అని ప్రస్తావించాడు. ఊర్లుగాని ఊర్లలో సామాజిక భద్రత లేకుండా తాత్కాలిక పనులు చేసుకొంటూ బ్రతికే బడుగు జీవులు, కూలీలు, వలస కార్మికులు ఎదుర్కొనే సమస్యలను గూర్చి కవితను హృదయ వేదనను వ్యక్తం చేస్తూ -

"ఎన్ని పనుల్ని
నిర్వహిస్తున్నాడో శ్రామికుడు
పొట్టకూటి కోసం " - అని అంటూ కోటి విద్యలు కూటి కోసమే అన్నట్లు శ్రామికుడు రాత్రనకా పగలనకా పొట్టకూటి కోసం పడే యాతనను వివరించాడు.

ఇలాగే ఇంకో హైకూలో జిల్లేడు గింజ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి గాలిలో ఎగిరి పోవడాన్ని గూర్చి ప్రస్తావిస్తూ -

"ఎంత సునాయస
ప్రయాణమో కదా!
జిల్లేడు గింజది " - అని అంటూ జిల్లేడు గింజ సునాయస ప్రయాణాన్ని గురించి తెలిపారు.

ఇలాగే మరో హైకూలో పెళ్ళైన స్త్రీల మెళ్ళోతాళి సంసార బంధానికి డ్రైవింగ్ లైసెన్స్ అని చెబుతూ -

"మెళ్ళోతాళి
సంసారంబండికి
డ్రైవింగ్ లైసెన్స్ " - అని అంటాడు. మనం వాహనం రోడ్డుపై నడపాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తప్పక ఉండాలి. అది ప్రభుత్వ నిబంధన. అదే విధంగా ఒక స్త్రీ ఒక పురుషునితో సంసారం చేయాలి అంటే మెళ్ళోతాలి ఉండాలి. అది వివాహ బంధానికి ఆచార సంప్రదాయంగా సమాజంలో గుర్తింపుగా మనం భావిస్తాం. దీన్నే కవి ఎస్జీడి.చంద్రశేఖర్ గారు సంసారం అనే బండికి మెళ్ళోతాలి లైసెన్స్‌గా చమత్కరించారు.

కవి 'మొగిరాల లక్ష్మీప్రసాద్' గారు తన 'హైకూలు' లో ఈ సృష్టిలో ప్రేమ ఎంతో మధురమైన జ్ఞాపకం. ఆ ప్రేమ ప్రియురాలి ప్రేమ కావచ్చు, ప్రియుడి ప్రేమ కావచ్చు, జంతువులపై ప్రేమ కావచ్చు, ప్రకృతి ప్రేమ కావచ్చు. కానీ ప్రేమలో విఫలమైన భగ్న ప్రేమికుడు స్వచ్ఛమైన ప్రేమకోసం అదమరచి ప్రేమ ప్రేమ అని తపిస్తూ తిరుగుతుండగా ఒక వ్యక్తి ఈ విశ్వంలో అన్నీ తన బిడ్డకోసం భరించి కల్మషములేని స్వచ్ఛమైన ప్రేమ అందించేది అమ్మ ఒక్కరే అని చెప్పే విషయాన్ని ప్రస్తావిస్తూ -

"స్వచ్ఛమైన ప్రేమ
ఎక్కడ దొరుకుతుందనడిగాను
నీకు అమ్మ లేదా అన్నా రెవరో..." అని చెప్పాడు.

మొగిరాల లక్ష్మీప్రసాద్ గారు మరో హైకూలో తనకు కావలసిన దానిని ఇంకొకరు మనసుపడి లాక్కెల్లాలని చూస్తే అడ్డుపడే విధానాన్ని గూర్చి చెబుతూ -

"పుష్పం విచ్చుకుంది
మనసుపడి ముద్దాడబోతే
తుమ్మెద అడ్డుకుంది " - అని అన్నాడు.

మగువలకు పుష్పాలు అంటే వల్లమాలిన ఇష్టం. పుష్పం బాగుంది కదా! అని ముద్దాడబోయిన మగువకు భంగపాటు ఎదురౌతుంది. తనకు కావలసిన మకరందాన్ని ముద్దాడితే మలినమవుతుందని బావించి తుమ్మెద అడ్డుకునే విధానాన్ని చెప్పారు. మరో హైకూలో మొగిరాల లక్ష్మీప్రసాద్‌గారు పెద్దగాలికి పూలన్నీ రాలిపోగా వెర్రెక్కి తిరిగే తుమ్మెదను గూర్చి చెబుతూ -

"పెను గాలికి
పూలన్నీ రాలాయి
తుమ్మెద తిక్కగా తిరుగుతోంది " అని అన్నాడు.

ఈ హైకులో పెనుగాలికి చెట్ల కొమ్మల్లోని పూలన్నీ రాలిపోయాయని ఆ పూలలోని మకరందాన్ని తాగటానికి వచ్చి తుమ్మెద గత్యంతరం లేక తిక్కగా తిరుగుతుందని అంటాడు. ఎవరికైనా లక్ష్యం నెరవేరనప్పుడు పిచ్చిపట్టి నట్లుగానే ఉంటుంది.

మరో హైకూలో మొగిరాల లక్ష్మీప్రసాద్ గారు నాటి సత్యహరిశ్చందుడు సత్యం, ధర్మం, న్యాయం అనే మాట లకు కట్టుబడినాడు. నేటి సత్యహరిశ్చంద్రులు అధర్మం, అన్యాయం, అసత్యాలే ఎక్కువగా మాట్లాడుతున్నారు తప్ప సెల్‌ఫోన్‌లో ఎవ్వరూ నిజాలు చెప్పట్లేదనే భావం స్ఫురించే విధంగా చెబుతూ -

"సత్య హరిశ్చంద్రుడు
నిజాలు చెప్పట్లేదు

ఈ మధ్యే సెల్‌ఫోన్ కొన్నాడట " - అని చెప్పాడు.

ఇంకో హైకూలో మొగిరాల లక్ష్మీప్రసాద్ గారు యువత స్నేహితులతో తిరుగుతూ చెడు అలవాట్లకు చెడు వ్యసనాలకు లోనవుతున్నారు. అలా కాకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలంటే గ్రంథాలయమనే మంచి మిత్రుడి స్నేహం చేయమని కవి హితభోద చేస్తూ -

"మంచి మిత్రుల
కోసమా అన్వేషణ
ఒక్కసారి లైబ్రరీకి వెళ్ళిరా " - అని తెలిపాడు. యువత ప్రపంచాన్ని దర్శించాలంటే లైబ్రరీ అనే మంచి మిత్రుడిని సందర్శించాలంటాడు.

నేడు ఆధునిక సమాజంలో ఉరుకుల పరుగుల జీవితంలో కొడుకులు, కూతుర్లు తల్లిదండ్రులను పూర్తిగా మరచిపోతున్నారు. తల్లి నవమాసాలు మోసి కని మాతృత్వానికి ప్రతీకలైన తన కొడుకులను అల్లారు ముద్దుగా పెంచుతుంది. అలా పెంచిన తల్లిని భారంగా భావించి వృద్ధాశ్రమంలో వదలేస్తున్నారు. ఆ తల్లి తన పేగు బంధాన్ని మరువలేక నిరాశ్రయురాలై వృద్ధాశ్రమంలో బిడ్డపుట్టిన రోజు అంటూ పురుటి నొప్పులను గుర్తుచేసుకుంటుంది. స్త్రీకి ప్రసవం అంటే మరో జన్మ కాబట్టి ఆ రోజును గుర్తుచేసుకొని నేను ఒకరికి జన్మనిచ్చి నేను బ్రతికాననే భావనతో వృద్ధాశ్రమంలో పూజలు చేస్తున్న వైనాన్ని గూర్చి చెబుతూ మొగిరాల లక్ష్మీప్రసాద్ గారు -

"కొడుకు పుట్టిన రోజని
తల్లి పూజ చేస్తోంది
వృద్ధాశ్రమంలో...! " - అని తెలిపాడు. తానెక్కడున్నా తన మమకారం మరువలేక బిడ్డ శ్రేయస్సు కోరుకుంటుంది తల్లి.

మొగిరాల లక్ష్మీప్రసాద్ గారే మరో హైకూలో సాఫ్టువేర్ ఉద్యోగాల హడావుడిని గురించి చెబుతూ -

"అబ్బాయి అమెరికా నుండే
ఇక్కడమ్మాయికి తాళికట్టాడు
ప్రపంచీకరణంటే ఇదేనేమో...!" - అని అంటున్నాడు. ప్రపంచీకరణలో భాగంగా భాషకు, ప్రాంతాలకు హద్దులు చెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఉన్నత చదువులు చదివినవారు సాఫ్టువేర్ ఉద్యోగాలకు విదేశాలకు వెళ్ళడం జరుగుతుంది. బాజా భజంత్రీలతో సంప్రదాయబద్ధంగా జరగాల్సిన వివాహ కార్యక్రమం వీడియోకాన్ఫరెన్స్‌లాగా ఆన్‌లైన్‌లో వధువూ, వరుడు తాళికట్టి తలంబ్రాలు పోసుకోవడాన్ని గూర్చి తెలిపాడు. మొగిరాల లక్ష్మీప్రసాద్ గారు మరొక హైకూలో -

"తేనెటీగ కుడితే
ఏడుస్తావెందుకు
తియ్యగా లేదా...?"

తేనెటీగ కుడితే ఎందుకు ఏడుస్తావని ప్రశ్నిస్తాడు కవి. దాని పేరే తేనెటీగ అయితే అది కుడితే కూడా తియ్యగా ఉండాలి కదా! అయితే అలా ఉండదు. బాధగా ఉంటుంది. ఈ హైకూలో నిక్షిప్తమై ఉన్న వ్యంగం మనల్ని బాగా ఆకర్షిస్తుంది.

ఇలా నాటకాలకు మాత్రమే పరిమితమైన కళాదీపిక పత్రికలో అత్యంత ఆధునికమైన లేదా అతినవ్యమైన కవిత్వానికి ప్రత్యేకించి హైకూ కవిత్వానికి స్థానం కల్పించిన తీరు మనకు ఈ పత్రికలో అక్కడక్కడా కనిపిస్తూ ఉంటుంది.

## నానీ కవితలకు దోహదం :

నానీలు అనే కవితా ప్రక్రియ అత్యాధునిక దేశీకవితా ప్రక్రియ. నానీలను మొట్టమొదట గోపి అంటే ఆచార్య ఎన్.గోపాల్ సృష్టించారు. నానీలు నాలుగు పాదాలతో కొనసాగుతుంది. ఈ నాలుగు పాదాల్లో 20 నుంచి 25 అక్షరాలు ఉండాలి. కానీ దీనికి కొంత వెసులుబాటుగా 5 అక్షరాలల్లో ఎన్ని అక్షరాలైనా అదనంగా చేర్చుకోవచ్చు. అందువల్ల నానీల్లోని లక్షణాలైన 20 నుంచి 25 అక్షరాలుండాలి అనే దాన్ని నానీలు రాసిన కొంతమంది కవులు పట్టించుకొన్నారు. మరికొంతమంది పట్టించుకోలేదు. ఈ నాలుగు పాదాల నానీలు రెండు యూనిట్లుగా ఉండాలి.

వీటి రెండింటికీ పరస్పర సంబంధం ఉండాలి. నానీలు భావతీవ్రతను, సాంద్రతను, గాఢతను వస్తువైవిధ్యాన్ని కలిగి ఉండాలనే నియమ నిబంధనలు కూడా నానీల కున్నాయి. తెలుగుకు మాత్రమే పరిమితమైన ఈ నానీలు 1997 నుండి ఆచార్య ఎన్.గోపి కలం నుండి వెలువడి బహుళంగా వ్యాప్తి చెందాయి. చాలామంది కవులు నానీలను రాసి నానీల సంపుటాలను, నానీల సంకలనా లను వెలువరించారు. ఇప్పుడు నానీల వేడి వాడి కొంత తగ్గింది.

కేవలం నాటకాలకు మాత్రమే పరిమితం చేసుకొన్న కళాదీపిక పత్రిక అతినవ్య కవితాధోరణులైన ఈ నానీలకు కూడా స్వాగతం పలికి కొంతమంది రచయితల నానీలపై వ్యాసాల్ని కొంతమంది కవుల కవయిత్రుల నానీలను ప్రచురించింది. వీటిని గురించి ఇక్కడ ప్రస్తావించడం జరుగుతూ ఉంది.

యస్.ఆర్.పృథ్వీ గారు రాసిన 'నానీలు' లో సినిమా శృతిమించిన భాషాపదజాలం, శృతిమించిన వస్త్రదారణ అలానే టీవీ సీరియల్లో మహిళలు మితిమీరిన విలనిజంను గూర్చి ప్రస్తావిస్తూ -

"వెండి తెర వగలు
బుల్లి తెర పొగలు
కుర్రకారుకి
క్రీడా స్థలాలు" - అని చెప్పాడు. వెండితెరపై నాయికలు వయ్యారాల వగలు, బుల్లితెరపై ప్రతి నాయకిగా విలనిజం చేసే మహిళలు పొగలు పుట్టిస్తు న్నారు. అది తొందరగా ఆకట్టుకొనే కుర్రకారుకి విచ్చలవిడి క్రీడా స్థలాలుగా మారుతున్నాయి అన్నారు కవి.

ఇంకో నానీలో స్త్రీ, పురుషుల మధ్య రంగు భేదమనే తారతమ్యం ఉండకూడదని చెబుతూ -

"నలుపైతే ఏమి
తెలుపైతే ఏమి
మనసు ఛాయ
బంగారమయితే " - అని అన్నాడు. మనుషులు కొందరు తెల్లగా వుంటారు, మరికొందరు నల్లగా ఉంటారు. తెల్లగా వున్నవారంతా మంచివారు, నల్లగా వున్న వారంతా చెడ్డవారు కాదు. మనుషులు ఏ రంగులో ఉన్నాసరే మంచిమనసుంటే చాలు అది బంగారమవు తుందనే అభిప్రాయాన్ని యస్.ఆర్.పృథ్వీ వ్యక్తం చేశాడు.

యస్.ఆర్.పృథ్వీ ఇంకో నానీలో ఉషోదయం వేళ సూర్యుడిని గూర్చి ప్రస్తావిస్తూ -

"ఉదయిస్తున్న
బాల భానుడు
అమ్మ నుదురు మీద
ప్రకాశిస్తున్న బొట్టులా " - అని అంటారు. ఉద యిస్తున్న సూర్యుడు చిన్నగా ఎర్రని రూపంలో మనకు కనబడతాడు. హిందూ సంప్రదాయంలో మహిళలు నుదుటిపై ఎర్రటి కుంకుమ బొట్టును గుండ్రంగా పెట్టు కుంటారు. అలా ఉదయిస్తున్న సూర్యుడు గుండ్రంగా ఎర్రగా ఉన్నాడు. అలాగే అమ్మ నుదుటి మీద కూడా ఎర్రటి బొట్టు ప్రకాశిస్తున్న బాల భానుడిలా ఉంది అని చెప్పాడు కవి.

యస్.ఆర్.పృథ్వీగారే మరో నానీలో నేటి మనుషుల మోసాలను గురించి ప్రస్తావిస్తూ -

"గాలిని ఆరగించి
బ్రతికారు మునులు
మోసాలను ఆరగిస్తూ
జనులు " - అని అన్నాడు.

మునులు దట్టమైన అరణ్యాలలో సంచరిస్తూ అడవి తల్లి ప్రకృతి బడిలో ఉంటూ గాలిని మాత్రమే పీల్చుతూ బ్రతుకుతారు. వారికి ఏలాంటి మోసాలు తెలియవు. కానీ సమాజంలో నాయకులు, ప్రజలు మాత్రం మోసాలు అన్యాయాలు చేసి సంపాదించిన ధనాన్ని ఆరగిస్తూ బ్రతుకుతున్నారనే వాస్తవాన్ని వివరించాడు.

సింగార సుబ్బరాయుడు గారు రాసిన "సింగార నానీలు" లో నైతిక విలువలు మరచి అక్రమమార్గంలో అనైతికంగా చీకటి సుఖానికి అలవాటుపడ్డ వ్యక్తుల

గురించి ప్రస్తావిస్తూ -

"అక్రమ అనైతిక
చీకటి సుఖానికి
డెవిల్స్ గిఫ్ట్ -
ఎయిడ్స్ " - అని అంటాడు.

నేటి సమాజంలో పెట్రేగిపోతున్న విచ్చలవిడి శృంగారం గురించి, చీకటి సుఖానికి అలవాటుపడ్డ వాళ్ళకు దెయ్యం ఎయిడ్స్‌ను బహుమతిగా ఇస్తుంది. కనుక అక్రమమైన సుఖాలకు అలవాటు పడవద్దని కవి సూచన చేశాడు ఈ నానీలో.

సింగార సుబ్బరాయుడు గారే మరో నానీలో కారు మబ్బులతో ఆకాశం మేఘావృతమై భయానక తుఫాను సమయాన సూర్యుడు కనబడక పగలు చీకటిగా ఉండడాన్ని గూర్చి చెబుతూ -

"తుఫాను ముందు
సూర్యుడు 'లాంగ్ లీవ్'
అగ్నిగోళం ఆరుతుందని " - అని అన్నాడు. పెద్ద పెద్ద తుఫానుల వల్ల విరామం లేకుండా కుండపోత వర్షం కురుస్తుంది. ఆ సమయంలో సూర్యుడు వారం, పదిరోజులైన కనబడడు. అప్పుడు సూర్యుడు తానెక్కడ చల్లబడి ఆరుతానేమోనన్న భయంతో 'లాంగ్ లీవ్' తీసుకున్నాడని కవి చమత్కరించాడు.

సింగార సుబ్బరాయుడు గారే ఇంకో నానీలో వివిధ వాహనాలకు ప్రకృతిని ప్రియురాలుగా భావించి -

"రైలుకు పొలం
బస్సుకు నది
ఫ్లైట్లకు అడవి
ప్రియురాండ్రు " - అని అంటాడు. పచ్చని పొలాల మధ్య పైరు గాలిని ఆస్వాదిస్తూ నడిచే రైలుకు, గల గల పారే నదివంతెనపై వెళ్ళే బస్సుకు, దట్టమైన పచ్చని అడవి పైన ఆకాశంలో వెళ్ళే ఫ్లైట్లకు అడవిని ప్రియురాండ్రు అని కవి అభివర్ణించాడు.

మరోనానీలో సింగార సుబ్బరాయుడు గారు కుహనా రాజకీయ నాయకుల చేతిలో మోసపోయిన కూలి బ్రతుకుల ఉదంతాన్ని గూర్చి చెబుతూ -

"ఓ టేసిన
ఓటి బ్రతుకులు
ఎటో చూస్తున్నాయి
పూట కూటికి " - అని అన్నాడు. ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి చిలకపలుకులు పలికిన రాజకీయ నాయకులు ఎన్నికల్లో నెగ్గగానే మోహంచాటేస్తారు. మంచి నాయకునికి ఓట్లేస్తే ఉపాధి దొరికి మా బ్రతుకులు మారుతాయని ఎంతో ఆశగా వుంటారు చిల్లర జనాలు. చేతిలో పనిలేక ఏమీలేని బడుగు బ్రతుకులు జీవనం గడవక పూటకూటీ కోసం ఎదురుచూస్తున్న వైనాన్ని కవి హృదయ ఉదారకంగా ఆవిష్కరించాడు.

సింగార సుబ్బరాయుడు గారే ఇంకో నానీలో భూమాతను నమ్ముకొని బ్రతికే రైతన్నను గురించి ప్రస్తావిస్తూ -

"గతుక
మెతుకు నిచ్చి
బ్రతుకు నిల్పిన
మాతా, నామాగాణి "

పొలంలో కష్టపడి చెమటోడ్చి పనిచేసే రైతు బాగా పండిన వరి పంట వల్ల తాను సుభిక్షంగానే ఉన్నాడు. తినడానికి మెతుకులిచ్చి (జీవితాన్ని) బ్రతుకు నిల్పిన నా తల్లి భూమాతా నామాగాణి అని రైతు సంతోషిస్తూ గర్వంగా చెప్పుకుంటాడు అని ఈ నానీలో కవి చెప్పాడు.

**ముగింపు :**

ఇలా హైకూలు మినీ కవితల్లా మంచి భావుకతతో, చమత్కారంతో మనల్ని ఆకట్టుకొనేవిగానే ఉంటున్నాయి. ముఖ్యంగా కళాదీపిక పత్రికలో ప్రచురించిన ప్రకృతి పరమైన అంశాలు, సామాజికాంశాలుగా చోటుచేసుకొన్న హైకూ కవితల్ని విశ్లేషించటం జరిగింది. మినీ కవితాతత్వం హైకూతత్వం ఈ రెండు మిళితమైన దేశీయ ప్రక్రియ 'నానీ'. ఈ రెండు కలసిన 'నానీ'కి చిన్నది 'బుజ్జివి' అనే

దేశీయమైన అర్థం ఉంది. నానీల కవిత్వానికి సంబంధించి కొంతమంది కవుల నానీలను కూడా ఇక్కడ విశ్లేషించటం జరిగింది. నానీల కవితల్లో కూడా కవులు సామాజిక స్పృహతో కూడిన కోణంలోనే రచనలు చేశారు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. చంద్రశేఖర్, ఎస్వీడి : ఆధునికాంధ్ర కవిత్వం ఆవిర్భావ వికాసాలు.
2. నారాయణరెడ్డి, డా॥ సి : ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు - ప్రయోగములు 1989
3. సమాలోచనం : (ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియపై సమీక్ష) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ - హైదరాబాద్.
4. కళాదీపిక మాస పత్రికలు : జనవరి-ఫిబ్రవరి, మార్చి-ఏప్రిల్, మే, జూన్, జూలై 2006, ఫిబ్రవరి 2007.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగులో పౌరాణిక నవల - సామాజిక చైతన్యం

- సిహెచ్. పూర్ణచంద్రరావు, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, SR & BGNR గవర్నమెంట్ కళాశాల, ఖమ్మం.

సమాజం ఒక ప్రవాహం. ఒక జీవ నది. నిరంతరం తమ గమనాన్ని సాగిస్తుంటుంది. ఈ ప్రపంచంలో మనుషులు, జంతువులు, పక్షులు ఇలా యనభై ఏడు కోట్ల జీవరాసులు ఉన్నాయని చెబుతుంటారు. ఈ జీవరాసులు నిరంతరం తమకు కావాల్సిన తిండి కోసం, బ్రతుకు కోసం పోరాటం చేస్తుంటాయి. ఇందులో భాష తెలిసిన మనుషులు మరింతగా తమ ఉనికి కోసం ముందుకు సాగుతుంటారు. నిరంతరం మనిషి సాంఘీకంగా, ఆర్థికంగా, తాత్త్వికంగా ముందుకు సాగుతూనే ఉంటాడు. వేలు, లక్షల సంవత్సరాలు క్రితం పుట్టిన మానవుడు మొదట కోతి రూపం నుండి మనిషిగా మారటం, మొదట సంజ్ఞలతో జీవించటం ఆ తరువాత భాషను సృష్టించుకోవటం సమూహాలుగా జీవించటం, సాధు జంతువులను పోషించటం, ఇలా తెలిసిన జీవితం నుండి మరో కొత్త జీవితం పొందటానికి నిరంతరం శ్రమిస్తూనే ఉన్నాడు. ఇదే మానవ చైతన్యం.

మనిషి నాగరికత నేర్చుకోవటం మొదలుపెట్టిన తరువాత మనుషులు సమూహాలుగా జీవించటం మొదలుపెట్టిన తరువాత యుద్ధాలు చేయటానికి అలవాటు పడటం, ఆర్యులు, ద్రావిడులు అను రెండు వర్గాలుగా మారటం, పరస్పరం యుద్ధాలు చేసుకోక పోవటం, మనువు యుగం. ఆరంభం కావటం, హైందవ ధర్మం ప్రచారం పొవటం, చాతుర్వర్ణ వ్యవస్థ రూపాం దటం, జనపదాలు స్వయం పోషక వ్యవస్థను పొందటం, గ్రామాలలో ప్రజలు తమ జీవనం కోసం వృత్తులను చేతపట్టడం, గ్రామ జీవనానికి కొరత లేకుండా చూసు కోవటం, వృత్తులు కులాలుగా మారటం, జనపదాలు పరిపుష్టతను పొందటం, పాలకులు రాజులుగా మారటం, రాజ్యాలను ఏర్పాటు చేసుకోవటం, బౌద్ధం, జైనం,శైవం వైష్ణవం లాంటి మతాలు పుట్టుకురావటం, హైందవ మతంలో భాగంగా ధర్మం, న్యాయం వంటి అంశాల మాటున రాజ్యాలు సాగటం, రాజుల జీవితాలు, యుద్ధాలు, సంస్కృత భాషలో అక్షర బద్ధం కావటం, జంబూ ద్వీపం నుండి భారతదేశంగా పేరు రూపాంతరం చెందటం, ఇనుము వాడకం పెరగటం, పితృస్వామిక వ్యవస్థ బలపడటం మహిళలు కుటుంబాలకు పరిమితం కావటం, భారతదేశంలో ఆచారాలు, సంప్రదాయాలు, మూఢ నమ్మకాలతో పాటు సంస్కృతి ఏర్పడటం, వృత్తి నైపుణ్యం పెరగటం, నదీ లోయల్లో జనాభా పెరగటం, పోడు వ్యవసాయం సాగటం, పంచమ వర్ణం ఉద్భ వించటం.... ఇలా వేల సం.ల నుండి మానవ జీవనం ఒక చైతన్య పథంలో సాగింది.

క్రీ.పూ. రామాయణ భారతయుద్ధాలు జరిగాయి. అప్పటికే పురాణాలు కూడా ఆశురూపంలో ఉన్నాయి. ఆ తరువాత పురాణాలు అక్షరబద్ధం అయ్యాయి. వేదాలలో దాగిన వైదిక జ్ఞాన సంపద పురాణాల్లో కథల రూపంలో ఉంది. వీటిని ఋషులు సంకలితం చేశారు. ఈ పురాణాల్లో భారతీయుల జీవన విధానం, ఆచార వ్యవహరాలు, సాంఘీక రాజకీయ ధార్మిక పరిస్థితులు దార్శనిక సిద్ధాంతాలు కన్పిస్తాయి.

ఈ పురాణాల వల్లా గడిచిన తరాల మానవుల సుఖ దు:ఖాలు, మానసిక ప్రవృత్తులు, పరస్పర సంబంధాలు, సంప్రదాయాలు, అణిచివేతలు తెలుస్తాయి. మన తరాల చారిత్రక, సాంస్కృతిక జీవనం మన కళ్ళముందు దర్శనమిస్తుంది.

తెలుగు నవలా సాహిత్యం కాలం మారుతున్న కొద్దీ తమ పరిధిని విస్తరింపజేసుకుంది. సమాజంలోని పలు సమస్యలు ఇతివృత్తాలుగా స్వీకరించి ఆ సమాజానికి ఒక సందేశంగా నిలుస్తూ సామాన్యుని పక్షాన నిలువ గలిగింది. కులం, మతం, లింగం, కాలం, ప్రాంతం...

ఇలా అన్ని కోణాలనూ లోతుగా అధ్యయనం చేయ గలిగింది. ఈ నవల పనిలో పనిగా పురాణాలనూ స్పృశించింది.

ఈ సమాజంలో మనిషిని మనిషిగా చూడటటం మానవత్వం. ఈ సృష్టిలో ప్రతి మనిషి ఒకేలా జన్మిస్తాడు. కానీ సమాజంలో వున్న సామాజిక అంతరాల కారణంగా మనుషులు కులాలు, మతాలు, లింగం వంటి అంశాల కారణంగా అసమానతలు దాగివున్నాయి. ఈ అసమానతలే మానవుల మధ్య అంతరాలకు దారి తీస్తున్నాయి. అలాగే సమాజంలో పేదరికం, అస్పృశ్యత ఆర్థిక అంతరాలకు మరింత ఊతాన్ని ఇస్తున్నాయి. ఇలాంటి సమాజంలో మనుషుల మధ్య ప్రేమ సాన్నిహిత్యం వికసించి మానవత్వాన్ని పొందాలి. మానవులు అందరూ సమానమే నన్న భావన రావాలి. ఇలాంటి మానవీయతను అందించిన పౌరాణిక నవలలను పరిశీలిద్దాం.

పిలకా గణపతి శాస్త్రి రాసిన "అందని చందమామ" నవలలో ఈనాటి కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు, ప్రేమ వివాహాలు, యువతులను అపహరించి దౌర్జన్యంగా పురుషులు చేసుకునే వివాహాలు వంటి అంశాలకు ప్రతీకలుగా ఆనాటి వరూధిని ఇంద్రమణిల వివాహం గుర్తుకు తెప్పిస్తుంది.

ఈ నవలలో స్త్రీ ఔన్నత్యం కన్పిస్తుంది. వరూధిని మొదట తనకు ప్రవరుడే కావాలనీ, ఆ అందగాడు లేని తన జీవితం,అందం అడవిగాచిన వెన్నెలని భావించి అతన్ని వెదికే ప్రయత్నంలో ఇంద్రమణిని వివాహమాడుతుంది. తరువాత అతను ప్రవరుడు కాదని, ఇంద్రమణి అని తెలిసి మొదట బాధపడినా తరువాత ఆ అందని చందమామ కన్నా ఈ అందిన చందమామను వివాహమాడటం వేయి రెట్లు ఆనందం కలిగిందని భావిస్తుంది. తాను ప్రేమించిన వాడు కాక, తనను ప్రేమించిన వాడిని వివాహమాడితే ఆనందం మరింతగా ఉంటుందని తెలుసుకుంటుంది. అలాగే ఈనాటిలాగ పురాణకాలంలో కూడా ప్రేమ వివాహాలు ఉన్నాయనే భావనను అందిస్తుంది.

ఆనాటి వరూధినిలో వ్యక్తిత్వం ఆత్మగౌరవం ఉంది. వరూధిని గంధర్వ కన్య కావటంతో స్త్రీ స్వేచ్ఛ పుష్కలంగా ఉంది. మానవ సంబంధాల కన్నా అతీతమైనవి గంధర్వ సంబంధాలు. వీరికి వావి వరుసలు ఉండవు. అన్నింటా వీరిది విలాస జీవితమే. అయినా వరూధిని ఇంద్రమణి తోనే వైవాహిక జీవితం గడిపింది. విచ్చలవిడి శృంగారానికి పూర్తిగా దూరంగా ఉంది. తృప్తిగా జీవితాన్ని ముగించింది. ఈనాడు స్త్రీ వాద ఉద్యమంలో భాగంగా స్త్రీ కోరుకున్న స్వేచ్ఛకు వరూధిని ప్రతీక. వరూధినిలో కుటుంబ జీవనంలో స్త్రీ కోరే స్వేచ్ఛ కనిపిస్తుంది. భర్త పట్ల నిరంతరం ప్రేమ, స్నేహం, సహృదయతను చూపుతుంది. తమ భర్త తనను వదలకుండా తన వద్దనే ఉంటే ఈ జన్మకు అదే చాలునని ఆనందిస్తుంది. హైందవ వర్ణ వ్యవస్థలో కుటుంబ జీవితానికి ఆదర్శం పురాణ వరూధిని.

తాటికొండల నరసింహారావు రాసిన "కౌసల్యా సుప్రజారామ" నవల పితృస్వామిక వ్యవస్థకు అద్దం పడుతూ స్త్రీ, పురుష సంబంధాలు, కుటుంబ సంబంధాలు, సామాజిక సంబంధాలను ఉండవల్సిన తీరును వివరించింది. హైందవ మత ధర్మాలను బోధిస్తూ, ఆర్యులకు అనుగుణంగా లేదా దేవతలకు అనుగుణంగా వర్ణాశ్రమ ధర్మాలను రూపొందించి దానవులు లేదా ద్రావిడులు ఆటవిక తెగలు వంటి తెగలకు అస్పృశ్యతను అంటగట్టింది. ఆనాడు రాజుల రాజ్యాలను జయించటం గణ తెగలను తమకు అనుగుణంగా మలుచుకోవటం చేశాయి. దాంతో ఆర్య సంస్కృతిని వంట బట్టించుకోవటానికి ప్రయత్నించిన లంకాధిపతి లాంటి వారు ఘోర తపస్సు చేసి బ్రహ్మ నుండి వరాలు పొంది, దేవతలను మానవులను ఆర్యులను హతమార్చటానికి నిరంతరం ప్రయత్నిస్తాడు. ఇతని అరాచకాలను సహించ లేని భూదేవి, మునులు, శ్రీ మహా విష్ణువును శరణు కోరుతారు. దాంతో శ్రీ మహావిష్ణువు రావణుని అంతం చేయటానికి శ్రీరాముడిగా అవతరిస్తాడు.

నాటి పరిస్థితి చరిత్రలో చాలా కాలం సాగింది. ఆనాడు ఇక్ష్వాకు వంశానికి ద్రావిడ వంశీయుడయిన రావణునికి

జరిగిన వైరం తరాలుగా సాగింది. అయిదారు తరాల తరువాత శ్రీరాముడు తన ముత్తాత అనరణ్యుని హత్య చేసిన రావణుని చంపి ప్రతీకారం తీర్చుకున్నాడు. ఇది మానవ చరిత్ర క్రమంలో నేటి దాకా కొనసాగుతూనే ఉంది. భారతదేశంలో రాజులు, సంస్థానాధీశులు, జమీందార్లు, పాలేగాళ్ళు చివరికి రాజకీయ నాయకులు కూడా తరాలుగా తమ వంశ ప్రతీకారాలను తీర్చుకుంటూనే ఉంటున్నారు. ఇది చరిత్ర నుండి సంక్రమించిన పౌరుషం. ఆనాడు రాముడికి రావణునికి జరిగిన యుద్ధం వంశపారం పర్యంగా సాగిన ప్రతీకారానికి సాక్ష్యంగా నిలుస్తుంది.

తెన్నేటి హేమలత రాసిన "మోహనవంశి" నవలలో చాలా మంది తాత్త్వికులు శ్రీకృష్ణుడు దేవుడు దుష్ట శిక్షణ కోసం మానవవతారం ఎత్తాడని చెబుతారు. కానీ ఈ రచయిత్రి మాత్రం మానవుడు భగవంతుడయ్యాడని విశ్వసిస్తుంది. ఈ నవలలో శ్రీకృష్ణుడు స్త్రీ స్వేచ్ఛను ప్రసాదించే ప్రయత్నం చేస్తాడు. ఈయన దృష్టిలో సత్యవతి ద్రౌపది వంటి స్త్రీలు, గొప్ప మానవతా మూర్తులుగా పరిగణింపబడుతారు.

"నీ దారిన నువ్వు జీవించు, సుఖపడు, కాలం సమీపించినప్పుడు రాలిపో. ఆధిక్యత కోసం నీతోటి మానవుడికి మత్తు మందు పెట్టకు. నీ ఉన్నతి కోసం కొన్ని నియమాలను నీ సోదరుడికి విధించకు. నీ విధి నువ్వు చెయ్యి. ఎల్లవేళలా హృదయాన్ని ఆర్ద్రంగా అట్టిపెట్టు" అని సత్యవతి శ్రీకృష్ణునితో చెబుతుంది.

ఈనాడు మనం మాట్లాడుకున్న మానవతావాదం, స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, అస్తిత్వ వాదం వంటివి ఆనాటి సమాజంలో ఈ నవల ద్వారా వ్యక్తం అవుతాయి. ఏ మనిషి కూడా మరో వ్యక్తి మీద తన సిద్ధాంతాలను బలవంతంగా రుద్దరాదని ప్రతి మనిషి స్వేచ్ఛగా జీవించే హక్కును ఈ సమాజం ప్రసాదించబడాలనీ తాత్త్వికత ఈ నవలలో కనిపిస్తుంది.

కస్తూరి మురళీకృష్ణ రాసిన "సౌశీల్య ద్రౌపది" నవలలో ఈనాడు స్త్రీ వాదం ద్వారా మహిళలు కోరుకుంటున్న స్వేచ్ఛ, సమానత, వ్యక్తిత్వం ఆత్మగౌరవం వంటి అంశాలను ఆనాడు పితృస్వామిక భావజాలం నుండి పొందే ప్రయత్నం చేశారనిపిస్తుంది. ఆనాడు ద్రౌపది అవమానం, లైంగిక హింస, స్త్రీ పట్ల వివక్ష లేని పురుష సమాజం ఉద్భవించాలని కాంక్షించింది.

పితృస్వామిక సమాజంలో ఏ కాలంలోనైనా బహు భర్తత్వం గల స్త్రీలకు అవమానం తప్పదని వారు యుగ ధర్మం కోసం ఉద్భవించారనే భావనను పురుషులు మరుస్తారనీ ఏ కాలంలో నైనా స్త్రీలో ఉండే మంచితనం గుర్తించారనే భావన ఈ నవలలో కన్పిస్తుంది.

తెన్నేటి హేమలత రాసిన "స్వర్ణ సీత" నవలలో సీతారామ కథలో పాటు వర్తమాన ఉద్యమాలు ప్రాచీన కాలం నాటికే రూపుదిద్దుకుంటున్నాయనే భావన కనిపిస్తుంది.

ఈ భూమి దాదాపు రెండు వందల కోట్ల సంవత్సరాల క్రితం పుట్టిందని అప్పటి నుండి సామాజిక మార్పులు జరుగుతున్నాయని రచయిత్రి చెప్పే ప్రయత్నం చేసింది. ప్రధానంగా ఆనాడు సమాజంలో మాతృస్వామిక వ్యవస్థ ఉండేదని శ్రీరాముడు పితృస్వామిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రయత్నం చేశాడని తెలుస్తుంది. అయినా సీతాదేవి, కౌసల్యాదేవి లాంటి స్త్రీలు, రాముని భారత ప్రజాతంత్ర పరిషత్తు పరిపాలనలో కీలక పదవులు చేపట్టారని స్త్రీ సమస్యలకు తగిన పరిష్కారాలు, సూచించారని ఈ నవల ద్వారా తెలుస్తుంది. తార, సరమ వ్యక్తిత్వాన్ని కోరుకుంటారు. సీత వ్యక్తిత్వం, ఆత్మగౌరవాన్ని సాధికారికతను కాపాడుకోవటంలో భాగంగా వాల్మీకి ఆశ్రమం చేరుతుంది. శూర్పణఖ తనకు రాముని నుండి జరిగిన అవమానాన్ని జీవితాంతం తలుచుకుంటుంది. తన ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఆనాటికే స్త్రీ వాదం ఆరంభంగా మనం చెప్పుకోవచ్చు.

ఈ నవల మనువు సృష్టించిన బ్రాహ్మణవాదం వర్ణ వ్యవస్థల సమస్య నాటికే మొదలయిందని చెబుతుంది.

హనుమంతుడు సరస్వతీ నదీ తీరంలో తిరుగుతున్నప్పుడు ఒక ఆటవిక స్త్రీ హనుమంతునితో పూర్తిగా బ్రాహ్మణిజాన్ని వ్యతిరేకిస్తుంది.

"మేము లంకా కాందిశీకులము. భారతదేశానికి బ్రతకటానికి నీళ్లు ఈదుకు వచ్చిన వాళ్లము వీలయితే భారత దేశాన్ని ఏలదలచుకున్న వాళ్ళము. శ్రీరాముడు క్షత్రియుడే గానీ బ్రాహ్మణుల మాట వింటాడట కదా! అందుకని ఆయనంటే మాకు కోపం. మహారాణి బ్రాహ్మణ స్త్రీ అయి ఉండి క్షత్రియుడ్ని పెళ్లి చేసుకుని మా మాట వినదట. అందుకుని మాక్కోపం.. ఆవిడ కూడా లంకా కాందిశీకురాలేనట మొదట. ఆ మాట కొస్తే మేమెవరమో తెలుసునా? అసలు భారతీయులం మేము. ఎక్కడ్నుండో వచ్చి రాజ్యం ఏలుతున్న శ్రీరాముడు ఆర్యుడే కాని భారతీయుడు అంతకంటే కాదు" ఇలా హనుమంతునితో చెబుతుంది.

ఆర్యులు బ్రతుకు తెరువు కోసం భారతదేశం వచ్చి భారతీయులను పాలిస్తున్నారనే ఆవేదనను తెలుపుతుంది.

అలాగే బ్రాహ్మణ వాదాన్ని బ్రాహ్మణులు బలంగా సమాజం మీద రుద్దుతున్నారని ఆ బ్రాహ్మణ వాదాన్ని వ్యతిరేకిస్తూ బ్రాహ్మణ వ్యతిరేక వాదాన్ని విశ్వామిత్రుడు, వశిష్టుడు లాంటి వారు తెచ్చారనే భావన ఈ నవలలో కన్పిస్తుంది. అలాగే జాబాలి నాస్తిక వాదానికి మార్గదర్శి అవుతాడు.

ఈనాడు సమాజంలో బ్రతుకు దెరువు కోసం మనుషులు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళుతుంటాడు. ఆనాటి సమాజంలో కూడా బ్రతుకు తెరువు కోసం ఇలాంటి వలసలు కొనసాగాయి. రావణుని మరణం శ్రీలంక పట్టణం ధ్వంసం అయిన తరువాత లంకా వాసులందరు సముద్రాన్ని దాటి భారతదేశంలోని సరస్వతీ నదీ తీర పరిసరాల్లోను, దండ కారణ్యం ప్రాంతంలోనూ, జీవించారని ఈ నవల చెబుతుంది. వీరు శంబూకుని పాలనలో జీవిస్తూ తిండి లేక అన్నమో రామచంద్ర అని అలమటిస్తుంటే రాముడు ఆ దారిలో వెళుతూ వీరందరికీ తాను స్వయంగా పాయసం వండి వడ్డించారని ప్రతీతి. ఇలాంటి వలసలు చరిత్రలో ప్రతి కాలంలో జరిగాయని చెప్పవచ్చు.

కావున ఈ సృష్టిలో కాలం మారింది. యుగాలు మారాయి. రాజ్యాలు రాజ్యపాలన మారింది. కానీ మానవ జీవనం ఒకటే కాలం మారుతున్న దశలో నాగరికత మూలంగా పాక్షికమైన మార్పులు మాత్రమే జరుగుతూ వచ్చాయి. ఎప్పుడూ పాలకవర్గాల మీద పాలిత వర్గాలు దండెత్తుతూనే వచ్చాయి. ఈ సామాజిక మార్పులను సాహిత్యం నాడు నేడు ప్రతిబింబిస్తూనే వస్తుంది. ముఖ్యంగా పౌరాణిక నవలా సాహిత్యంలో పాత కొత్తల మేలు కలయికగా సామాజిక జీవన చిత్రణ జరిగింది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిమ్నతీకరణంలో

– డా॥. పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

ఒక నిర్దిష్ట ప్రాదేశిక విభాగంలోని సమాజం ఆచార వ్యవహారాల్లో వేష భాషల్లో గుంపులుగా విడువడి మనుగడ సాగిస్తుంది. ఒక్క ప్రాదేశికత మాత్రమే దాన్ని ఒక మొత్తం కట్టిపడేయగలుగుతుందికానీ గుంపుల మధ్య అనైక్యత అనివార్యంగా కొనసాగుతుంది. అంటే అది ఊరికో పేరుకో మాత్రమే సమాజంకాని అది వైవిధ్యాల సమాహారం. సమాజంతాలూకు ఈ వైవిధ్యాలు చాలా వరకు పరస్పర వైరుధ్యాలుగా చలామణిలో ఉంటాయి. ప్రతి కదలికలోను కనపడని లక్ష్మణరేఖలు అడ్డుతగుతూ ఉంటాయి. ఏకత్వంవైపు నడచే ప్రతికదలిక అతిక్రమణగానో, ఆక్రమణగానో నిషిద్ధ ముద్రలు వేయించుకుంటుంది. వేగంగా మారే వస్తువాహన సంస్కృతి ప్రభావంతో దాని లక్ష్మణ రేఖలు చెరిగిపోతున్నట్టే అనిపించినా కనపడని అంతరాల్లో, అగాధాల్లో దాని ప్రగతి చక్రం కూరుకుపోతూ ఉండటం చాలా సహజంగా జరుగుతుంది.

ఈ ఏకత్వంలోని భిన్నత్వాన్ని అధ్యయనం చేసే క్రమంలో ఆ సమాజంలో ఉపశ్రేణిగా ముద్రవేయబడ్డ సమూహాల భాషా సాహిత్యాలు మరుగున పడిపోవటమో వెనకపడిపోవటమో చాలాసహజం. భాషాసాహిత్యం శోధకులకు వీటిపట్ల ఉదాసీనత, వివక్ష గొప్ప వనరుగా ఉపయోగపడతాయి. నిమ్నతీకరించబడుతూ, క్రమంగా అస్పృశ్యమవుతూ చివరికి అదృశ్యమయ్యే ఉపశ్రేణి వర్గాల భాషను దాని సభ్యతాసభ్యతలముద్రల్ని వివేచించడం ఆవశ్యం.

ఒక సమాజంలోని ప్రతివ్యక్తి, ప్రతి సమూహం ఇతర వ్యక్తులకంటే ఇతర సమూహాలకంటే భిన్నమైనవిగా, ప్రత్యేకమైనవిగా గుర్తించబడాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు అడుగేస్తాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేకమైనవిగా గుర్తించబడ్డ వ్యక్తులు, సమూహాలు ఇతరులకు, ఇతర సమూహాలకు ఆదర్శం అవుతాయి. ఈ ఆదర్శవంతమైన వ్యక్తులు, సమూహాలు మొత్తం సమాజాన్ని నడిపిస్తారన్న మాట. వాళ్ళు గోతిలోకి దిగమంటే మొత్తం సమాజం కళ్ళుమూసుకుని గుడ్డిగా దిగిపోతుంది. లేదా పైకి రమ్మంటే గొర్రెదాటుగా అనుసరిస్తాయి. గొర్రె స్వభావం సమాజ సహజ స్వభావం సమాజాన్ని ముంచాలన్నా పైకెత్తాలన్నా ఆధిపత్యం నాయకత్వం వహించే వ్యక్తుల, సమూహాల చేతుల్లోనే ఉందన్నమాట.

ఆధిపత్యం వహించే వ్యక్తులు, సమూహాలు సాంఘిక, ఆర్థిక రాజకీయాలపరంగానే కాకుండా మానసికంగా, మేధోపరంగా కూడా పైచేయిగా ఉంటారు. అంటే వీళ్ళు సమాజంలోని మిగతా సమూహాలను చేతగాని వాళ్ళుగా, చవటలుగా నమ్ముతూ నమ్మిస్తూ వాళ్ళ అనుచర గణంగా తయారుచేసుకుంటారు.

భారతీయుల ప్రాచ్య విజ్ఞానం మీద లార్డుమెకాలె వ్యూహరచన ఇలాంటిదే. ఇలాంటి వ్యూహరచన ఉపశ్రేణి వర్గాలమీద నిరంతరం ప్రయోగించబడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో భిన్న సంస్కృతుల సమాహార సమాజాన్ని ఒకానొక ప్రాదేశిక ఆధిపత్య సంస్కృతి మొత్తం సమాజానికి ప్రాతినిద్యం వహించగలుగుతుంది. ఈ క్రమంలో స్థానిక వేషభాషలు, ఆచారవ్యవహారాలు, విజ్ఞానం, కళలు, మొత్తం వాళ్ళ వారసత్వ సంపద పనికిమాలినవిగా తీర్మానించబడతాయి. జానపద విజ్ఞానం విషయంలో కూడా జరిగిందదే.

ఈ స్థానిక వేష, భాషల వెనకబాటు తనాన్ని సోదాహరణంగా పరిశోధకులు చర్చించడంవల్ల వీటిపట్ల నెలకొన్న ప్రెజుడైస్‌ను, వివేచనా రాహిత్యాన్ని తగ్గించే అవకాశం కలుగుతుంది. స్థానిక భాషాలోని పదాలు, పదబంధాల చుట్టూ అల్లుకున్న న్యూనతీకరణను అర్థం చేసుకునే వీలుకలుగుతుంది. ఇవి వర్గ మాండలికాలుగా

కూడా మినహాయించబడి ఉదాసీనతకు గురికావడం జరుగుతుంది.

'నాకు తెలియదు', 'నాకు తెలవదు' అన్న వాక్యాలలో మొదటిదే ప్రమాణభాషలోకి చేరుతుంది. విద్య, సాంస్కృతిక, రాజకీయ ఆర్థికాది రంగాల్లో పైచేయిగల వ్యవహర్తలను అనుసరించి ప్రామాణీకరణ నిర్ణయించబడుతుందన్న సంగతి తెలిసిందే.

'పనిమినిషి' అనే పదబంధం ఇంటిపనులకు నిర్దేశించబడ్డ వ్యక్తిగత ఉద్యోగిని సూచిస్తుంది. ఉద్యోగం అంటే రూఢిలో ఏదో ఒక పనికి నియుక్తం కావటమే. కాని ఇది సేవా, పారిశ్రామిక రంగాలకు పరిమితం అయ్యింది. ప్రాథమికరంగం, లేదా గృహ సంబంధ అంశాలలో ఉద్యోగం అన్న పదాన్ని వాడుకలో కనిపించదు. మన సమాజంలో పనిమనిషి కంటే 'ఉద్యోగి' కి ఎక్కువ సామాజిక హోదా ఆపాదించబడుతుంది.

పనిని సమాజం వైట్ కాలర్ అని వైట్ కాలరేతరంగా విడగొట్టి తద్వారా భౌతికశ్రమ, బౌద్ధిక శ్రమకంటే తక్కువ స్థాయి కలదిగా గణించబడి భౌతికశ్రమ తిరిగి నైపుణ్యంకలపని, నైపుణ్యం అవసరం లేని పనిగా విడగొట్టబడింది. మొత్తం చేతిపనులన్నీ ముఖ్యంగా ప్రాథమిక రంగానికి చెందిన పనితనం అంతా నైపుణ్యం లేనిపనిగా తీర్మానించబడింది. ఇది బుద్ధిజీవులు శ్రమజీవులపై పన్నిన కుట్రగా చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం, సేవారంగవికాసాలను మన సమాజంలో పాశ్చాత్య విజ్ఞానం ప్రభావితం చేసింది. ప్రాచ్య విజ్ఞానం పాశ్చాత్య విజ్ఞానం కంటే తక్కువస్థాయి కలదిగా ఎంచబడింది కాబట్టి. సామాజికంగా ఆర్థికంగా ప్రాథమికరంగం సహజంగా తక్కువస్థాయిలోనే ఉంటుంది. కాబట్టి ప్రాథమికరంగానికి చెందిన పదజాల మూతక్కువ స్థాయిలోనే ఉంటుంది. కుశమును నేర్పుగా కోయకపోతే వేళ్ళుతెగుతాయి. కుశమునుకోసేవాడు కుశలుడు అంటాం. కాని 'కుశలత' 'తెలివి', 'నైపుణ్యం'గా అందులోను ప్రాథమికరంగానికి సంబంధంలేనంతగా దూరంగా జరిగిపోయింది.

సంస్కృతీకరణ, అంగ్లీకరణ నేపథ్యంలో స్థానిక భాష నిమ్నతీకరించబడటంచూస్తాం. చేతివృత్తులేకాక వాటిపేర్లు కూడా నీచస్థితి లోకినెట్టబడ్డాయి. ఉదా॥కు చాకలి, మంగలి పేర్లు రజక, నాయీబ్రాహ్మణులుగా సంస్కృతీకరించబడ్డాయి. నిందవాచకాలు మిగిలాయి. తొక్క, తోలు, బొక్క, లాంటి పదాలు ఆగ్రహవ్యక్తీకరణలుగా, బూతులు జాబితాలోకి జారిపోయాయి. తెలుగులో లైంగికావయవ వాచకాలు ఇతర అవయవ వాచకాల్లా కాకుండా రాయశక్యంకాని స్థాయిలో బూతుల జాబితాలో చేరిపోయాయి. వీటి సంస్కృతీకరణలే సభ్యోక్తులుగా ప్రమాణభాషశబ్దాలుగా చలామణి అవుతున్నాయి.

లేబరు, విధువ (వెధవ) లాంటిపదాలు తిట్లుగా వాడబడుతున్నాయి. అంటే భౌతికశ్రమ, బౌద్ధికశ్రమ; స్త్రీత్వం, పురుషత్వం; తెలుగు, సంస్క ృతంలాంటి ద్వంద్వాలలో మొదటివి తక్కువ శ్రేణివిగా జమకట్టబడుతున్నాయి. లింగ, కుల, భాషలాంటి అంశాలలో తిష్టవేసిన వివక్ష తెలిసో తెలియకో మన వివేచనను అధిగమించి ఒక నిబంధన అభ్యసనంలా ఉనికిలో ఉంది.

ఈ వివక్షను ప్రశ్నించటం ప్రస్తుతం విడ్డూరంగా ధిక్కారంగా ముద్రించబడి సామాజిక తిరస్కారానికి గురవుతుంది. వృత్తులు, వర్గాలు నిమ్నోన్నతాలుగా గణించబడటం, ఉచ్చనీచాలుగా చలామణిలో ఉండటం సర్వసాధారణ అంశం అయ్యింది. ఆయా ద్వంద్వాలలో ఒక దానిపట్ల మోజు, మరోదానిమీద చిన్నచూపుకు ప్రధానభూమిక బలమైన ఆర్థిక ప్రాతిపదికలే అన్నది స్పష్టమైన విషయం. వివక్షను తప్పించుకోవటానికి ఉప శ్రేణి వర్గాలు గొంతెత్తడం, పిడికిళ్ళు బిగించడం, అహింస పోరాటాలు చెయ్యడం మేధోపరమైన వ్యాసంగాలతోపాటు ఉచ్చశ్రేణి వర్గాల భూమికల్ని గమనించి అదే భూమికల్ని నిర్మించుకోవటం ద్వారా పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చు.

ఆగ్రహవ్యక్తీకరణకు, ప్రతీకారవాంఛకు, ప్రతిచర్యకు వినియోగించబడే 'బూతులు' 'స్త్రీ' ని లక్ష్యం చేసుకున్నవే. ఇద్దరు పురుషులమధ్య లేదా ఇద్దరు స్త్రీల మధ్యకానీ

హింస, ప్రతిహింస, ప్రతీకారేచ్ఛల్ని సంతుష్టిపరచుకోవడానికి స్త్రీ యే బలవుతుంది. ఆమ్మో, ఆలో ఘర్షణలో ఎలాంటి సంబంధ లేకపోయినా ప్రతీకారేచ్ఛ సంతుష్టికి ప్రధాన వనరు అవుతుంది. దీనికి కారణం ఆడదాన్ని ఆస్తిగా పరిగణించడమే. ఆస్తుల్ని దోపిడీ చేయడం, దోపిడీ చేయబడడం ధీర, భీర చర్యలుగా జమకట్టబడు తున్నాయి. పిరికిపందలు చేతకాని వాళ్ళుగాను, ధీరులు, వీరులు గాను ఆస్తుల్ని కొల్లగొట్టడం ప్రాతిపదికగా సమాజం విభజిస్తుంది. గెలుపోటముల్ని 'కొల్లగొట్టడం, కొల్లగొట్టబడటం భూమికగానే నిర్ణయించడానికి నిలువెత్తు సాక్షీభూతంగా చరిత్ర నిలుస్తుంది.

పితృహంతకుల పట్ల ఉదాసీనతను కాలం కలగ జేస్తుందికాని తన ఆస్తులు ఆడవాళ్ళను అపహరించే వారిపట్ల పగచల్లారే అవకాశం ఉండకపోవటానికి కారణం పితృస్వామ్యవ్యవస్థలో స్త్రీని భోగవస్తువుగా, ఆస్తిగా చూడటమే ఆస్తుల దురాక్రమణ అవమానంగా, ఆత్మ గౌరవ హానిగా, ఆత్మ గౌరవ భావన ప్రాణంకంటే గొప్పదని సమాజం నమ్మడం లాంటి భావజాలంవల్ల సమాజంలోని హింసకు ప్రధానకారణం.

ఈ ద్వంద్వాల మధ్య సమతుల్యత వైపుగా హింసాత్మ కంగానో, అహింసాత్మకంగానో ఘర్షణలు అనివార్యం అవుతాయి. అయితే ఈ ఘర్షణలు, పోరాటాలు అహిం సాత్మకంగా కొనసాగటమే వాంఛనీయం. సంబంధిత సమాజ పరిణామ పరిణితి చిహ్నం. ఉపశ్రేణి వర్గాలపట్ల వివక్ష అసమానతలు నశించడం ఆరోగ్యదాయకం. సృజనలో వీటిని స్పృశించడం సమాజప్రగతికి ఆవశ్యం.

**ఆధార గ్రంథాలు :**

1) తెలుగుభాషాచరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
2) పోష్టుమోడర్నిజం - బి. తిరుపతిరావు

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు గిరిజన నవలలు - హక్కుల నిరాకరణ

- డా॥. వై. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

గిరిజన జీవితంమీద సాహిత్యం ఇటీవలి కాలంలో ఎక్కువగానే వెలువడింది. కథల రూపంలోనూ, నవలల రూపంలోనూ గిరిజన జీవితాలు, వారి సమస్యలు, సమస్యలతో ముడిపడినవారి మనుగడ కొంత తెలుస్తోంది. తెలుగులో గిరిజన జీవితంపై నవల 1985 తర్వాతనే వెలువడినా, గిరిజన జీవితమే ప్రధానంగా సాగిన రచనలు చాలానే వచ్చాయి. అందులో సాహు, ఊరు, అడవి, ఎల్లి, నీలి, ఎన్నెలనవ్వు, అతడు అడవిని జయించాడు, చివరి గుడిసె, వసంతగీతం, అడవితల్లి, చీకటిముడులు, పునరావాసం వంటివి ప్రధానంగా కనిపిస్తున్నాయి.

గిరిజన సాహిత్యం కూడా ఇతర సాహిత్యం లాంటిదే. కాని సంస్కృతి వైవిధ్యం ఉంది. గిరిజనులు తమదైన పద్ధతులలో, ప్రాంతాలలో, స్వచ్ఛతతో జీవించడం వీరికున్న ప్రత్యేకత. అమాయకత్వం, నిష్కల్మషత్వం, నిష్కాపట్యంతో ఉన్న వీరు ఎక్కువగా రకరకాల దోపిడీలకు గురవుతున్నారు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజన స్త్రీలవిషయంలో ఇది రెట్టింపుగా ఉంది. ఇటు ఇంట్లో, అటు సమాజంలోనూ రెండువైపులా వారు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం. అవి వారిని అతలాకుతలం చేస్తున్నాయి. ఏమి జరుగుతోందో తెలియని నిస్సహాయ స్థితిలో వీరు ఉండటం ఆలోచించదగ్గ విషయం. అందుకు ఈ పత్రానికి నేను స్వీకరించిన నవలలు- ఎల్లి, నీలి, అడవి, ఎన్నెల నవ్వు. హక్కులు మనిషికి భద్రతను ఇస్తాయి. ఈ నేపథ్యంలో హక్కులు ఎంతవరకు అనుభవయోగ్యంగా ఉన్నాయో స్త్రీలు ఎలా అనుభవిస్తున్నారో చూడటం ఈ పత్ర లక్ష్యం.

ఆధిపత్యకులాలకు చెందిన స్త్రీలకంటే భిన్నంగా ఉంటారు గిరిజన స్త్రీలు. స్త్రీలపై అణచివేత అనేది సంస్కృతీ సంప్రదాయాలలో ఎంతోకాలంగా అలవాటుగా ఆచారంగా వేళ్ళూనుకొని ఉంది. పురుషుడే కుటుంబానికి యజమానిగా ఉంటూ అన్నిటినీ నియంత్రిస్తూ ఉండటం పితృస్వామ్యలక్షణంగా ఉంది. ఈ దశలో పురుషుడికి స్త్రీల శ్రమను, లైంగికత్వాన్ని, సంతానోత్పత్తి శక్తినీ నియంత్రించడానికి అవకాశం ఏర్పడింది. దీనితో స్త్రీమీద ఆధిక్యత, అధికారం ఏర్పడ్డాయి. ఈ స్థితి కేవలం ఆధిపత్య కులాలకు చెందిన స్త్రీలకే కాదు గిరిజన స్త్రీలలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంది.

1. 'ఎల్లి' నవలలో ఇంట్లో తండ్రి ఇష్టానుసారం వివాహం చేసుకొని, అత్తగారింట్లో మొగుడు, అత్త మామలు పెట్టే ఇబ్బందులను, దెబ్బలను తట్టుకోలేక పుట్టింటికి తిరిగి వస్తుంది ఎల్లి. తీసుకొన్న ఓలి ఇచ్చుకోలేని తండ్రి అత్తగారింటికి పంపించాలను కొంటాడు. 2. ఇదే నవలలో మరో స్త్రీ మాలచ్చిమి. ఇద్దరు బిడ్డల తల్లి అయినప్పటికీ కట్టుకున్న భర్తే మరో వ్యక్తికి డబ్బుకోసం అమ్మేస్తాడు. ఆమె నేనెళ్ళనని తిరగబడితే, కళ్ళు పొడిచి, మరీ పంపేస్తాడు. 3. ఇదే నవలలో ఇంకొక స్త్రీ పార్వతి. ఈమెను తాగిన మైకంలో తనభర్త బిచ్చాలు అమ్మేస్తాడు. ఆమె ప్రమేయం ఏ మాత్రం ఉండదు. కేవలం డబ్బుకోసం తను ఆ పని చేస్తాడు. "నా పిల్లల గతి ఏం కావాలి? నన్ను అమ్మడానికి నీకెలా మనసొప్పింది?" అని పార్వతి అడిగితే, నోర్మూయ్ అంటూ భార్యను గద్దించి, పురుషాహంకారం చాటుకొంటాడు. ఎల్లి నవలలో ఏ స్త్రీకి స్వేచ్ఛ లేదు. పురుషుల కనుసన్నలలోనే మెలగాల్సిన పరిస్థితి. 'ఇంటి గుట్టు రట్టు' అని సామెత. ఇంటి విషయాలను బయటికి చెబితే పరువుపోతుందని చాలామంది భావిస్తారు. అందువల్ల అత్తింటి వేధింపులు, భర్త పెట్టే శారీరక, మానసిక హింసలు వెలుగులోకి రావు. దీన్ని దృష్టిలో ఉంచుకొని "గృహహింస నిరోధక చట్టం 2005" ను అమలులోకి తెచ్చారు. ఈ చట్టం ఆధారంగా మహిళలు కుటుంబ సభ్యులపై కేసుపెట్టే అవకాశం

ఉంది. కాని అమాయకత్వం, ఓలి తిరిగి ఇవ్వాల్సి వస్తుందేమోననే భయంతో బయటకు రానివ్వకపోవటం వల్ల ఈ హక్కు ఈ నవలలో కాలరాయబడిందే తప్ప అమలుకాలేదు.

ఆర్టికల్ 39(ఇ) ప్రకారం స్త్రీ కార్మికులు, వారి ఆరోగ్యం, శ్రమదోపిడీ కాకుండా నివారించే బాధ్యత రాజ్యానిదే! ఈ చట్టం తెలియని, తెలుసుకోలేని గిరిజన మహిళలు ఇంకా ఎందరో ఉన్నారనడానికి నిదర్శనమే 'ఎల్లి'లోని ఎల్లి, 'నీలి'లోని నీలి పాత్రలు. భర్తలు తాగి తందనాలాడుతూ, స్త్రీలే అన్ని పనులు చేయాలని నిర్బందించడం ఒకరకమైన హింసకాగా ఎంతపని చేసినా ఒక బుట్ట అల్లడం కూడా సరిగా రాదని సతాయించడం మరోరకమైన హింస. దీన్ని మొక్కలోనే తుంచకపోతే మానైనాక వంగుతుందా? అంటూ ఎల్లిని చావచితక గొట్టడం, అత్తమామలు చచ్చేటట్లు ఎల్లితో పని చేయించడం, నోరు తెరిచి మాట్లాడకూడదంటూ హింసించడం వంటివన్నీ 'ఎల్లి' నవలలో స్త్రీలు ఎదుర్కోవడం జరుగుతోంది. ఇదే గొడ్డుచాకిరి నీలిలోనూ ఉంది. ఆమెను ఒక గొడ్డుగా భావించడం, నీలి భర్త పోయాక, నీలి పుట్టింటికి వెళ్తానంటే నా యింటి గొడ్డు ఎక్కడికీ వెళ్ళడానికి వీలు లేదంటూ ఆమెను నిర్బంధిస్తారు. మరోవైపు దువ్వతో అక్రమసంబంధం అంటగట్టి హింసించడం. ఇవన్నీ చూసి సహించలేక నీలి ఎదురు తిరుగుతుంది. దానితో నీలిని వెలివేస్తారు. ఒక స్త్రీ తనకు నచ్చేలా బతకగలిగే స్వేచ్ఛను ఇవ్వని స్థితి ఇందులో వ్యక్తమవుతోంది. శ్రమదోపిడీ నాగరిక స్త్రీలలోనే కాదు గిరిజన స్త్రీలలోనూ ఎక్కువగా ఉండటం స్త్రీల స్థితిని తెలుపుతూ ఉంది. గుండె ధైర్యంతో అందరినీ ఎదిరించగలిగిందే తప్ప పూర్తిగా విజయవంతంకాలేని స్థితి నీలిది కాగా, పరిస్థితులకు రాజీపడి జీవించాల్సిన పరిస్థితి ఎల్లి వంతైంది.

వరకట్న నిషేధ చట్టం(1961) అమలులోకి వచ్చింది. దీని ప్రకారం వివాహానికి ముందుకాని, వివాహం తరువాత కాని, మరెప్పుడైనా కాని వరకట్నం ఇవ్వడాన్ని లేదా తీసుకోవడాన్ని నిషేధిస్తుంది. వరకట్నం అనేది స్త్రీనుంచి పురుషుడు తీసుకొనే కానుకలు కాగా ఓలి అంటే పురుషుని నుంచి స్త్రీ తండ్రి తీసుకొనేది. ఎవరు ఎవరికిచ్చినా ఇటు వరకట్నం, అటు ఓలి రెండూ స్త్రీలను బాధించేవే. 'ఓలి' రూపంలో తీసుకొనే ఆచారం ఇప్పటికీ గిరిజనులలో ఉంది. ఈ దురాచారం గిరిజన స్త్రీలను ఎంత మానసిక క్షోభకు గురిచేస్తుందో వ్యక్తం చేస్తూ ఉన్నాయి 'ఎల్లి', 'నీలి' నవలలు. వరకట్నం, ఓలి రెండూ గిరిజన సమాజంలోని దురాచారాలను ఖండించేవే. వారిలో ఉన్న 'ఓలి' అనే దురాచారం స్త్రీలను ఎలా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కుంగదీస్తుందో చెప్పే రచనలే! ఓలికోసం కన్నతండ్రియైన ఎంకన్న పెళ్ళి వయసు కూడా రాని ఎల్లిని వయసు ఎక్కువైన వాడికిచ్చి పెళ్ళి చేయడం. అందరూ ఎల్లికి వెంకన్న సరిజోడు కాదంటున్నారని తన భర్తతో చెప్పినప్పటికీ, దురగను స్త్రీలకు ఒక అభిప్రాయం ఉండటమే నేరమంటూ "నీ యిష్టం ఎవుడడిగాడే ఒళ్ళేం పులపులమంటుందా?" అంటూ ఆమె నోరు మూయిస్తాడు. స్త్రీల ఇష్టాయిష్టాలతో పనిలేకుండా పురుషులే నిర్ణయాలు తీసుకోవడం, స్త్రీకి స్వేచ్ఛను హరింపజేయడం కన్పిస్తోంది.

ఇంట్లో తండ్రి ఇష్టానుసారం వివాహం చేసుకొని అత్తగారింట్లో మొగుడు, అత్తమామలు పెట్టే ఇబ్బందులను, దెబ్బలను తట్టుకోలేక పుట్టింటికి తిరిగి వచ్చేస్తుంది ఎల్లి. తీసుకొన్న ఓలి ఇచ్చుకోలేక కూతురిని తిరిగి అత్తగారింటికే పంపించేయాలనుకొంటాడు తండ్రి. అత్తగారింట్లో కూతురు పడే బాధలను కూడా పట్టించుకోకుండా తిరిగి తనని పంపించేంత కర్కశత్వానికి ఈ ఓలి అనే దురాచారం ఉసిగొల్పుతూ ఉంది.

ఓలి తీసుకొని పుట్టింటివాళ్ళు మాలచ్చిమిని ఒకడికి అమ్మితే కట్టుకొన్నవాడు అదే డబ్బుకోసం మరొకరికి ఆమెను అమ్మటం ఎంతో దారుణమైన పరిస్థితి. ఇదంతా ఆచారం అనే కుట్రలో జరుగుతున్న దోపిడీగా తెలుస్తోంది. మారుమనువు ఆ స్త్రీకి ఎంత క్షోభను కల్గిస్తుందో అర్థం చేసుకోలేని స్థితిని తెలుపుతూ ఉంది. స్త్రీలు ఇంకా బానిసత్వంలో మగ్గిపోతున్నారనడానికి ఎల్లి, మాలచ్చిమిలే

నిదర్శనంగా నిలుస్తారు. ఆమెకు కూడా ప్రేమ, ఆలోచనలు ఉంటాయి. తనని ఎవరికీ అమ్మకూడదన్న కనీసపు ఆలోచన కూడా చేయని మూర్ఖత్వం పురుషులలో ఉంది. అందుకే కొడవటిగంటి కుటుంబరావు "మన సమాజంలో కొందరు తక్కువ కులాల్లో పుడతారు. అనేక మంది బీదల కడుపున పుడతారు. మరికొందరు ఆడ వాళ్ళుగా పుడతారు."అంటారు. వీరి మాటల్లో తక్కువ కులాల్లో పుట్టినవాళ్ళూ, బీదల కడుపున పుట్టిన వాళ్ళూ, ఆడవాళ్ళూ అంతిమంగా అణచివేయబడతారనే విషయాన్ని స్పష్టం చేశారు. ఈ నవలలు అదే విషయాన్ని చెప్తూ ఉన్నాయి. ఒకరినుంచి మరొకరికి ఓలికోసం అమ్ముకొంటూ ఉంటే, బిడ్డల్ని వదిలి ఆ స్త్రీలు పడుతున్న బాధ వర్ణనాతీతం. తల్లిని వదలలేక పిల్లలు, పిల్లలను వదిలి ఉండలేక తల్లి పడుతున్న బాధలు బానిస జీవితాల్ని తలపిస్తూ ఉన్నాయి. చట్టాలెన్ని ఉన్నా సమాజంలో మార్పురానితనానికి సాక్ష్యంగా ఈ నవల నిలుస్తుంది.

నేటికీ స్త్రీకి రక్షణలేదు. పసిపిల్లల నుంచి మహిళల దాకా వారిపై ఎన్నో అఘాయిత్యాలు రోజురోజుకీ పెరిగిపోతూనే ఉన్నాయి. హింసాసంస్కృతి పెచ్చుపెరిగిన సమాజంలో గిరిజనులు కూడా బాధింపబడుతున్నారు. ఎల్లి నవలలో లైంగిక దోపిడీ స్వకులస్థులది కాగా, 'ఎన్నెల నవ్వు'లో అగ్రకులస్థులది. గ్రామంలోని అగ్రకులాల వాళ్ళు యానాదులపై శారీరక లైంగిక దోపిడీ చేస్తూ, వారి జీవితాలను బలి తీసుకొంటున్న వైనం రచయితలు చిత్రీకరించారు. అగ్రవర్ణాల భూస్వాములు పేదలపై జరిపే ఈ లైంగిక దోపిడీవల్ల వారెంత బాధ పడుతున్నారో కూడా పట్టించుకోని పైశాచికత్వం కన్పిస్తుంది. 'ఎన్నెల నవ్వు'లో మంగమ్మ, అలివేలు ఇద్దరూ భూస్వాముల లైంగిక దోపిడీకి గురవుతారు. ఇద్దరూ వారి దౌర్జన్యాలకు మోసపోతారు. పొగాకు కంపెనీ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, టూరింగ్ టాకీస్ మేనేజర్ కృష్ణమూర్తి వంటి వాళ్ళంతా సామాజికంగా కింది కులస్థులుగా భావించే స్త్రీలను లైంగికంగా నయానో భయానో దోపిడీ చేస్తూనేఉన్నారు. ఆ దోపిడీకి వారి జీవితాలను వారు కోల్పోతూనే ఉన్న వైనం అలివేలు పాత్రద్వారా స్పష్టపరిచారు రచయిత. "ధనికుల నగ్న సత్యానికి సాక్షులు పీడిత ప్రజలు కాగా మగవాళ్ళ నగ్న సత్యానికి సాక్షులు ఆడవాళ్ళు" (కొడవటిగంటి కుటుంబరావు) అన్నది స్పష్టమవుతూ ఉంది.

'ఎల్లి' నవలలో బాజి అనే గిరిజన స్త్రీ అగ్రవర్ణాల వాళ్ళ లైంగికదోపిడీకి గురై, తన సంసారంలో ఇమడలేక మగడంటేనే భయపడి, పిచ్చిదై, చనిపోతుంది. ఈ సంఘటన మగవాళ్ళ దౌష్ట్యాన్ని చాటుతోంది. ఇంకా పెద్ద మనిషైనా కాని మోతిని ప్రభుత్వాధికారులు సేర్‌దార్, చౌకీదార్ జవాను, ఇంకో జవాను ఇలా ఒకరి తర్వాత ఒకరు చేసిన లైంగిక దోపిడీకి గురై, మరణించిన స్త్రీ 'అడవి' నవలలో కన్పిస్తుంది. ఊళ్ళోవాళ్ళ లైంగిక దోపిడికి బాజి, అగ్రవర్ణాలవాళ్ళ దౌష్ట్యానికి మంగమ్మ, అలివేలుబీ ప్రభుత్వాధికారుల వలన మోతి ఇలా ప్రతి స్త్రీ ఎవరో ఒకరి ద్వారా దోపిడికి గురవుతున్న వైనం చిత్రీకరించారు. స్త్రీలను రకరకాల దుర్భర పరిస్థితుల్లోకి నెట్టి, వారు పడే కష్టాలను, బాధలను చూసి ఆనందిస్తుంది సమాజం. కుటుంబంనుంచి మొదలైన ఈ స్థితి సమాజంలో అనేక రూపాల్లో కన్పిస్తూ ఉంది. అందుకే స్త్రీలకు హక్కులు ఎంతో ప్రాధాన్యం అన్నది స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల్ని బట్టి తెలుస్తుంది. స్త్రీలకి రక్షణ లేకపోవడం తద్వారా స్త్రీ జీవితం మీద పడే ప్రభావం ఇవన్నీ స్రీకి భద్రతా హక్కు ప్రాధాన్యాన్ని చాటేవే!

ఆధిపత్య ధోరణి 'ఎల్లి' నవలలో అడుక్కొని తిని బతికే భార్యాభర్తలలో కనిపిస్తుంది. కాళ్ళులేని భర్తకు అడుక్కొచ్చి అన్నం పెడుతుంది భార్య. అయినా ఆ భర్త ఒకటి బదులు ఇంకోకూర కలిపి పెట్టిందనే ఆలోచనతో ఆమెను కిందికి వంగు అని చెప్పి మరీ కొడతాడు. "వాళ్ళ స్త్రీలు వాళ్ళ చేతిలో బాధితులు." అంటాడు శ్రీశ్రీ. అది అక్షరాలా నిజమన్నది స్పష్టమవుతూ ఉంది. తాను లేవలేని స్థితిలోనూ భార్యను కొట్టే అధికారం భర్త తీసుకొంటున్నాడు. దీనిని బట్టి చూస్తే పీడనకు గురయ్యేది ఎక్కువగా

పేద స్త్రీలేనన్నది స్పష్టంగా వ్యక్తమవుతూ ఉంది. ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరిలో భార్యమాత్రమే పని చేయడం భర్త చేయకుండా చేసిన పనికి వంకలు చెప్పడం పీడన, దోపిడీల కిందే లెక్క. స్త్రీల హక్కులను హరించేది ఎవరో కాదు స్త్రీలు పాలిచ్చి పెంచిన జనంలో వారేనంటూ జయ ప్రభ 'బందిపోట్లు' అనే కవితలో పేర్కొంది. హక్కులు ఎవరికి కావాలో వారు డిమాండ్ చేస్తే వస్తాయి. తలవంచు కొంటే వేల సంవత్సరాలైనా ఆ హక్కులు రావని ఈ సంఘటనలు రుజువు చేస్తూ ఉన్నాయి. ఆర్థికబలం ఉంటే స్త్రీకి కష్టాలు ఉండవన్నది కూడా నిజంకాదు. ఎందుకంటే ఆర్థికంగా బలంగా ఉన్న స్త్రీ కూడా భర్తకు అణిగిమణిగి ఉండే సందర్భాలు చాలా కనిపిస్తున్నాయి సమాజంలో! కనుక మొహమాటాలను బద్ధలు కొట్టినప్పుడే హక్కులు సాధించుకోగలరనే విషయం స్పష్టమవుతోంది.

స్త్రీల హక్కుల అవిచ్ఛిన్నతను, విశ్వజనీనతను మనం అర్థం చేసుకొని, ఇంకించుకోలేకపోతే వాటిని కుటుంబం, సమాజం, దేశం వీటికంటే ముఖ్యమైనవిగా గుర్తించకపోతే స్త్రీలపై అణచివేత ఆగదు. లైంగిక దోపిడీలు ఆగవు. ప్రపంచ స్థాయిలో జరిగే ప్రతి మార్పూ దాని ప్రభావాన్ని ప్రతి చిన్నకుటుంబం మీద కూడా చూపుతుందనే విష యాన్ని గమనించకపోతే అది ఆ కుటుంబం మను గడనూ, స్త్రీలనూ, బాలికలనూ నిర్లక్ష్యం చేసే విధానాన్నీ ప్రభావితం చేస్తుందని తెలుసుకోకపోతే మనం స్త్రీల హక్కుల సారాంశాన్ని అర్థం చేసుకోలేదని అర్థం. కనుక స్త్రీలకు ముఖ్యంగా గిరిజన స్త్రీలకు ఈ హక్కులు అర్థమయ్యేలా వారిని చైతన్య పరచాల్సిన అవసరాన్ని చాటుతూ ఉంది. ''ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది.''అని గురజాడ. స్త్రీలు రాజకీయాల్లోకి వస్తే సమాజాన్ని మార్చవచ్చన్న ఓల్గాగారు(కీలకోపన్యాసం - ఆధునిక తెలుగు సాహిత్యం - స్త్రీల హక్కులు 19.12.2019) ఆశించిన ఆలోచనల ప్రకారం స్త్రీలందరూ తమ హక్కులతో ఆనందంగా జీవించాలని ఆశిద్దాం.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# జగిత్యాల జిల్లా జాతరలు

- జె. లక్ష్మీనర్సయ్య, తెలుగుశాఖ- ఓరియంటల్ విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఒకసారి శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శివుడు, శ్రీగణేశుడు, లక్ష్మీదేవి.. ఇలా ఈ దేశంలో హిందువులు కొలిచే దేవతలు చాలా మందే ఉన్నారు. భారత దేశంలో (28) ఇరవై ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలో దేవాలయాలు ఉన్నాయి. ప్రతి దేవాలయానికి సంవత్సరానికి ఒకసారి ఉత్సవాలు జరగుతాయి. అదే విధంగా తెలంగానలో కూడా రకరకాల దేవాలయాలు ఉన్నాయి. వాటిలో ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలనే తెలంగాణా ప్రాంతంలో 'జాతరలు' అని అంటారు. జాతరలలో శైవ, వైష్ణవ పద్ధతులతో ఆయా శైవ, వైష్ణవ దేవాలయాల్లో పూజలు జరుగుతాయి.

ఇవే కాకుండా జానపదుల దేవాలయాలలో వారి వారి పద్ధతులలో పూజలు జరుగును. ఇలా ప్రతి దేవాలయంలోను ప్రతి సంవత్సరం జాతరలు చేస్తారు. కొత్తగా ఏర్పడిన తెలంగానా రాష్ట్రం ఏర్పడి అభివృద్ధి పథంలో సాగుతూ ఉన్న ఈ రాష్ట్రం మొదట 10 జిల్లాలలో ఏర్పడినా కే.సి.ఆర్ గారి ప్రభుత్వం ముప్పది మూడు జిల్లాలుగా ఏర్పాటు చేసింది. అందులో ఒకటిగా ఏర్పడిన జిల్లా, జగ్గదేవుని పేరుపై ఏర్పడ్డ ఒకప్పటి గ్రామమే జగిత్యాల. జగిత్యాల జిల్లాగా ఏర్పడి అన్ని రంగాలలో ముందుకు వెళ్తున్న ఈ జిల్లాలో పద్దెనిమిది మండలాలు ఉన్నాయి. ఈ పద్దెనిమిది మండలాలలో 350కి పైగా గ్రామ పంచాయితీలున్నాయి. ప్రతి గ్రామంలో పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ మొదలైన దేవాలయాలున్నాయి. వీటిలో కూడా సంవత్సరానికి ఒకసారి బోనాల జాతరలను నిర్వహిస్తారు. ఇవే కాకుండా ధర్మపురి లక్ష్మి నరసింహ స్వామి కొండగట్టు, ఈ దక్షిణ భారతదేశాన్ని సుమారు 500 ఏళ్ళు పాలించిన శాతవాహనుల రాజధాని కోటి లింగాల, బీర్‌పూర్ లక్ష్మీ నర్సింహస్వామి, దుబ్బ రాజన్న మొదలైన ఆలయాలలో ప్రతి సంవత్సరం జాతరలు నిర్వహిస్తారు. ఈ జాతరల గొప్పదనం ఎంతోవున్న పూర్వం నుండి జాతరలు జరిగే ప్రాంతాలు ఉన్నా, కొత్తగా నిర్మించిన దేవాలయాలలో కూడా జాతరలు పెద్దయెత్తున జరుగుతున్నాయి.

భక్తికి తారాస్థాయిగా జరిగే ఉత్సవమే జాతర. మన పూర్వీకుల నుండి సాంప్రదాయంగా వచ్చిన ఉత్సవమే ఈ జాతరలు.

జగిత్యాల జిల్లా ప్రాంతాన్ని శాతవాహనులు, కాకతీయులు, ఆసఫ్ జాయిలు పాలించినారు. శాతవాహనుల రాజధానియై కోటి లింగాలను మట్టికింద మహా నగరంగా చరిత్రకారులు పేర్కొన్నారు. కాకతీయులకు సమకాలీనులైన పొలాసరాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. కొండలరాయుడు నడయాడిన నేల అనికూడా ఈ ప్రాంతాన్ని అంటారు. ఈ జిల్లాకు ఉత్తర ప్రాంతంగా గోదావరి పారుతూ ఉంటుంది. ఇట్టి ప్రాంతంలో శైవ, వైష్ణవ ఆలయాలు చాలానే ఉన్నాయి. ఈ ఆలయాలను పూర్వమే రాజులు నిర్మించి ఈ ఆలయాలకు (ఉత్సవాలను) జాతరలను ఘనంగా నిర్వహించారు. అట్టి జాతరలపై శతకాలు, కథలు, మౌఖిక కథలు, పాటలు అనేకం ఉన్నాయి. అటువంటి జాతరలపై, సాహిత్యంపై సమగ్ర అధ్యయనం జరగాల్సివుంది, ప్రతి గ్రామంలో ఏదో ఒక దేవాలయం. వాటిల్లో శిష్టులు, జానపదులు వారి వారి దేవాలయల్లో పూజాది కార్యక్రమాలు చేస్తారు. ఒక్క దేవాలయంలో ఒక్క విధమైన పద్ధతిలో ప్రత్యేకమైన జాతర విధానం కనిపిస్తుంది.

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో జాతరలు ఉన్నా, పురాతన దేవాలయాల జాతరలు ప్రత్యేకమైనవి. జగిత్యాల జిల్లాలో పద్దెనిమిది మండలాలు ఉండగా ప్రతి మండలంలో శైవ, వైష్ణవ, దేవి సంబంధ ఆలయాల్లో జాతరలు ప్రతి సంవత్సరం, ప్రతి దేవాలయంలో నిర్ణీత మాస తిథులలో

జాతరలు జరిపిస్తారు. అట్టి జాతరలలోని ప్రత్యేకతలు విశిష్టమైన. ఆ జాతర ద్వార ఆ ప్రాంత సంస్కృతీ సాంప్రదాయాలు తెలుస్తాయి . గ్రామాల్లోని గ్రామ దేవతలకు జానపదులు కూడా వారి వారి పద్ధతులలో జాతరలు చేస్తారు. ఇవే కాకుండా కొన్ని దేవాలయాలకు కులపెద్దలే పూజారులుగా ఉంటారు. అనాది నుండి ఈ జాతరలు ఎలా జరిపేవారో నేటికి అదే పద్ధతిని అనుసరిస్తు జాతరలు చేయడం కనిపిస్తుంది. గ్రామ దేవతల జాతరలలో జానపదులదే కీలక పాత్ర. ఈ జాతరలలో చుట్టాలు, బంధువులతో కలిసి మాంసం, మత్తు సేవించి ఆనందంగా ఆ సమయాన్ని గడుపుతారు. శిష్టుల, జానపదుల జాతరలలో శిష్టులపై జానపదుల, జానపదులపై శిష్టుల ప్రభావాన్ని కూడా గమణించవచ్చు. ఈ జాతరల ద్వారా ఎంతో వచ్చింది.

**జాతర :**

జాతర అనే శబ్ధం ప్రకృతి నామమే యాత్ర. ఈ పదాన్ని ఆంధ్రాలో బ్రహ్మోత్సవాలని, తెలంగాణాలో జాతరలు. విరివిగా వాడుకలో ఉన్నాయి. ఈ శబ్ధం ఈవిధంగా వ్యాప్తిలోకి వచ్చింది. ఈ ప్రాంతంలో 'జాతర' అనే పద ప్రత్యేకమైనది.

**జగిత్యాల జిల్లాలో జాతరలు జరిగే ప్రదేశాలు :**

జగిత్యాల జిల్లాలో 18 మండలాలున్నాయి. 350కి పైగా గ్రామాలున్నాయి. వాటిలో శైవ సంబంధమైనవి. వైష్ణవ సంబంధమైనవి మరియు గ్రామదేవతా సంబంధమైన దేవాలయాలు, వాటిలో జరిగే జాతరలు ఉన్నాయి. శైవ సంబంధమైన జాతరలు ధర్మపురి శివాలయం, కోటిలింగాల, బిల్వాకోడూరు, దొంగమల్లన్న, గుట్ట రాజేశ్వరాలయం, పాలస్తేశ్వరాలయం, మల్లాపూర్ శివాలయం మొదలైనవి.. వైష్ణవ సంబంధమైనవి ధర్మపురి లక్ష్మి నరసింహస్వామి ఆలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి, దొంతాపూర్ రామాలయం, జగిత్యాల నందు రామాలయం, ధర్మపురి వేంకటేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాలు మొదలగు ఆలయ జాతరలు, గ్రామ దేవతలైన పోచమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ మొదలైన ఆలయాలలో ప్రతి సంవత్సరం జాతరలు వైభవోపేతంగా జరుగుతాయి.

**శైవ సంబంధ క్షేత్రాల జాతరలు :**

జగిత్యాల జిల్లా ప్రాంతంలో ప్రతి మండలంలో ఒక శైవాలయం ఉంది. అనగా ఈ జిల్లాలో శైవ ఆలయాలే ఉన్నాయి. ఈ దేవాలయాల్లో శైవులు మాత్రమే పూజలు చేస్తారు. ఈ దేవాలయాలలో కళ్యాణం, డోలోత్సవం, రథోత్సవం, ఏకాంత సేవ మొదలైనవి జాతర సమయాల్లో చేస్తారు. శివునికి ప్రత్యేకమైన పూజ అభిషేకం. ఇవి కోటిలింగాల, ధర్మపురి, భీర్‌పూర్, పొలాస, జగిత్యాల దుబ్బ రాజన్న బిల్వాకోడూరు, పెగడపెల్లి మొదలైన దేవాలయాల్లో జరిగే జాతరలో కనిపిస్తాయి.

**వైష్ణవ సంబంధ క్షేత్రాల జాతరలు :**

వైష్ణవులు వైష్ణవ సంబంధ దేవాలయాల్లో వైష్ణవులు మాత్రమే పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. వైష్ణవ సాంప్రదాయంలో ఈ జాతరలు జరుగుతాయి. ఈ దేవాలయాలు జగిత్యాల జిల్లాలో ధర్మపురిలో లక్ష్మీ నరసింహ స్వామి, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, శ్రీరామలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి, బీర్‌పూర్ లక్ష్మీ నర్సింహస్వామి, పేంపేట వేంకటేశ్వరస్వామి, కొండాపూర్ వేంకట వేంకటేశ్వరస్వామి, దొంతాపూర్ రామాలయం, తిమ్మాపూర్ మరియు తాట్లవాయి రామాలయం మొదలగు ఆలయాలలో వైష్ణవ సంబంధ పూజా పద్ధతుల ద్వారా పెద్ద ఎత్తున జాతరలు జరుగును.

**గ్రామ దేవతా సంబంధ క్షేత్రాల జాతరలు :**

జగిత్యాల జిల్లా ప్రాంతంలో విరివిగా గ్రామ దేవతలు కొలువై ఉన్నారు. ఈ జాతరలలో జానపదులు మాత్రమే అధికంగా పాల్గొని విజయవంతం చేస్తారు. ఇందులో 'బోనం' 'బలి' తాటికల్లు సమర్పణ ప్రధానం. ఈ దేవాలయాలు పెద్ద పెద్ద గ్రామాల్లో ఉన్నాయి. పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, మారెమ్మ మొదలైనవి. ధర్మపురి ప్రాంతంలో గిరిజనులు సమ్మక్క, సారక్క గద్దెలు నిర్మించి

వాటిల్లో జాతరలు నిర్వహిస్తున్నారు. 7. జగిత్యాల జిల్లా సహిత సంబంధము: జగిత్యాల జిల్లాలో సాహిత్యం లిఖిత రూపంలోనూ, మౌఖిక రూపంలోనూ ఉన్నాయి. కథలు, క్షేత్ర మహాత్మాలు, శతకాలు, పాటలను మొదలైనవి విరివిగా లభిస్తున్నాయి.

### జాతరలపై శిష్టుల, జానపదుల పరస్పర ప్రభావం:

శిష్టులు, జానపదులు దేవతలకు చేసే పూజావిధానం వేరువేరుగా ఉంటుంది. శిష్టులు వేదాది మంత్రాలతో, జానపదులు దేవతలకు మొక్కలు సమర్పిస్తూ పూజలు చేస్తారు. జానపదులు ఆయా దేవతలపై పాటలు పాడుతూ తమ భక్తిని చాటుకుంటే, శిష్టులు అభిషేకం, కళ్యాణం, డోలోత్సవం, ఏకాంతోత్సవం చేస్తారు. రథోత్సవంలో ఒకరికొకరు సహకరించుకుంటూ పూజిస్తారు. జానపదుల దేవతలైన పోచమ్మ దగ్గరికి శిష్టులు కూడా వెళ్తారు. ఇలా ఒకరి ప్రభావం మరొకరిపైన ఉంటుంది.

### ముగింపు :

ఈ పత్రంలో జగిత్యాల జిల్లా జాతరల ద్వారా, ఒక తరం నుండి మరొక తరానికి సంస్కృతి, సాంప్రదాయాలు ఎలా వ్యాప్తి చెందాయో వివరించాను.

అలాగే భక్తిని పెంచడానికి, భగవంతునిపై నమ్మకాన్ని కలిగించడానికి ఉపయోగపడుతుదని ఆషిస్తున్న. ఈ జాతరల విశేషాలు, తెలంగాణ చరిత్ర నిర్మాణానికి కూడా ఉపయోగపడుతాయని భావిస్తున్నాను.

### ఉపయుక్త గ్రంథాలు :

1. నరసింహ శతకం - కాకుత్సం శేషప్ప.
2. నరహరి శతకం - కాకుత్సం శేషప్ప.
3. నృకేసరి శతకం - కాకుత్సం శేషప్ప.
4. మనస్సంబోధన కీర్తనలు - జై శెట్టి రాజయ్య.
5. తెలంగాణ సుప్రసిద్ధ కోటలు - జై శెట్టి రమణయ్య.
6. తెలంగాణ సుప్రసిద్ధ దేవాలయాలు - జై శెట్టి రమణయ్య.
7. ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం - సంగనభట్ల నర్సయ్య.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలంగాణ ఉద్యమం - సంఘీభావ కథ

- జె. శంకర్, పరిశోధక విద్యార్థి ఉస్మానియా విశ్వ విద్యాలయం.

ఏదైనా ఒక ప్రాంతాల్లో అభివృద్ధి లోపించినప్పుడు ప్రజల ఆకాంక్ష మేరకు జరగనప్పుడు లేదా ఒక ప్రత్యేక తెగ, జాతి, వర్గానికి సరియైన ప్రాధాన్యం, గుర్తింపు లభించినప్పుడు ప్రాంతీయ, ప్రత్యేక, ఏర్పాటు వాద ఉద్యమాలు వస్తూనే ఉంటాయి.అలాంటి ప్రత్యేకమైన ప్రాంతీయ ఉద్యమాలు ఊపందుకోవడానికి పెట్టు బడుల్లో అసమానతలు, నిరుద్యోగం, రాజకీయ ఆధి పత్యం ప్రధాన కారణాలైతే అనేక సంవత్సరాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల్లో ఎదిగిన రెండు వేరు వేరు ప్రాంతాలను కేవలం భాషా ప్రాతిపదికన ఒక రాష్ట్రంగా చేయడం వల్ల అసమానతల్లె కారణంగా ఏర్పడ్డ ఉద్యమమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం.

**పరిచయం :**

తెలుగు మాట్లాడే ప్రజలందరినీ ఒకే గొడుగు కిందకి తెచ్చేందుకు జరిగిన ప్రయత్నాల ఫలితంగా 1956 న భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్. రాష్ట్రాల పునర్విభజన కమిషన్ నివేదికకు భిన్నంగా, ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా 2.07 కోట్ల రూపాయల లోటుతో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని, 4.49 కోట్ల మిగులు నిధులతో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రాలో విలీనం చేయడం ద్వారా మొదలై, తెలంగాణ ప్రాంతంపై ప్రభుత్వం చూపిన వివక్ష వల్ల ఆంధ్రా పాలకుల మోస పూరిత పరిపాలన వల్ల తెలంగాణ ప్రజలపై కొనసాగించిన అన్యాయాలను ఎండగడుతూ, ముల్కీ నిబంధనల అమలుకు నిరుద్యోగ యువత 1969 లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలై 2001 తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావంతో మొదలైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని ప్రజల ఆకాంక్షగా 2014 జూన్ 2 న ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భా ఆవిర్భవించినది.

మాట్లాడాల్సిన సందర్భంలో కవి మౌనం పాటించడం ప్రజాద్రోహం. సమకాలీన ఉద్యమ స్వరూప స్వభావాలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో అర్థం చేసుకుని సమదృష్టితో మాట్లాడడం కవి నిరంతర కర్తవ్యం. సమాజ రక్షణకు రక్షక భటుడు తన విధి నిర్వాహణను చేసినట్లు ఉద్యమ విజయ సాధనకు కవి దిశా నిర్దేశం చేయాలి. సామాజిక ఉద్యమ గమ్యానికి సాంస్కృతిక రహదారి కావాలి. ప్రజా ఉద్యమానికి వాహిక కావాలి. కావున 1 నవంబర్ 2007 న హోలియా పట్టణంలో సీమాంధ్రుల సంఘీభావ సదస్సు జరిగింది. తెలంగాణ ఉద్యమంలో ఇది చారిత్రక సదస్సు. ఈ సదస్సు రెఫరెండం సర్పంచ్‌గా వేనేపల్లి రంగారావు నేతృత్వంలో ''తెలంగాణ మట్టిమనుషుల'' సారథ్యంలో ''సీమాంధ్రుల తెలంగాణం''అనే పేరులో పేరుతో జరిగిన ఈ సదస్సు సామాజికోద్యమాల చరిత్రలో మరో మలుపని చెప్పవచ్చు. సీమాంధ్ర కవులు కళాకారులు రచయితలు కార్యకర్తలు ఈ సదస్సులో పాల్గొని 'అన్నదమ్ముల్లా విడిపోదాం - ఆత్మీయుల్లా కలిసుందాం' అని పిలుపు నిచ్చారు. తమ తమ ప్రాంతాల వెనుకబాటును ప్రస్తావిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు మద్దతు పలికారు.ఈ సందర్భంలోనే సంఘీభావ సాహిత్యాన్ని వెలువరించాలని నిర్ణయించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సీమాంధ్ర కవులు తెలంగాణ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించి, తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా 'కావడి కుండలు' కవితా సంకలనంతో మొదలై సంఘీభావం కథ నాటిక వ్యాసం మొదలైన ప్రక్రియల ద్వారా ఉద్ధృతమైంది.నా ఈ వ్యాసంలో ఆంధ్ర కవులు సంఘీభావ కథ ద్వారా మద్దతు తెలిపిన తీరును విశదీకరిస్తాను.

సాహిత్యం ఎంత శాశ్వతము కథలు అంటే శాశ్వతం. ఒక మాటకు ఉన్న శక్తి కన్నా మాటల సమాహారంతో రూపొందే కథకు ఉన్న శక్తి వందరెట్లు ఎక్కువ. సామాజిక

వాతావరణం కథావస్తువును నిర్దేశిస్తే, సాహితీ వాతావరణ కథ రూపాన్ని మెరుగులు దిద్దుతుంది. ఇలాంటి కథలు తెలంగాణ ఉద్యమానికి సంఘీభావంగా ప్రకటించిన తీరు రచయితల ఉద్యమ స్ఫూర్తి ఈ కథల్లో కనిపిస్తుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాలని తెలంగాణ ప్రజల ఆకాంక్ష తీరాలని కోరుకునే వాళ్ళు ''సచ్చే దిల్ సే''ప్రేమించే వాళ్లలో మొట్ట మొదటిగా కనిపించేది మల్లీశ్వరి గారు. తెలంగాణ జన జీవితాన్ని సంఘర్షణను ఉద్యమాలకు అద్దం పడుతూ వచ్చిన ''వెతలే కథలై'' కథా సంకలనంలో 'ఇటు చూస్తే నాన్న అటు చూస్తే చిరంజీవి' కథలో తెలంగాణను అభిమానించే ఒక తండ్రికి, చిరంజీవిని అభిమానించే కొడుకుకు మధ్య జరిగిన 'మానసిక సంఘర్షణన్టె' ఈ కథలో కనిపిస్తుంది.

ఈ కథలో జీవన్ చిరంజీవిని ప్రేమించే కల్లా కపటం లేని పిల్లవాడు. కానీ తను అభిమానించే చిరంజీవి కపటంతో కూడిన సమైక్యవాది. ఇది గ్రహించిన తండ్రి కొడుకుకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాడు. కానీ మంచి తప్ప చెడునీ ఐక్యత తప్ప ఘర్షణను ఊహించలేని ప్రపంచం వాడిది. ఐక్యతలోంచి మంచి పుడుతుందన్టె భ్రమ నుంచి పెద్ద వాళ్లే బయట పడలేకపోతున్నారు. అనివార్యం అయిన చోట మంచి కోసం సందర్శించాలని తన ఆలోచనల్లోంచి తానే గ్రహించాలని తండ్రి గ్రహిస్తారు. తను అభిమానించే చిరంజీవి స్కూల్ ఫంక్షన్ కు వచ్చినప్పుడు సమైక్యాంధ్ర అంటే మీకు ఇష్టం లేదు అని అడిగిన జీవన్ మాటకు రాని సమాధానాన్ని గమనించిన జీవన్ నాన్న వాదాన్ని నిలబెడుతూ చిరంజీవి లేకపోతే ఏం నాన్న తెలంగాణ ఉందిగా అని చిరంజీవి అయితే ఒక్కడే ! తెలంగాణ అయితే చాలా చాలా మంది అని తన సంఘర్షణలో నుండి బయటపడతాడు.సిరిసిల్ల నడిబొడ్డున మాట్లాడిన తెలంగాణ అమరవీరుల గురించి ప్రశంసించిన తీరు,మారిన రాజకీయ సమీకరణాల్లో నీకు నీ ప్రజల మనోభావాలు గుర్తుకొచ్చాయా? తెలంగాణ ప్రజలు నీకు నీ ప్రజలు కారా? వారి మనోభావాలు నీకు పట్టావా? అని ఒక ఉద్యమకారుడు చిరంజీవి ద్వంద వైఖరి ప్రశ్నించిన తీరు ఈ కథలో కనిపిస్తుంది.

మల్లీశ్వరి గారు కోస్తా మాండలికంలో రాసిన మరో కథ 'టెంకి జెల్ల'తెలుగమ్మా అంజయ్య అను ఇద్దరి భార్యాభర్తల మధ్య జరిగిన విడాకులు పంచాయితీతో కలిసి ఉండనప్పుడు విడిపోవడమే మేలు అనే న్యాయ సమీక్ష ద్వారా ఎక్కడి ప్రాంతం వారి ఆస్తులు అక్కడి వాళ్లకే చెందుతాయి అనే పెద్ద మనుషుల తీర్పు ద్వారా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును సమర్థిస్తూ ఈ కథ ద్వారా సంఘీభావాన్ని తెలియజేశారు.

టెంకి జెల్ల కథలో భార్య అయిన తెలగమ్మాకు, అందెయ్యకు పెళ్ళి సంబంధం నాటి నుండి వారి మధ్య ఈ ఎడమొహం, పెడమొహమే కనిపిస్తుంది. నన్నొగ్గు అన్ని తెలగమ్మా వాదిస్తే, నేనొగ్గను అని అందెయ్య వాదించడం జరుగుతుంది. ఈ గొడవ పంచాయతీ పెద్ద మనుషుల వరకు వెళ్తుంది. తెలగమ్మకు కులపు వాళ్లను వేసుకుని ఉద్యమం చేస్తుంటే, తెలగమ్మను అనుసరించిన అందెయ్య కూడా ఉద్యమం చేపడతాడు. చివరకు సొనప కాయలో దాచుకున్న డబ్బుల సంగతి తేల్చమని అందెయ్య అడగడం వల్ల వీరిద్దరి మధ్యన ఉన్న గొడవ విడాకులది కాదు, డబ్బుల గొడవ అని పెద్ద మనుషులకు అర్థమవుతుంది. ఇక్కడ తెలంగాణ, ఆంధ్ర వేరు పడడంలో ఏ సమస్య లేదు హైదరాబాద్ నగరం ఆస్థుల పంపకాలే ప్రధానం అనేది ఇక్కడ రచయిత్రి అందెయ్య, తెలగమ్మ పాత్ర ద్వారా తెలియపరిచారు.పెద్ద మనుషుల వద్ద తెగని పంచాయితీ గ్రామ సభ ద్వారా తెగుతుంది అనే నమ్మకంతో గ్రామ సభకు వెళ్తుంది. కానీ ప్రకాశం నాయుడు తెలగమ్మ ను హేళన చేస్తూ, అంజయ్య పక్షం వహిస్తాడు. ఈ విషయం టీవీల వాళ్లకు తెలిసి హడావిడి జరుగుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ హక్కులు ఉంటాయి. కలిసి ఉండాలని కోరుకోవడంలో తప్పులేదు, విడిపోతాను అనడంలో తప్పులేదు అనే వాదనకు వస్తారు. కానీ తెలగమ్మ రాజ్యాంగంలో హక్కులతోపాటు బాధ్యతలు కూడా ఉంటాయని వాదిస్తుంది. ఇద్దరి

మధ్యన పెద్ద మనుషుల వాదోపవాదాల్లో ఒక పిక్కిరోడు పైకి లేసి ప్రకాశం నాయుడిని ఒక జెల్ల కాయ పీకి కూర్చుంటాడు. ఇది తెలిసిన మీడియా గాలి గత్తర చేస్తుంది. చివరకు ప్రజాస్వామ్యంలో వద్దనుకుంటే విడిపోయే హక్కు కూడా ఉంటుందనీ, తెలగ మ్మకు కూడా విడిపోయే హక్కు ఉంటుందని ప్రకాశ్ నాయుడు పంచాయతీ చేస్తాడు. ఇక టెంకి జెల్ల ని పోరాట రూపంగా ఉద్యమం చేయాలి అనే స్ఫూర్తి ప్రజల్లో కలుగుతుంది.పెద్ద మనుషుల నాలికకు నరం లేకపోతే పిక్కరోల్ల గనమే పీఠం ఎక్కుతుంది అనే సత్యం ద్వారా ప్రత్యేక తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను, రాజకీయ, ఆర్థిక దోపిడీని ఈ కథ ద్వారా తెలియపరుస్తూ, రచయిత్రి గారు సంఘీ భావాన్ని వెల్లిబుచ్చారు.

తెలంగాణ జన జీవన సంఘర్షణను ప్రత్యేకంగా అనుభవిస్తున్న సోదరి మణి కలం నుండి వెలువడిన మరో అగ్ని కణమైన కథ డాక్టర్ సమతారోష్ని గారు రచించిన 'అమ్మ' కథ. మొదటగా తెలంగాణ భాష, యాస పట్ల ఉన్న వివక్షతను, చులకన భావాన్ని కూతురు రాజీ బోధించిన హితబోధ ద్వారా సమైక్యాంధ్ర నినాదాన్ని వదిలి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, తెలంగాణ రాష్ట్ర సాధించాలని కోరుకుంటుంది.సమస్య ఏదైనా అది మనం చూసే దృష్టి కోణంలో ఉంటుంది.వివరించే వ్యక్తిని బట్టి ఉంటుంది.భావన దృష్టితో, ఎన్ని సంవత్స రాలు కలిసి ఉన్నామని భావనతో ఉన్న అమ్మ భావనను రాజీ అమ్మ దృష్టి కోణాన్ని మార్పించి,వివరించిన విధానం వేరు పడటం వల్ల ఉండే లాభాలను చిన్న రాష్ట్రాల అభివృద్ధిని ఈ కథ ద్వారా వివరిస్తుంది.

తెలంగాణ 'వెతలే కథలై' లో జి. విజయ లక్ష్మి గారి 'నిన్ను చూడాలని ఉంది' కథలో కడుపుతో ఉన్న అమ్మకు తన బిడ్డ ఇచ్చే ధైర్యాన్ని,పోరాడితే కానీ రాదని తెలంగాణకు ఎదిరించి ఎలా తెచ్చుకోవాలో కరుణ పాత్ర ద్వారా తెలిపి తెలంగాణ ఉద్యమానికి ఈ కథ ద్వారా సంఘీ భావాన్ని తెలిపారు.

నీరు పల్లంలోకి పారుతుంది కాబట్టి దాన్ని అడ్డుకునే వాడు ఎవడు? ప్రేమతో సాగనంపే వాడు ఎవడు? అనేది సూక్ష్మంగా చూడమంటుంది సాహిత్యం. ప్రాంతీయ అస్తిత్వాలు, వాటి పరిధులు కాలంతో పాటు మారుతూ ఉంటాయి. కర్నూలు కథా సమయం మిత్రులు ఇటీవలి కాలంలో తాము రాసిన కథల్లో తెలంగాణను సమర్థిస్తూ 'విభజన రేఖలు' పేరన కథా సంకలనం వేసారు.

'పోగొట్టుకున్నది' కథలో తుంగభద్ర నది ఒడ్డున జై సమైక్యాంధ్ర నినాదాలతో హోరెత్తుతున్న సమైక్య వాదుల్ని చైతన్యపరిచి,పెద్దన్న పేరుతో రెండు ప్రాంతాల్ని మోసం చేస్తున్న ఆంధ్రా వారి పెత్తనం ఎండగడుతూ నీళ్ల దోపిడీ తీరును కళ్లకు కట్టినట్టు చూపించి, మన నీటిని పోగొట్టు కుని మనది కాని హైదరాబాద్ ను కావాలి అంటారు ఏంటి ? అని 'మనది కాని దాన్ని వెతుకుతున్నామన్నా, సమైక్యాంధ్రలో పడి రాయల సీమను మరిచి పోయామన్నా' అనే సూక్తి ఈ కథలో మనకు కనిపిస్తుంది.

'జై తెలంగాణ' అనే మరో కథలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయినా వీరేశం తన చిన్ననాటి స్నేహితుడు ఉరుకుందప్పతో కలిసి వాళ్ల అన్న కూతురుకు సంబంధం కొరకు బైరాపురం వెళ్తున్నప్పుడు అప్పుడే ఇద్దరి మధ్యలో జరిగిన సంభాషణల్లె ఈ తెలంగాణ కథ.ఈ కథలో ఆంధ్ర పెద్దన్నలు సీమ ప్రాంతం వారిని మోసం చేస్తూ, వారి పంట భూములను కౌలు చేస్తూ,భూ యజమానులుగా మారిన తీరును, వారి నీటి వనరుల దోపిడీ మరియు సీమ ప్రజల ఉదార స్వభావం ఈ కథలో మనకు అగుపిస్తుంది.

'గాయాలు' అనే మరే మరో కథలో సెలవులకు వచ్చిన తన కూతురు ఎదుర్కుంటున్న ప్రాంతీయ వివక్ష,భాషా వివక్ష తాను 20 ఏళ్ల కింద ఎదురుకున్న విధంగానే నేటికీ కొనసాగుతున్న తీరు ఈ కథలో కనిపిస్తుంది.నరేష్ అనే పాత్ర ద్వారా ప్రాంతీయ అసమానతలు,ఆహార అలవాట్ల పట్ల హేళన, సినిమా భాషలో వివక్ష, పాత్రల్లో వివక్ష అభివృద్ధిలో వివక్ష, రాజకీయ లాలూచీ రాయసీమ, తెలంగాణ వెనుకబాటుతనం, ఎడారిని తలపించే

పరిస్థితులు, దోపిడీకి అనువైన ప్రాంతాలను ఎలా దోచుకుంటున్నారో చెబుతూనే, ఆ రోజు అవసరం కోసం తమిళనాడు, కర్ణాటక లోని తెలుగు వాళ్ళను నిర్దాక్షణ్యంగా వదిలివచ్చిన తీరును, వేరే అవసరాల కోసం ఇంకొక ప్రాంతం తెలుగు వాళ్ళతో కలిసి ఉంటాం అనే తీరును ఎండగడుతూ, మీ సావాసం మాకొద్దు అనే మాట వినడానికి సిద్ధంగా ఉండండి అనే నినాదం ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది.

'విభజన రేఖలు, అనే ఈ కథలో పెద్దన్న రాఘవరావు గారి పాత్ర ద్వారా జాతి అనే పేరుతో పెద్దన్న చేసిన అనేక రకాల దోపిడి చేసింది చాలక చివరి దాకా తన తల్లి దగ్గరి ఆస్థి కొరకు తమ్ముళ్లను మాయ చేసి, స్వార్థ బుద్ధితో కబళించాలన్జె తీరును గమనించిన తమ్ముడు ఉమా మహేష్ చివరకు పెద్దన్నను ఛీకొట్టి, నడిపి అన్న నాగేశ్వర్‌ను మోసం చేసే ఉద్దేశ్యం లేదు, నీతో సమైక్యంగా జతకట్టడానికి ఇష్టం లేదని కరాఖండిగా చెప్పిన తీరు ఈ కథలో అగుపిస్తుంది. 'తెలంగాణ ప్రాంతీయ వాదానికి జై కొట్టండి - పెద్దన్న మోసాన్ని ఎండగట్టండి' అనే నీతి ఈ కథలో కనిపిస్తుంది.

'కొత్త కల' మరో కథలో సమైక్యాంధ్ర ఉద్యమంలో ఉధృతంగా పాల్గొంటున్న విజయ్ ని తన పెద్దమ్మ కొడుకు రమేష్ మరియు యూనివర్సిటీలో రాయలసీమ కరువు పరిస్థితులపై పరిశోధన చేస్తున్న చైతన్య ప్రకాశ్ ద్వారా చైతన్యమైన తీరు ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది. అవగాహన లేమితో సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటున్న విజయ్ తీరును ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే హైదరాబాద్ నగరం పోతుంది అనే బాధను చైతన్య ప్రకాశ్ అనే పాత్ర ద్వారా పోగొట్టి, మనకు దక్కనిది ఎవరికీ దక్కకూడదనే ఆ సిక్ సంస్కృతిని వదిలేసి, లూటీ చేసిన డబ్బులు కాపాడుకోవడానికే యూటీ నినాదం. హైదరాబాద్ ఇప్పుడు కోస్తా పెట్టుబడిదారుల, రాయలసీమ ఫ్యాక్షనిస్టుల స్విస్ బ్యాంక్. వాళ్లకు కాపాలా కాయాల్సిన అవసరం మనకెందుకని, కలిసి నడవాల్సింది, పోరాడాల్సింది, మనలా మోసపోయిన వారితో కానీ అందరినీ అణగదొక్కి సమస్త అభివృద్ధిని తమ ఆధిపత్యంలోకి తీసుకున్న వాళ్లతో కాదు.ఈ అరవై ఏళ్ల సమైక్యాంధ్రలో బాగుపడింది నాలుగు జిల్లాలు. రెండు కులాలు.ఎవని నినాదాన్ని మోస్తూ, ఎవని వాదాన్ని బలపరుస్తూ, ఎవ్వని కుట్రలో కూరుకుపోతూ, కాళ్ల కింద కదిలిపోతున్న నెలను మరిస్తే, ఎట్లా? అనీ, మనది ఆకలి గొడవ. వాళ్లది ఆస్థితుల గొడవ. అని చెబుతూనే, భూమన్ రాసిన రాయలసీమ ముఖ చిత్రం, శ్రీకృష్ణ కమిటీ నివేదిక మొదలైన పుస్తకాలను చదివించేలా చేస్తాడు. ఈ పాత్ర ద్వారా చైతన్య ప్రకాశ్ ఇచ్చిన పుస్తకాలను చదువుతూ నిద్రలోకి జారుకున్న విజయ్, సీమ పరిస్థితి, ఆంధ్ర మాతను చేస్తున్న దోపిడీని గురించి కలగని, వారి అరాచకాలను ఎదిరించటానికి సిద్ధమవుతాడు ఈ కథలో.?

రాయలసీమ నాయకులు సమైక్య రాష్ట్రానికి నాయకత్వం వహించినా కోస్తా పొలాలకు నీళ్లు మళ్లించే పెద్ద జీతగాళ్లుగా మిగిలారు. శ్రీబాగ్ ఒప్పందం అమలులోని డొల్లతనం తెలంగాణ విడిపోతున్న యీ వర్తమానంలో రాయలసీమ ప్రజలకు అర్థమై, తెలంగాణ వాదనలోని సూత్రాన్ని అంగీకరిస్తూ, ఆ స్ఫూర్తితో తమను కష్టాల పాలు చేస్తున్న కోస్తా పెద్దన్నను వేలెత్తి చూపుతూ, పెద్దన్నకు వ్యతిరేకంగా, తెలంగాణ వాదానికి మద్దతుగా రాయలసీమ సంఘీభావంగా వెలువడిన కథల సమాహారమే ఈ 'విభజన రేఖలు'.

భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్విభజన తర్వాత ప్రజల్లో అభివృద్ధికి సంబంధించి అనేక ఆకాంక్షలు రేకెత్తాయి.విద్య ఉపాధి రంగాల విస్తరణతో పాటు, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి ఉంటుందనుకున్న ఆశలు ఉండేవి. వందలాది సంవత్సరాలు పరాయి పాలనలో ఉన్న తమకు కొత్త రాష్ట్రం, కొత్త ప్రభుత్వం రావడం వల్ల కొత్త అవకాశాలు వస్తాయని భావించారు. తమ సర్వతో ముఖాభివృద్ధికి ఉపయోగపడతాయి అనుకున్నారు. కానీ ఆ ఆశలు సంపూర్ణంగా నెరవేరకపోవడం వల్ల అభివృద్ధి ఎంత జరిగిన మూడు ప్రాంతాలలో ఒకే ప్రాంతానికి జరగడం వల్ల మిగతా ప్రాంతాలు సహజంగానే వెనుకబడి

పోయాయి. పై కారణాల వల్ల రాష్ట్రాలు సమైక్యంగా కలిసినప్పటికిని, విడిపోయినప్పటికిని వందేళ్లు గడవకముందే మళ్లీ కొత్త ప్రాంతీయ, ఉపప్రాంతీయ వాదాలు తలెత్తడం సహజంగా జరిగిపోతున్నాయి. ఇందులో భాగంగానే తెలంగాణ ఉద్యమానికి ప్రాంతేతర కవులు తమ వంతు సంఘీభావంగా, కథా సంకలనాల రూపంలో తెలంగాణకు తెలంగాణేతరులు వ్యతిరేకం కాదని తమ వంతు సంఘీభావాన్ని కథల రూపంలో తెలియజేసి తెలంగాణ రాష్ట్రం సిద్ధించటంలో తమ వంతు పాత్రను పోషించారు.

**ఆధార గ్రంథాలు :**

1. వెతలే కథలై, సం. అమృత లత, అనిశెట్టి రజిత, తుర్లపాటి లక్ష్మీ, కిరణ్ బాల, రజనీ పబ్లికేషన్స్, 2011.
2. టెంకిజెల్ల కథ, ర. కె.ఎన్. మల్లీశ్వరి, వార్తా పత్రిక, 2 అక్టోబర్ 2011.
3. విభజన రేఖలు, సం. డా. ఎం. హరికిషన్, జి. వెంకట కృష్ణ,డా.కె. సుభాషిణి, సాహితీ మిత్రులు, కర్నూలు, డిసెంబర్ 2013.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఓల్గా కథలు - స్త్రీ అణచివేత ధోరణి చిత్రణ

- కె. నరేష్, అతిథి అధ్యాపకుడు, ట్రిపుల్. ఐ.టీ, ఆర్.కె.వ్యాలీ, వై.యస్.ఆర్. కడప.

ఆధునిక తెలుగు సాహిత్యంలో రూపుదాల్చిన సాహితీ వాదం 'స్త్రీ వాదం' తమ అస్థిత్వం. ఈ క్రమంలో తమ అస్థిత్వం నిలుపుకోవడం కోసం మహిళలు చేసిన ఉద్య మాలు, అవి సాధించిన విజయాలు నిరుపమానమైనవిగా చెప్పవచ్చు. దీనికి స్త్రీ చైతన్యమే ప్రధాన హేతువుగా ఉందని చెప్పకతప్పదు. కొత్త సమాజానికి ఆధునిక స్త్రీ పుట్టుక తప్పనిసరి అయ్యింది. అది అక్కడితో ఆగిపోలేదు. మహిళలు సమాన హక్కులు, సమాన గౌరవం, సమాన స్థాయి కావాలని నినదించే స్థాయికి ఎదగడమే గాకుండా ధర్మాగ్రహ పోరాటానికి సిద్ధమైంది. అస్తిత్వ వేదనను అందించింది. కాస్తంత దృష్టి పెట్టమని విశాల సాహిత్య వేదికను ఏర్పరచింది. కథలు, నవలలు ద్వారా సమాజ గతిని, ఆలోచనలనూ సకల కల్మషాల్ని కడిగి పారేసే మహత్తరమైన పని మొదలెట్టింది. దానికి తగిన ఒక తాత్విక భూమికను ఏర్పరచుకోవడం ఒక గొప్ప పరి ణామం. అందుకు దోహదపడిన స్త్రీ వాద రచయిత్రు లెందరో ఉన్నారు. వారిలో అగ్రగణ్యులు ఓల్గా. తెలుగు సాహిత్యంలో బలమైన గొంతుతో అనితర సాధ్యమైన, ప్రతిభావంతమైన పాత్ర నిర్వహించిన వారిలో ఓల్గా పేరు మొదటగా ఉంటుంది. స్త్రీ వాదంలో ఆమె ఒక వ్యక్తిగా గాక శక్తిగా రూపుదాల్చారు.

ఓల్గాగా ప్రసిద్ధి చెందిన పోపూరిలలితకుమారి నవలలు, కథలు రాశారు. ఓల్గా కలం నుంచి సహజ (1986), స్వేచ్ఛ (1987) అనే నవలలు, స్పర్శ, తోడు, ఓ పెళ్ళికథ, నోర్ముయ్, కళ్ళు, మొదటిచావు, ఒక రాజకీయ కథ, సారీ జాఫర్, గోడలు, భద్రత వంటి కథలు వెలు వడ్డాయి. ఈమె రచనల్లో స్త్రీ పురుష అసమానతలను, పురుషహంకార ధోరణులను ఎండగట్టడం, గృహ సంబంధ అణచివేతలకు ఎదురుతిరగడం, సంప్ర దాయాల ముసుగులో అస్తిత్వాన్ని కోల్పోవడాన్ని నిరసిం చడం, వంటి అంశాలను కథ, నవలల్లో చిత్రించారు. అలా సమాజంలో ఆయా అంశాలను చర్చకు పెట్టారు. చర్చకు తన సాహిత్యం ద్వారా దోహదం చేశారు. వీరి సాహిత్యంపై ఇప్పటి వరకు వందలాది చర్చాగోష్ఠులు జరిగాయి. అవి స్త్రీ జీవిత గమనాన్ని పురోగమనం వైపు మరల్చాయి.

స్త్రీ వాదాన్ని, సాహిత్యాన్ని పరిశీలనాత్మకంగా చద వాల్సిన వారు, దానిని అర్థం చేసుకోవాల్సిన వారు మగవారేనని చెప్పక తప్పదు. ఎందుకంటే ఇంట్లో బయటా ఆధిక్యత చూపుతున్నది మగవారే కనుక. స్త్రీ పురుష అసమానతల్లోని సున్నితమైన అంశాల్ని పట్టించు కోవాల్సిందీ మగవారే కదా! సామాజిక వ్యవస్థలో అన కొండలా విస్తరించిన పితృస్వామ్య, రాజకీయ స్వభావాన్ని ఓల్గా అత్యంత నేర్పుగా తన రచనల్లో చొప్పించగలిగారు. తన దృక్పథం ఏమిటో తను నిర్వహించాల్సిన పాత్ర ఏమిటో తెలుసుకొని, రచనల ద్వారా చేయదగిన నిర్మాణాత్మక కృషిచేసి తనేమిటో నిరూపించుకున్నారు. ఓల్గాకు తను చెప్పాల్సిన అంశంపట్ల ఖచ్చితమైన అవగాహన ఉంది. ఆ అవగాహనతో తన చుట్టూ ఉన్న స్త్రీల జీవితాల్ని ప్రత్యక్షంగా చూసినపుడు కలిగిన ఆగ్రహంలోంచి, ఒకింత నిగ్రహం పాటించి, అసలు కార ణాన్ని శోధించి రాసారు. అందుకే ఏ కథలోనూ పురుషుల్ని శత్రువులుగా చూడరు. మిత్ర వైరుధ్యం ఎక్కడుందో చెబుతారు. బలహీనతలేమిటో, ఉండాల్సిన రీతి ఏమిటో మాట్లాడుతారు. ఎక్కడా ద్వేషంతో రగిలిపోయే ప్రకం పనలు కనబడవు. కానీ స్త్రీలు అలాగే బతకాలనే కట్టడిని విధించిన పురుష ప్రపంచాన్ని మాత్రం చీల్చిచెండాడు తారు. అది ఉదాత్త సాహిత్య సంస్కారంగా ధర్మాగ్రహ పోరాటంగా భావించి రాస్తారు.

1980కి ముందు స్త్రీలు రాసేవి పాత సంప్రదాయాలు, పురా వ్యక్తిత్వ చిత్రణలే ఉండేవి. సకల చాదస్తాలతో తాతగారి బామ్మగారి భావాలకు దాసులుగానే ఉండేవి. తమను తాము ప్రశ్నించుకోకుండా ఉండిపోయేవి. స్వీయ వ్యక్తీకరణ లేదు. కొన్ని అభిప్రాయాల్ని నిర్భయంగా చెప్పుకునే. తీరు లేదు. సంసార పక్షంగా ఉంటే చాలను కున్నారు. ఆధునిక భావాలతో చైతన్యవంతమైన పాత్రలు లేవు. సరిగ్గా ఆ సమయంలో ఓల్గా కలం పట్టి కథలు రాసింది. ఆమె కథలను బట్టి కథలుగా తీసుకోలేం. ఆయా కథల్లోని పాత్రలకు జీవ లక్షణం ఉంది. సమాజంలో తిరుగాడే పాత్రలు అవి. ఎన్నో ఆదర్శాలను వల్లె వేయడం కోసం పుట్టినవి కావు. అలాగే ఒక కాలానికి సంబంధించినవి కావు. గతంలో జీవించిన వారు, నేటి కాలంలో జీవిస్తున్న వారు అందరికీ చెందిన కథలవి. వాటిలో ఉండే ఒత్తిడులు మారొచ్చు. బాధల రూపు సంఘర్షణల తీరు మారొచ్చు. పోరాడి ఓడిపోతూ నిలదొక్కుకొని ఆత్మ గౌరవం ప్రకటించడంలో తేడాలుండొచ్చు. అంతవరకు స్త్రీల గురించి ఎంతోమంది రాసి ఉండొచ్చు. అయితే వాటిని భిన్నంగా ఓల్గా కథలుంటాయి.

'ముడి మిసిమి' కథలో ఓల్గా ముసలి వయసులో తల్లి ఆలనాపాలనా చూసుకోవాల్సిన పిల్లల బాధ్యత గురించి అద్భుతంగా వివరిస్తారు. రంగమణి తన కూతురు సుజాత చిన్నప్పుడు మారాం చేసినపుడు తనెలా ప్రవర్తిం చిందీ జ్వరమొచ్చినపుడు నిద్రలేమిని ఎంత సంతోషంగా భరించిందీ, మూడేళ్ళు వచ్చే వరకూ మంచి ఉద్యోగాన్ని ఎలా వదులుకుందీ చెప్పింది. ఆఖరుగా ఉద్యోగం మానేసి తనను చూసుకోమని అడిగింది. సుజాత అలాగే చేసింది. చిలిపిగా ఆడిస్తూ, వంటలు నేర్చుకుంటూ పాటలు వింటూ పుస్తకాలు చదువుతూ అమ్మ కోరికలు తీరుస్తూ సమాదరిస్తూ కన్నతల్లిగా మారిపోయింది. అనేకానేక ఆర్థిక, సాంఘిక, శారీరక, ఆరోగ్య కారణాలవల్ల తల్లిదండ్రుల వృద్ధాప్యాన్ని 'మిస్' అవుతున్న పిల్లలకు, తల్లిదండ్రుల్ని కంటికి రెప్పలా చూసుకునే వారికి ఈ కథను అంకితం ఇచ్చారు. నేడు వృద్ధులను పిల్లలను పట్టించుకోవడం లేదు. వారిని అనాథ ఆశ్రమాల్లో చేర్పిస్తున్నారు. కొందరైతే రోడ్డు మీదకు నెట్టేస్తున్నారు. ఇంకొందరు బతికుండగానే శ్మశానంలో పడేస్తున్నారు.

బాల్యం నుంచే ఆడపిల్లల హక్కులను తల్లిదండ్రులు ఇతరులు ఎలా హరిస్తున్నారో 'నోర్ముయ్' కథలో ఓల్గా చక్కగా తెలిపారు.

"నోర్ముయ్....

ఈ మాట పదే పదే చెవుల్లో వినబడుతుంటే భరించ లేక చెవులు కూడా మూసుకుంది జానకి. ఈ మాటతో పరిచయం ఒక్కనాటిది కాదు. ఒక సంవత్సరానిది కాదు. ఊహ తెలిసిన క్షణం నుంచి ఎప్పుడూ ఎవరో ఒకరు జానకిని ఈ మాట అంటూనే ఉన్నారు.

చిన్నతనంలో ఎక్కడ ఏం చూసినా, ఏం జరిగినా పట్టలేని సంతోషమో, కోపమో, బాధో కలిగేవి. వాటిని అమ్మకో, నాన్నకో చెప్పాలని పరిగెత్తేది. తన ఆవేశాన్నంతా ప్రదర్శిస్తూ చెప్పబోతే వాళ్ళు వెంటనే ... నోరు మూసుకుని అవతలికి నడువు. ఎక్కడలేని సంగతులు నీకే కావాలి. అని కసిరేవాళ్ళు.

అమ్మా నాన్నలే కాదు, అమమ్మ, తాతయ్య, నాయ నమ్మ, అత్త, పిన్ని, మావయ్య, బాబాయి అందరూ అంతే... ఎందుకట్లా వాగుతావనే వారు.

ఆడపిల్ల కంత నోరు పనికిరాదు. అనేది అత్త. ఎంత నోరు తనది? వెళ్ళి అద్దంలో చూసుకుంటే ఎర్రని పెదవు లతో బుల్లి నోరు కనిపించింది. ఇంతచిన్న మూతిని పట్టు కుని ఎందుకలా అంటుంది?

ఆడపిల్లలకు నోరు ఎందుకుండకూడదు?

అన్నలు తమ్ముళ్ళు ఊరిమీదపడి తిరుగుతుండే వారు. అన్నల వేళకొచ్చి అన్నం తినడం, నిద్రపోవడం, వాళ్ళు వేళకొచ్చి అన్నం తినడం, బయట తిరిగేటప్పుడు హాయిగా అరుచుకుంటారు. మాట్లాడుకుంటారు. అన్నలు కాలవలో ఈతకి దూకుతూ ఎలా అరుస్తారనీ! జానకి ఒకరోజు పెరట్లో తొట్టెనిండా నీళ్ళు వున్నప్పుడు తొట్టి అంచుమీద నిలబడి పెద్దగా అరుస్తూ తొట్లోకి దూకింది.

తొట్లో నీళ్ళన్నీ ఆనందంతో చిందులేసేసరికి జానకి సంతోషం పట్టలేక మరి రెండు కేకలేసింది. గట్టిగా గొంతునరాలు పొంగేలా అరిచింది.

నాయనమ్మా, నాన్న ప్రత్యక్షమయ్యారు.

నాన్న ముఖం అసహ్యంగా చేసుకుని జానకిని తొట్లోంచి ఎత్తిబైట పడేశాడు. బట్టలు లేని జానకిని చూసి చీదరించుకుంటూ 'సిగ్గు లేదు' అని తిడుతూ వెళ్ళి పోయాడు. అన్ననూ, తమ్ముళ్ళనూ కాలవకి స్నానానికి తీసికెళ్ళి వాళ్ళు బట్టలు విప్పుకొని ఈతలేస్తుంటే నవ్వినవ్వి అలసిపోయేనాన్న!" అంటూ జానకి తనకు ఎదురైన బాధా భరితమైన అవమానాలను తలచుకుని ఆవేదన చెందు తుంది. చిన్నప్పటి నుంచి ఆడపిల్లను అడుగడుగునా అదుపు ఆజ్ఞల్లో పెట్టే పెద్దవారు, మగ పిల్లలకు ఎందుకు పెట్టరని తనలో తానే తరచి ప్రశ్నించుకుంటుంది. ఇలా స్త్రీ హక్కులు ఎలా హరించబడుతున్నాయో ఓల్గా తన కథల్లో చక్కగా చిత్రించింది.

**ఆధార గ్రంథాలు :**

1. ఓల్గా కథలు - ఓల్గా.
2. స్త్రీ వాదం - కాత్యాయనీ విద్మహే.
3. రాయలసీమ సాహిత్యం - శశిశ్రీ.
4. తెలుగు సాహిత్య సమీక్ష - రెండో సంపుటం - జి.నాగయ్య.
5. కథా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# కొలకలూరి ఆకలి కథ - సమాలోచనం

- కొండయ్య కోసూరు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మధురై కామరాజు విశ్వవిద్యాలయం, మధురై.

ఆది మానవుడు అరణ్యాలలో నివసిస్తూ, తన జీవన పోరటాన్ని సాగించాడు. నిరంతరము ఆది మానవుడు కౄర మృగాల మధ్య తిరిగుతూ, ఆహార అన్వేషణలో అనేక కష్టనష్టాలను చవి చూశాడు. ప్రతి జీవి మనుగడ సాగించడానికి ఆహారం అవసరం. కాలానుగుణంగా మనిషిలో మార్పు వచ్చింది. ఆకలి అనేది అతని ఆలోచనా విధానంలో మార్పుకు కారణ భూతమయ్యింది. ఆ ఆలోచనే నిప్పును కనిపెట్టడానికి పురిగొల్పింది.అలా నిప్పును కనుగొన్న మానవుడు వండిన మాంసాహారాన్ని భుజిస్తూ జీవించసాగాడు. ఆది మానవుని నుండి ఆధునిక మానవుని వరకు జరిగిన పరిణామ క్రమంలో ఆకలి మనిషికి ఆలోచనలు నేర్పింది. ఆకలి తీరితే ఏ ప్రాణికైనా సుఖపుష్టి కలుగుతుంది. తద్వారా ఆలోచనా శక్తి పెరుగుతుంది. తద్వారా అద్భుతాలు సృష్టించడానికి వీలు కలుగుతుంది. అనుకోకుండా జరిగిన ప్రమాదం వలన మూడు పూటలా మంచి పౌష్టిక ఆహారం లభించడంతో కడు పేదరికానికి చెందిన చిన్ని తన ఆకలి తీర్చుకోవడమే కాకుండా తమ కుటుంబ సభ్యులకు కూడా ఆకలిని తీర్చుతుంది. ఇది మూడు నాళ్ళ ముచ్చటగా మారడంతో ఆకలి బాధను భరించలేక చివరికి ప్రాణార్పణ చేసుకున్న వైనాన్ని ఇనాక్ గారు 'ఆకలి' కథ ద్వారా తెలియజేశారు.

### రచయిత పరిచయం :

ఆధునిక తెలుగు సాహిత్య వినీల ఆకాశంలో పున్నమి చంద్రునిలాగా వెలుగులు ప్రసరింప జేసిన కవితా ప్రఖండుడు ఇనాక్. నిరక్షర కుక్షికి అక్షర కుక్షగా పుట్టి లక్షలాది అక్షర నక్షత్రాలు కురుపించి సలక్షణ గ్రంథాలు ఎన్నో రాసిన విలక్షణ లక్షణాలు గల విశిష్ట విమల గుణరాశి కొలకలూరి ఇనాక్. ప్రాచీన ప్రక్రియలతో పాటు ఆధునిక ప్రక్రియలైన కథ, నవల, నాటిక, కవిత అన్ని ప్రక్రియలలో రచన చేసి పాఠకుల మనస్సులు రజింప చేసిన సవ్యసాచి ఇనాక్. ఊరబావి, సర్కారు గడ్డి వంటి ఉత్తమ రచనలు ఎన్నో తమ కలం నుంచి జాలువారాయి. భారత ప్రభుత్వం ఇటీవల కాలంలో ఇనాక్ గారికి "పద్మశ్రీ" ప్రదానం చేయడం ప్రతి తెలుగు వారు గర్వించదగిన విషయం.

### ఆకలి కథ - సమాలోచనం :

'ఊరబావి' కథా సంపుటిలో నవరత్నాలాంటి కథలు తొమ్మిది కలవు. అందులో ఆణిముత్యం లాంటి జాతి ముత్యం 'ఆకలి' కథ. కథా ప్రారంభంలోనే మొదటి పంక్తి చదివిన వెంటనే సహృదయ పాఠకులకు కథా ఇతివృత్తం కొంత వరకు అర్థమై ఆద్యాంతం కథను చదవాలన్న ఉత్సుకతను రేకెత్తించి, ఏక బిగిన చదివించగల సత్తాగల రచనా పటిమ కలది ఈ కథ.

రాత్రో, తెల్లవారు జామునో కారు కిందపడి గోడ్రు కప్ప చచ్చిపోయింది. ఈ కప్ప ఇక ఎగరదు, దూకదు, వాన వచ్చినా వరద వచ్చినా బెకబెకలాడదు.

చింత చెట్టు కింద కాళ్ళ మధ్య తలపెట్టుకొని, బిక్కుబిక్కు మంటూ కూర్చున్న 'చిన్ని' కప్పను చూసింది. పది రోజుల నుంచి ఎడతెగని వాన, నేల చెమ్మగా, చెట్టు పక్క బురదగా వుంది. నేల మీద కాలు మోపితే నరాలు జిల్లుమంటున్నాయి. ఉదయం తొమ్మిదయినా పొద్దు పొడవలేదు. వెలుతురు లేదు. రోడ్డుకు రెండు పక్కలా ఇళ్ళున్నాయి. కుడి పల్లెలో మేడలున్నాయి, రేడియోలు ఉన్నాయి. ఎడం పల్లెలో గుడిసెలున్నాయి. కుడిపల్లె, ఎడమపల్లెను కూలికి పిలుస్తుంది. కుడి పల్లె ఎడమకు గాని, ఎడం పల్లె కుడికి గాని, పెరక్కుండా సిమెంట్ రోడ్డు ప్రకాశిస్తూ ఉంటుంది.

చిన్ని ఎడం పల్లెకు చెందిన ఏడేండ్ల చిన్న అమ్మాయి. వాళ్ళ అమ్మకు నిండు నెలలు, బలహీనత. ఇంట్లో చిన్ని వాళ్ళ అక్కా, తమ్ముడు, తల్లి, నాన్న ఉంటారు. మూడు రోజుల నుండి తిండిలేదు సరికదా! తాగడానికి పచ్చి

మంచి నీళ్ళు కూడా అక్క తీసుకు రాలేదు. అక్క అన్నం కోసం ఎన్ని ఇళ్లు తిరిగినా ఎవరూ అన్నం పెట్టలేదు. చిన్ని చింతచెట్టు మొదట్లో కూర్చొని వుంది. వాన కురిసి వెలిసి పోయింది.

చిన్ని రోడ్డు దాటుతూ, లారీ కింద పడబోయింది. అప్పుడు లారీ ఓనరు, డ్రైవరు కోపపడతారు. ఒకసారి పిల్లలందరూ కలిసి చెట్టును తాకి వచ్చే ఆట ఆడు తుంటారు. చిన్నిని అందరూ ఉత్సాహపరుస్తారు. చిన్ని రోడ్డు దాటుతూ లారీ క్రింద పడి ప్రమాదానికి గురై ఆసుపత్రిలో కళ్ళు తెరచింది. రక్తం చాలా పోయింది. ఆ రోజు నుంచి ఆరు నెలల పాటు చిన్నికి మంచి ఆహారం నష్టపరిహారంగా ఇవ్వడానికి లారీ ఓనరు, తనంతట తానే నిర్ణయించుకున్నాడు. తన డబ్బుతో తల్లి దండ్రులకు అన్నం పెట్టింది చిన్ని. లారీ ఓనరు బస్తీ నుంచి రోజు రుచి కరమైన ఆహారం తెచ్చేవాడు. ఆరు నెలల తరువాత నుదిటి దెబ్బనయం అయ్యింది. లారీ వచ్చినా పళ్ళు, ఆహారం రావడం లేదు, బాగున్నావా! అని పలుకరింపే తప్ప మరేమి లేదు. చిన్నికి ఇంట్లో తిండి నచ్చలేదు. ఏమి చేయాలో తోచలేదు. మూడు రోజులు ఆహారం తినక నీరసించి పోయింది. చింతచెట్టు మొదట్లో నుండి రోడ్డు మీదకు వచ్చింది.తన ఆప్త మిత్రువైన లారీ వస్తూ వుంది. లారీ ఓనరు డ్రైవరు అరుస్తూ ఉన్నారు. డ్రైవరు బ్రేక్ వేశాడు, బ్రేక్ పడలేదు. లారీ చక్రాల క్రింద నలిగిన చిన్ని, కప్ప చనిపోయి ఎలా రోడ్డుకు అతుక్కుని ఉంటుందో ఆ విధంగా అతుక్కు పోయింది. చిన్ని ఆకలి తీర్చుకునే మార్గం తెలియక అసువులు అర్పించుకుంది.

కుడి, ఎడం పల్లెకు మధ్య సిమెంటు రోడ్డును రచయిత ఇలా వర్ణిస్తాడు. 'కుడి పల్లె ఎడమకు గాని, ఎడం పల్లె కుడి పల్లెకు గాని పెరక్కుండా, వేదకాలం నాటి శాసనం వలె, ఆధునిక కాలంలో వచనం లాగా రోడ్డు ముసలిది, ముతకది కాదు. ఒట్టిది మట్టిది కాదు, తారుది తప్పటిది కాదు. సిమెంటు రోడ్డు చిద్విలాసంగా చిరం జీవిగా ప్రకాశిస్తుంది' అని జడత్వ వస్తువును ప్రాచీన కాలపు కట్టుబాట్లకు ప్రతీకగా తీసుకుని విశ్లేశించిన విధం రమణీయం.

చిన్నికి మూడు రోజుల నుండి తిండి లేక ఉండే స్థితిని రచయిత 'రాత్రి కడుపు నిప్పు పడ్డ వరి గడ్డివామి లాగా కుమిలి కుమిలి కాలింది' అని ఆకలి మంటను వర్ణించిన తీరు అద్భుతం. దెబ్బకు దెయ్యం వదిలి పారిపోయిందన్నట్లు పెద్ద దెబ్బ తగల గానే ఆకలి పటా పంచలై పోయిందన్న విషయాన్ని ఇనాక్ ఈ విధంగా తెల్పాడు. కొంచం పెట్టమని వెంటపడి అడిగితే పెట్టక పోగా అన్నకు చిన్ని మీద అబద్ధం చెప్తాడు. పిల్లవాడి అన్న కోపంతో వచ్చి చిన్ని చెంపమీద కొడతాడు. ఆ దెబ్బకు చిన్ని క్రింద పడిపోయింది.

మూడు రోజుల నుండి చిన్నికి తిండి లేని కారణంగా కడుపులో పేగులు మెలికలు పడిపోయినంత నొప్పిగా వుంది. పడిన చోట నుండి లేవాలంటే ఓపిక లేకపోయింది. మూణ్ణాల నుండి శనిలాగా పట్టుకుని దెయ్యంలా వెంటాడుతూ ఉన్న ఆకలిని మరిపించ గల్గినంత దెబ్బవేసి అన్న పుణ్యం చేసుకున్నాడు. ఆ దెబ్బతో కడుపు నిండి పోయింది, ఆకలిపోయింది.

**ముగింపు :**

ఆకలి మనకు దేవుడు ఇచ్చిన వరం. అంతేకాదు, ఆకలి పేదల పాలిట ఒక శాపం. ఆకలితో అలమటించి పోయిన ఒక నీరుపేద కుటుంబ కథ ఇందులో వర్ణించ బడింది. కులీ నాలి చేసి కుటుంబం గడిపే తండ్రి, నిండు గర్భవతి అయినా పిల్లల కోసమే సర్వం త్యాగం చేసిన తల్లి, తనను కంటికి పాపలాగా చూసే అక్క, తనపట్ల అంతులేని ప్రేమతో చూసే తమ్ముడు వీరందరిని ఆకలి చిచ్చు నుండి కాపాడటానికి తన ప్రాణాలను కోల్పో తుంది. కథ ఆరంభం నుండి అంతం వరకు ఇలాంటి వర్ణనలు, వాస్తవ చిత్రణ కథా పుష్టికి పరిపూర్ణం గావించి, పాఠకుల హృదయాలను ఆనందమయ డోలికల్లో ఓల లాడునట్లు చేసే రచనా సత్తా కల్గిన లబ్ధప్రతిష్టుడు కొలక లూరి ఇనాక్.

**ఆధార గ్రంథం :** కొలకలూరి సమగ్ర రచనలు - ప్రత్యేక సంచిక.

# జానపద సాహిత్యము - పరిణామము

- సైదయ్య మల్లెపాకుల, డిగ్రీ లెక్చరర్, కొండనాగుల, నాగర్‌కర్నూల్ జిల్లా.

**జానపద సాహిత్యం :**

జనపదము అంటే పల్లె. ఆ పల్లెల్లో నివసించే వారినే జానపదులు అని అంటారు. ఆ పల్లె ప్రజలకు సంబందించిన విజ్ఞానమునే జానపద విజ్ఞానము అని అంటారు. ఈ జానపద విజ్ఞానములో ప్రజలకు సంబందించిన జానపద వైద్య విధానము, జానపద కళలు, భాషనృత్యము, సంగీతము, నాటకము, జానపద ఆచార వ్యవహారాలు, వేషభూషణలు మొదలైనవి ఇందులోనే ప్రవేశిస్తాయి.

జానపద సాహిత్యంలో జానపద గేయకథలు, గద్యాఖ్యానాలు, సామెతలు పొడుపు కథలు చేరుతాయి. జానపద గేయాలను, గేయ కథలను కలిపి జానపద కవిత్వము అని అంటారు. ప్రాచీన ప్రబంధకవులు శిష్ట సాహిత్యమని దేనినైతే చెప్పారో అది నాగరికత ప్రజలలో, పండిత లోకంలో పుట్టి ప్రచారం పొందింది. సామాన్య ప్రజలలో పుట్టిన జానపద సాహిత్మయం వారిలోనే ప్రచారం పొంది జీవిస్తుంది. ఈ జానపద సాహిత్యం జానపదుల మానసిక భావనా స్వరూపాన్ని, సుఖదు:ఖాలను యదాతథంగా చిత్రిస్తుంది.

జానపద గేయానికి డాక్టర్ బిరుదురాజు రామరాజు గారు తొమ్మిది ప్రధాన లక్షణాలను ప్రతిపాదించినారు అవి 1) ఆశురచనా 2) అనామక కర్తృత్వము లేదా సామూహిక కర్తత్వము 3) నియమిత స్వరూప రాహిత్యము 4) అ నిర్ణీత రచనా కాలం 5) మౌఖిక ప్రచారము 6) లకృతక శైలి 7) గాన యోగ్యత 8) జన సామాన్య పరిచితమైన వస్తువు 9) అజ్ఞాత శిల్పము అనేటటువంటి కొన్ని ముఖ్యమైన లక్షణాలు ప్రతిపాదించారు. ఈ లక్షణాలన్నీ ప్రతి గేయానికి ఉండనవసరం లేదని ఈ లక్షణాన్నింటి కలయిక అయిన ప్రధాన తత్వము - అజ్ఞాత శిల్పము మరియు సార్వజనీనత ఉంటే చాలని బిరుదు రాజు రామరాజు గారు వివరించారు. జానపద గేయ

**సాహిత్య పరిణామము :**

చాలా ప్రాచీన కాలం నుండి తెలుగు భాషలో గేయ రచన జరుగుతుందని శిష్ట కవులు పేర్కొన్న సమకాలిక గేయాలే ప్రబల సాక్ష్యాలు.

ఏ భాష సాహిత్యములో నైనా గేయరూపములో ఉన్న దేశికవితలే ప్రాచీనమైన రచన, పద్యాలన్ని పదాల పరిణామాలేనని పలువురు విమర్శకుల అభిప్రాయం. గేయాలన్ని మాత్రా ఛందస్సులో ఉంటాయి. జానపద కవితనే కొన్ని మార్పులు పొంది దేశికవితగా పరిణమించిందని చెప్పొచ్చు. నన్నయ్య కంటే ముందువున్న శాసనాలందు క్రీ.శ. 1053 నుండి దేశికవితారీతులు కనబడుతున్నవి.

పాల్కురికి సోమనాథుడు శైవమత ప్రచారానికి అనుకూలమైన దేశిఛందస్సును రచించాడు. పాల్కురికి సోమనాథుని కవిత్వానికి ఆధారము ఆనాటి ప్రజలు భక్తి ఉద్రేకాలతో పాడుకున్న పాటలేనని ప్రచారంలో ఉన్నది. నాచన సోముని జాజర పాట ఛందస్సులోనే ఇప్పటికి తెలంగాణలో జాజర పాటలు కాముని పున్నమి సందర్భంగా జానపదులు పాడుతున్నారు.

జానపద గేయ వాఙ్మయము ప్రధానంగా మౌఖిక ప్రచారం ద్వారానే వచ్చింది. కాబట్టి అందులోని విస్రృత మైన పెద్ద భాగము కాలగర్బములో కలిసిపోయినది. ఆ మౌఖిక సాహిత్యానికి భద్రత లేకున్నది. తాళపత్ర గ్రంథాల్లో అక్కడక్కడ కొన్ని పాటలున్నాయి. ముద్రించి నటువంటి సాహిత్యంలో ఎక్కువగా ఆధునిక గేయ రచనలే ఉన్నాయి. జానపద గేయాల చావుపుట్టుకలు పల్లె ప్రజల నాలుకలయందే జరుగుతున్నాయి. చిన్న, చిన్న గేయాలు వ్యక్తుల కాలక్షేపానికి, ఆనందానికి తోడ్పడుతున్నాయి.

**జానపద గేయ వాఙ్మయోద్ధరణ :**

తెలుగులో శిష్ట సాహిత్యోద్ధరణకు పూనుకొని సి.పి.బ్రౌన్ గారు తొలుత జానపద గేయసేకరణకు కూడా చెప్పుకోదగ్గ కృషి చేశాడు. పల్నాటి వీర చరిత్ర, బొబ్బిలి యుద్ధ కథ, కుమార రాయుని కథ, కామమ్మ కథ, మొదలైన కథా గేయాలను మొదట సేకరించినది చార్లెస్ బ్రౌన్ గారే. దక్షిణ దేశంలో జానపద గేయాలను సేకరించాలనే ఆలోచన మొదట చార్లెస్ ఇ.గోవర్‌కు వచ్చింది. అతడు 1871 లో ప్రచురించిన "ఫర్స్ట్ సాంగ్ ఆఫ్ సౌత్ ఇండియా" అనే గ్రంథం లో తెలుగు పాటలు లేవు. తెలుగు, కన్నడ, మళాయాళ భాషలందున్న గేయాలను సమకూర్చి తెలుగు గేయాలకు బదులుగా వేమన పద్యాలను ప్రకటించాడు. తెలుగులో జానపద గేయాల సేకరణకు వాస్తవంగా "జె.వి.బాయ్ లీ"ని ఆద్యునిగా చెప్పొచును. సర్వాయి పాపడికి సంబందించిన ప్రసిద్ధి చారిత్రక గేయాన్ని మొట్టమొదటగా "బాయ్ లీ" సేకరించాడు. 1884 లో జానకి పాటలు, 1893 లో కోలాట కీర్తనలు అచ్చయినాయి. 1903 లో నంది రాజు చలపతి రావు స్త్రీల పాటలు, 1950 లో మంగు వెంకట రంగనాథ రావు స్త్రీల పాటలు, 1909 లో చిల్లర పాటలు ప్రకటించబడ్డాయి. పంచాగ్నుల ఆది నారాయణ శాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, చిలుకూరి నారాయణ రావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, అక్కి రాజు ఉమాకాంతం మొదలైన పండితులు జానపద సాహిత్యోద్ధరణకు కృషి చేసిన వారిలో ముఖ్యంగా పేర్కొనదగిన వారు, జానపద గేయాలను అసంఖ్యాకంగా సేకరించినవారు నేదునూరి గంగాధరం గారు. వారి మిన్నేరు, మున్నీరు, సెలయేరు అను గేయ సంకలనాలు ప్రసిద్ధి గాంచాయి. టేకుమళ్ళ కామేశ్వరరావు గారి పాత పాటలు, కృష్ణ శ్రీ గారి గేయాలు చెప్పుకోదగినవి. హరి ఆది శేషువు రచించిన జానపద గేయ వాఙ్మయ పరిచయము, డా॥ టి.దొణప్ప ప్రచురించిన జానపద కళాసంపద, త్రివేషి పేరుతో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి ప్రచురించిన గేయ సంకలనం, డాక్టర్ బిరుదు రాజు రామరాజు గారి తెలంగాణ పల్లె పాటలు, ఎల్లోరా గారిసరాగాలు, దీక్షితులు గారి జానపద వాఙ్మయము ఆర్.వి.యస్.సుందరం, టి.వి.సుబ్బారావు, అశ్వర్థ నారాయణ కలిసి ప్రచురించిన ఆల్చిప్పలు - ఆణిముత్యాలు, బి.రామరాజు, నాయని కృష్ణ కుమారి సంపాదించిన జానపద గేయాలు సాంఘిక చరిత్ర టి.వి.సుబ్బారావు సంపాదకత్వంలో వెలువడిన కాటమ రాజు కథలు ఈ కాలంలో వెలువడిన జానపద సాహిత్య గ్రంథాల్లో కొన్ని పేర్కొనదగినవి.

డా॥. బిరుదురాజు రామరాజు గారు తెలంగాణ ప్రాంతంలో వేలకు వేలు గేయాలను సేకరించాడు. జానపద గేయ సాహిత్యము అనే మొదటి జానపద పరిశోదన గ్రంధాన్ని రచించి బిరుదురాజు రామరాజు గారు ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి పి.హెచ్.డి. పట్టాను పొందాడు. యస్వీ జోగారావు యక్షగానాలనుగురించి పరిశోధన చేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం పి.హెచ్.డి. పట్టాను పొందారు. టి.వి.సుబ్బారావు గారు తెలుగులోని వీర గాధలను గురించి వెల్దండ రఘుమారెడ్డి గారు తెలుగు పల్లె పదములందు ప్రజా జీవనము, ఆర్వీయెస్ సుందరం గారు తెలుగు, కన్నడ జానపద గేయాలు అను అంశం గురించి, జి.లింగారెడ్డి గారు తెలంగాణ శ్రామిక గేయాలు గురించి, యం.దేవకి గారు బాలగేయ సాహిత్యం గురించి యం.రజని గారు, బాల నాటికల గురించి, పి.ధనలక్ష్మి బాలల నవల గురించి, శివకుమార్ బాలల కథా సాహిత్యం గురించి, బాలకృష్ణా రెడ్డి గారు తెలుగు పారమార్థిక గేయాల గురించి వివిధ విశ్వవిద్యాలయాలలో వీరు పరిశోధనలు చేశారు.

**జానపద గేయాల విభజన :**

1. పౌరాణిక గేయాలు.
2. చారిత్రక గేయాలు.
3. పారమార్థిక గేయాలు.
4. స్త్రీల పాటలు
5. శ్రామిక గేయాలు.
6. బాల గేయాలు.
7. శృంగార గేయాలు.

8. అద్భుత రసగేయాలు.
9. కరుణ రస గేయాలు.
10. హాస్య రస గేయాలు.

పైన తెలిపిన విధంగా జానపద గేయాల విభజన జరిగింది. ఈ జానపద గేయాలు ఒక్కొక్క ప్రాంతాన్ని బట్టి ఆ ప్రాంత స్థానిక చరిత్రలు, కుటుంబ బంధాలు, వీరగాధలు వివిధ ప్రాంతాల ఆధారంగా ఈ జానపద గేయాలుంటాయి. ఈ గాయాలకు కర్త ఎవరో తెలియదు. జానపద గేయాలు తమ శ్రమను మరిచి పోవడానికి బాణీలల్లుకొని ఆ ప్రాంత పరిస్థితుల్ని బట్టి పాటలు పడుతారు. వారి శ్రమను అనుబంధాలను, వరుసలను, ఆ ప్రాంత స్థితిగతులను తమ పాటల్లో వెల్లడిస్తారు. నాటి నుండి నేటి దాక ఎంతో మంది వాగ్గేయకారులు, నాజర్ నుండి నేటి గద్దర్ వరకు తమ పాటలకు జానపద గేయాల బాణీల ఆధారంగానే జీవం పోశారు. బాధను, దు:ఖాన్ని, ఆనందాన్ని అనురాగాన్ని, జనపదులు తమ గేయాల రూపంలో వ్యక్త పరిచేవాళ్ళు.

ఇవే కాక ఇంకా అనేక రకాల జానపద గేయాలున్నాయి. అవి :

1. కోలాట పాటలు.
2. మోట పాటలు.
3. బావ మరదళ్ళ పాటలు
4. బతుకమ్మ పాటలు.
5. భజన పాటలు.
6. పెళ్ళి పాటలు.
7. లాలి పాటలు.

ఇలా అనేక రూపాల్లో ఆనాటి నుండి జానపద గేయాలు జానపదులు పాడుకుంటూనే ఉన్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఎన్నో రకాల జానపద కవులు కళాకారులున్నారు. "తెలం"గాణ" - అంటే గానం, గేయం, పాట అని అర్థం. తెలంగాణలోని ప్రతి పల్లెల్లో పాటల కళాకారులుంటారు. ప్రతి ఊరు జానపద పాటల పూదోటనే... ఇక్కడ నిత్యం కరువు కష్టాలు జానపదుల జీవితాలను అతలా కుతలం చేస్తుంటాయి. ఈ కష్టాల బరువును దించడానికి కొంత ఊరట కోసం వివిధ రకాల బాణీలలో ఆశువుగా గేయాలల్లుతుంటారు. మనిషి జీవితం, మానవ సంబంధాలు, ఆర్థిక సంబాంధాలు ఈ సమాజంలోని అసమానతలు వీటన్నింటిని తమ పాటల్లో వ్యక్తం చేస్తారు జానపదులు, పండుగల సందర్భంలో జానపదులు, వీధినాటకాలు, యక్షగానాలు, భజన పాటలు స్త్రీలైతే బతుకమ్మ పాటలు పాడుతూ మురిసి పోతుంటారు. ఆయా జానపదుల ఆయా సంస్కృతుల ఆచారాలను బట్టి జానవదగేయాలు రూపుదిద్దు కుంటాయి. మనిషి పుట్టుకకున్నంత చరిత్ర కలిగి ఈ జానపద గేయాలు జానపదులతో పాటే పుట్టి పెరిగాయి.

**జానపద కవిత్వం :**

జానపద కవిత్వానికి సామాన్యంగా కర్త ఎవరో తెలియదు. సామూహిక కర్తృత్వం సామూహిక ప్రచారం ఈ మౌఖిక కవిత్వము సంప్రదాయ ప్రధాన లక్షణాలు. జానపద కవిత్వాన్ని గేయం, కథా గేయం అని రెండు విధాలుగా విభజించవచ్చు. జానపద గేయాల్లో కథ ఉండదు. ఆత్మ పరత్వం ఎక్కువగా కనిపిస్తుంది.

ఏటికేతం బెట్టి యెయి పుట్లు వండించి.
ఎన్నడూ మెతుకెరుగనన్నా.
నేను గంజిలో మెతుకెరుగనన్నా

అని శ్రమ పడుతున్న ఓ అనామకుడు తన ఆవేదనను తను పడుతున్న శ్రమను ఆ శ్రమకు తగిన ఫలితం లేదని తన దీన స్థితిని వ్యక్తపరుస్తున్నాడు.

అదే విధంగా ఒక తల్లి తన బిడ్డ అన్నం తినకపోయినా, మాట వినక మారాము చేసినా ఆ పిల్లవాన్ని సముదాయించాలి .... అందుకోసం.

చందమామ రావే - జాబిల్లి రావే
కొండెక్కి రావే - కోతిపూలు తేవే
పరుగెత్తి రావే - పాలు పెరుగు తేవే
అన్నింటిని తేవే - మా అబ్బాయి కీవే

అంటు ఓ తల్లి తన బిడ్డ కోసం పై విధంగా పాట పాడుతుంది. అలాగే వేడుక పాటలు, వలపు పాటలు,

జీవిత సన్నివేశాన్ని చిత్రీంచటంలో ఈ క్రింది పాట చాలా ప్రసిద్ధమైంది.

కంటికి కాటుక బెట్టి - కడవా చంకనబెట్టి
కళ్ళ నీళ్ళు కడవ నిండెను గదరా
చల్ మోహన రంగా అంటూ సాగుతుంది.

అదే విధంగా బావా, మరదళ్ళ పాటలు కూడా చాలా భావాత్మకంగా ఒకరి మనుసు లోని భావాన్ని ఇంకొకరికి అర్థమ్మయ్యేటట్లు పాట రూపంలో సాగుతుంటాయి. ఈ క్రింది పాట బావా మరదల్లా కు సంబందించిన ఒక ప్రసిద్ధి జానపద గేయం.

"చిన్ని చిన్ని దానివే ఓ పిల్ల - పజ్జోన్న గోసెదానా, ఆకల్లదూపల్లా నినుకోరి వచ్చాను - కాపు జొన్నలు గాయవే " అంటూ ఈ పాట ఎంతో లయాత్మకంగా సాగుతుంది. ఇలా తెలంగాణలో ఎన్నో వందల వేల జానపద గేయాలు ప్రజల నోళ్లలో నాట్యమాడుతేనే ఉన్నాయి. కల్పితాలు, లేకుండా కపటాలు లేకుండా ఒక స్వచ్ఛమైన తేటని ఊటలా ఈ జానపద గేయం జలజలాపారుతుంది. నేడు కవులుగా, గాయకులుగా, ప్రజావాగ్గేయ కారులుగా పాటలు పాడుతున్న ఎంతో మందికి ఈ జానపద బాణీలే పునాదులు, వీటి ఆధారంగానే పాటలు అల్లుతున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా శాస్త్రి.
2) తెలుగు సాహిత్య సమీక్ష - డా॥జి.నాగయ్య.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కథల్లో కుటుంబ జీవన చిత్రణ

**- మామిడి విజేత,** పరిశోధక విద్యార్థిని, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

మానవుడు ఎప్పుడైతే మాట్లాడడం మొదలుపెట్టాడో అప్పుడే కథ పుట్టిందని చెప్పవచ్చు. కనుక కథ చాలా శతాబ్దాల కిందటే పుట్టిందని ఆశ్చర్యపోవాల్సింది ఏమి లేదు. మనిషి తనచుట్టూ ఉన్న పరిసరాలలో విన్నవాటిని, చూసినవాటిని, తాను స్వయంగా అనుభవించిన అనుభవాలను, అనుభూతులను ఒక కథగా రూపుకట్టి తన చుట్టూన్న వారికి వినిపించిన మాటలే నేడు కథలుగా రూపాంతరం చెందినట్లుగా తెలుస్తుంది. ఇలా కథ కాలక్రమేణా తన స్వరూపస్వభావంలో మార్పు తెచ్చుకుని, పూర్వకాలంలో ఊహాకల్పనతో నడిచే కథలు ఈనాడు కథానికలుగా మారి రానురాను తెలుగు సాహిత్యంలో దాని స్థానాన్ని నిలుపుకుంది.

సమాజానికి, సాహిత్యానికి సన్నిహిత సంబంధం ఉంటుంది. సమాజంలో జరిగే అంశాలను సాహిత్యం వివిధ ప్రక్రియల రూపంలో వ్యక్తం చేస్తుంది. కావ్యం, ప్రబంధం, నాటకం, నవల మొదలైన సాహిత్య ప్రక్రియలతో పోలిస్తే కథానిక వయస్సు చాలా చిన్నది. సాంస్కృతిక పునరుజ్జీవనం తర్వాత భారతదేశంలోకి వచ్చిన కథానిక మెల్లగా తెలుగు సాహిత్యంలోకి కూడా వచ్చింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో కథానిక ప్రక్రియ 20వ శతాబ్ది ప్రారంభంలో ప్రవేశించి ఒక బలమైన ప్రక్రియగా వికసించింది. ఆంగ్ల సాహిత్యం నుండి దిగుమతి అయిన వచన సాహితీ ప్రక్రియలలో కథానిక ఒకటి.

సాహిత్యం మానవసృష్టి, మనిషి ప్రకృతికి, తనకి మధ్య ఏర్పడిన సంబంధాల నుంచి, సామూహిక (సామాజిక) సంబంధాలు నుంచి రూపొందాడు. కాబట్టి ఈ మానవ సంబంధాల సాహిత్యంలో అనివార్యంగా ప్రతిఫలిస్తాయి. బాహ్య ప్రపంచాన్ని మనిషి తనకు సంబంధంలేని కేవలం పదార్థంగాకాక తనకు దానితో గల సంబంధాల్లోంచే చూస్తాడు. కాబట్టి సాహిత్యం మానవ సంబంధాలకతీతంగా బాహ్య ప్రపంచాన్ని చూడలేదు. వ్యాఖ్యానించలేదు.

సాహిత్యం, మనిషి తనను తాను అర్థం చేసుకొనే విధానం, తనను తాను ఆవిష్కరించుకునే విధానం. All men by nature desire to know అని అరిస్టాటిల్ అంటాడు. తనన్ని ప్రపంచాన్ని తెలుసుకునే క్రమంలో సాహిత్యం ఒక భాగమే. తనను తాను అర్థం చేసుకోవాలంటే తానే (మనిషి) అక్కడ ఉండాలి. తన జీవితమే అందులో ప్రతిఫలించాలి.

"No man is an Inland, intire of it selfe...every man is a piece of continent, a part of the maine"

(సాహిత్యంలో మౌలిక భావనలు)

అంటే మానవ సంబంధం లేని మనిషి ఉండడు. మనిషి చుట్టూ మనుషులుంటారు. మనిషంటే సమూహంలో మనిషి. సమాజంలో మనిషి. కాబట్టి ఇక్కడ

మనిషి = మానవ సంబంధాలు.

సాహిత్యానికి మనిషి జీవితమే పునాది అంటే మానవ సంబంధాలే పునాది అని మనం అర్థం చేసుకోవాలి. ఈ మానవ సంబంధాలు సమాజంలోని ఉత్పత్తి విధానాన్ని బట్టి, జాతిని బట్టి, రక్తసంబంధాన్ని (కుటుంబం) బట్టి, ఇంకా భాష, కులము, మతము మొదలైన అనేక అంశాలను బట్టి నిర్దేశింపబడతాయి. మానవ సంబంధాలకు సుస్థిరత్వం లేదు. అవి సమాజ సమాజానికి, వ్యక్తివ్యక్తికి ప్రత్యేకంగా ఉంటాయి. మారుతున్న సమాజంలో మారుతున్న మానవ సంబంధాలే సాహిత్యంలో వర్ణించదగిన వస్తువు.

ప్రతి జీవిత సన్నివేశంలో ప్రతి సంఘర్షణ అనుభవం వద్ద మనిషికి ఎన్నో భావావేశాలు కలుగుతాయి. భయం, కోపం, ద్వేషం, అసహ్యం, అవిశ్వాసం, ప్రేమ, సంతోషం,

విశ్వాసం మొదలైనవి భావావేశాలు. ఈ భావావేశ ప్రధానమైన జీవితమే సాహిత్యంలో వర్ణించబడుతుంది. "మానవ సంబంధాలు" అనే అంశం ఎంత కొత్తదో అంత పాతది. అయితే గతంలో ఈ కథా వస్తువు నిర్వహించ బడిన విధానానికి ప్రస్తుతం నిర్వహించబడుతున్న విధానానికి ఒక స్పష్టమైన తేడాని మనం గమనించవచ్చు. ఇదివరలో మనం గొప్పవిగా చెప్పుకునే చాలా కథల్లో పాత్రలు అవతలి వారిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ ఉండేవి లేదా తమని తాము అర్థం చేసుకునే దారిలో ప్రయాణిస్తూ ఉండేవి. వర్తమాన సాహిత్యంలో మాత్రం ఎక్కువ భాగం కథలలో పాత్రలు "మనల్నెవరూ అర్థం చేసుకోవడం లేదు" అని ఆక్రోశిస్తూ ఉంటున్నాయి.

సమాజానికి కేంద్రం వ్యక్తి. వ్యక్తి ఆధారంగా సమాజంలో అనేక రకాలైన వ్యవస్థలు, సంబంధాలు విస్తరిల్లుతాయి. ఇవి వ్యక్తిలో అంతర్గతంగా ఉండే మానవీయ శక్తులు వికసించేందుకు ఉపయోగపడ తాయి.

**ప్రకృతి :**

తెలుగు కథలన్నీ మానవ సంబంధాలతో ముడివేసు కున్నవే. మానవత్వం పరిమళించని కథ ఉండదు. ప్రతి కథలోనూ మానవత్వం గుభాళిస్తుంది. మానవుని స్వభావముపై ప్రభావం చూపేది ప్రకృతి. వ్యక్తికి, సమాజానికి రూపాన్ని ఇవ్వడం కోసం అతనికి జ్ఞానోద యాన్ని కలిగించేది ప్రకృతే.

"యతః ప్రకృతిర్భూతానాం యేన సర్వమిదం తతమ్
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః"

(భగవద్గీత).

వ్యక్తిని ఇతర సృష్టి నుండి వేరు చేసి, అతని శరీరానికి బయట (వెలుపల) ఉన్న సాధనాలను ఉపయోగించు కునే నిమిత్తం ప్రకృతి అతనికి సహాయపడుతుంది. ప్రకృతి సహాయంతోనే, ఈ విశాల విశ్వంలో మానవుడు ప్రాచీన కాలం నుండి ఇప్పటివరకు ఎన్నో విజయాలను సాధిస్తూ తన జ్ఞానాన్ని, మేధస్సునూ పెంచుకుంటున్నాడు. మనిషి తాను జన్మించడంతోనే తనకు తెలియకుండానే తాను నివసించబోయే సమాజంతో సంబంధాన్ని కలిగి ఉంటాడు. అందువల్ల కథా రచయితలు వారి వారి కథల్లో మానవత్వాన్ని పొందుపరిచారు. కావున కథల్లో మానవ జీవితం, సుఖసంతోషాలు, కష్ట నష్టాలు, ఆత్మీయతలు, అనుబంధాలు, మానవ సంబంధాలు, స్త్రీ పురుషుల సంబంధాలు, మనస్తత్వాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలు వంటి అనేక అంశాలు మానవ జీవితంతో ముడిపడి ఉంటాయి.

మానవజీవితం ఒక ప్రవాహం వంటిది. దినదినము పొందే మార్పులను అనుసరించి మానవజీవితం కొనసాగు తుంది. అందుకే మానవుని జీవితం సంక్లిష్టమైంది. సంక్లిష్టమైన జీవితంలోంచే సమస్యలు పుట్టుకొచ్చి సమస్యకు ముడిసరుకు దొరుకుతుంది. అయితే రచయిత దృష్టి ఎటు పయనిస్తుందన్న విషయాన్ని ఆ రచయిత తీర్చిదిద్దిన మానవ సంబంధాల ఆధారంగా వివరించ వచ్చు. కాల్పనిక సాహిత్యం స్థూలంగా మనుషుల మీద, మనుషుల మధ్య సంబంధాల మీద, ఆ సంబంధాల మార్పుల మీద, ఆ సంబంధాల వల్ల కలిగే ఉద్వేగాల మీద ఆధారపడుతుంది.

"మనిషికి మనిషికి మధ్య ఉన్న సంబంధమే మానవ సంబంధం. మనిషంటే శరీరం, మనస్సు, బుద్ధితో కూడిన ఆత్మ. మానవుడు ఊహ తెలిసినప్పటి నుండి తన, పర అనే భేదాలు తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఉన్నాయని తెలుసుకుంటాడు. తరతరాలుగా వచ్చే సంప్రదాయాలు, సంస్కృతులు కట్టుబాట్లతో జీవితాన్ని కొనసాగిస్తాడు. సమాజంలో మనిషి బ్రతికే క్రమంలో తమ తోటి మనుషులతో పరస్పర సంబంధాలు ఏర్పడతాయి. ఈ సంబంధాలు మనిషికి పుట్టుకతో ప్రారంభమవుతాయి. మానవుడు సంఘజీవి. సంఘంలో ఒంటరిగా బ్రతకడ మనేది జరుగదు. పరస్పర సహకార భావం సంఘం ముఖ్య లక్షణం. సుఖవంతమైన జీవితాన్ని గడపడానికి మానవుడు తన చుట్టూ ఉన్న వ్యక్తులతో సంబంధాన్ని

ఏర్పరచుకొని జీవిస్తాడు. సమాజం మానవుని ప్రభావితం చేస్తుంది. కాబట్టి వివిధ రకాలుగా మారడానికి అవకాశం ఉంటుంది. కాలానికి అనుగుణంగా సమస్యలు మారుతూనే ఉంటాయి. ఈ సమస్యలకు అనుగుణంగా తెలుగు సాహిత్యంలో రచయితలు అనేక కథలు రచించారు.

**కుటుంబ సంబంధాలు :**

మానవుని జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలలో మొట్టమొదటిది కుటుంబం. దీనిద్వారా కుటుంబంలోని వివిధ వ్యక్తులతో ముందుగా సంబంధం ఏర్పడుతుంది.

కుటుంబం అనేది ఒక ప్రాథమికమైన నియంత్రణ వ్యవస్థగా మనం గుర్తించవచ్చు. కుటుంబ జీవితం కేవలం వంశాన్ని నిలిపే సాధనం మాత్రమే కాదు. తన నాటి సంస్కృతి సంప్రదాయాలను తరతరాలకు వ్యాపింపజేసే వాహిక కూడా. ఈ కారణంచేత కుటుంబవ్యవస్థ స్థిరత్వం మీదనే సమాజ స్థిరత్వం ఆధారపడి ఉంది.

వ్యక్తికి ఆత్మీయమైన సుఖసంతోషాలు, సంతృప్తిని చేకూర్చేది కుటుంబ వ్యవస్థ. కుటుంబ సంబంధాలు అంటే కుటుంబంలోని వ్యక్తుల మధ్య ఉన్న సంబంధాలు, కుటుంబాల మధ్య ఉన్న సంబంధాలు. తల్లి, తండ్రి, పిల్లలు, భార్య, భర్తల మధ్య ఉండే సంబంధాలు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండే సంబంధాలుగా మనం చెప్పుకోవచ్చు.

మానవ సంబంధాలన్నీ కుటుంబ సంబంధాలే. హైందవ (హిందూ) కుటుంబవ్యవస్థలో సామాన్యంగా సమిష్టి కుటుంబాలు కనిపిస్తాయి. కుటుంబసభ్యుల అవసరాలను, ఆలోచనలను గమనించి నడుచుకోవాల్సిన బాధ్యత కుటుంబ పెద్దది. కష్టసుఖాల్లో అందరూ భాగం పంచుకుంటారు. అనేక కారణాల వల్ల సమిష్టి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి.

తొలి తెలుగు కథైన 'దిద్దుబాటు' కుటుంబం, వైవాహిక జీవితానికి సంబంధించిన కథే. కమలిని తన కుటుంబాన్ని చక్కదిద్దుకోవడానికి చేసిన ప్రయత్నమే. ''మరిలాగా రాతకోతలు మప్పితే ఉడ్డోరం బాబు' అని రాముడు అన్న దాన్ని బట్టి కుటుంబంలోని స్త్రీ చదువు కుంటే విడ్డూరమని, స్త్రీవిద్యను గురించి సందేహ పడుతున్నప్పుడు, భర్తను మార్చడం కోసం

ఉత్తరం రాసిపెట్టి అతన్ని చక్కదిద్దుకుంటుంది. దీన్నిబట్టి ఈనాటి కుటుంబ పరిస్థితి ఏమిటని ప్రశ్నించు కున్నట్లయితే ఇప్పుడు కుటుంబాన్ని, ముఖ్యంగా వైవాహిక వ్యవస్థను ప్రశ్నించే కాలం వచ్చింది. ఇవాళ కమలిని, గోపాల్‌రావు దంపతులైతే కమలిని

సమస్య తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడమేగాని, ఆనాడు గురజాడ 'దిద్దుబాటు'లో లాగా మార్పు తీసుకు రావడం, సంస్కరణ ధోరణిలో ప్రవర్తించడం కాదు.

పెద్దింటి అశోక్‌కుమార్ రచించిన 'మాయిముంత' అనే కథలో రచయిత కుటుంబ సంబంధాలను చాలా చక్కగా వివరించాడు. పుట్టు నొప్పుల బాధ నీకేం తెలుసు. ఇయ్యపురాలు తిట్టిందని, అల్లుడు కొట్టిండని, బిడ్డ అలిగిందని కాన్పుకు తోలుకరాక ఊకున్నమా? వాళ్ళ ముఖం ఎవలు చూసింద్రు. బర్రె ముఖం జూడు. తల్లడిత్తంది. ఇది పురుడుకు తల్లిగారింటికొచ్చింది? అన్నది. దీన్నిబట్టి ఆడపిల్లనిచ్చిన వాళ్లు అణకువగా ఉండాలని, పెళ్లయ్యాక ఆడపిల్ల కూడా తను కావాలి అని అడిగిన వాటిని ఇవ్వకపోతే అలిగి ఇంటికి కూడా రాకుండా ఉంటుందని మనం అర్థం చేసుకోవచ్చు. 'తలడిచ్చుకుంటనే తల్లి పిల్ల కొరకు దేవులాడుతంది. నిలవడి ఈనితే పిల్లలకు దెబ్బ తగులుతుందని గడ్డిల పన్నది. బిడ్డ పుట్టుడంటే తల్లి సచ్చి పుట్టినట్టు అంటుంది బర్రెతో. దీనివలన రచయిత తల్లి పిల్లల సంబంధాన్ని చక్కగా వివరించాడు. అంతేకాకుండా గడ్డిపోసల్ని నములుతూ, నములుతూ ఆయాసాన్ని బిగపట్టుకొని పాలు ఇత్తనే ఉంది. రెండింటిని చూస్తూ "అందుకే అంటారేమో బిడ్డ రాయి. తల్లి లక్క అని" అనుకుంది సాయమ్మ. ఇందులో తల్లికి పిల్లల మీద ఉన్న అవ్యాజమైన ప్రేమ ఎప్పుడైనా ఒకలాగే ఉంటుందని కాని పిల్లల ప్రేమ మారుతూనే ఉంటుందని చాలా చక్కగా చెప్పాడు. అంతేగాకుండా ఈ కథ వల్ల కుటుంబాలపట్ల ఎంత

శత్రుత్వమున్నా మూగజీవాలను సైతం ఆప్యాయంగానే చూడగలిగారు. విలువలు మారిన, మనుషులను దూరంగా ఉంచినా ఇంకా తడి ఇంకిపోని మానవ హృదయం ఆవిష్కృతమైంది.

''అబ్బాయి వద్దు'' అనే కథలో సింధు, ఆకాశ్ దంపతులు. 'నా కడుపులో పెరుగుతున్నది మగ బిడ్డ అని తెలిసి మరీ ఎందుకు అబార్షన్ చేయించారు.'అందుకే చేయించాను' 'ఎవరైనా ఆడపిల్లలైతే వద్దనుకొని అబార్షన్ చేయిస్తారు. మీరు మగ పిల్లవాడని తెలిసి అబార్షన్లు చేయించడమేమిటి' అని సింధు అడుగుతుంది. దీన్నిబట్టి ఆడపిల్లలంటే ఖర్చుతో కూడుకున్న విషయమని వాళ్లను చదివించాలి, ఉద్యోగం చేయించాలి, పైగా బోలెడన్ని కట్నాలిచ్చి పెళ్లిళ్లు చెయ్యాలి. ఇన్ని చేసినా వాళ్ళు అత్త గారిండ్లల్లో సుఖంగా ఉంటున్నారని కూడా లేదు. అందువల్లనే చాలామంది ఈ బాధలన్నీ ఎందుకు అని ఆలోచించడం వల్లనో ఏమో కాని ఆడపిల్లల్ని వద్దనుకుని, అబార్షన్ చేయించుకోవడం సహజమైంది కాని ఈకథలో మాత్రం ఆకాష్ తను మగపిల్లవాడై పుట్టి కూడా, తన తల్లికి సహాయపడలేక, మాతృహృదయంలో ఉంచి చివరిదశలో కూడా ఉపయోగపడలేకపోతున్నాననే బాధతో తన భార్య సింధు గర్భంలో ఉన్నది పిల్లవాడని తెలిసి అబార్షన్ చేయించడం, సింధుకి రెండవసారి ఆడపిల్ల కలిగాక తను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవడం జరుగుతుంది. సంసారాల్లోని నిజాన్ని ఈ కథద్వారా మనం గమనించవచ్చు.

వివాహం జరుపుకోవడంలోను ఒక ప్రత్యేకత ఉంది. వివాహం కేవలం వ్యక్తిగతమైన అంశం కాదు. కుటుంబ సంబంధమైనది. హిందూసమాజంలో వివాహం అనేది విడదీయరాని బంధం. పెళ్ళికి పునాది నమ్మకమే. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకో వలసిన బాధ్యత దంపతు లిద్దరిపైన ఉంటుంది. భాగస్వామి ఫోనులు తనిఖీ చేయడం, ఆలస్యంగా వస్తే అపార్థం చేసుకోవడం, తగాదాకు దిగడం నమ్మకానికి తూట్లు పొడుచుపోవడమే. లేనిపోనివి ఊహించుకొని గొడవలకు దిగడం మనం ఎంతో పవిత్రమనుకునే భార్యాభర్తల బంధాన్ని ఎగతాళి చేయడమేనని 'పచ్చని ఆకులు రెండు' అనే కథలో చక్కగా చెప్పడం జరిగింది.

నేడు భార్యాభర్తల నడుమ ఉండవలసిన అనురాగం క్షీణిస్తుందనేది నిస్సందేహం. యువత శాస్త్రరీత్యా జరిపే వివాహాలకంటే కాంట్రాక్టు పెళ్లిళ్లు చేసుకోవడానికి చూపుతున్న శాతం రోజురోజుకూ పెరిగిపోతుంది. దీనికి ముఖ్య కారణం పాశ్చాత్య నాగరికత, ఆడ మగ అనే తేడా లేకుండా ఇద్దరూ పని చేయడంవల్ల చేతుల్లో ఆడుతున్న డబ్బు.

**ముగింపు :**

సమాజంలోని సంక్లిష్టమైన, సంక్షుభితమైన అంశాలు, అందులో భాగమైన మనుషులనూ వాళ్ళ మధ్య సంబంధాలను అతలాకుతలం చేస్తుందని, ఈ వర్తమానానికన్న ముందరి మనుషులు తర్వాతి మనుషులు ఒకరు కాదు, వారి మధ్య సంబంధాలు యధాతథంగా ఉండడానికి అవకాశం తక్కువ. ఈ కల్లోలభరితమైన జీవితమే కాల్పనిక సాహిత్యానికి గొప్ప ముడిసరుకును అందజేస్తుంది. మానవ సంబంధాలలో మార్పులతోనే మనుషులలో మార్పును గుర్తించగలుగుతాం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు నవలల్లో కుటుంబ జీవనచిత్రణ - సి.ఆనందరామం.
2. సాహిత్యంలో మౌలిక భావనలు - పి.శివశంకర్.
3. భగవద్గీత - వి.వెంకటసుబ్బయ్య.
4. తెలుగు కథాసాహిత్యం - ఆధునిక దృక్పథాలు - ఎస్.శరత్‌జ్యోత్స్నారాణి.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలంగాణ సాహితీ ఉద్యమ నిర్మాత వట్టికోట ఆళ్వారుస్వామి

- మేరోజు బ్రహ్మాచారి

తెలంగాణా ప్రాంత తొలి నవలా రచయిత శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి. తెలంగాణ ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసే అనేక కథానికలు ఆయన రాశారు. గ్రంథల యోధ్యమం ద్వారా విజ్ఞాన వ్యాప్తికి కృషి చేసిన సాహిత్యాభిలాషి శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి.నల్లొండ జిల్లా నకిరేకల్లు మండలంలోని చెరువ మాధవరం గ్రామంలో 1915 నవంబరు ఒకటిని ఆయన జన్మించారు. తండ్రి రామ చంద్రాచార్యులు, తల్లి సింహాద్రమ్మ. నిరుపేద వైష్ణవ బ్రాహ్మణులు.

శ్రీ ఆళ్వారు స్వామి 1938 ప్రాంతంలో తెలంగాణ గ్రంథాలయోద్యమంలో ప్రముఖపాత్ర పోషించారు. శ్రీ పట్టాభి సీతారామయ్య, శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావులతో కల్సి అనేక సమావేశాలు ఉద్యమాలలో పాల్గొన్నారు. 'దేశోద్ధారక గ్రంథ మండలి' పేరిట' ఒక సంస్థను ఏర్పాటు చేసి పలు గ్రంథాలను ప్రచురించారు. ఈ పుస్తకాలను తన భుజాలపై పెట్టుకొని గ్రామ గ్రామాన తిరిగి పుస్తక ప్రియులచేత చదివించి, చందాదారులుగా చేర్పించారు. దేశోద్ధారక గ్రంథ మండలి తరపున ఒక రిఫరెన్స్ లైబ్రరీని కూడా స్థాపించి పాత పత్రికలు గ్రంథాలను సేకరించి ఆయా రంగాలలో నిష్ణాతులకు, పరిశోధకులకు అనువుగా వుంచారు.

ఆళ్వారు స్వామి 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని కొంత కాలం జైలు శిక్ష అనుభవించారు. 1944 లో ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. అభ్యుద్య రచయితల సంఘంలోనూ ఆళ్వారుస్వామి తనదైన చురుకైన పాత్ర పోషించారు.1946 ప్రాంతంలో నిజాం ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేదించింది. కమ్యూనిస్టు నాయకుల్ని అరెస్టు చేసింది. దాంతో అనేక మంది నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. అయితే పోలీసులకు చిక్కిన శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామిని మూడేళ్ళ పాటు సంగారెడ్డి, వరంగల్లు, గుల్బర్గా జైళ్ళకు పంపారు. ఆళ్వారుస్వామికి ఈ జైలు జీవితంలో ఎన్నో గ్రంథాలు చదువుకునే వీలు చిక్కింది. ఈ సమయంలోనే శ్రీ ఆళ్వారుస్వామి జైలు నియమనిడంధనలను ఎంతగానో సంస్కరించాలని ఆందోళన చేశారు.

జైళ్ళో నిర్బంధంలో వుండే నేరస్థుల మనోభావాలను విశ్లేషిస్తే 'జైలు లోపల' అనే గ్రంథం తన జైలు జీవిత అనుభవాలను రసవత్తరంగా గ్రంధస్థం చేశారు. అలాగే, తెలంగాణా ప్రాంత ప్రజా జీవితం, ప్రజల నుడికారంతో ఈయన రాసిన 'ప్రజల మనిషి' గ్రంథం ప్రతి వారినీ ఆకర్షించింది. ఆనాడు ఆళ్వారుస్వామి రాసిన మరో నవల 'గంగు' తెలంగాణా జీవన రీతికి అద్దం పడ్తుంది. అభ్యుదయ రచయితల సంఘం క్రియాశీలక సభ్యునిగా ఈయన రాసిన రచనలు సుమారు 20 పైగా ఉన్నాయి.

తెలంగాణ ప్రజా ఉద్యమానికి, ప్రజా సాహిత్యానికి ఊపిరివంటి వారు ఆళ్వారుస్వామి. వారు తెలంగాణలో గ్రంథాలయోద్యమం నుంచి అన్ని ఉద్యమాల్లో పాల్గొన్న చైతన్య శీలి. ఆళ్వారుస్వామి సాగించిన ఉద్యమం, ఆయన రచనలు గతాన్ని తెలుసుకోవడానికి మాత్రమే పరిమితం కాదు. ఇప్పటికి పరిస్థితులలో రచయితలు, ఉద్యమకారులు తమ కర్తవ్యాన్ని తెలుసుకోవడానికి వట్టికోట చూపించిన దారి ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాత కూడా పోరాడుతున్న తెలంగాణ ప్రజలకు వట్టికోట స్ఫూర్తిదాయకంగా ఉంటాడు. వలసాధిపత్యం ఎన్ని రూపాలలో సాగుతున్నదో అర్థం చేసుకుంటే దానిని ఎదుర్కోవటం ఎట్లా అనేది చర్చించుకోవచ్చు.

ఇప్పటికీ తెలంగాణ వాదులకు ఏటికి ఎదురీదినట్టే ఉన్నది. తెలంగాణ సమాజానికి దారి చూపించి తెలంగాణ సాధించుకున్న విజయాలను సుస్థిరపరచు

కోవలసిన బాధ్యత తెలంగాణ వాదులపై ఉన్నది. తెలంగాణ ఉద్యమకాలంలో కొందరు కవులు, రచయితలు చేసిన కొంత కృషిని గుర్తించవలసిందే. అయితే తెలంగాణ భాష, తెలంగాణ వాదం, భావజాలం మొదలైన అన్నిటిపై స్పష్టమైన అవగాహన రచయితలకు ఉండాలె. కవులు రచయితలు ప్రజలకు చెప్పే స్థితిలో ఉండాలె.

సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ డబ్బు మిగిలించుకుని పుస్తకాల కోసం ఉపయోగించుకునేవాడు. పఠనం, ఉద్యమం లక్ష్యంగా ఆయన బతికాడు. రచన కూడా ఉద్యమంలో భాగమే. ఆయన రిక్షా కార్మికుల సంఘం, గుమాస్తాల సంఘం మొదలైనవి పెట్టాడు. కానీ ఎక్కడా ఉద్యమాలను నడుపలేదు. పుస్తకాలను ప్రచురించాడు. ప్రజలకు చేరవేశాడు. ఉద్యమంలో నాలుగు రాళ్ళు బొక్కడానికి పుస్తకాలు వేయడం, సంఘాలు నడపడం తద్వారా ప్రజలకు ద్రోహం చేయడం ఇవాళ కనబడుతున్నది. ఇప్పుడు తెలంగాణ సమాజానికి కావలసింది వట్టికోట వంటి గ్రంథాలయోద్యమకారులు. ప్రజలు ఎక్కడ ఉద్యమిస్తుంటే, అక్కడ తన అనుచరులతో సభలు పెట్టించుకొని కారు సమకూర్చమని అడిగి వెళ్ళి కడుపు నిండా తిని ప్రసంగాలు ఇచ్చే పెద్దలు ఇవాళ ఎటు చూస్తే అటు కనిపిస్తున్నారు. వట్టికోటలు ఇవాళ తెలంగాణ సమాజం నుండి రావాలే. వట్టికోట అభ్యుదయ రచయితల సంఘంలో పనిచేసినా, కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా పనిచేశాడు. అయితే ఉద్యమాన్ని అర్థం చేసుకున్నాడు. సమాజాన్ని, సామాజిక సంబంధాలను అర్థం చేసుకున్నాడు. ఇది ఆయన రచనలలో స్పష్టంగా కనబడుతుంది.

ప్రజల మనిషి నవలలో కథానాయకుడు కంఠీరవం. కంఠీరవం పాత్రలో ఒక "నిశ్శబ్దమైన తిరుగుబాటు దారు" ఉన్నడు. ఉద్యమ కార్యక్రమంలో సఫల వ్యూహకర్తగా కూడా కంఠీరవం కనబడతాడు. రచయితలు తమకు తెలియకుండానే స్వీయ వ్యక్తిత్వాన్ని తాము సృజించిన పాత్రల్లో నిక్షిప్తం చేస్తారనే విశ్వాసం కొందరు విమర్శకుల్లో ఉంది. అది ఆళ్వారు స్వామి చిత్రించిన ప్రజలమనిషి నవలలోని కంఠీరవం పాత్రలో మూర్తీభవించింది. నవలలో కంఠీరవం ఎక్కడా ఉద్రిక్త ప్రసంగాలు చేయలేదు. తను మాత్రమే ఆయుధాలు ధరించి అడవుల్లో తిరగలేదు. శుష్కమైన నినాదాలు చేయలేదు. చడీ చప్పుడు చేయకుండానే ప్రజా ఉద్యమంలో సర్కారును కదిలించే కృషిని ఆరంభించాడు. ఆళ్వారుస్వామి నలభై ఏడేళ్ళ జీవితంలోనూ ఇదే తీరు కనబడుతుంది.

నిజమైన ఉద్యమకారుడికి ప్రత్యేకమైన వ్యక్తిగత జీవితం ఉండదు. సమాజంతోనే అతడి నిత్య జీవితం మమేకమవుతుంది. సిసలైన ఉద్యమకారుడు ఏనాడు ఏకాంతవాసంలో ఉండలేదు. పదిమందిని కదిలిస్తూ తాను కదం కదుపుతాడు. ఈ రెండు అంశాలు ఆళ్వారు స్వామి జీవితంలో సుస్పష్టంగా కనబడతాయి. ఆయన తన నాలుగున్నర దశాబ్దాల ఆయుర్దాయంలోనే ఎన్నో పనులు చేయగలిగారంటే వ్యక్తిగత జీవితమంటూ ప్రత్యేకంగా నిర్మించుకోలేదనే సారాంశం. ఆళ్వారుస్వామి చుట్టూ ఎప్పుడు మిత్రులు, ఉద్యమకారులు, కవులు, రచయితలు ఉండేవారట. వీరిలో వివిధ భావజాలాలకు సంబంధించిన వారున్నారు. విభిన్న రాజకీయ నేపథ్యాలున్న వారు వీరిలో కనబడేవారు. అందరితోనూ కలిసి పనిచేయగలిగే విశాలమైన దృక్పథం, విభిన్న ఆలోచనల్ని స్వీకరించే పరిపూర్ణ ప్రజాస్వామిక దృక్పథం ఆళ్వారు స్వామిలో నిండుగా ఉండేది.

ఆళ్వారు స్వామి ప్రజా జీవితం నిజామాబాద్ లో జరిగిన వయసు నిజామాంధ్ర మహాసభల్లో పాల్గొనడంతో ఆరంభమైంది. అప్పటికాయన వయసు ఇరవైరెండు సంవత్సరాలు. ఈ సందర్భంలో ఆనాటి తొలిదశ నిజామాంధ్ర మహాసభల రాజకీయ వైఖరిని గురించి నిష్పాక్షిక దృష్టితో ప్రస్తావించుకోవడం తప్పేమికాదు. 1930 లో జోగిపేటలో ఆరంభమైన ఈ సభల్లో తొలుత అందరూ మితవాదులే. దేవరకొండ, ఖమ్మం, సిరిసిల్ల, షాద్ నగర్ లు వేదికలుగా ప్రతిఏటా జరిగిన ఆంధ్రమహాసభలు నేతల మితవాద వైఖరికి అద్దంపట్టాయి. ఈ సభల్లో ఎక్కడా నిజాం సర్కారు తీరును విమర్శించిన దాఖలాలు

కనిపించవు. మహాసభల్ని ప్రదర్శించేవారు, సామాజిక పరివర్తనను కనీసం ఊహించలేనివారు.

తీర్మానాలతో కాకుండా ఆచరణాత్మక పద్ధతిలో ఆంధ్రమహాసభ నిర్వహణ జరగాలని ఆయన కోరు కున్నారు. తెలుగు భాషా సాహిత్యాల కోసం ఆంధ్ర మహా సభ ప్రత్యేకమైన శ్రద్ధ చూపాలనీ, గ్రంథాలయాల ఏర్పాటును ఉద్యమస్ఫూర్తితో చేపట్టాలనీ ఆళ్వారుస్వామి ఆశించారు. అయితే నిజామాబాద్ సభ ఆయనకు నిరాశనే మిగిల్చింది. బహుశా ఆ వెనువెంటనే ఆయన దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించారు. ఆంధ్రమహాసభల్లో రావి నారాయణ రెడ్డి 1941 చిలుకూరు సభల నాటికి విప్లవాత్మక నాయకుడిగా ఎదిగారు. నారాయణరెడ్డిలోని విప్లవతత్వంపై ఆళ్వారుస్వామి అభిమానాన్ని పెంచు కున్నారు. ఆయన వెంటే ఉన్నారు. ఆళ్వారుస్వామి 1944 నాటి భువనగిరి ఆంధ్రమహాసభల్లో మితవాద అతివాదుల మధ్య రాజీకోసం ప్రయత్నించారు. అది కుదరలేదు. పదహారణాల అతివాదిగా ఆళ్వారుస్వామి గుర్తింపును పొందక పోవచ్చుకానీ, ఆయన ఏనాడూ మితవాదికాదు. మితవాదుల ప్రభుత్వానుకూలమైన వైఖరుల్ని నిరసించిన ఉద్యమ స్వభావి. ఒకటిన్నర దశాబ్దాల ఆంధ్రమహాసభ చరిత్రలో సర్కారు వ్యతిరేక ఉద్యమ స్వభావాన్ని బహిరంగంగా వ్యక్తపరచిన కొద్దిమందిలో ఆళ్వారుస్వామి ఒకరు.

ఆయన దాదాపు ఐదు సంవత్సరాల పాటు జైలు జీవితాన్ని గడపవలసి వచ్చింది. ఆళ్వారుస్వామి తన జీవితంలో రెండు పరయాలు జైలుకు వెళ్ళారు. అందులో 1942 - 43 మొదటిసారి, పైన ప్రస్తావించిన 1946 -51 రెండవసారి. మొదటి దశలో ఆయన జైలుకు వెళ్ళడం వెనుక ప్రత్యేకమైన నేపథ్యం ఉంది. 1942లో ఆళ్వారు స్వామి 'క్విట్ ఇండియా' ఉద్యమకార్యకర్తగా జైలుకు వెళ్ళారు. ఈ వాస్తవం ఆళ్వారుస్వామి త్యాగమయ జీవితానికి దర్పణం పడుతున్నది.

హైదరాబాద్ సంస్థానంలో కాంగ్రేస్ వాదులు అక్కడా కూడా నిరసనలు, సత్యాగ్రహాలు చేశారు. అతికొద్ది మంది జైలుకు పోయారు. వారిలో ఆళ్వారుస్వామి ఒకరు. భారత జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన సంగెం లక్ష్మీబాయి, బద్దం ఎల్లారెడ్డి, వంటి తెలంగాణ త్యాగవీరుల వరుసలో ఆళ్వారుస్వామి స్థానం ఉంటుంది. భారత్ లో బ్రిటీష్ వలస పాలనతో సమస్యలు ఉత్పన్న మవుతున్నాయనీ, బ్రిటీష్ వలన పాలకుల అండదండల తోనే నిజాం నియంతృత్వం సురక్షితమవుతోందనీ ఆళ్వారుస్వామి అంచనా కావచ్చు. అందుకే ఆయన నిజాం సర్కారుపై పోరాటాల కంటేముందు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించి జైలుకు వెళ్ళారు. ఆళ్వారుస్వామి జీవితాన్ని గురించి చెబుతున్నప్పుడు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన అవసరం ఉంది. 1942 -43 సంవత్సరాల మధ్య ఆయన ఒక ఏడాది పాటు జైలులో ఉన్నారు. జైలు నుంచి విడుదలైన తరువాత భువనగిరి ఆంధ్ర మహాసభల్లో చురకుగా పాల్గొన్నారు.

నిజాం సర్కారు తక్షణ లక్ష్యమైనవారు. ఈ జాబితాలో రావినారాయణ రెడ్డి మొదటివారు. ఆయనకు సన్ని హితులుగా గుర్తింపు ఉన్నవారు కూడా సర్కారుకు లక్ష్యాలుగా మారారు. ఇట్లా 1946 లో ఆళ్వారుస్వామిని అరెస్టు చేశారు. సంగారెడ్డి, గుల్బర్గా, హైదరాబాద్, వరంగల్లు, నిజామాబాద్ జైళ్ళలో ఆయన రాజకీయ ఖైదీగా ఉన్నారు. ఎన్నో కష్టాల్ని ఎదుర్కొన్నారు. నిజామాబాద్ జైలులో ఎంతటి దుర్భరమైన పరిస్థితులు ఉండేవో దాశరథి ఆత్మకథ 'యాత్రాస్మృతి' చెబుతుంది. గుల్బర్గా జైలులో ఉన్నప్పుడు అధికారులు అమానుషంగా లాఠీ చార్జి చేశారు. తనదైన సంయమన వైఖరితో ఈ కష్టాలన్నిం టినీ భరించారు ఆళ్వారుస్వామి. 1948 సెప్టెంబర్ 17 నాడు హైదరాబాద్ సంస్థానం ఏడవ నిజాం పాలననుండి విముక్తమైంది. ఈ సందర్భంలో పలువురు రాజకీయ ఖైదీలు అంచెలంచెలుగా విడుదదలయ్యారు. అయితే ఆళ్వారుస్వామి, రావి నారాయణ రెడ్డి మాత్రం ఇంకా ఖైదీలుగానే ఉండవలసి వచ్చింది. 1948 సెప్టెంబర్ 17 తరువాత సాయుధ పోరాటపు కొనసాగింపును రావి నారాయన రెడ్డి అంగీకరించలేదు. బహుశా ఆళ్వారుస్వామి

కూడా ఈ వైఖరినీ బలపరిచి ఉంటారు. అయినా వారిని రాజకీయ ఖైదీలుగా జైలులోనే కొనసాగించడం ఎందుకు జరిగిందో అర్థం కాదు. పోలీసు చర్య తరువాత పరిపాలనా భాద్యతలు స్వీకరించినా జనరల్ జయంత్ నాథ్ చౌదరి కమ్యూనిస్టు వ్యతిరేక వైఖరి ఇందుకు కారణమని చెబుతారు.

హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఎక్కువ కాలం పాటు జైలు జీవితాన్ని గడిపిన ఉద్యమ జ్యోతుల్లో ఆళ్వారు స్వామి ఒకరు. దేశోద్ధారక గ్రంథమాల స్థాపించే నాటికి ఆయన వయసు పాతిక సంవత్సరాల లోపు. ఏకవ్యక్తి సైన్యం తరహాలో దేశోద్ధారక గ్రంథమాల కోసం కృషి చేశారు ఆళ్వారుస్వామి. సురవరం ప్రతాపరెడ్డి, ఖండవల్లి బాలేందు శేఖరం, భోగరాజు సీతారామయ్య, ఆదిరాజు వీరభద్రరావు, కాళోజి నారాయణ రావు వంటి ఎంతో మంది ప్రసిద్ధుల పలు రచనలు దేశోద్ధారక గ్రంథమాల ద్వారా వెలుగు చూశాయి. సాహిత్య ఉద్యమ రంగంలోనూ ఆళ్వారుస్వామి వైతాళిక భూమికను నిర్వహించారు.

ఆళ్వారుస్వామి జంటనగరాలలో అభ్యుదయ రచయితల సంఘం విస్తరణ బాధ్యతల్ని స్వీకరించారు. నాటి మీజాన్ పత్రిక సంపాదకులు అడవి బాపిరాజు అధ్యక్షతన, ఆళ్వారుస్వామి ప్రధాన కార్యదర్శిగా అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణలో ఆవిర్భవించింది. ఇందులో రాంభట్ల కృష్ణమూర్తి వంటి ప్రతిభావంతులు చురుకుగా పనిచేశారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో వెలువడిన సాహిత్యానికి అభ్యుదయ రచయితల సంఘం ద్వారా ఏదో ఒక స్థాయిలో స్ఫూర్తి లభించిందనే భావించాలి. 'అరసం' సికింద్రాబాద్ నుండి కొంత కాలం పాటు 'తెలుగుతల్లి' పేరుతో ఒక సాహిత్య పత్రికను నిర్వహించింది. ఈ పత్రిక సంపాదకులు రాచమళ్ళ సత్యవతీదేవి అయినా, నిర్వహణ బాధ్యతల్ని ఆళ్వారు స్వామే చూసేవారు. స్వాతంత్ర్యానంతర కాలంలో ఒకటి రెండు దశాబ్దాల పాటు అభ్యదయ సాహిత్య భావనలు తెలంగాణ అంతటా గాఢంగా వ్యాపించాయి. ఇందుకు ఆళ్వారుస్వామి చేసిన కృషి మరవలేనిది.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# విద్యార్థి కవిత్వంలో పదచిత్రాలు

- ఎస్. గోదావరి

సాహిత్యంలోకి ఝంఝా ప్రభంజనాలు ప్రవేశిస్తున్న కాలం, అభ్యుదయం ఉద్యమం మందగించి, అనుభూతి వాదులకు కాలదోషం పట్టి, భావ కవిత్వానికి పాడెకట్టి, దిగంబర కవితా ఉద్యమం తెలుగు సాహిత్యంలో ప్రవేశించి స్తబ్ధతను తొలిగించడానికి పురిటి నొప్పులు పడుతున్న కాలంలో, విద్యార్థి కవితా కన్నులు తెరిచాడు. విద్యార్థి కవిత్వం శైశవదశలో ఉండగానే మానవులందరికి విప్లవ మంత్రోపదేశం చేసే విరసం సుడిగుండంలా వస్తే అందులో చిక్కుకోక కవిత్వం నిరంజనంలా ఉండాలని, సొంత గొంతుతో నిలిచాడు.

విద్యార్థి మానవీయ దర్శనతోనూ, సమాజవాస్తవికతా భూమికతోనూ, నూత్న కవితాధారలను వెలయించారు. అంతర్ముఖుడై అనుభూతుల్ని మేల్కొల్పి స్మృతులనెగరేసి, ఆలోచనలనుద్దీపింపజేసే కర్తవ్యాన్ని స్ఫురింపజేయడం కవిత్వం యొక్క ప్రయోజనమని కొనసాగాడు. చిత్తశుద్ధి, నిర్దిష్ట ధ్యేయమూ దివిటీలుగా విద్యార్థిని నడిపాయి. ఛందస్సు ఒక మాధ్యమం మాత్రమేకాని కవితకు ప్రాణం కాదని, వస్తువే జీవమని నమ్మి, సాహిత్యరంగంలో అంతర్గతంగా సాగే సంఘర్షణలను పట్టించుకోలేదు.

సృజనాత్మక ప్రతిభ ప్రాచీన కావ్యాల అధ్యయనం నుండి రాదు, సామాజిక అధ్యయనం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందనే మౌలిక వాస్తవాన్ని రచనల ద్వారా నిరూపించినవాడు విద్యార్థి.

విద్యార్థి కవిత్వ జెండాకు మూడు రంగులున్నాయి. ఒకటి అన్యాయాన్ని ఎదిరించడం, రెండు ప్రకృతిపట్ల ప్రేమ, మూడు మధ్య తరగతి జీవిత చిత్రణ. శిక్షణ, క్రమశిక్షణ వృత్తిధర్మాలైనప్పుడు సాహిత్య సైనికుడుగా, నిబద్ధతతో వ్యవహరిస్తూ వచ్చాడు విద్యార్థి. బంగ్లాదేశ్ యుద్ధంలో పాక్ విమానం కూల్చివేతప్పుడు కీలకపాత్ర వహించడం, నిరుపేదల పై దౌర్జన్యం చేస్తున్న బిహారీ ముఠానాయకుడ్ని ఎదురించడం వంటివి. విద్యార్థి ఎవరో, ఏమిటో నిరూపిస్తాయి. ప్రపంచ ప్రసిద్ధ తాత్వికుడు జిడ్డు కృష్ణమూర్తితో తనకు సైనిక వృత్తి ఇష్టం లేదని చెప్పటమంటే యుద్ధంకన్నా శాంతి ఇష్టమని, అది సాక్షాత్తు సమాజంలో మాత్రమే దొరుకుతుందన్న ఇంగితాన్ని పెంచుకోవడం అయ్యింది. ఇక వీరిలో కేవల భక్తికన్నా దేశభక్తి మిన్న అయ్యింది. ఆ దేశభక్తి, నిబద్ధతలే ఈ అర్ధశతాబ్ది కాలంలో జీవితాన్నీ, కవిత్వాన్నీ, జమిలిగా కొనసాగిస్తూ వచ్చి, ఈనాడు సమకాలీన సమాజదర్పణంగా నిలిచాడు.

మాకు మాత్రం ఏం తెలుసు
అసలు శత్రువులు దేశంలోపలే వున్నారని
అనేక రూపాల్లో అనేక రంగాల్లో టెర్రరిస్టు
ముఠాలే మాఫియా గ్యాంగులే
ప్రజా జీవనాన్ని శాసిస్తున్నాయని
స్వాతంత్ర్యానికి సరిహద్దులు గీస్తున్నాయని

విద్యార్థి తన కవన ప్రయాణంలో అలలు, పలకరింత, ఘర్మసముద్రం, మంచుమైదానం, ఖండాంతర కవిత్వం సంపుటాలతో మనల్ని దేశ సరిహద్దుల దగ్గరకు తీసికెడతాడు. యుద్ధ వాతావరణాన్ని, సైనికుల దుర్భర జీవితాన్నీ, దట్టించిన దేశభక్తినీ తెలియజేస్తాడు. అలాగే మనిషిలోని అంతర్లోకాలలోకి, ప్రకృతిలోని సోయగాలు, అద్భుతాలు, దానితోబాటే మానవ సంబంధాలు, జన్మభూమి పులకరింత, మిత్రులు, స్నేహాలు, ప్రతిక్షణం, ప్రతి సమయం, ప్రతి దృశ్యమాన సందర్భం పరిచయం చేస్తూ, తన స్పందనలు పలవరిస్తూ ఆ అనుభవాలను, అనుభూతులను మనలోకి ప్రవహింపజేస్తాడు. నిత్యం మేలుకుని వున్న కవికి మాత్రమే యిది సాధ్యం.

వి.ఆర్.విద్యార్థిగా ఆయన సాహిత్యా భిమానుల కెందరికో తెలుగు నేల మీదనే కాదు, తెలుగు తెలిసిన

భూగోళమంతటా తెలుసు. ఒకే ఒక్క 'అపరిచితులు' కవితతో కాళోజీ మొదలు కవిత్వాభిమానుల్నే కాదు, మనుషులందరి హృదయాలను సున్నితంగా స్పృశించిన కవి ఆయన. మనిషి ఆయన. ఆ మనిషి రాములు. విపరీతమైన పరిస్థితులనుంచి నేలమీంచి నింగికెగసి ఎంతో ఘర్షణపడి, ఒక జీవన సమరమే చేసి తనదయిన ప్రత్యేక స్థానానికి చేరుకున్న స్థానిక విశ్వమానవుడాయన.

వి.ఆర్.విద్యార్థి కవిత్వంలో మూడు అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. అవే ఆయన కవిత్వానికి అంతస్సూత్రాలని చెప్పొచ్చు.

ఒకటి తనలోకి తాను చూసుకుంటూ, తనతో తను యుద్ధం చేస్తూ తనను తాను శోధించుకుంటూ తనను తాను తెలుసుకునే ప్రయత్నం.

రెండు తనచుట్టూ పరివేష్టితమైన ప్రకృతి సౌందర్యంతో మమేకమైపోయి ఎక్కడ అందం కనిపించినా, ఎక్కడ మంచి కనిపించినా దాన్ని అనుభవించి కవిత్వంగా పలవరించటం.

మూడు తనలో చెలరేగే అనేక సంవేదనల్ని కవిత్వంగా మలచగల్గే ప్రతిభా సంపదని, ఊహాశక్తిని కల్గి ఉండటం.

ఆయన కవిత్వంలోని మొదటి లక్షణం తనలోకి తాను చూసుకుంటూ అంతర్ముఖీనుడైపోవడం. ఇందుకు ఉదాహరణలుగా ఆయన రచించిన చాలా కవితల్ని చూపించవచ్చు.

ఆయనకెంతో పేరు తెచ్చి పెట్టిన "అపరిచితులు" అనే కవితనే పరిశీలిస్తే ఆయనలోని అంతర్ముఖీనత్వమే ఆయనచేత ఈ కవితను రచింపజేసిందని పిస్తుంది.

ఎన్నో దశాబ్దాలుగా కాపురం చేస్తున్న భార్యాభర్తల మధ్య కూడా సంపూర్ణమైన భావసమైక్యం యేర్పడదు. ఇద్దరి మధ్య పూడ్చలేని అగాధాలెన్నో ఉంటాయి. తనలోకి తాను చూసుకోగల్గిన విద్యార్థిలాంటి కవులకే ఈ విషయం అర్థం అవుతుంది.

"కుటుంబ వ్యాపారంలో పార్ట్‌నర్స్‌గా
ఒకర్నొకరం కన్సల్ట్ చేసుకోవడం తప్ప
ఇద్దరిలో ఎవరమూ
ఒకరి గడప ఒకరం దాటితేనా ?" అన్నాడు విద్యార్థి ఈ 'అపరచితులు' కవితలో.

ఈ కవితలోనే

"జీవితంలో
నన్ను నేను గెలవడానికే
కవిత్వమై పలకడం, కథలు చెప్పడం
చిత్రం గీయడం, శిల్పం తొలవడం
నాట్యం చెయ్యడం, స్వర తరంగమై లేవడం
నిరంతరం నాతో నేను
యుద్ధం చేస్తూ
గెలుస్తాను
ఓడిపోతాను
కాని గెలవడానికే" అంటాడు విద్యార్థి.

సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం మొదలైన లలితకళలన్నీ ఆయా కళాకారులు తమలోకి తాను చూసుకొని తాము చూసుకొని తమతో తాము యుద్ధం చేసుకొని, తమను తాను తెలుసుకోవడానికేనన్న ఒక గొప్ప వాస్తవాన్ని విద్యార్థి ఈ కవితలో చెప్పాడు.

"ఆకాశపు అదృశ్య శిఖరాలనుండి
తేజో జలపాతాలు దూకుతున్నాయి
తడిసి పరివర్తితులమౌదాం పద" అంటాడు.

ధ్రువాల దగ్గర స్వింగింగ్ కరోనాలనే అత్యద్భుత దృశ్యాలు కనిపిస్తాయట.

"ఈ స్వింగింగ్ కరోనా ముడి విచ్చుకుంటోంది
దిగంతంనుండి దిగంతాల దాకా డోలి వద్దాం పద" అంటాడు.

అమెరికాలోని నయాగారా జలపాతాన్ని చూడటం ఎవరికైనా ఒక అపూర్వ అనుభవం. వి.ఆర్.విద్యార్థి 'నయాగరా'ను చూసినప్పుడు కల్గిన పారవశ్యాన్ని ఒక గొప్ప కవితగా మలచాడు.

నయాగరా జలపాతాన్ని చూసినవాళ్ళకు ఈ పద చిత్రాలన్నీ ఆ జలపాతాన్ని దృశ్యమానం చెయ్యడంలో ఎలా సఫలమయ్యాయో అర్థమవుతుంది.

వి.ఆర్.విద్యార్థి కవిత్వం రాయడమే కాదు కవిత్వాన్ని జీవించే కవి. అతనిలో ఒక వినూత్న కుల, మత, ప్రాంత సిద్ధాంతాలతో పాటు ఇతర అన్ని సిద్ధాంతాలకూ దార్శ నికత స్వచ్ఛమైన మానవత్వంతో నిండిన దార్శనికత మనకు కనిపిస్తుంది. అసలు సిసలైన స్వచ్ఛమైన కవి వీ.ఆర్. విద్యార్థి.

ఆధునిక కవిత్వంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న కవి. ఆధునిక తెలుగు కవిత్వం తిరిగిన మలుపులు ఇన్నీ అన్నీ కావు. గత వెయ్యేళ్ళ సాహిత్య చరిత్రలో కవిత్వం ఇంతగా మార్పులు చెందటం, ఇన్ని వాదాలను ఆశ్రయించడం ఆధునిక కవిత్వ ప్రత్యేకత. అయితే కలకాలం నిలిచే కవిత్వాలు తక్కువైపోవడం కూడా ఆధునిక కవిత్వంలో, కవిత్వపు శాశ్వతత్వంలో మనం గమనించవచ్చు. ప్రతిభా దారిద్ర్యంవల్ల, అవ గాహన కొరకు ఇతర రచనల్ని అధ్యయనం చేయకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడి ఉండవచ్చు. ఒక కవి కవిత్వం పదికాలాలపాటు నిలవాలంటే ఆ కవికి విస్తృత అధ్యయనంతో బాటు లోకాన్ని కూడా బాగా చదవాలి. లోకం పోకడల్ని సరైన దిశగా అర్థం చేసుకున్న కవి చైతన్యం తప్పక విచ్చుకున్న కమలమై ఎల్లకాలం సాహిత్యపు గుబాళింపుల్ని అందిస్తూనే ఉంటుంది.

ఎప్పుడో గత నలభై ఏళ్ళ క్రితం తన సాహిత్య ప్రస్థానాన్ని 'అలలు' కవితా సంకలనంతో ప్రారంభించి, పదిలంగా దాచుకున్న తన అనుభవాల్ని, అనుభూతుల్ని కవితాత్మకం చేసి పదిమందికీ పంచి పెట్టిన విద్యార్థి పలకరింత, ఘర్మ సముద్రం, మంచుమైదానం, ఖండాం తర వంటి పలు కవితా సంకలనాలను తెలుగువాళ్ళ ముంగిళ్ళలోకి తెచ్చారు. ఇవన్నీ అతనిలోని విస్తృత చైతన్య చిహ్నాలుగా నిలిచిపోయాయి. ఇతర భాషల్లోకి అనూదితాలై వాళ్ళందరికీ విద్యార్థి చైతన్యాన్ని పంచి పెట్టాయి.

తన కవితా సంకలనాన్ని ప్రజా చైతన్యం ఇబ్బడి ముబ్బడిగా కల్గిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు గారికి అంకితమిస్తూ విద్యార్థి ఒకమాట అన్నారు.

'నిరంతరం సామాన్యుని బాగుకోసం తపించేవాడూ ప్రజా హృదయ వేదిక పై స్థిరపడ్డవాడూ' అంటూ చెప్పడం అత్యంత వాస్తవం.

❀ ❀ ❀

# సంస్కృత సాహిత్యానికి శ్రీభాష్యం విజయసారథి చేసిన కృషి

– నాగరాజ నాగజ్యోతి, పరిశోధక విద్యార్థి, సాహిత్య విభాగం, ఫ్యాకల్టీ, ఎస్.వి.డి.వి., బెనారస్ విశ్వవిద్యాలయం, బెనారస్, ఉత్తర ప్రదేశ్.

సంస్కృత భాషా వాఙ్మయ స్రవంతి భారతదేశము అన్ని ప్రాంతాలలోనూ ప్రవహించి సుసమృద్ధమైనది. అన్ని ప్రాంతాలవారు ఈ వాఙ్మయాన్ని పరిపోషించారు. ముఖ్యంగా కాశ్మీరము, ఆంధ్రదేశము, కేరళ, కాశీ, కంచి వంటి మహానగరములు సంస్కృత సాహిత్యానికి ఆధారములైనవి. కాళిదాసు, భాసుడు, శ్రీహర్షుడు మొదలగు వారు సంస్కృత సాహిత్యానికి ఎంతో సేవ చేశారు.

తెలుగు వారు కూడా సంస్కృత భాషా సాహిత్యానికి ప్రాచీన కాలము నుండి ఇప్పటి వరకు విశిష్ట సేవను చేసినారు. వారిలో ప్రసిద్ధ అలంకారశాస్త్ర గ్రంథమైన రసగంగాధర విరచిత జగన్నాథుడు, చిత్రమీమాంసను రచించిన అప్పయ్య దీక్షితులు, మధురావిజయంను రచించిన గంగాదేవి, ప్రతాపరుద్రీయం కర్త విద్యానాథుడు, సంస్కృత పంచమహాకావ్యాలకు ప్రసిద్ధ మైన వ్యాఖ్యను రాసిన మల్లినాథుడు, మొదలైనవారు న్నారు. ఈ క్రమం అనాది నుండి కొనసాగుతూనే ఉంది. ఆధునిక యుగంలో కూడా తెలుగు కవులు ఎంతోమంది సంస్కృత సాహిత్యానికి సేవ చేసినవారున్నారు మరియు ఇప్పటికీ చేస్తున్నవారున్నారు.

మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడు గారు శతాధిక గ్రంథ రచనలు చేశారు. ఎన్నో సంస్కృత గ్రంథాలకు తెలుగు అనువాదాలు చేశారు. ఆచార్య రాణి సదాశివమూర్తి గారి "పుష్పకరండిక"కు సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆధునిక సమస్యల్లో ఒకటైన "పర్యావరణ పరిరక్షణ" అనే అంశాన్ని ఉద్దేశించి డాక్టర్. జి. ఎస్. అర్ కృష్ణమూర్తి గారు "వానకి" రచన చేశారు.

పద్మశ్రీ అవార్డు గ్రహిత శ్రీభాష్యం విజయసారథి కూడా ఈ కోవకి చెందిన వారే. వీరు కరీంనగర్ జిల్లా చేగుర్తిలో 10 మార్చి 1937 లో జన్మించారు. ఈయన సంస్కృతమునే తన భాషగా నిర్దేశించుకున్నారు. ఆధునిక సంస్కృత మహాకవుల్లో ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. నిజాం కాలంలో ఉర్దూ మాద్యమం నిర్బంధంగా ఉన్నప్పటికి సంస్కృతంలోనే చదివారు.

సంస్కృతం అంటే దేవతల పూజలు, పురాణ కథలు అనుకుంటున్న స్థితిలో సామాజిక అంశాలు తీసుకొని సమాజాభ్యుదయాన్ని కాంక్షిస్తూ ప్రజావళికి అభ్యుదయ పథం చూపిస్తూ శతాధిక గ్రంథరచనలు చేసిన పండితులు. కులమత వైరుధ్యాలను, అనైక్యతను నిరసిస్తూ సర్వ మానవ సమానత్వాన్ని కోరుకుంటూ రచనలు చేశారు.

సంస్కృతం, తెలుగు, ఉర్దూ భాషల్లో నిష్ణాతులైన శ్రీభాష్యం విజయసారథి సంస్కృత భాషా సాహిత్యంలో చేపట్టని ప్రక్రియ లేదు. సుప్రభాత, కావ్య, దేశభక్తి, లేఖా, సూక్తి, మాలికా, ఉదాహరణ, సంగీత, సాంఘిక, చైతన్య, అనువాద, తెలుగు విమర్శ, స్తుతి, గద్య, నవల, ప్రహసన, ప్రహేళికల వంటి ఎన్నో ప్రక్రియలను శతాధిక గ్రంథరచన ద్వారా సుసంపన్నం చేశారు.

తనపదకొండవఏటనే బాసర సరస్వతీ ఆలయానికి వెళ్ళిన విజయసారథి అక్కడే "శారదా పదకింకిణి" అనే కావ్యాన్ని రచించారు. ఈ కావ్యంలోని శ్లోకాలు, గేయాలు అన్నీ పదాంత్యానుప్రాస, పాదాంత్యానుప్రాస మొదలైన శబ్దాలంకారాలతోనూ, గుణాలతోనూ శోభిస్తున్నాయి.

**వినాయక స్తుతిలో**

"పురాణ విలాస వనాళి మయూర"
"సుధీజన మానస తాప విదూర"

ఈ విధంగా "వినాయకనామ", "విభావసుధామ" ఇత్యాదిగానూ పదాంత్యానుప్రాస, సాహిత్యదర్పణ కారుని మతంలో చెప్పబడింది. ఇలాగే సరస్వతీ స్తవనంలో కూడా

"శారదా సారదా" స్వామినీ, భామినీ, అని ఇలా సాగిన రచనల్లో పదాంత్యానుప్రాస మధురంగా ఉంది. భక్తిరస ప్రధానమైన ఈ రచనల్లో మాధుర్యగుణం తొణకిసలాడు తుంది.

"రాధికా కాముకే వందిబృందారికే మౌని మందారకే"

సుందరీ దర్పకే అనీ గోపికా, బాలికా, మాలికా, వల్లికా, మల్లికా, వేల్లితా, ఇలా సాగిన రచనల్లో "దండి" మతాన్ని అనుసరించి "అనిష్ఠు రాక్షరీ ప్రాయమైన సౌకుమార్యం" మమ్మటాదుల మతాన్ని అనుసరించి స్వచ్ఛజలంలా శు ష్కేంధనాగ్నిలా సర్వం వ్యాపించే (మనస్సుకు పూర్తిగా వ్యాపించే) ప్రసాదగుణం ఉన్నాయి.

శ్రీభాష్యం విజయసారథి రచించిన "మందాకిని" కావ్యంలో శ్లోకాలుండవు. కావ్యమంతా మాత్రా ఛందస్సులోనే ఉంటుంది. మందాకిని అంటే గంగా ప్రవాహం. మందాకిని కావ్యంలో వీరు ప్రయోగించి నటువంటి ఎక్కువ ధాతువులు మరేకవి ప్రయోగించ లేదనే చెప్పవచ్చు. ఉదా: అకతి, చకతి, తకతి, చలతి, జలతి, సలతి, స్యన్దతి, స్పన్దతే, స్కున్దతే, మోదతే, ప్రోదతే మొదలైన సంస్కృత ధాతువులు మందాకిని కావ్యానికే అందానిచ్చాయి.

"దుర్బలగ్రసన పరదుష్ట సత్త్వవ్రాత
తాడన స్ఫాలనోద్దామోర్మి మండిత
వనజాఖేటక వ్యాపృత వ్యాధతృట్
ప్రశమన వ్యాసక్త పాథోవిరాజితా"

ఈవిధంగా దీర్ఘసమాస రచన ఉన్నా అక్కడ చిత్త ప్రజ్వలనకు కారణమైన వస్తువేదీ లేకపోవడం చేత ఓజోగుణ నిర్వహణం జరిగిందనడానికి అవకాశం లేదు. పూర్తిగా ఈ రచనంతా పరిశీలిస్తే ప్రసాదగుణమే "చిత్త విస్తార" హేతువుగా సాక్షాత్కరిస్తుంది.

"ఉషస్సూక్తం" అనే వీరిమరొక రచన అర్థాలం కారభూషితమై పఠితుల చేత చమత్కారత్వాన్ని కలుగ జేస్తుంది.

"కృషకకార్మిక కష్టజీవి శ్రమజ జల లవకైతవేన
తుహినజలకణజాల మపనుదతీవ తాపం ప్రకృతి మాతుః"

అన్న మాటలో ఉత్ప్రేక్ష కవి హృదయాన్ని చక్కగా ఆవిష్కరిస్తుంది. కృషకులు (కార్మికులు) మొదలైన శ్రమజీవుల స్వేద బిందువులు ప్రకృతి మాత యొక్క తాపాన్ని పోగొడుతున్నాయి. కానీ కవి "కైతవేన" అనే పదాన్ని ఉపయోగించి ఇవి స్వేద బిందువులు కావు, అవ్యాజంతో జాలువారుతున్న తుహిన కిరణాలు అంటారు. ఇది అపహ్నుతి అలంకారం. ఇంతే కాకుండా ఇవి ప్రకృతిమాత యొక్క శ్రమతాపాన్ని దూరం చేస్తు న్నాయా? అన్నట్లు ఉన్నాయంటారు. ఈ ఉత్ప్రేక్ష ద్వారా భూమికి కలిగే తాపాన్ని తీర్చగల సామర్థ్యం శ్రమజీవుల స్వేదములో ఉన్నదని సూచిస్తున్నారు.

"అపనోదతీవ" అనే పదం ప్రయోగం చేత క్రియాపదంతో "ఇవ" శబ్దాన్ని అన్వయించడాన్ని బట్టి ఇది ఉత్ప్రేక్ష కావాలి తప్ప ఉపమకాదు. అంతే కాకుండా వ్యంగ్యగర్భంగా చురకలు వేయుటకు కూడా కవి అలంకారాలు ఉపయోగించారు.

"వేదికాస్వివ నాయకా ద్రుమశాఖికాసు రువన్తి కీరాః"

ప్రాతః కాలంలో చెట్లకొమ్మలలో చిలుకలు పలుకు తున్నాయి. ఇది ఎలా ఉందంటే వేదికల మీద నాయ కులు సామాన్యులకు అందని తాము ఎన్నికల కోసం నేర్చుకున్న పలుకులు వల్లే వేస్తున్నట్లున్నదట. వేదికల మీద పలికే నాయకుల పలుకులు చిలుక పలుకులే తప్ప నిజంగా ప్రజల బాధలను తీర్చేవి కావని, పైగా చిలుకలు చెట్లకొమ్మలపై ఎక్కడో కూర్చొని పలికినట్లు నాయకులు కూడా ఎక్కడో ఉన్నత పదవుల్లో ఉంటూ సామాన్యులకు అందుబాటులో లేని చోటుల్లోంచి కేవలం శ్రవణపేయంగా పలుకుతారే తప్ప వాస్తవాలు కాదని వ్యక్తపరుస్తున్నారు. శ్రీభాష్యం విజయసారథి వారు ఎన్నో రచనలు చేసి "యుగకర్త యుగోద్ధర్తా, సరస్వతీ సుశోత్తంశ" అన్న ప్రశంసలు అందుకున్నారు.

"దేశాభిమానాన్ని చాటుతు "భారత భారతి"
సమసమాజాన్ని ఆశిస్తూ "క్రాంతి గీతం"
రూపాయి ఆధిక్యతను అధిక్షేపిస్తూ "రూపసూక్తం"
కపట భక్తుల ముసుగులు తీస్తూ "కౌలేయసూక్తం"
రచించారు.

ఈ విధంగా శ్రీభాష్యం విజయసారథి సంస్కృత సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. తెలుగు మాతృభాష అయినప్పటికి వీరికి సంస్కృత భాషయందు ఉన్న టువంటి సమర్పణతా భావం ఇప్పటికి తక్కువ కాలేదనే చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. విజయసారథి, శ్రీభాష్యం, మందాకిని
2. విశ్వనాథుడు, సాహిత్య దర్పణం
3. మమ్మటుడు, కావ్యప్రకాశము
4. విజయసారథి, శ్రీభాష్యం, శారదా పదకింకిణి
5. విజయసారథి, శ్రీభాష్యం, ఉషస్సూక్తం
6. దండి, కావ్యాదర్శ.

**ముగింపు :**

ఈ విధంగా సంస్కృత భాషా సాహిత్యం ఆంధ్ర దేశమున మిక్కిలి ఆదరమును పొంది చిరకాలము గొప్ప వికాసము పొందుచున్నది.

"ఆసీదాంధ్రమహీయం సంస్కృత వాణ్యాశ్చిరం విహృతిర్గమ్"
ఉపలాలితాచ సాభూద్భూపైః విద్వద్భిరత్రత్యైః"

ఈ తెలుగుదేశము ఎప్పుడో సంస్కృత భాషకు విహార భూమి అయినది. ఇక్కడి రాజులును, విద్వాంసులును, సంస్కృత సారస్వతమును మిక్కిలి ఆదరముతో సేవించి యున్నారు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# జాషువా - దళిత కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి

- సూరేపల్లి పద్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్టమైన వ్యక్తిత్వం ఉన్న ప్రముఖ కవి చక్రవర్తి గుర్రం జాషువా. జాషువా 1895, సెప్టెంబర్ 28 న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. తండ్రి గుర్రం వీరయ్య, తల్లి లింగమ్మ. తల్లి దండ్రులు వేరు వేరు కులాలకు చెందినవారు. తండ్రి క్రైస్తవ మతమును స్వీకరించిన యాదవుడు. తల్లి మాదిగ వారిది చాలా బీద కుటుంబము. తక్కువ కులంలో పుట్టడం వలన సమాజం నుంచి అవమానాలను, తిరస్కారాలను, ఛీత్కారాలను ఎదుర్కొన్నారు. చదువుకోడానికి బడిలో చేరిన తరువాత జాషువాకు కష్టాలు మొదలయ్యాయి. ఉపాధ్యాయులు, తోటి పిల్లల నుండి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. అయితే జాషువా ఊరుకొనేవాడు కాదు, ఎదురు తిరిగేవాడు. అగ్రవర్ణాల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తే, తిరగబడేవాడు. జాషువా జీవితం బాల్యం నుంచి వేదనామయమే! సమాజం నుంచి ఆయన మనసుకు తగిలిన గాయాలు సామన్యమైనవి కావు. అయితే మనసుకు తగిలిన గాయాల గురించి బాధపడుతూ కూడ, వాటిని అధిగమించేందుకు, కుల వివక్ష లేని సమాజం కోసం పరితపిస్తూ కవితలు రాసేవారు. ఆయన కవిత్వం సున్నితమైన, సరళమైన పదాలతో ఉండేది. కానీ ఆవేశపూరితంగా ఉండేది కాదు. ఆ కవిత్వం సమసమాజం ఆలోచింపజేసే విధంగా ఉండేది. తక్కువ కులములో జన్మించినందు వలన పడిన అనేక అవమానాలు ఎదుర్కొవడానికి, కవిత్వాన్నే ఆయుధంగా చేసుకొని మూఢాచారాలపై తిరగబడి, ఏ సమాజం నుండి అవమానాలను, తిరస్కారాలను, ఛీత్కారాలను అందుకున్నారో అదే సమాజం నుండి అంతకంతకు రెట్టింపు గౌరవ సత్కారాలు అందుకున్నారు. అది వారి గొప్పతనానికి ప్రజలు పట్టిన నీరాజనం. సమకాలీన కవిత్వ ఒరవడియైన భావకవిత్వ రీతినుండి ప్రక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు.

1910వ సం॥లో మేరీని పెళ్ళి చేసుకున్నాడు. ఉన్నత పాఠశాల చదువు ముగించి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేశారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు.ఆ ఉద్యోగం పోవడంతో రాజమండ్రి వెళ్ళి 1915-16 సం॥లో మూకీ చిత్రాల కథావాచకుడుగా పనిచేశారు. టూకీ సినిమాలకు లేని ఆ రోజుల్లో తెరపై జరుగుతున్న కథకు, సంభాషణలను చదువుతూ పోవడమే ఈ పని. కొంతకాలం సత్యవోలు గున్నేశ్వరరావుగారి 'చింతామణి' నాటక మండలి'లో నాటక కర్తగా పనిచేశారు. ఆ తరువాత 1919-1929 మధ్యకాలంలో గుంటూరులోని లూథరన్ చర్చివారు నడుపుతున్న ఉపాధ్యా శిక్షణాలయంలో అధ్యాపకుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేశారు. 'ఉభయ భాషా ప్రవీణ' పట్టా పుచ్చుకొని జాషువా గారు 1928-1942 మధ్య గుంటూరు జిల్లా ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడుగా పనిచేశారు. 1942-1945 మధ్య కాలంలో బ్రిటీష్ ప్రభుత్వ యాజమాన్యంలో భారత ప్రభుత్వం నెలకొల్పిన జాతీయ యుద్ధ ప్రచారక సంఘంలో ప్రచారకుడిగా కూడా పనిచేశారు. 1957-59 మధ్యకాలంలో మద్రాసు రేడియో కేంద్రలో 'నిర్మాతగా' ఉద్యోగం నిర్వహించారు. 1964 సం॥లో ప్రభుత్వం జాషువాగారిని శాసనమండలికి నామినేట్ చేశారు. కానీ ఆయన ఏ ఉద్యోగం చేసినా జీవనం గడపడానికి మాత్రమే అని, ఆయన జన్మత: కవి, కానీ కవిగా బ్రతుకును సాగించడం కష్టమని 'బడిపంతులు'' అయ్యారు. ఒకసారి వినుకొండలో కొప్పరపు సుబ్బారావుగారి అవధానం విన్నాడు. ముగిసిన తర్వాత కవులు కొందరు అవధానిని ప్రశంశిస్తూ

పద్యాలు చదివారు. బాల జాషువా కూడా పద్యాలు రాసుకొని, చదవటానికి వేదిక ఎక్కాడు. 'అంటరానివాడు', 'కులం తక్కువవాడు' పద్యాలు రాయడం, చదవటమా అని కొందరు ఆయనను అవమానించారు. బాలజాషువా ఎంతగానో కృంగిపోయాడు. ఆయనకు జరిగిన అవమానా లలో ఇది ఒక మచ్చు తునక మాత్రమే. అంటరాని వాడని హిందువులు ఈసడించుకుంటే, క్రైస్తవుడై ఉండి, హిందూమత సంబంధ రచనలు చేస్తున్నాడని క్రైస్తవ సమాజం నుండి బహిస్కరించారు. క్రమంగా ఆయన నాస్తికత్వం వైపు మరలాడు.

జాషువాగారు అంకురిత దీక్షతో కావ్యరచనకు ఉప క్రమించారు. జాషువా గారికి చిన్నతనం నుండే సృజనాత్మక శక్తి ఉండేది. బొమ్మలు గీయటం, పాటలు పాడటం చేసేవాడు. బాల్య స్నేహితుడైన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమత్‌శాస్త్రి వద్ద మేఘసందేశం, రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువాగారు 36 గ్రంథాలు, ఇంకా ఎన్నో కవితా ఖండికలు రాశాడు. ఒక జాతికి, ఒక మతానికి చెందిన కవిత్వాలు మంచివి కావని, అసలు అవి కవిత్వాలే కావని, అలాంటి వాటిని వీలు నామా కవిత్వాలు అంటారని, జాషువా గారి భావం. ఇది సామాన్యులకు తెలియజేయడానికే ప్రయత్నించారు. 'గహన సంచారం లేని కవిత్వం నా లక్ష్యం' అని జాషువా గారు అన్నారు. ఆయన కవితకు మూలాధారాలు వస్తువులు, మానవత్వం హేతువాదాలు. దీనుల పట్ల సంఘం అణచివేసిన వారి పట్ల సానుభూతితో కలం కదిలించారు. సంఘ సంస్కరణ ఆయన కావ్య లక్ష్యం, ఆకలి శోకాలను నిర్మూలించాలన్నదే ఆయన ధ్యేయం. చిత్తశుద్ధిలేని పెత్తందార్లను, గుత్తస్వాములను నిలదీసి ప్రశ్నించారు. అంధవిశ్వాసాలను, మత విద్వేషాలను తీవ్రంగా నిరసించారు. జాషువాగారు అభ్యుదయ వాది. రేడియోలో వస్తున్న కవితలను విమర్శిస్తూ , అన్నార్తుల ఆక్రందనకు తన కవితలో వినిపించారు.

'రేయిబవలు భారతీయ సంస్కృతీ పేర
గండశిలలు చూపి కథలు చెప్పి
కటిక పేదవాని కడుపులోగల చిచ్చు
గడపగలవే నీవు గగనవాణి'

జాషువా గారు సంకుచిత తత్వాలను ఖండిస్తూ, 'నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు తిరుగులేదు. విశ్వనరుడ నేను' విశ్వజనీనమైన దృక్పదం గల ఆయన గబ్బిలం పట్ల జాలిని చూపుతూ.

'నరుని కష్టపెట్టి నారాయణుని గొల్చు
ధర్మశీలురున్న ధరణి మీద
కాలుమోపలేక గబ్బిలమొక్కటే
చరణ యుగళిదివికి సాచి నడుచు'

జాషువా గారి రచనలన్నీ ఖండకావ్యాలు, వాటిలో గబ్బిలము, పిరదౌశి, కాందిశీకుడు, స్వప్నకథ, ముంతాజ మహల్, నేతాజీ, క్రీస్తుచరిత్ర, కొత్తలోకము ప్రసిద్ధమైనవి ఆత్మకథను మూడు సంపుటాలుగా 'నా కథ' అను శీర్షికను రాశారు.

ఆయన రచనల్లో గబ్బిలం (1941) సర్వోత్వమమైన రచన. ఇది కాళిదాసు మేఘసందేశం తరహాలో సాగు తుంది. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును కాశీ విశ్వనాధునికి చేరవేయమని గబ్బిలంతో సందేశం పంపడమే దీని సారాంశం. ఎందుకంటే దళితు లకు గుడిలోకి ప్రవేశం లేదు. కానీ గబ్బిలానికి అడ్డు ఉండదు. కథనాయకుడి వేదనను వర్ణించిన తీరు హృదయాలను కలచివేస్తుంది. 20వ శతాబ్దంలో వచ్చిన ఆధునిక తెలుగు కావ్యాల్లో విశిష్టమైన రచన గబ్బిలం. ఖండకావ్య రచనలో సుమారు 22 సంవత్సరాలు, కలం సృష్టించిన అద్భుతమైన కళాఖండం ఈ గబ్బిలం. ఖండ కావ్య ప్రక్రియకు, ఊపిరి ఊది జనం జీవంతో తొణికిస లాడేలా చేసి ఆధునికాంధ్ర సాహిత్యంలో ప్రతిష్టాత్మకమైన స్థానం సంపాదించి పెట్టిన మహాకవి జాషువా సామాజిక అసమానతపై, సంస్కరణల ఫలాలు చేతికి అందే సమయంలో, వర్ణాశ్రమ ధర్మాల పరిరక్షణను సమర్థించే లక్షణాలు ముందుకొస్తున్న విధానం జాషువాను కలవర

పరిచాయి. హక్కులకొరకు ఉద్యమించే సమయం వచ్చిందని భావించి, హరిజనులుగా పిలువబడే వారిలో ధైర్యం నింపి, చైతన్యం రగిల్చి ఉద్యమించేలా చేసి దళితుల ఆత్మగౌరవ సాధనకై తపించాలని ఊహించాడు. పీడక వర్గాలను ఎదిరించి, హక్కుల సాధన దిశగా సాగిన మహాప్రస్థానం, జాషువా రాసిన రచనే గబ్బిలం. ఆగామి యుగంలో దళిత సూర్యుడి శిరస్సున ఉంచిన అగ్ని కిరీటమే ఈ గబ్బిలం. ఆయన మనోభావాన్ని దళిత యువకుడి ద్వారా యెంత చక్కగా చెప్పారో!

వాని నుద్ధరించు భగవంతుడే లేదు
మనుజెడెట్లు వాని గనికరించు
వాడు జేసికొన్న పాపకారణ మేమో
యింతవరకు వాని కెరుకలేదు
"ఆ అభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు!
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"
"కులము లేని నేను కొడుకుల బుట్టించి
ఈ యఖాతమందే తరోయవలేనే
భార్యయేల బుట్టబానిస కని వాడు
జరుపసాగే బ్రహ్మచర్య దీక్ష"

1932వ సం॥లో వచ్చిన పిరదౌసి మరొక ప్రధాన రచన పర్షియన్ చక్రవర్తి ఘజనీ మొహమ్మద్ ఆస్థానంలో ఉన్న కవి పిరదౌసి. అతనికి రాజుగారు ఒక మాట ఇచ్చారు. మాటకు ఒక బంగారు నాణెం ఇస్తానని, ఆ కవి పది సంవత్సరాలు శ్రమించి మహాకావ్యాన్ని వ్రాశాడు. కానీ అసూయపరుల మాటలు విని రాజు తన మాట తప్పాడు. ఆవేదనతో ఆత్మహత్య చేసుకొన్న ఆ కవి హృదయాన్ని జాషువా అద్భుతంగా వర్ణించాడు. సుల్తాను మాటతప్పినప్పుడు

అల్లాతోడని పల్కి నాపసిడి కా
వ్య ద్రవ్యము న్వెండితో
జెల్లింప దొరకొన్న టక్కరివి: నీ
చే బూజితుండైనచో
నల్లా కున్సుఖమే? మహమ్మదు నృపా
లా! సత్య వాక్యం బెవం
డుల్లంఘింపదొ వాడెపో నరుడు, ధ
న్యుం డిద్ధరామండలిన్

వంటి పద్యాలు పిరదౌసి మనో భావాలను పాఠకుల మనోఫలకం మీద నిలచిపోయేలా చేస్తాయి. చివరగా పరిదౌసి మసీదు గోడలపై రాసిన పద్యం జాషువా పదాలలో

ముత్యముల కిక్కయైన సముద్రమున
బెక్కుమారులు మునకలు వేసినాడు
భాగ్యహీనుడ ముత్యమ్ము వడయనైతి
వనధి: నన్నుమ్రింగ నోరు వచ్చినది తుదకు.

పిరదౌసి ఒక పారశీక కవి. పిరదౌసి యొక్క యదార్థ జీవిత కథయే ఈ పిరదౌసి కావ్యం. విధి వంచితుడైన కవి జీవిత చివరి ఘట్టాన్ని ఎంతో హృద్యంగా వర్ణించాడు. జాషువా కవి. జాషువా, పిరదౌసిలోకి పరకాయ ప్రవేశం చేసి రాసిన రచన. పిరదౌసిలానే జాషువా కూడా తన జీవితంలో ఎన్నో కష్టాలు, అవమానాలు, తిరస్కారాలు, ఛీత్కారాలు పడ్డాడు. కానీ తన కృషికి తగ్గ గుర్తింపు, ప్రశంసలు, సన్మానాలు, బిరుదులు పొందాడు. కానీ కావ్యంలోని పిరదౌసి యివ్వేమీ పొందకుండానే కను మూసిన విధివంచిత కవి.

1948వ సం॥లో మహాత్మాగాంధీ మరణవార్త విని ఆవేదనతో జాషువా సృష్టించిన స్మృత్యంజలి 'బాపూజీ' భారత జాతిపిత మహాత్మాగాంధీని ఒక దుండగుడు హత్య చేసినపుడు భారతావని అంతా శోకసముద్రంలో మునిగిపోయింది. ఈ సందర్భంలో గాంధీజీ ఔన్నత్యాన్ని, పవిత్రతను తలచుకొని ఎన్నో విధాలుగా కొనియాడారు జాషువా కవి. మిక్కిలిగా పరితపించి, బాపూజీ లేని దేశాన్ని తలచుకొని దు:ఖించారు. భారతదేశములోని వజ్రాల సంపద అంతటినీ తూకం వేసినా కూడా గాంధీజీయే ఎక్కువ బరువు తూగుతాడు, లోకానికంతటికీ సామరస్యమును ప్రసాదించిన విజ్ఞాన ప్రధాత గాంధీజీ అని జాషువా పేర్కొన్నాడు.

భరత వర్షంబీను వజ్రాల ధనరాశి
తూకంబునకు పెచ్చు దూగునాడు
మూడు మూర్తుల దయాభూతి ప్రత్యంగాన
తాండవించెడు పవిత్ర స్వరూపి
పదివేవ యేండ్ల లోపల ధరాదేవత
కనియెఋంగని జగన్మని వరుండు
అనుగుదమ్ములు కోరుకొని స్వరాజ్యార్థమై
పస్తుండి శుష్కించు పండుముసలి
గోచిపాత గట్టుకొని జాతిమానంబు
నిలిపినట్టి ఖదరు నేతగాడు
విశ్వసామరస్య విజ్ఞాన సంధాత
కామిత ప్రదాత గాంధీ తాత.

గాన గంధర్వుడు అయిన ఘంటసాల గారిని స్మరించుకుంటూ ఒక చిన్న సంఘటనను గుర్తుచేశారు జాషువాగారు. 'సత్యహరిశ్చంద్ర' నాటకం, వారి 'స్మశాన వాటిక'అనే పేరుతో తన ఖండకావ్యంలోని పద్యాలు లేకుండా ఊహించుకోలేము. వీరు రాసిన శిశువు (పాపాయి) అనే ఖండికను ఘంటసాల గారు అద్భుతంగా గానం చేశారు. ఈ పాట ఘంటసాల గారు పాడి, రికార్డింగ్ జరిగే సమయంలో జాషువాగారు వారి ఇంటికి వెళ్ళి, ఘంటసాల గారి ఇంటి బయట ఉన్న అరుగు మీద కూర్చున్నారట. ఘంటసాల గారు బయటకు వచ్చి 'ఏమి టండీ'! బయటనే కూర్చున్నారు'అని అడిగితే, అందుకు జాషువాగారు "నేను అంటరాని కులమునకు చెందిన వాడను, మీరు బ్రాహ్మణులు, మీ అనుమతి లేకుండా మీ ఇంట్లోకి ఎలా రాగలను? అని అన్నారట. అప్పుడు ఘంటసాల గారు "నాకు ఎలాంటి పట్టింపులు లేవు, మీరు మా ఇంటిలోపలికి స్వేచ్ఛగా రావచ్చు. " మీరు సరస్వతీ పుత్రులు, మీరు అంటరాని వారైతే సరస్వతీ దేవి కూడా అంటరానిదనే కదా అర్థం!" అని చెప్పి ఇంట్లోకి తీసుకొని వెళ్ళి, తన సహృదయాన్ని చాటుకొన్న ధన్యజీవి ఘంటసాల గారికి హృదయ పూర్వక బాష్పాం జలి చెప్పారు. ఈ ఘటన గుర్తొచ్చినప్పుడల్లా నాకు తెలియ కుండానే నా కళ్ళు చెమర్చుతాయని జాషువాగారు అనేవారు.

ఆకాశంబును కారుమబ్బుగము లాహరించె, దయ్యాలతో
ఘూకంబుల్ చెరలాడసాగినవి, వ్యాఘోషించె. . . నల్దిక్కులన్
గాకోలంబులు, గుండెఝల్లుమనుచున్నంగాని యిక్కాంటియం
దా కల్లాడిన జాడలే, దిచ్చట సౌఖ్యంబెంత క్రీడించునో!

మహాకవి గుర్రం జాషువాగారు దిగువ కులంలో పుట్టడం వల్ల నానారకాల అవమానాలను అనుభవిస్తూనే, అరుదైన, అద్భుతమైన సాహిత్యాన్ని అందించిన మహావీరుడు. హరిజనుడు అవ్వడం వలన అగ్ర కులస్థులు ఆయనను దూరంగానే ఉంచేవారు. సాహిత్య సమావేశాలలో కూడ ఆయనకు విడిగానే బోజనం వడ్డించే వారట. అబ్బూరి వరదరాజేశ్వరరావుగారు రాసిన 'కవన కుతూహలం' అనే పుస్తకంలో తాను ఇలాంటి సంఘటనకు ప్రత్యక్షసాక్షిగా ఉన్నట్లు రచయిత చెబు తారు. తన జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా జాషువాలోని హస్య చతురతలో ఎలాంటి మార్పూ రాలేదు. జాషువాగారిలో హాస్య ప్రవృత్తి చాలా ఎక్కువ.

'నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును
నవ్వులు చిత్తవృత్తికిన్ దివ్వెలు"
కొన్ని నవ్వులెటు తేలవు కొన్ని విష ప్రయుక్తముల్
పువ్వుల వోలె ప్రేమ రసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైన లే
నవ్వులు సర్వదు:ఖదమనంబుల వ్యాధులకున్ మహౌషదుల్!

అని అంటారు జాషువాగారు. నవ్వు మనిషికి మాత్రమే ఉన్న ప్రత్యేకమైన వరం. స్వచ్ఛమైన, ప్రశాంతమైన అంత రంగానికి చిహ్నమే నవ్వు. నవ్వులలో చాలా రకాలు ఉం డవచ్చు. కానీ అభిమానంతో కూడిన నవ్వులు సమస్త దు:ఖాలను నశింపజేస్తాయి. ఎటువంటి వ్యాధికైనా మందులా పనిచేస్తాయి, అని పై పద్యంలోని భావం.

అంతటి భావం మనసున కలిగి ఉన్నాడు కాబట్టే ఎంతటి బడబాగ్నినైనా చిరునవ్వుతో జయించగలిగాడు జాషువాగారు.

'కులమతాలు గీచుకున్న గీతలు జొచ్చి
పంజరాన గట్టు వడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన
నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను"

ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా. పుట్టుకతోనే దళితుడైన జాషువా గారు తక్కువ కులంలో జన్మించి, ఆ కారణంగా అనేక అవమానాలు పొంది కూడా, పట్టుదలతో కవిశేఖరుడై, నవయుగ కవి చక్రవర్తి తెలుగు సాహితీలోకంలో విలసిల్లిన ప్రజ్వరిల్లిన తేజోమూర్తి జాషువాగారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని, చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందిన మహాకవి జాషువాగారు.

'ఒక్కొక్క పద్దియమునకు నొక్కొక్క నెత్తురుబొట్టు మేనిలో తక్కువగా" రచించిన ఈ కవి చక్రవర్తి శారదాదేవి వరప్రసాది. 24 జులై 1971న గుంటూరులో ఆ శారదాదేవి ఒడిలోనే శాశ్వత విశ్రాంతి తీసుకున్నారు. జాషువాగారు తన జీవిత కాలంలో ఎన్నో బిరుదులు, పురస్కారాలు అందుకున్నాడు. తిరుపతి వేంకటకవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి జాషువా కాలికి గండపెండేరం తొడిగి ఈ కవీశ్వరుని పాదం తాకి నా జన్మ ధన్యం చేసుకున్నాను అని అన్నారు. అది తనకు లభించిన అత్యున్నత పురస్కారంగా జాషువాగారు భావించాడు. కవితా విశారద, కవికోకిల కవిదిగ్గజ-నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్‌గా ప్రసిద్ధుడయ్యాడు. క్రీస్తు చరిత్రకు 1964 సం॥లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1970 సం॥లో భారత ప్రభుత్వము పద్మభూషణ పురస్కారం అందజేసినది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు కూడా అందుకున్నారు.

జాషువా స్మారకార్థం కూతురైన హేమలతా లవణం గారు నెలకొల్పిన జాషువా ఫౌండేషన్ ద్వారా మానవ విలువలతో కూడిన రచనలు చేసిన సాహిత్యకారులకు జాషువా సాహిత్య పురస్కారం అందజేయబడుతున్నది.

"వడగాల్పు- నా జీవితమైతే, వెన్నెల - నా కవిత్వం" అని జాషువాగారు అన్నది అక్షర సత్యం.

"రాజు మరణించెనొక తార రాలిపోయే
కవియు మరణించే నొక తార గగన మెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాల్కల యందు"

"జాషువా విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి అచార్య ఎండ్లూరి సుధాకర్‌కి బహుకరించారు. దాశరథి రంగాచార్యకు జాషువా జీవిత సాఫల్య పురస్కారం మరియు కొలకలూరి స్వరూపరాణికి జాషువా విశిష్ట మహిళా పురస్కారము బహుకరించారు. దళిత సాహిత్యంలో విశేష కృషిచేసినందులకుగాను కాలువ మల్లయ్యకు జాషువా సాహిత్య విశిష్ట పురస్కారం బహూకరించారు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. జాషువా రచనలు-రెండవ సంపుటం
2. శ్మశానవాటిక ఖండకావ్యం-జాషువా విశ్లేషణ
3. సత్యహరిశ్చంద్ర-శ్మశానవాటిక -చీమలమర్రి-బృందావనరావు
4. కవనకుతూహలం-అబ్బూరి వరదరాజేశ్వరరావు
5. మహాకవి జాషువా జీవితం - సాహిత్యం-డా॥ చెంగల్వ రామలక్ష్మి
6. జాషువా సాహిత్యం దృక్పథం-పరిణామం-ఆచార్య ఎండ్లూరి సుధాకర్
7. నవయుగ కవిచక్రవర్తి, కవికోకిల-శ్రీగుర్రం జాషువా-టీ.వీ.యస్. రావు
8. సుప్రసిద్ధుల జీవిత విశేషాలు, జాషువా -జానమద్ది హనుమచ్ఛాస్త్రీ

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# వింధ్యవాసినీ దేవి కవిత్వంలో నానీల వసంతం

– డా॥. పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

భావాన్ని కేవలం నాలుగు చిన్న పంక్తుల్లోకి ఒదిగి అనల్పార్థాన్ని సృష్టించిన ఆధునిక కవిత్వ ప్రక్రియ నానీలు. ఆచార్య ఎన్. గోపీ గారితో నానీల ప్రక్రియ ప్రారంభమై దినదిన ప్రవర్ధనమానమై విరాజిల్లింది. ఇటీవల 182 నానీలతో వింధ్యవాసినీదేవి 'నానీల సింగిడి' పేరుతో నానీల హరివిల్లును సృష్టించింది. జీవితానుభవాలను అక్షర శిల్పాలుగా మలిచి కవితా ఇంద్రధన్నును సృజించింది.

చైతన్య శిల్పాలను చెక్కే శిల్పిగా ఉపాధ్యాయుడిని నమస్కరిస్తూ నానీలను ప్రారంభించింది. బాల్యాన్ని చిత్రించేప్పుడు ఎన్నో రంగులతో చిత్రిస్తారెందుకని, కేవలం నిష్కల్మషం ప్రతిబింబించేలా చిత్రిస్తే చాలంటుంది. బాల్యంలో బీజాలు సరిగా పడితే భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉంటుందనే భావన కనిపిస్తుంది. సమాజంలో అస్తిత్వ పోరాటాలు ఆవిర్భవించింది ఆస్తిలో వాటా కోసం కాదు, ఆత్మగౌరవానికి తొలిమెట్టుగా అభివర్ణించింది. మహిళలకు సమాజంలో ఎదురవుతున్న విపత్కర పరిస్థితులను గమనించిన రచయిత్రి ఊహా సామ్రాజ్యంలోనే నేను మహారాణిని" అనడంలో సమాజంలోని స్థితిగతులను చెప్పకనే చెప్పినట్లుగా అనిపిస్తుంది.

భావమా? అభ్యుదయమా?
ఏదైతేనేం ?
కవి గుండెను
కదిలించాలి కదా!

సమాజంలో జరిగే సంఘటనకు కవి హృదయం స్పందిస్తుంది. స్పందిస్తేనే కదా కవిత్వ సృజన జరిగేది. భావం, అభ్యుదయమా, ఇంకొకటా అన్నది తరువాత కదిలేది, కదిలించేదే కవిత అనే భావన వ్యక్తమవుతుంది.

అహంకారం బుసకొడుతూ పరిగెట్టేది పతనానికి దారి చూపించడానికే అంటుంది. కాలాన్ని వడబోసిన కాల గమనంలో చివరికి మిగిలేది జ్ఞాపకాల గుర్తులే అంటుంది.

విలువలన్నీ
డిలీట్ చేయబడ్డాయి
నేటి మనిషి
సజీవ యంత్రం

మంచి గంధంలాగా పరిమళించే మానవత్వం ఒకే ఒక అలంకారం కావాలి. కాని మానవత్వమా అదెక్కడ అనే రోజుల్లో జీవిస్తున్నాం. అందుకేనేమో మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాట అందె శ్రీ కలం నుండి జాలువారింది. నేటి మనిషి సజీవయంత్రంలా జీవిస్తున్నాడని, మానవీయ విలువలన్నీ డిలీట్ చేయబడ్డాయని వేదన వ్యక్తం చేసింది.

నీళ్లమీదే
నడిచొచ్చాన్నేను
కన్నీటి వంతెన
బలంగా మారింది.

జీవితానికి కన్నీటి వంతెన వేయబడిన వైనాన్ని మాటల వెనుక కన్నీటి బాధ వ్యక్తమవుతుంది. జీవన చదరంగంలో జీవన గమ్యం దూరమైనా కష్టమని బాధపడొద్దు, చిట్టిచీమ పరుగును ఆదర్శంగా తీసుకోమని సలహా ఇస్తుంది. విజయం వరిస్తే విర్రవీగటం విజయ లక్షణం కాదు. అహంకారాన్ని సంకెళ్ళు వేసి బంధించమని ప్రబోధిస్తుంది.

రాయి శిల్పంగా మారిందా ?
తడిమి చూడు
ఉలిదెబ్బల
ఆనవాళ్ళు.

ఉలిదెబ్బలకే శిల శిల్పంగా మారుతుంది. ఆ ఉలి దెబ్బల ఆనవాళ్ళు ఎప్పటికీ కనిపిస్తూనే ఉంటాయి.

జీవితంలో ప్రతి ఎదుగుదల వెనుక కష్టాల ఆనవాళ్ళుం టాయని తన దార్శనికతను నిరూపించుకుంది. అంతర్జాల ప్రపంచం ప్రపంచ స్నేహితుల నిచ్చింది కాని పక్కనున్న స్నేహితులని మరిపించిందన్న భావన వ్యక్తం చేసింది.

దూరమౌతున్న మేఘాలు
భారంగా కదిలాయి
గుండెనిండా
కన్నీటి తడితో...

దూరమౌతున్న మేఘాలే భారంగా కదులుతున్నట్లు కనిపిస్తాయి. స్నేహబంధం దూరమైతే, మనసున్న మనిషి హృదయం ఎలా తట్టుకుంటుంది. గుండెనిండా కన్నీటి తడితో హృదయం సంద్రంగా మారుతుంది. జీవితాంతం ఆ బాధ భారంగానే మిగులుతుంది అనే ఆర్తి కనిపిస్తుంది. ప్రజాస్వామ్యంలో 'ఓటు' అన్నది గురుతర బాధ్యతగా భావించాలి. చూపుడు వేలుపై వేసే సిరాచుక్క నోటుకు ఓటును అమ్మొద్దని అభ్యర్థించింది అని ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేసింది.

అప్పుడప్పుడు
కన్నీళ్లను దాచేయాలి
మరొకరి కళ్లు
చెమర్చకుండా

కష్టాల కడగండ్లతో జీవిస్తున్నప్పుడు కన్నీళ్లు రాకమానవు కాని కవి కళ్లలోనే దాచుకోవాలి మరొకరి కళ్లు చెమర్చ కుండా అంటుంది. నీ కన్నీళ్లు ఎదుటివారిని కన్నీళ్లు పెట్టించకూడదు. ఆ జాలి నీకవసరం లేదు. నీ హృదయ పరిమాణం పిడికిలంత అయితే సంకల్పం పిడికిలి బిగించినంత కావాలి అంటుంది.

ఇల్లంటే
నాలుగ్గోడలు మాత్రమే
కుటుంబం,
నాలుకు మనసుల సంగమం

ఇల్లనే నాలుగు గోడల మధ్యన నివసిస్తున్నాం కాని జీవించే కుటుంబం మాత్రం నాలుగు మనసుల సంగమంగా భావించాలి. మానవ సంబంధాలు చాలా ముఖ్యమైనవి పదిమందికి ఆదర్శంగా జీవించాలనే భావన స్పష్టమవుతుంది. మనుషుల్లో మానవ సంబం ధాలు మృగ్యమవుతున్నాయి. మాటలు హృదయం నుండి రావటం లేదు, గొంతులోంచే వస్తున్నాయి గుండెను ఏ ఆనకట్ట ఆపిందో అంటుంది. కాలానికి మనుషులంటే చాలా భయం, అందితే దాచేస్తారనే భయం ఉందని చెప్తుంది. గుండె అనే అల్మారాలో ఎన్ని జీవిత మజిలీలు కావ్యాలుగా రూపుదిద్దుకొంటాయి. వాటిలో విషాదాంతా లకే చోటెక్కువ అంటుంది. జీవితాన్ని చదవడం ఆరం భిస్తే జీవిత చరిత్రలు వెలవెలబోతాయి అని వ్యక్త పరిచింది.

క్రమశిక్షణకు ప్రతీక సూర్యుడే. నియమం తప్పని ప్రయాణమే సూర్యుని క్రమశిక్షణ. సూర్యుడిని ఆదర్శంగా తీసుకొని క్రమంగా క్రమశిక్షణ అలవర్చుకొని లోకానికి వెలుగునివ్వాలనే పిలుపు ప్రతిధ్వనిస్తుంది. ఈనాడు పూలు పూయాలంటే ఋతువులతో పనేలేదు. మనసు చెట్టుకు ఆశల పూలు పూస్తున్నప్పుడు ఋతువులతో పనేంటి అని ప్రశ్నిస్తుంది. మనిషి 'ఆశాజీవిగా జీవిస్తున్నాడు'. ఊహల పల్లకిలో ఊరేగుతున్నాడు. ఊహే ఒక రకంగా మనిషిని బ్రతికిస్తుందని చెప్పవచ్చు. కవిగా జన్మించాలనుంది; అనునిత్యం అక్షరమై శ్వాసించేందుకు అంటుంది. అమర వీరులకు జనం గుండెల్లో జ్ఞాపకాలుగా శాశ్వతంగా మిగిలి పోతారు మరి స్మృతి చిహ్నాలెందుకని ప్రశ్నిస్తోంది.

తరాల నాటి వృక్షం
తలొంచుకొని
బలౌతుంది
నగరాభివృద్ధి కోసం

నగరాభివృద్ధి పేరిట ఎన్నో చెట్లు నేలకొరుగు తున్నాయి. ఇది కూడా పరోపకారంలో భాగమే అని తలొంచుతున్నాయి. తరువులు తాను బలి అయినా సమాజానికి సందేశం ఇచ్చే వెళ్తున్నాయి. పాలకులకు ప్రజలే దేవుళ్ళు; కాని పూజలు మాత్రం ఐదేళ్ళ కొకసారే చేస్తారని వ్యంగ్యాస్త్రాలు సంధించింది. మెదడు ఎన్నో కొత్త

ఆవిష్కరణలకు నాంది పలుకుతుంది కాని మెదడును పరమాణువులా మార్చే మరో లోకాన్ని సృష్టిస్తుంది అంటుంది. అణుబాంబులా అక్షరం పేలింది; మస్తిష్కంలో ప్రశ్నల విస్ఫోటనం జరుగుతుంది అంటుంది.

సంఘ సంస్కరణలకు కాలం చెల్లింది. అయితే ఆత్మ సంస్కరణ అనివార్యమిప్పుడు అంటుంది. జీవితమంతా దుఃఖపు చీకటితో మునిగిపోయిందని ఆశల నక్షత్రాలు వెలుగురేఖలా కాంతిని వెదజల్లుతున్నాయంటుంది. కంప్యూటర్ల కాలంలో మెదడుకు పనిలేకుండా పోయిందని అంతా జీబీల్లోనే నిక్షిప్తం అయ్యిందని పేర్కొంది. బతుకమ్మ సిగలో మందారం లాగా ప్రపంచ పటంలో తెలంగాణ సింగారం అయిందని పేర్కొంది. గురువులు ఎప్పుడూ దైవాల్లాగా విద్యార్థుల హృదయాల్లో అమరుల్లాగా నిలిచిపోతారని వ్యక్తం చేసింది. ప్రశంసల వర్షం నేడు కురుస్తోంది. ఆ వర్షంలో తడిసి కవిహృదయం పురివిప్పిన మయూరమైంది. చెట్టుగా జన్మించడమే రాలే పువ్వుకి చివరి కోరిక అంటుంది. ప్రాంతీయ వైషమ్యాలు దాటడానికి మమకారాల వంతెన నిర్మిద్దాం రండి అని చెప్పి తనలోని మానవీయతని చాటింది. అంతర్జాలంలో అన్నీ ఉన్నాయట అనుబంధాల డాట్ కాం ఎక్కడుందో వెతికిచూద్దాం అని విస్మయం వ్యక్తం చేసింది. విద్యార్థులనుద్దేశించి పరీక్షలు ముగిసాయని సంతోషపడొద్దు; ఇకపైన జీవిత పాఠాలు నేర్వాల్సింది ఉందంటుంది. నిశ్శబ్దం వినడం అలవాటు చేసుకో నీలోని ధ్వనులన్నీ పలుకుతాయంటుంది. గెలిచినప్పుడు కాదు, ఓడినప్పుడు కూడా సంతోషమే లక్ష్యం కావాలి. గెలుపుదేముంది మహా అయితే నిన్ను ఈ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఒక్కసారి ఓడిపోయి చూడు ప్రపంచమే నీకు పరిచయమవుతుంది కాబట్టి సంతోషం జీవిత లక్ష్యం కావాలి. గెలిచినా ఓడినా ఒకే విధంగా ఉండాలి. మనిషి మిగిలున్నంత వరకే మనుషుల మధ్య నిరంతరం సంఘర్షణ జరుగుతుంటుందంటుంది. బురదను చూసి అసహ్యించుకోవద్దు. కమలం కూడా బురదలో నుండే పుట్టిందని, పేర్కొనడంలో పుట్టుక గురించి కాదు జీవించిన జీవితంలో జన్మసార్థకత కన్పిస్తుంది. బురదలో పుట్టిన కమలం దేవుని మెడలో వరమాల అవుతుందని చెప్పకనే చెప్పినట్లుంది.

ఇలా నానీలలో ఆత్మీయతను, దార్శనికతను, సత్యసంధతని ప్రదర్శించింది. ఆమె అంతరంగలోని ఆవేదన, నివేదన అంతా అక్షరబద్ధం చేసింది. మనుషులు కలుస్తున్నా మనసులు దూరమవుతున్నాయనే ఆవేదన, మానవతా విలువలు కనుమరగవుతున్నాయనే బాధ నానీలలో స్పష్టమయ్యింది. ప్రతి నానీలో జీవిత పయనంలో ఎదురైన అనుభవాలను కవిత్వీకరించింది. సూటిగా స్పష్టంగా భావాన్ని వ్యక్తీకరించడం మాట్లాడటంలోనే కాదు లిఖితంలో కూడా భావుకత నాలుగు పాదాలలో ప్రతిధ్వనించింది. లోకజ్ఞత, దార్శనికతకు ప్రతిబింబమే ఈ నానీల సింగిడి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# విశ్వనాథవారి వీరవల్లుడు - ఒక సమాలోచన

- డా॥. కొమ్మనబోయిన సుజాత, లెక్చరర్, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

కళా ప్రపూర్ణ, కవిసామ్రాట్, పద్మభూషణ్ బిరుదాంకితులైన విశ్వనాథ సత్యనారాయణ గారు చేపట్టని సాహిత్య ప్రక్రియలేదు. మహాకావ్యాలు, ప్రబంధాలు, ఖండకావ్యాలు, గేయ కావ్యాలు, నాటకాలు, నవలలు, కథానికలు, విమర్శలు ఇలా శతాధిక గ్రంథాలు రచించిన మహానుభావుడాయన.

విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన అనేకానేక నవలల్లో ఒక చక్కని, అద్భుతమైన నవల వీరవల్లుడు. నవల నిడివిలో చిన్నదైనా ఆద్యంతం ఆసక్తికరంగా, రసవత్తరంగా నడిచిన నవల. గుర్రం కదనుతొక్కిన జోరులో కథ నడుస్తుంది. కనుక ఒకసారి చదవడం మొదలుపెట్టిన తర్వాత పూర్వయ్యే వరకు పుస్తకం మూసేయలేం. పుస్తకం చదువుతున్న భావన కాకుండా ఎవరో మనముందు నిలబడి కథ చెప్తున్నట్లుగా అత్యంత ఆసక్తికరంగా సాగడం దీనియొక్క మరొక ప్రత్యేకత.

**ఇతివృత్తం :**

ఒక పల్లెటూరి పిల్లవాడు బస్తీ స్కూల్లో చేరడం జరుగుతుంది. ఆ స్కూలులో ఒక పంతులు నీ పేరేమిటి అని అడిగాడు వల్లప్పా అని సమాధానం చెప్తాడా పిల్లవాడు. ఆ మేష్టారు పగటి వేషాల వాళ్లు తిప్పినట్లుగా కళ్లు ముక్కు తిప్పి వల్లప్పా, వల్లకాడప్పా! అంటాడు. మిగిలిన పిల్లలందరూ అల్లరిగా నవ్వుతారు. దాంతో ఆ పిల్లవాడికి కోపం, దుఃఖం వస్తాయి. ఇహ అప్పటినుండి ఆ పిల్లవాడి పేరు ఎప్పుడు క్లాసులో పిలిచినా అందరూ నవ్వడం, ఆ పిల్లవాడు సిగ్గుపడడం ఇట్లా మూడు నెలలు గడిచాయి. ఇంతలో సెలవలిచ్చారు. పిల్లవాడు ఇంటికి వెళ్లాడు. ఇంటికి వెళ్లి తండ్రితో నాన్నా! నా పేరు వల్లప్పా బాగాలేదు మార్చుకోవాలంటాడు. ఆ పిల్లవాడి బామ్మ ఇదేమి చదువురోయ్ పేరు బాగా లేకపోవడం ఏమిట్రా అంటుంది. మా మాస్టారు బాగా లేదన్నాడే ఆయన ఎం.ఏ పాసయినాడు ఆయనకంటే మీకెక్కువ తెలుసా ఏమయినా సరే పేరు మార్చాల్సిందే అంటాడు పిల్లవాడు. వాళ్ల బామ్మ "నీవా పేరు మార్చుకుంటే నీ తండ్రి ఆస్థి నీవు తింటానికి తగవు అంటుంది. ఇంతకీ వల్లడంటే ఎవరు అనడుగుతాడు పిల్లవాడు. వల్లడు మన పాలేరు అంటాడు పిల్లవాడి తండ్రి. పాలేరు పేరైతే నాకసలక్కర లేదు అంటాడు పిల్లవాడు. ఒరేయ్ వీడ్ని చదువు మాన్పించేయ్ అంటుంది బామ్మ. ఆ పిల్లవాడు తండ్రి ముందు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే ఆ పిల్లవాడి తల్లి కళ్ల నీళ్ళు తుడుస్తూ వాడు పసివాడు వాడికేమి తెలియదు మీరు చెప్పరాదా అంటుంది. ఆ రోజు రాత్రి ఆ పిల్లవాడి నాన్న వల్లడి కథ చెప్తాడు.

వాళ్ళ నాన్న కథ చెప్పడం మొదలుపెడతాడు. చిన్నప్పుడు తాను కూడా తెలియక వల్లడ్ని తిట్టిన విషయంతో కథ మొదలుపెట్టి చెప్తాడు.

ఒకనాడు వాళ్ళ వంశమూల పురుషుడు వాళ్ళుండే ఊళ్ళో బ్రతకడం కష్టమై ఒక అడవిలో ప్రయాణం చేస్తూ ఒక ప్రాంతం సమృద్ధమై ఉండడం చూసి అక్కడ నివాసం ఏర్పాటు చేసుకొని ఉంటాడు. ఒకనాడు వల్లడి పూర్వుడు అడవిలోంచి వెళ్తూ వీళ్ళ ఇంటికి వచ్చి ఆకలిగా ఉంది అన్నం పెట్టమంటాడు. ఆయన అన్నంపెట్టి చుట్టపొగాకిచ్చి ఒరేయ్! ఇక్కడ ఊరు కడదామని ఉంది. ఈ ముళ్ళ కంప అంతా కొట్టాలి నీవు వస్తావా. నీవు కూడా ఒక చిన్న కొంప వేసుకొని ఇక్కడే వుండువుగాని అంటారు. వాడు దొరా! కడుపునిండా అన్నం పెట్టావు నీమాట కాదనలేను వస్తాను అని నాలుగు రోజుల్లో పెళ్ళాం బిడ్డలను తీసుకొని వచ్చాడు. ఇద్దరు కలిసి అడవిలో చెట్లు కొట్టి జొన్నలు, రాగులు పండించుకొంటూ కాలక్షేపం చేశారు. తర్వాత కమ్మ మరియు ఇతర కులాల వారిని తీసుకువచ్చి ఊరు ఏర్పాటు చేసుకున్నారు. అలా వల్లడి కుటుంబానికి వారికి అనుబంధం ఏర్పడుతుంది.

ఆ పిల్లవాడి ముత్తాత దగ్గర వల్లడు పాలేరుగా పని చేసేవాడు. అతని పిల్లలు చిన్నవాళ్లుగా ఉన్నపుడే అతను చనిపోవడం జరుగుతుంది. ఆ చనిపోయిన అతని (ముత్తాత) అన్న రాయుడు గారు. రాయుడు ఆస్థినంతా స్వాధీనం చేసుకొని వాళ్ళకి నిలువ నీడలేని పరిస్థితి కల్పిస్తాడు. ఆ ముత్తాతగారి భార్య చిన్నవాళ్లయిన తన పిల్లల్ని తీసుకొని గత్యంతరం లేని పరిస్థితుల్లో పుట్టింటికి చేరుకుంటుంది. ఇది జరిగే నాటికి వల్లడు ఊళ్ళో లేడు. అతను వచ్చిన తర్వాత పరిస్థితులు ఆకళింపు చేసుకుని ఏ విధంగా కథ నడిపి మళ్ళీ తన దొర కుటుంబాన్ని ఆ ఊళ్ళో నిలబెట్టాడు అనేదే కథలోని ప్రధానమైన అంశం.

**వల్లడి పాత్ర చిత్రణ :**

ఇందులో ప్రధాన కథానాయకుడు వీర వల్లడు. విశ్వనాథవారు వల్లడి పాత్రను మలచిన తీరు అత్యద్భుతం. అతను రెండు రోజులు వేరే ఊరు వెళ్ళి వచ్చేసరికొ దొర కుటుంబం కన్పించకుండా పోయేసరికి వీర వల్లడికి వీరావేశం వచ్చినా ఎప్పుడెలా ప్రవర్తించాలో వివేకం తెలిసినవాడు కనుక తొందరపడకుండా చాలా లౌక్యంగా చాతుర్యంగా కథ నడుపుతాడు.

"మళ్ళీ నా దొర ఆస్థి నా నా దొరకు అప్పజెపుతాను. అప్పజెప్పకపోతే నా పేరు వల్లడు కాదు. నేను మాలవాడి కడుపున పుట్టలేదు" అని ప్రతిజ్ఞ చేసిన వల్లడు తన మాట నిలబెట్టుకున్న వీరుడు.

ఒక్కపూట గుప్పెడు మెతుకులు పెట్టినందుకు జీవితాంతం కృతజ్ఞత చూపిన వంశంలో పుట్టినవాడు వల్లడు. ఆనాటి నుండి ఈనాటి వరకు వల్లడి వంశపు నెత్తురులో ఈ దేవతాగుణం లేశమైన చెదరలేదు. దొర ఇంట్లో దీపం పెట్టేవరకు వల్లడికి కూడు సయించలేదు. నిద్రపట్టలేదు. మునసబును, శివేరు నాయకుడ్ని, కరణాన్ని తనవైపు అంటే న్యాయంవైపు తిప్పడంలో వల్లడు చూపిన చాతుర్యం మాటల్లో వర్ణించలేనిది. మొత్తం రంగమంతా సిద్ధపరచి సమయం కోసం ఎదురు చూస్తుండగా వంట నూర్పిళ్ళ సమయం వస్తుంది. నూర్పిళ్ళ తర్వాత వల్లడు పాలేరు భాగం తీసుకోబోతుండగా రాయుడు గారు అడ్డుపడతారు. వల్లడు "ఇది నా దొర పొలం. ఈ పంట నా దొరది. నేనందులో పాలేరు భాగం తీసికొనేది తీసుకొనేదే" అని ఎదురు తిరుగుతాడు. రాయప్ప గారు "దొర యెవ్వడు నీవెవ్వరు, నా పొలంలో అడుగు పెట్టావా బండ కొయ్య వేయిస్తాను నీ దొరసాని ఆమె పిల్లలూ, నెత్తిన గుడ్డవేసుకుని వెళ్ళారు. ఇక్కడ ఎవరి అబ్బగాడి సొమ్మం దని పళ్ళికి తీశావు" అని కోపంతో పరవళ్ళు తొక్కాడు అప్పుడు వల్లడు పలికిన మాటలు విని తీరవలసిందే. ఆ సమయంలో వీర వల్లడి మాటలు ఇవి. "నా దొర ఆస్థి నీవు వేసుకొని తిందామని చూస్తున్నావు. నా గొంతులో ప్రాణం వుండగా నిన్ను తిననివ్వను. ఈ గుడ్డతో నా పూర్వులు వచ్చారు. నీ పూర్వులు వచ్చారు. ఇక్కడ కొచ్చిన మొదటి కుటుంబాలు మీరూ, మేమూ. బ్రాహ్మలలో పెద్ద కుండ మా దొరది. నా కులంలో పెద్ద కుండ నాది. నా దొరతో చస్తే చస్తాను. బ్రతికితే బ్రతుకుతాను, నా దొరకి మల్లే ఊరి వదలి లేచైనా పోతాను లేకపోతే నా దొరను తీసుకువచ్చి వూళ్ళో నిలదొక్కుతాను. నా పట్టు శివంగి పట్టునుకో. మాలవాడు కదా హుష్ అంటే ఎగిరి పోతాడను కుంటున్నారు. నేను నీ గుండెల్లో కూచుంటాను. నిన్ను సాధించాలంటే లక్ష విధాలా సాధిస్తాను నీ ఇల్లు దోయిస్తాను. లక్ష చెయ్య గలుగుదును కాని అవేవి చెయ్యను. వ్యవహారం గానే సాధిస్తాను ఇదిగో ప్రొద్దున్నే లేచిపోతున్నాను నా దొరసానినీ, చిన్న దొరలను తీసుకువస్తాను. వాళ్లను తీసుకువస్తేగాని గంటెడు నీరు పుచ్చుకోను ఇది ప్రతిజ్ఞే అనుకో. మాలవాడు వ్యవహారం చేయలేడను కుంటున్నావు. చేసి చూపిస్తాను. మాలవాడి వ్యవహారానికి, బాపనాడి వ్యవహారానికి భేదం చూపిస్తాను. వ్యవహారం చేయడానికి అక్షరం ముక్కలు రావాలనుకుంటున్నావేమో! బుద్ధికి, అక్షరానికి ఏమి సంబంధం లేదు. సంబంధం లేదని మా దొర వెయ్యిస్తారు చెప్పాడు". ఇలా మాట్లాడి రివరివా బయల్దేరి దొరసాని ఊరిముఖం పట్టాడు వల్లడు. ఆ వెళ్ళడం వెళ్ళడం దొరసానిని తీసుకొనే వస్తాడు. ఆ తర్వాత ఇక అతడు వ్యవహారం నడిపిన తీరును చదివి తెలుసుకోవల్సిందే గాని మాటల్లో తెలిపేది కాదు.

నూజివీడు జమీందారును దర్శించి ప్రభువుల అనుగ్రహాన్ని సంపాదించి దొర కుటుంబాన్ని నిలబెట్టిన వీరుడు వీర వల్లడు.

విశ్వాసానికి నిలువెత్తు రూపం వీర వల్లడిది తన దొరగారి భార్య సర్వలక్ష్మమ్మ గారిని తీసుకువచ్చి మళ్ళీ ఊళ్ళో నిలిపే వరకు అన్నం కూడా తినని విశ్వాసం అతనిది. అతను సర్వలక్ష్మమ్మ గారిని తీసుకురావడానికి వాళ్ళ ఊరు వెళుతూ దారిలో అలసిపోయి ఒక చెట్టుకింద పడుకుంటాడు. అక్కడికి ఒక బ్రాహ్మణ స్త్రీ నీళ్ళ కొరకు వస్తుంది. అతన్ని చూసి ఎవరిని విచారించి అన్నం తిన్నావా? అని అడుగుతుంది. తిన్నానని అబద్ధం చెప్తాడు వల్లడు. ఆమె అతని మాట నమ్మదు నీవు అబద్ధం చెప్తున్నావు మా ఇంటికి రా అన్నం పెడతానని అతన్ని ఇంటికి తీసుకువెళ్ళి అన్నం పెడితే వల్లడు తప్పించుకోలేక అమ్మా! నేను చెరువు దగ్గర తిని వస్తానని ఆ అన్నం తీసుకువస్తాడు. ఆ అన్నం తినడానికి కాదు. ఆవిడ మనస్సు కష్టపెట్టడం ఇష్టంలేక ఆ అన్నాన్ని తీసుకువెళ్తాడు. అతని చేతిలో అన్నాన్ని చూసి ఒక కుక్క అతన్ని అనుసరించి వస్తుంది. అప్పుడు వీర వల్లడు "పెడతానో, పెట్టలో తెలియని అన్నం కోసం అంత అనుసరించిందే ఈ కుక్క తరతరాలుగా మా దొరల కూడు తిని బ్రతికాను నేనెంత చెయ్యాలి" అనుకుంటాడు. అలా బయలుదేరిన వల్లడు ఆకలవుతూ ఉన్నా సర్వలక్ష్మమ్మ వస్తారని ప్రమాణం చేసేవరకు అన్నం తినకుండా ఉన్న పట్టుదల గల మనిషి. తన దొర కుటుంబాన్ని నిలబెట్టడం కొరకు అతను పడుతున్న తాపత్రయం చూసి సర్వలక్ష్మమ్మ గారే "ఓరి పిచ్చి ముండాకొడకా! నీకెందుకురా ఈ బాదరబందీ అంతా? ఆ దొర కొడుకు లేమైపోతే నీకేమి? ఈ బలవద్విరోధం నీకెందుకు? అని అంటుంది. అలా హిమాలయాలంత ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పాత్రగా వల్లని పాత్రను మలిచారు విశ్వనాథ సత్యనారాయణ గారు.

వల్లడు ఒక అద్భుతమైన పాత్ర. ఆ పిల్లవాడికే కాదు, పాఠకులకు కూడా కథ పూర్తయ్యేటప్పటికీ హిమాలయ పర్వతంలా ఉన్నతంగా భాసిస్తాడు వీర వల్లడు. వల్లడు ఆజానుబాహువైన మనిషి. ఛామనఛాయ వాడి కళ్ళూ, మొగం కొట్ట వచ్చినట్లు ఉంటాయి. ఊళ్ళో వాడొక పంచాయితీదారు. వాడి స్వరం మేఘ గంభీర స్వరం. ఊరి మొత్తం మీద ఎవ్వరూ వాడ్ని తిట్టడానికి సాహసించే వారు కాదు.

సాహసం, పట్టుదల, లౌక్యం, మానవత్వం, విశ్వాసం, కార్యదక్షత ఇవన్నీ కలబోసుకున్న రూపమే వీర వల్లడు. దొర కుటుంబాన్ని తన కుటుంబంగా భావించి, సేవించని వాడు వల్లడు. దొర కుటుంబం అంటే ఎంత భక్తో, ఎంత ప్రేమో అంతకుమించి చనువు కూడా. "ఏమయ్యోయి దొర్లె పడుకున్నావు కాబోలు! మంచం పట్టుకుంటే వదల్లేవు. కుప్ప దూసుకుపోయారు ఎవళ్ళో నేనేమో పెద్దముండా కొడుకుని. అక్కరకు వచ్చావు దొరవు అంటే నీవేమో కోడలమ్మను కావలించుకొని కూచోటమే తప్ప ఇల్లు కదలవు. నేను చచ్చిం తర్వాత తెలుస్తయి నీ పాట్లు". అని అనేంత చనువు. దీనిని బట్టే తన దొర కుటుంబంతో తనెంతగా మమేకమయ్యాడో తెలుస్తుంది.

ఒక యజమాని కుటుంబం ఒక పాలేరుని మా కుల దేవత, మా ప్రాణదాత అని నెత్తిన పెట్టుకోవడం మొదటి అబ్బురమనిపించినా వల్లడి కథ చదివిన తర్వాత వల్లడి ముందు అవి చాలా చిన్నమాటలనిపిస్తాయి. అంత మహోన్నతంగా ఆ పాత్రను తీర్చిదిద్దారు విశ్వనాథ సత్యనారయణ గారు. మానవత్వపు విలువలకి, మమకారాలకు, ముఖ్యంగా విశ్వాసానికి పెద్దపీట వేసిన నవల వీర వల్లడు.

ఈ నవలకొక చక్కని కొసమెరుపు నిచ్చారు విశ్వనాథ సత్యనారాయణ గారు. అది ఆ పిల్లవాడి మాటల్లోనే విందాం. "మళ్ళీ నేను స్కూలుకు వెళ్ళాను నమ్మండి. నమ్మకపోండి. వల్లప్పా అని ఎక్కిరించిన వాళ్లకి నలుగురికి ఫెడేలు ఫెడేలుమని లెంపకాయలు పేలిపై మళ్ళీ నన్నన్నవాడు లేడు. నేను అప్పటినుంచి మా పాలేరుకు మల్లే వీర వల్లుడ్ని అయినాను".

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# యువత - ఆధ్యాత్మికత

- డా॥. బి.యం.యం.ఆర్.యస్.టి.కె, ఆచార్యులు, వేదాంతం.

భారతీయ ఆధ్యాత్మికత మహోన్నతమైనది, మహోత్కృష్టమైనది. మన దేశానికి సంబంధించి ఆధ్యాత్మిక ప్రపంచంలో రమణ మహర్షి, శ్రీరామకృష్ణ పరమహంస, స్వామివివేకానంద, శ్రీశంకర భగవతాదలు వంటి మహనీయులెందరో ఉన్నారు. వారంతా ఆధ్యాత్మిక మార్గంలో పయనించి, ఆధ్యాత్మికోన్నతిని పొంది, తమ సందేశాల ద్వారా దివ్యమైన ఆధ్యాత్మిక తరంగాలను ప్రసరింపజేశారు. వారు తమ ప్రభోదాలతో ప్రజలందరినీ ఆధ్యాత్మికపరంగా చైతన్యవంతం చేశారు. "ప్రతి మనిషికి పైకి కన్పించే శరీరం, అంతర్లీనంగా ఉండే మనస్సుతో పాటు 'ఆత్మ' అనే శక్తి దాగి ఉందని, అది తేజోమయమైనదని అన్ని శక్తులను తనలో ఇముడ్చుకోగలదని అదే యదార్థమైన మనిషి" అని, అసత్యాన్ని అందరికీ చాటి చెప్తూ జీవన్ముక్తుల్ని చేయడానికి కృషి చేశారు.

ఆధ్యాత్మికత అంటే "ప్రతి మనిషికి శరీరంతో పాటు మనస్సు పైకి కన్పించని వ్యక్తిత్వం అనేవి ఉంటాయి. ఆ వ్యక్తిత్వమే అంతరాత్మ. శరీరాన్ని మనస్సును నిగ్రహపర్చి ఒకే వస్తువు మీద ఏకాగ్రతను కలిగి అంతరాత్మకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడమే ఆధ్యాత్మికత". ప్రాచీనకాలం నుండి ఎంతో ఆధ్యాత్మిక ఔన్నత్యం కలిగిన మనదేశంలో నేడు పాశ్చాత్య సంస్కృతీ విధానాలు విలయతాండవం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఎక్కువగా ఉంటోంది.

దాని వలన వారు మన సంస్కృతీ విలువలను, ఆచార వ్యవహారాలను, ఆధ్యాత్మిక భావాలను విస్మరిస్తున్నారు. విలువలతో కూడిన శాస్త్రీయ విజ్ఞానాన్ని, ఆచార వ్యవహారాల్ని, నేర్చుకోకపోవడం వలన, వాటిని అనుసరించకపోవడం వలన యువత అనేక విధాలుగా ఇబ్బందులపాలౌతున్నారు. ఉదాహరణకు తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల అమర్యాదగా వ్యవహరించడం, దాన్ని ఫ్యాషన్‌గానూ, స్వేచ్ఛా చిహ్నంగానూ భావించడం, కొన్ని సందర్భాల్లో స్వేచ్ఛ ఎక్కువై విశృంఖలత్వానికి దారి తీయడం, ఆత్మహత్యల వంటి దుశ్చర్యలకు పాల్పడి తమ లక్ష్యాలను, జీవన గమ్యాలను చేరుకోకుండానే విగత జీవులవడం వంటి సందర్భాలనెన్నో మనం తరచుగా తెలుసుకుంటూనే ఉన్నాం. యువత ఈ విధమైన విధానాలను వీడి సన్మార్గంలో పయనించడానికి ఆధ్యాత్మిక మార్గం ఎంతగానో తోడ్పడుతుంది. యువత నుద్దేశించి వివేకానందస్వామి వంటి మహనీయులు చేసిన ప్రభోదాలు ఎంతో స్ఫూర్తినిస్తూ వారిని ప్రభావితం చేస్తాయి. యువతకి "వేదాంతంతో, శాస్త్రీయ విజ్ఞానంతో జతకూడిన పాశ్చాత్యశాస్త్ర విజ్ఞానం, ఆదర్శమైన బ్రహ్మచర్యం, వాటితోపాటు శ్రద్ధ, ఆత్మవిశ్వాసం ఎంతో ఆవశ్యకమని" స్వామి వివేకానంద ప్రభోదించారు. అలాగే "గురువుకి ఏమాత్రం ఎదురు చెప్పని విధేయత, కఠోర బ్రహ్మచర్యం అనే రెండు అంశాలు విజయ రహస్యాలు" అని యువత నుద్దేశించి తెలియజేశారు. "ఉక్కునరాలు, ఉక్కు కండరాలతో శారీరక దారుఢ్యం, మానసిక స్థయిర్యం కలిగి, ధైర్యసాహసాలతో సింహాలలాగా యువత ఉండాలని, అలా ఉన్నవారే నిజమైన యువత అని కూడా ఆయన పిలుపునిచ్చారు. మహాకవి శ్రీశ్రీ గారు కూడా "మహాప్రస్థానం"లో యువత నుద్దేశించి -

"ఎముకలు కుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులారా చావండి!
నెత్తురు మండే
శక్తులు నిండే
సైనికులారా రారండి!"

అంటూ కవిత రాశారు. యువత ఎప్పుడూ చైతన్యవంతంగా, ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సోమరి

తనాన్ని వదలి, యువశక్తి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. కానీ నేటి యువత కామం, భయం, అహంకారం, ఆత్మన్యూనత వంటి భావ సంక్లిష్టాలతో కొట్టుమిట్టాడుతూ, వ్యవసనాలకు బానిసలుగా తయారవుతున్నారు. వారి మనస్సులు భావ సంక్లిష్టాలతో నిండిపోవడం వలన సరైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోలేని పరిస్థితుల్ని కలిగి ఉంటున్నారు. కాబట్టి యువత మహనీయుల బోధలకు ఆదర్శంగా తీసుకొని తమ వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే దిశగా ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. తద్వారానే వారు వ్యక్తిత్వ నిర్మాణం చేసుకోగలగడంతోపాటు, అభివృద్ధి పథంలో భాగస్వామ్యం కావడానికి అవకాశం ఉంటుంది.

యువత ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడం వలన అనేక ప్రయోజనాలున్నాయి. ఉదాహరణకు ఆధ్యాత్మికతలో ధ్యానం, యోగ వంటి అంశాలను నిత్యం ఆచరించవలసి ఉంటుంది.

దీని వలన ఏకాగ్రత శక్తి పెంపొందుతుంది. పోటీ ప్రపంచంలో అనుకున్న లక్ష్యాలను యువత సాధించాలంటే ఏకాగ్రత అనేది ఎంతో అవసరం. ధ్యానంలో ఒకే విషయంపై దృష్టి నిలపడమనేది అలవాటవుతుంది కాబట్టి తద్వారా లక్ష్యాల సాధన కూడా సులభతరమౌతుంది. అదేవిధంగా బ్రహ్మచర్యం పాటించడం మరొక అంశం. దాని ఆచరణలో భాగంగా నియమాలను పాటిస్తారు. తద్వారా ధూమపానం, మద్యపానం వంటి దురవ్యవసనాలను వీడి సన్మార్గంలో ఉండడానికి అవకాశం ఏర్పడుతుంది. మతసామరస్యం, లౌకిక భావన వంటి సామాజిక అంశాలకు సుస్థిరత ఏర్పడుతుంది.

ఈ విధంగా అనేక ప్రయోజనాలున్న ఆధ్యాత్మిక మార్గాన్ని మన భారతీయ సమాజంలో ఇప్పటి వరకు అనేక యువకులు అనుసరించి, తర్వాత తరాల వారికి మార్గదర్శకులుగా, స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారు. పురాణాలను పరిశీలిస్తే భక్తప్రహ్లాదుడు, ధ్రువుడు వంటి వారు ఆదర్శమూర్తులుగా ఉండడాన్ని గమనించవచ్చు. ఆధునిక కాలంలో అయితే స్వామి వివేకానంద, సంత్ జ్ఞానేశ్వర్ వంటి వారు యుక్త వయస్సులోనే ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించి యావత్ లోకానికి ఆదర్శంగా నిలిచారు. వివేకానందుడు యోగ, ధ్యానం వంటి ఆధ్యాత్మికాంశాలపై రాసిన పుస్తకాలు, సంత్ జ్ఞానేశ్వర్ రాసిన 'జ్ఞానేశ్వరి గీత' మొదలైనవి ఎంతగానో ప్రాచుర్యాన్ని, జనాదరణను పొంది ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తున్నాయి. ఇలాంటి మహనీయుల యొక్క జీవన మార్గం, వారి యొక్క రచనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తి ప్రదాయకం. వారిని ఆదర్శంగా తీసుకుని యువత లక్ష్యాల సాధనకై కృషి చేయాలి. అందుకు ఉపకరించే ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలి. అప్పుడే "మనిషికి ఆధ్యాత్మికతయే అసలైన జీవన శక్తి" అన్న విషయం అవగతమై, ఆత్మన్యూనత వంటి భావ సంక్లిష్టాల నుంచి విముక్తులు కాగలుగుతారు. మన భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూ, వాటి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన బాధ్యత కూడా యువతపై ఉంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆధ్యాత్మిక జ్యోతి - పి. రామచంద్ర దయానిధి.
2. నా భారతం అమర భారతం - స్వామి వివేకానంద.
3. మహా ప్రస్థానం - శ్రీశ్రీ.

# అపురూప కళారూపాల విధ్వంస దృశ్యం యక్షగానం

- డా॥. కందిమళ్ల సాంబశివరావు

"మహాజనులారా! నా జీవితం ఈ కళతో ప్రారంభ మయింది. మీ ఆదరణకై... అభిమానానికై పరితపించానే గానీ, కడుపుకు పిడికెడు మెతుకులకై ఎన్నడూ ఆశించ లేదు. మీ ఉత్సాహమే మా ఊపిరి.. మీ మెచ్చుకోలు ప్రసంగాలే మాకు ఆహారాలు అనుకొని ఇన్నళ్లూ బ్రతికాం... కానీ మహాజనులారా! కళాకారుడికి దరిద్రం శాపం. కళకు దరిద్రానికీ ఏదో అవినాభావ సంబంధం ఉంది. కళా కారుడికి దరిద్రం శాపం. కళకు దరిద్రానికీ ఏదో అవినాభావ సంబంధం ఉంది. కళాకారుడు కళలో ఎంత ఉచ్ఛ స్థితిలో ఉంటాడో... దరిద్రంలో అంతకన్నా మహోన్నత స్థితిలో ఉంటాడు. అ నిజం నేను కొద్ది క్షణాల క్రితం తెలుసుకొన్నాను. ఆదరణలేని కలను నమ్ముకొని బ్రతికాం. మాకు బిరుదులు.. పండిత శాలువాలూ వద్దు. గజారోహణలూ గండపెండేరాలూ వద్దు. మరో ప్రదర్శనకు బ్రతికుండను ఇంత అన్నం పెట్టగల మహానుభావుడుంటే చాలు. ఇది నా జీవితంలో కలిగిన మొట్టమొదటి అనుమానం. దానికి ఈ సభలోని ఆదరణ సమాధానం కావాలి. ఏ మహానుభావుడు ఏక్షణంలో నా కళను మెచ్చుకొంటూ ఈ శాలువాను నా భుజం మీద కప్పాడో గానీ.. మహాజనులారా! ఇది నేను చచ్చిన తరువాత నాశనంపై కప్పి గుడ్డగా మారే దురదృష్టాన్ని మరో దురదృష్టంగా జోలెగా మారి మీ ముందుకు వస్తున్నది. ఎందుకో తెలుసా! ఆదరణ లేని కళ మనకొద్దు నాన్న. అన్న నా కుమారుడు ఈ భామాకలాపంలో భామ వేషం వేస్తూ కొద్ది క్షణాల క్రితమే మరణించాడు. నా బిడ్డను దహనం చేసుకునే డబ్బు నా దగ్గర లేదు. అందుకే మీ ముందుకు వస్తున్నాను. నా ఈ జోలెనిండితే నా బిడ్డ శవాన్ని దహనం చేసుకొంటాను. నా కళను మీకోసం మీ అందరికోసం బ్రతికించుకొంటాను. మహాజనురాలా? మీ అభిమానం చిన్నచూపు చూస్తే నా బిడ్డ శవాన్ని కాకులకు వదిలి... ఆ భయంకర దృశ్యాన్ని నా మిగిలిన కళా జీవితా నికి హెచ్చరికగా ఈ కళకు దూరంగా బ్రతుకుతాను.." అని గుండెను పిండే విషాదాంతో ఒక కళాకారుడి విషాద మయమైన వేడుకోలు.. అభ్యర్థన.. కళాకారుడి కడుపులోని ఆకలి కాష్టంలో కట్టెలా కాలుతున్నా.. అతడి కీర్తికిరీటాల ధగధగలు ఆకాశాన్ని అంటుతూ ఉంటాయి. ఒకప్పుడు మహోన్నతంగా వెలిగి కాలానుగుణంగా మారిన అభి రుచులు.. ప్రపంచీకరణ ఉక్కుపాదాల కింద నలిగి చిట్లి పోతున్న సంప్రదాయ, జానపద కళారూపాల దైన్య; హైన్య స్థితిని; ఆ కళాకారుల క్షుభితతాశ్య కల్లోల నీరధులకు అద్దం పట్టిన ప్రఖ్యాత నాటక, సినీ రచయిత; నటుడు; యం.వి.యస్. హరనాథరావు యక్షగానం నాటిక ఆధునిక తెలుగు సాంఘిక నాటక ప్రస్థానంలో అద్భుతాలను ఆవిష్కరించి గొప్ప రచన; ప్రదర్శనగా శిఖరాయమానంగా నిలిచింది.

హరనాథరావు... మూడు దశాబ్దాల కాలం తెలుగు రంగ వేదికపై ఎగసిన ఉత్తుంగ తరంగం. అక్షరం ఒక అగ్ని. అవి గుప్పెడు కలిస్తే శతఘ్ని. ప్రతిమాటలో ఆ శతఘ్నులను అస్తవ్యస్త వ్యవస్థపై పేల్చిన నాటక కవి.. పవి.. రవి.... హరనాథరావు ఆయన ఈటెల వంటి మాటలు.. విచ్చుకత్తుల వంటి విసుర్లు పదునైన సంభా షణ శరసంధానంతో సామాజిక సమూహం ఉలిక్కి పడింది. ఆయన మాటలు మల్లెపూవు మెత్తగానూ ఉంటాయి. మరఫిరంగి నుండి దూసుకువచ్చే అగ్ని కీలల్లా ఉంటాయి. ఆయన నాటక; సినీ రచనల్లో స్వీకరించిన ఇతివృత్తాలన్నీ సమకాలీన; సంక్షుభిత వ్యవస్థకు అద్దం పడతాయి. జగన్నాధరథ చక్రాలు; క్షీరసాగర మథనం; జనారణ్యం బూచి; అడవిలో అక్షరాలు; కన్యావరశుల్కం వంటి నాటకాలు; యక్షగానం; అంతం కాదిది ఆరంభం; రెడ్‌లైట్ ఏరియా; నువ్వు నీకు తోడుంటే; పాపం

సుబ్బారావు ఒక్కడే వంటి నాటికలు హరనాథరావు కలం నుండి జాలువారాయి. ఒక్క జగన్నాధ రథచక్రాలు మినహా (దీని దర్శకుడు సినీ దర్శకుడు టి.కృష్ణ) అన్ని నాటకాలూ; నాటికలను స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించి వందలాది బహుమతులను పొందారు.

1979లో హరనాథరావు యక్షగానం నాటికను రచించారు. ఈనాటికలో సంప్రదాయ కళారూపమైన కూచిపూడి భాగవతుల యక్షగానం; శతాబ్దం చరిత్రగల అపురూప జానపద కళారూపమైన తోలుబొమ్మలాట కళాకారుల వ్యదార్థ జీవన విషాద రాగాలను గుండెపట్టు కదిలించేలా రచించారు. ఈ నాటికి ఇతివృత్త వైవిధ్య పాత్ర చిత్రణ; సన్నివేశ కల్పన; సందేశం వంటి అంశాలు విశ్లేషించిబోయే ముందు యక్షగానం; తోలుబొమ్మలాంటి కళారూపాల చరిత్ర; నేపథ్యాలను విశ్లేషించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తెలుగునాట ఉన్న ప్రాచీన కళారూపాలలో అతి ప్రాచీనమైనది యక్షగానం. ఆంధ్ర; తమిళ; కర్నాటక దేశాలలో అతివిస్తారంగా ఇది వ్యాప్తి చెందింది. వర్తమాన కాలంలో మనం చూస్తున్న వీధి భాగవతానికి యక్షగానమే పుట్టిల్లు వంటిది. యక్షగానం అంటే యక్షులచే పాడలుడే సంగీత విశేషం. యక్షగాన ప్రదర్శన వచ్చే ప్రతి పాత్ర తనను గూర్చి తాను చెప్పుకోవడంతోపాటు కథను ముందుకు నడుపుతుంది. 15వ శతాబ్దం నుండి యక్షగాన ప్రక్రియ విశేష ప్రాచుర్యంలోకి వచ్చింది. యక్షగానంలో కథకు సంబంధించిన పాత్రలతోపాటు ఎరుకసాని పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఇవ్వబడింది. యక్షగానాలలో పామర జనుల హాస్యం కొరకు కటికమువాడు; సింగి; సింగడు; సుంకరకొండడు వంటి పాత్రలు ఉండేవి. యక్షగానాలు కోస్తా ప్రాంతంతోపాటు తెలంగాణ; రాయలసీమ; ఒరిస్సా సరిహద్దు జిల్లాలు; తమిళనాడు లోని మధుర, తంజావూరు, పుదుక్కోట వంటి ప్రాంతాలలో ప్రత్యేకించి తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలలో విస్తృతంగా ప్రదర్శింపబడింది. యక్షగానాలలో పురాణ కథలతోపాటు సమకాలీన ఇతివృత్తాలను కూడా స్వీకరించారు.

మొదట దేశీ సంప్రదాయంలో పుట్టిన యక్షగానానికి కృష్ణా జిల్లా కూచిపూడికి చెందిన సిద్ధేంద్రయోగి దీనిని సంస్కరించి మార్గసంప్రదాయంలో తీర్చిదిద్దాడు. సిద్ధేంద్ర యోగి నుండి కూచిపూడి భాగవతులు దాదాపు ఐదు శతాబ్దాల కాలం భామా కలాపం యక్షగానాన్ని విస్తృతంగా ప్రదర్శించారు. భామాకలాపంలో శ్రీకృష్ణుడు నాయకుడు. సత్యభామ కథానాయిక. శ్రీకృష్ణుడు రుక్మిణిపై చూపుతున్న ప్రేమ తనపై ప్రదర్శించలేదని కినుక చెందిన సత్యభామ వ్యథ చెందడం ఇందులోని ఇతివృత్తం. కూచిపూడి భాగవతులు ఊరూరా తిరుగుతూ యక్షగానాలను ప్రదర్శిచడంతో స్ఫూర్తిపొందిన పామరులైన వారు కొందరు తమ శైలిలో వాటిని ప్రదర్శించడం ప్రారంభించారు. పామరుల ప్రదర్శలు వీధి భాగవతాలుగా రూపాంతరం చెందాయి.

అన్ని లలిత కళల సమాహార స్వరూపంగా శతాబ్దాల కాలం నుండి పామర జనులకు వినోద సాధనంగా నిలిచిన అచ్చమైన జానపద ప్రదర్శన కళ తోలుబొమ్మలాట. ఒక నాటిక ప్రదర్శనకు కావలసిన హంగులన్నింటికీ నీ పుణికి పుచ్చుకొన్న కళారూపం ఇది. తోలుబొమ్మలతో ఆడించే ఆట కాబట్టి తోలుబొమ్మలాటగా పేరు వచ్చింది. కథలో వచ్చే ఉదాత్త పాత్రవైన రాముడు; కృష్ణుడు; సీత వంటి బొమ్మలను జింక చర్మంతో రావణుడు; కీచకుడు వంటి దుష్టుల బొమ్మలను మేకచర్మంతో తయారు చేస్తారు. ఆ తోలును శుభ్రం చేసి రంగులతో బొమ్మలుగా తీర్చిదిద్దుతారు. తెల్లని తెరను కట్టి వెనుకవైపు దీపపు కాంతిని ప్రసరించడంతో తెరపైన బొమ్మలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి. బొమ్మల అవయవాలకు దారాలను కట్టి వాటి కదలికల ద్వారా బొమ్మలను ఆడిస్తారు. పురుష బొమ్మలకు పురుషులు; స్త్రీ బొమ్మలకు స్త్రీలు తెరవెనుక నుండి సంభాషణలు పలుకుతారు. సూత్రధారుడు అనే మాట ఈ తోలుబొమ్మలాటను పుట్టింది. సూత్రము అనగా దారము. సూత్రములను తన చేతియందు ధరించి బొమ్మల కదలికలను శాసించువాడు సూత్రధారుడు అని దీని భావము, తోలుబొమ్మలాట కళారూపం ఆంధ్రదేశం

లోనే కాకుండా మహారాష్ట్ర; కేరళ; కర్నాటక; తమిళనాడు; బెంగాల్ వంటి రాష్ట్రాలలో కూడా వ్యాప్తి చెందింది. కథలో ఉన్న పాత్రలతోపాటు పామర జనుల వినోదం కోసం తోలుబొమ్మలాటలో జుట్టు పోలిగాడు; బంగారక్క; అల్లాటప్పగాడు; కేతిగాడు వంటి హాస్య పాత్రలుంటాయి. ఈ పాత్రలలో కూడా కేతిగాడు అతికీలకమైనది.

దశాబ్దాల క్రితం వరకూ యక్షగానం వంటి సంప్రదాయ కళారూపాలకు తోలుబొమ్మలాట వంటి జానపద ప్రదర్శనా కళారూపాలకు ఎంతో ఆదరణ లభించేది. నెలల తరబడి గ్రామాలలో ఉండి ఈ కళారూపాలను జనరంజకం ప్రదర్శించేవారు. సినిమాలు, టెలివిజన్ వంటి మాధ్యమాలు తిష్టవేసుకోవడంతో మారుతున్న ప్రేక్షకుల అభిరుచి మేరకు ప్రాచీన కళారూపాలకు ఆదరణ పూర్తిగా తగ్గిపోయింది. ఒకప్పుడు ఈ కళాకారులకు ప్రభువులు; జమిందార్లు; ధనవంతులు ఘనమైన సన్మానాలను చేసి నగదు బహుమతులిచ్చేవారు. ప్రజలు కూడా వారి శక్తికొలదిగా విరాళాలు ఇచ్చేవారు. కాలం మారింది. అభిరుచులూ మారిపోయాయి. సాంకేతిక విప్లవంతో అద్భుతాలు సృష్టించే సినీ, టెలివిజన్ మాధ్యమాల పోరులో... జోరులో ప్రాచీన కళలకు ఆదరణ పూర్తిగా తగ్గిపోయింది. ఒకప్పుడు ప్రజలకు వినోదాన్నీ; విజ్ఞానాన్నీ; నీతినీ బోధించిన కళారూపాలు పూర్తిగా కనుమరుగై పోయాయి. తరతరాల నుండి వారసత్వంగా వస్తున్న కళను విడిచిపెట్టలేక; వేరే వృత్తులకు తరలివెళ్లలేక ఆదరణ పూర్తిగా మృగ్యమైపోతున్న నేపథ్యంలో ఆ కళాకారులు బ్రతుకు చితికి ఛిద్రమైపోయింది. జానెడు పొట్టలో నిలువెత్తున లేచే ఆకలి మంటలను చల్లార్చలేక మారిన అభిరుచులకు అనుగుణంగా ఆ అరుదైన కళకు వ్యాపారాత్మక హంగులను అద్దలేక కొడిగట్టిన దీపంలా మిణుకు మిణుకు మంటున్న ఆ కళాకారుల బ్రతుకు పుస్తకంలో చిరిగిన పేజీల చిత్రణతో హరనాథరావు రచించిన హృద్యమైన నాటిక "యక్షగానం"

ఈ దేశంలో దరిద్రం కొత్తకాదు మనిషికి ఆశ ఉన్నంతగా కాలం అది ఉంటుంది. కానీ మనిషికి జీవితంలో దొరకని ఆనందాన్నీ, తృప్తిని అందిస్తుంది కళ. మనిషి తినే తిండి శరీరం బ్రతకడానికి.. పెరగడానికి. కళ అందించే ఆహారం మనసు బ్రతకడానికి.. పెరగడానికి. కళ అనేది అటు కళాకారునికి ఆత్మానందాన్నీ; ఇటు ప్రేక్షకునికి రసస్ఫూర్తిని కలిగించాలి. అదే కళాకారుడికి జీవితమూ; లక్ష్యం అనే వాదానికి కట్టుబడ్డ భట్టుకు; ఈ దేశంలో కళకు అంకితమైన కళాకారుడి శవాన్ని చందాలు వేసి దహనం చేస్తున్నారు. ఆ శవాల లెఖ్ఖలోకి మనం రాకుండా మరో జీవనం చూసుకుందామని బలంగా వాదించే ప్రహ్లాదునికి జరిగిన భావ సంఘర్షణ ఇతివృత్తంగా హరనాథరావు యక్షగానం నాటికను రచించారు. తరతరాల వారసత్వ సంపదగా వస్తున్న సంప్రదాయ కళారూపాలకు ఆదరణ మృగ్యమైపోయిన కాలంలో గత వైభవానికి వర్తమానానికి మధ్య జరిగిన; జరుగుతున్న వ్యథ మథనాన్ని ఈ నాటికలో బలంగా చిత్రించారు. అటు సంప్రదాయ కళలతోపాటు ప్రాచీన జానపద కళారూపాలను ప్రదర్శించే కళాకారుల దయనీయ గాథను కూడా ఉపకథగా జతచేసి సంధించారు.

కళ అర్థం; పరమార్థం; ప్రయోజనాలపై భిన్నవాదాలున్నాయి. కళకళకోసమని వాదించే సంప్రదాయతరం; కళ కళకోసం కాదు ప్రజల కోసం; సామాజిక ప్రయోజనం కోసమని గొంతెత్తి నినదించే ప్రగతిశీలవాదులకు తోడు కళను వ్యాపారమయం చేసి అంగడిబొమ్మగా మార్చి స్వప్రయోజన పరులూ ఉన్నారు. యక్షగానం నాటికలో రచయిత ఈ మూడు వాదాలకు చోటు కల్పించి కళ ప్రజల కోసమేనని; ఆ కళాకారులను బ్రతికించవలసిన బాధ్యత సమాజానిదేనని బలంగా నిరూపించారు. ఉప్పెనలా కమ్ముకొస్తున్న ఆధునిక పోకడల సుడి గుండంలో చిక్కి గిరికీలు కొడుతున్నా... ఆదరణ శూన్యమై ఆకలికి కవలిన పేగులు రుద్రవీణను మీటుతున్నా.. నమ్మిన కళకు ద్రోహం చేయకుండా.. బ్రతుకు తెరువు కోసం ఆ కళకు వ్యాపారపు హంగులు అద్దకుండా స్థిరంగా నగమై నిలిచిన భట్టు ఈ నాటికలోని ప్రధాన పాత్ర. "జనం కోసం మనం దిగజారవలసిన అవసరం లేదు.

ఈ కళా స్వరూపంలోని పవిత్రతనూ; దాని చరిత్రను కాపాడగలిగితే చాలు. రాబోయే తరాలకు దాని అపభ్రంశరూపం అందించి బ్రతకడం కంటే చావడం మేలు" అనేది భట్టు సిద్ధాంతం. "మనం జీవిత నాటకంలో ఓడిపోయాం. ఈ కళ మనకు కూడు పెట్టలేదు. ఎందుకీ కళ. కడుపు నింపని కళా జీవితం కన్నా చావే మేలు" అని వర్తమానాన్ని జీర్ణించుకొని తనకుమాలిన ధర్మాలకు తినోదకాలు ఇవ్వాలని వాదించే వాస్తవవాది ప్రహ్లాదుడు. ''ఇనోదంసూడు... ఊరికే ముద్దెట్టదు... ఇనోదం తిలకించు... మనసు సల్లబడతాది... బుద్ధి మెత్తబడతాది... ఆటగిణ్ణి దొరా! జనం మెచ్చిన ఆటగాణ్ణి. తెరమీద బొమ్మల్ని చూపించినాను.. బువ్వలేని బతుకు.. సేతగాని సావు.. మా బతుకులు బజారు పాలయ్యాయి. ఆ బెమ్మ దేవుడి బొమ్మలాటలో మడిసి సేతిలోని బొమ్మ ఓడిపోయింది సామీ! మన బతుకులు మన ఏసాలంత కులాసాగా... మన ఆటలంత వుసారుగా వుంటాయను కొంటారు ఈ ఎర్రి జనం. బువ్వలేకపోయినా మనం దీన్నే నమ్ముకొన్నాం. మనవే నిజమైన ఆటగాళ్లం. ఈ బతుకులో ఆడలేక ఓడిపోయిన ఆటగాళ్లం. ఈ టేజీ మీద ఓడలేక గెలుత్తున్న ఆటగాళ్లం. మన ఆటసూసినోడు మనకు బువ్వెడుతున్నాడా? లేదు సామీ! పదండి దొరా! ఆ మద్దెలమెడను కట్టండి. బువ్వను నేనడుగుతాను. మీరుంటే నాకు బలం. ఈ జనం మనల్ని బతికించాలి. ఆళ్లకు మనం బిడ్డలం. మన ఆటలు వాళ్ల బిడ్డలాటలు.. మా అయ్య కనికరిస్తే ఓ గుడ్డ.. అమ్మ పాపం దలిస్తే ఓ ముద్ద.. ఎప్పుడూ వచ్చే వాళ్లం కాదు.. వొచ్చినా అడిగేటోళ్లం కాదు.. కాలం కలిసిరాలేదు. కరమం తోడై నడిపింది. అంటూ ఒకప్పుడు దివిటీలా వెలిగి ఆహారం అనే చమురు లేక కొడిగట్టిన వెలుగు లాంటి తోలుబొమ్మలాట కళాకారుడు కేతిగాడు. ప్రేక్షక అభిరుచికి; ఆదరణను తర్జనితో ప్రశ్నిస్తాడు.

"ప్రేక్షకులకు లేని దిగులు మాకెందుకు.. వారికి గుడ్డలు లేని సీతతో సీతతో తీసిన రామాయణం కావాలి.. వశిష్టుడి ఆశ్రమంలో సెక్స్ డాన్సులు కావాలి. వాటికే డబ్బు.. ఆదరణ.. అనే మాకు తిండి ఐశ్వర్యం. నీ కళను సొమ్ము చేసుకొనే సన్మానాలకే గానీ నీకింత అన్నం పెట్టవు... ఆదరణ చూపదు. నీవు నేర్చుకొన్న సంప్రదాయ నృత్య రీతులను మరచిపో... భగవంతుడు ఆడదాన్ని సృష్టించి అందమైన అవయవాలను ఇచ్చాడు. అవే మన కళకు పెట్టుబడి... మనకు రాబడి. నీ ఊహనూ... మేథస్సును ఆ అవయవాలపై ప్రదర్శించు" అంటూ ప్రేక్షకుల బల హీనతల గుర్రాలపై స్వారీ చేస్తూ కళను వ్యాపర ముడి సరుకుగా మార్చిన బేహారి కేశవ భట్టు.

"సామాన్య మానవునిలో చైతన్యానికి మీ యక్షగానాలు ఏం ఉపయోగపడుతున్నాయి. కళ కళకోసం కాదు. ప్రజల కోసం. ప్రజా సమస్యలను ప్రతిబింబించని కళలను ఆదరించవలసిన అవసరం మాకులేదు. ప్రేక్షకులలో వస్తున్న మార్పును మీరు గమనించడంలేదు. మా దృష్టిలో రాముడు బ్రతికాడు.. కలాపం చేయడానికి భామ బ్రతికింది. కానీ సామాన్యుడి జీవితం బ్రతకలేదు. అందుకే మీ కళలు అంతరించిపోతున్నాయి. ఇప్పటికైనా మీ కళలను ప్రజల కోసం తయారు చేయండి. సామాన్యుణ్ణి సజీవంగా సృష్టించండి. అవే మాకు కావలసిన కళ.. మేం కోరుకొనే కళ" అంటూ ప్రజాకళల ఆవశ్యకతను వివరించే పాత్ర ప్రేక్షకుడు. ప్రహ్లాదుడు; కేతిగాడు; కేశవభట్టు; ప్రేక్షకుడు తమవైన భావాల నాలుగు కాళ్లమండపంలా భట్టు ముందు నిలిచి సంప్రదాయ జానపద కళాకారుల సమస్యలను; వర్తమాన; భవిష్యమాన స్థితిని ప్రశ్నిస్తు న్నాయి. పురాతన కళలు ప్రజా చైతన్యానికి; నీతి ప్రబోధా నికి ఎంతో కృషి చేశాయని స్థిరంగా వాదిస్తాడు. కళ కాలం ఆటుపోట్లకు గురై అంతరించి పోకూడదని; దానిని ఆదరించవలసిన బాధ్యత అందరిపై ఉందని సందేశ మిస్తాడు.

తెలుగు నాటకరంగంలో వందలాది మంది రచయిత లున్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క వాణి... బాని. అక్షరాలను అందంగా కూర్చి.. పేర్చి అలంకారిక శైలిలో ప్రయో గించడంలో నిస్సందేహంగా హరనాథరావు మొదటి

వరుసలో ఉంటారు. వింటినారిని ఆసాంతం లాగి సంధిస్తే సర్రున దూసుకెళ్లే బాణంలాగా హరనాథరావు సంభాషణా ప్రయోగ శైలి ఉంటుంది. గ్రాంధికం; సరళ గ్రాంధికం; వ్యవహారికం; కొండ మాండలిక పదాలు జమిలిగా సుందరత్వాన్ని సంతరించుకొని ఉంటాయి. సన్నివేశంలో గుండెను పిండే విషాదం ఉన్నా దానిని నొక్కిపెట్టి హాస్యంగా మాట్లాడడం శ్రీశ్రీ రసన అని పిలిచారు. ఆరసన హరనాథరావు రచనల్లో మీరు మిక్కిలి యక్షగానం నాటికలో ఎక్కువగా కన్పిస్తుంది. హరనాథరావు భావనైశిత్యం చాలా తీవ్రంగా ఉంటుంది. కితకితలతో మొదలై తెరలు తెరలుగా నవ్వును పుట్టిస్తాయి. ఒక్కొక్క చోట గుండెను తడిపేస్తాయి. రోమాలను నిక్కబొడుచు కొనేలాగా చేస్తాయి. చెర్నాకోలుతో వీపుపై ఛెళ్లున చరిచినట్లు ఉంటాయి.

హరనాథరావు గొప్ప రచయితేకాదు.. మంచినటులు; అంతకుమించి గొప్ప దర్శకులు. సంగీతంపై కూడా ఆయనకు మంచి పట్టు ఉంది. ఆయన రచనను ఆయనే ప్రదర్శించేవారు. యక్షగానం నాటికను ఆయన నాటిక సమాజం అభిమానుల (ఒంగోలు) పక్షాన రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నాటక పరిషత్తులలో ప్రదర్శించి అనేక బహుమతులు పొందారు. యక్షగానం నాటికలో హరనాథరావు భట్టు పాత్రను అనితరసాధ్యంగా పోషించారు. తెలుగు నాటక పోటీ ప్రస్థానంలో ఆంధ్ర నాటక కళాపరిషత్ స్థానం ఎంతో ప్రముఖమైనది. ఆ పోటీలను ప్రాథమిక పరిశీలనలో నాటకం; నాటిక ఎంపిక కావడమే గొప్పగా; గౌరవంగా కళాకారులు భావిస్తారు. 1979లో రాజమండ్రిలో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్ స్వర్ణోత్సవాలలో యక్షగానం నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని గెలుచుకొంది. ఉత్తమ నటుని బహుమతితోపాటు ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడు పురస్కారాలను ఒకే పర్యాయం పొందిన ఏకైక రంగస్థల ప్రముఖునిగా ఆంధ్ర నాటక కళా పరిషత్ చరిత్రలో హనరాథరావు నిలిచిపోయారు. ప్రాచీన సంప్రదాయ జానపద కళా రూపాల అర్థం; పరమార్థం; ఆవశ్యకత; ప్రయోజనాల సమాహార స్వరూపాన్ని ఇతివృత్తంగా స్వీకరించి అద్భుతమైన పాత్ర చిత్రణా శిల్ప నైపుణ్యం రసనిష్యందిగా నిలిచే కమనీయ సంభాషనా ప్రయోగంతో; గుండెలను కదిలించే సన్నివేశ కల్పనతో చిక్కని.. చక్కని రచనగా యక్షగానం నాటిక ఆధునిక తెలుగు సాంఘిక నాటక ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచింది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఈతకోట సుబ్బారావు కవిత్వంలో విభిన్న దృక్పథాలు

- దేవరపల్లి రాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, కృష్ణ విశ్వవిద్యాలయం, మచిలీపట్నం.

తెలుగు భాషా సాహిత్యాన్ని సాహిత్యకారులు 1875 ముందు ఉన్న కాలాన్ని ప్రాచీన భాషా సాహిత్య చరిత్ర గానూ 1875 తర్వాత కాలాన్ని ఆధునిక యుగంగానూ విభజించారు. ప్రాచీన కాలంలో కవుల చేతిలో సృజించ బడిన కావ్యాలకంటే ఆధునిక కాలంలో సృష్టించబడిన కవిత్వం ఎంతో వైవిధ్యాన్ని కలిగి ఉంది. గిడుగు వేంకట రామమూర్తి వ్యవహారిక భాషావాదం ఉద్యమంతో భాష విషయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ఈ కృషి ఫలితంగా తెలుగు సాహిత్యంలో అనేక రకాల సాహితీ వచన ప్రక్రియలు పరిపుష్టిని సాధించాయి. ఎందరో కవులు, రచయితలు పుట్టుకు వచ్చారు. సాహిత్యం సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చింది. వచన కవితలు, కథలు, నవలలు, హైకూలు, మినీకవిత్వం, నానీలు మొదలైన ప్రక్రియలు మిక్కిలి ప్రసిద్ధి పొందాయి. రచనా సాహిత్యంలో వస్తువు అనేది ప్రధానపాత్ర వహిస్తుంది. అందుకే వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు "ఆధునిక కవిత్వం" అంటే కవి తాను సమాజంలో ఒకడుగా భావించుకుని, వర్తమాన సమాజ స్వరూపాన్ని మార్చే కృషిగా భావించారు. అలా నేటి సమాజంలోని ప్రజలను చైతన్యం చేస్తున్న కవుల్లో ఈతకోట సుబ్బారావు ప్రముఖుడు.

'విశాలాక్షి' సుబ్బారావుగా సాహిత్యంలో సుపరిచితుడైన ఈతకోట సుబ్బారావు గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈతకోటవారు కవిగా సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకున్నారు. వచనకవిగా, కథకునిగా, దీర్ఘకావ్యాల రచయితగా, చరిత్ర పరిశోధకునిగా, సంపాదకునిగా ప్రసిద్ధిచెందారు.

ఈతకోట సుబ్బారావుగారు నాలుగు కవితాసంపుటాలు, ఒక కథాసంపుటం, నాలుగు దీర్ఘకావ్యాల రచయితగా, నాలుగు గ్రంథాల చరిత్ర పరిశోధకునిగా, రెండు పుస్తకాలకు సంపాదకునిగా, విశాలాక్షి పత్రిక స్థాపకునిగా ఎంతో ఖ్యాతి పొందారు. ఈయన కవిత్వంలో ఉన్న విభిన్న దృక్పథాలను పరిచయం చేయటం నా వ్యాసలక్ష్యం.

ఈతకోట సుబ్బారావు హృదయలిపి, చీలినమనిషి, కాకిముద్ద, ఈతకోట సంపాదకీయాలు అనే నాలుగు కవితా సంపుటాలను ప్రధానంగా దేశభక్తి, సామాజిక సంబంధాలు, సందేశాత్మకం, ప్రపంచీకరణం, పర్యావరణం దృక్పథ కవిత్వమని ఐదు రకాలుగా నేను వర్గీకరించాను.

## దేశభక్తి దృక్పథ కవిత్వం :

దేశంకోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగాపెట్టి పనిచేస్తున్న సైన్యం యొక్క గొప్పతనాన్ని మనం గౌరవించాలని, వారికి మనం ఋణపడి ఉండాలని, 'సైనికుడు' కవితలో కవి ఇలా అన్నారు.

"మీ పెదవులపైన - పూల తోటలు నాటాలనే కదా
శాంతి చుట్టూ మానిరంతరం కాపలా- మీ పిల్లలు
సీతాకోక చిలుకలవ్వాలనే
ఎండల్లో వానల్లో ఎడతెగని ప్రయాస - కబ్జాల
దురాక్రమణలో
మేమిక్కడ మీకోసం - యుద్ధాలు చేస్తుంటాం
మాతృభూమి రక్షణలో - మాకు మతాల్లేవు,
కులాల్లేవు."

మనం సంతోషంగా కుటుంబాలతో గడపాలని, సైనికుడు మన కోసం ఎండల్లో, వానల్లో అలుపెరగకుండా నిరంతరం దేశసరిహద్దుల్లో పహారా కాస్తుంటారు. ఆ వీరజవాన్లకి మతాలు, కులాలతో పని లేదు. అందరమూ సమానమే. మనం భారతీయులమనే భావన కలిగి ఉంటారు.'ఝుండా ఊంఛా రహే హమారా' కవితలో దేశ సరిహద్దుల్లో యుద్ధాలు జరుగుతున్నప్పుడు,

విద్రోహులను ఎదుర్కొంటున్న సమయంలో పరిస్థితులను కవి వివరించారు.

"నాకు తెలుసు - యుద్ధం నీకు
నేలతల్లి గుండెలపై జరుపుతున్న శాంతి యాగం -
చీకటి రెండో ఆకాశమై
నీ చుట్టూ హిమ ప్రహరీ కడుతూ - శ్వాస శ్వాసకీ
గుండెలోతుల్ని తోడేస్తున్నా
నీ కాళ్లు ఇనప స్తంభాలౌతాయి"

దేశ సరిహద్దుల్లో మంచుతో పహారాకాస్తూ శత్రువులను ఎదురిస్తారు సైనికులు. శ్వాస అందక చలికి ఉక్కిరి బిక్కిరి అవుతున్నా లెక్క చేయకుండా తమ కాళ్ళను ఇనప స్తంభాలుగా చేసుకుని దేశ ప్రజల రక్షణ కోసం పోరాటం చేస్తూనే ఉంటారు సైనికులు.

ఇంకా 'అంతా ఇంగ్లీషే', 'రక్తం కలుషితమౌతుంది', 'కంచెలు' 'వెలుతురుస్నానం' మొదలైన కవితల్లో దేశభక్తిని ప్రోదిచేస్తున్నారు కవి ఈతకోట.

**సామాజిక సంబంధితాలు :**

సమాజంలోని అరాచకాలను అసమానతలను, స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను రూపుమాపి సమసమాజ నిర్మాణకాంక్ష ప్రతి కవితలోనూ దర్శనమిస్తున్నాయి. నేడు సమాజాన్ని పీడిస్తున్న వాటిల్లో మద్యపానం అతిప్రధాన మైంది. మద్యపానానికి బానిసై ఎందరో తమ కుటుంబా లను నాశనం చేసుకుంటున్నారు. ప్రజలు తాగుడికి బానిసై ఇల్లు, ఒళ్ళుగుల్ల చేసుకుంటున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో వేల కుటుంబాలు తాగుడు మహమ్మారికి ఆహుతి అవుతున్నాయి. నేటి యువతరం తాగుడికి బానిసైపోయింది.

'మద్యప్రాణ మథనం' కవితలో ప్రభుత్వాలు సామాన్యుడిని మద్యానికి ఏ విధంగా బానిసను చేస్తు న్నాయో ఈతకోటవారు వర్ణించారు.

"తాగండి ప్రజలారా! తాగండి - తలకెక్కిందాకా తాగండి
మీ కోసమే అర్థరాత్రుల దాకా - సురశాలలు తెరచి ఉంచాం
తాగండి ప్రజలారా! తాగండి - ఇంటింటికీ తెల్ల కార్డులు పంచాం
మీ ఆరోగ్యానికి ఢోకా లేదు"

తాగండి ప్రజలారా తాగండి మీకు ఎటువంటి భయం లేదు. మీ ఆరోగ్యం పాడైతే నయం చేసుకోవడానికి ప్రభుత్వం మీకు తెల్ల కార్డులను మంజూరు చేసిందంటూ మద్యాన్ని ప్రోత్సహించిన ప్రభుత్వాలను కవి సుబ్బారావు తూర్పారబట్టారు.

భ్రూణహత్యల విషయంలో నేడు ఎటువంటి వివక్షత కనిపిస్తుందో మన అందరికి తెలుసు. ఆడపిల్ల అని తెలియగానే తల్లి కడుపులోనో, కుదరకపోతే ప్రసవించిన వెంటనే మురికి కాలువల్లోనో, చెత్త కుండీల్లోనో, బావుల్లోకో విసిరేస్తున్నారు. వీటిని నిర్మూలించడానికి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలకు అవగాహన కలగడం లేదు.

'బోరు బావిలో అమ్మ గుండె' అనే కవితలో ఈతకోటవారి ఆవేదన ఇది

"అమ్మ కడుపే ఆడపిల్ల సమాధి కావటం నిజం
ఆడ పిల్లతోపాటు అమ్మా చనిపోతుంది
ఐదున్నరడుగుల సజీవ శరీరంలో
వేలాది మృత దేహాలలో ఒక మృతదేహంగా
కడుపు బావిలో గుండె కోతను మోస్తూ
పుంలింగ కలలు కంటూ నిత్యం
శవజాగారం చేస్తూనే ఉంటుంది అమ్మ"

అమ్మ కడుపే ఆడపిల్లకు సమాధిగా మారుతున్నాయి. ఆ బాధని భరించలేక అమ్మ కూడా ప్రాణాలు వది లేస్తుంది. చివరికి ఒక సజీవ శవంగా, పిండాలను మోస్తూ వాటిలో మగ పిండం కోసం ఎదురుచూస్తున్న తల్లుల ఆవేదనపట్ల రచయిత రోదన చెందుతున్నారు.

ఇంకా అనేక రకాలుగా సమాజంలో జరుగుతున్న అరాచకత్వాలను గురించి 'నీలి నీడ' 'అంటుకట్టు', 'తిరస్కారగీతం', 'కంచెలు' మొదలైన కవితల్లో సామాజిక అసమానతలను వివరించారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

## సందేశాత్మక దృక్పథ కవిత్వం :

స్వాతంత్ర్యం వచ్చి డెబ్భైరెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి మనదేశంలో కులాలు, మతాలు మనుషుల్ని, వాళ్ళ జీవనాన్ని శాసిస్తూనే ఉన్నాయి. నేటికి కూడా అనేక ప్రాంతాల్లో పరువు హత్యలు జరగడం మనం చూస్తున్నాం.

'కంచెలు' అనే కవితలో కులాలు, మతాలు పేరుతో ఎవరికివారు గిరి గీసుకుని బతికేస్తున్న విధానాన్ని ఈతకోట వారు ప్రశ్నిస్తున్నారు.

"మనమంతా కులాల మైకుల్లో - పిచ్చి కేకలు పెట్టే
వెర్రి నాగన్నలమై
స్వేచ్ఛగా తిరుగుతున్న ఖైదీలమే - మనమంతా మనిషి
మనిషికీ చుట్టూరా
అందమైన కంచె కట్టుకొని - రంగు రంగు గూళ్లు
అల్లుకుంటున్న వాళ్లమే"

మనమందరం కులాలు, మతాల మైకంలో పడి ఎవరికి వారు సంకుచిత మనసులతో కంచెలను కట్టుకుని జీవిస్తున్నామని రచయిత భావన.

'వెలుతురు స్నానం' కవితలో అనాగరిక కులమతాల అడ్డు గోడలు, అంతరాలను ఇప్పుడైనా వదిలి బయటకి రావాలని కవిగారు పిలుపు ఇలా ఉంది.

"తరతరాల తరగని అడుగుజాడల - వెలుగు నీడల్ని
నెమరేసుకుందాం!
ఆరు ఋతువుల అంతరాంతరాల్లోని - ఆరారు
రుచుల అంతరార్థాన్ని"

ప్రజల మధ్య ఉన్న ఈ అంతరాలను తొలిగించాలి. ఒక్కసారి అందరు కలిసి ఉన్నప్పుడు జరిగిన మంచి చెడు సంఘటనలను గుర్తుకు చేసుకోండి. వాటిలోని అంతరార్థాన్ని గ్రహించి జీవితాలకి అన్వయించుకోవాలి. అవే జీవితాలకి వెలుగునిస్తాయి. భూమిమీద జీవిస్తున్న అన్ని ప్రాణుల్లోనూ మనిషిని ప్రత్యేకంగా చూపించేది ఆలోచనా శక్తి, ప్రవర్తనా విధానం. కానీ నేడు మనిషి ఆ మానవత్వాన్నే మరిచిపోయి ప్రవర్తిస్తున్నాడు.

'మాటమంత్రం' కవితలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు లోకం పోకడలను, ప్రేమగా, ఆప్యాయంగా పలకరించుకోవడం వల్ల కలిగే ప్రశాంతత, ఆనందాన్ని రచయిత ఈ కవితలో తెలియజేశారు.

"మాట మంచు బిందువై తాకితేనే కదా
మతాల మధ్య, మతాల మధ్య ఎగసిన కీలలు
కలల సీతాకోక చిలకలై కలకలా గలగలా
ప్రవహించేది
ఆనంద పల్లవాలు పల్లవులై గానించేది"

ప్రేమగా ఒక్కమాట మాట్లాడితే అది మంచుకన్నా చల్లగా మనసుని తాకుతుంది. కులాలు మతాలు అంటూ ఒకరి మధ్య ఒకరికి పగప్రతీకారాలు పెంచుకోవడంమాని సీతాకోకచిలుకల్లా హాయిగా జీవించాలని కవి ఆశిస్తున్నారు.

## ప్రపంచీకరణ దృక్పథ కవిత్వం :

నేటి సమాజం నిరంతరం అభివృద్ధి పథంలో దూసుకు పోతుంది. నాగరికత, ప్రపంచీకరణ పేర్లతో ప్రజలు విలువలను కోల్పోతున్నారు. ఒకరికి ఒకరు పరిచయాలు లేకుండా పోతున్నాయి. దగ్గరి వాళ్లను దూరం చేస్తూ, దూరం వాళ్ళని దగ్గర చేస్తుంది. ఎంతటి విధ్వంసానికైనా కారణం అవుతుంది నేటి ఆధునిక ధోరణి.

'ఏదో ఋతువు' కవితలో కవి సుబ్బారావుగారు ఇలా అన్నారు.

"అద్దంలో మనిషి అదృశ్యం - కనిపించేవన్నీ అందమైన
కలలు
మానవ యంత్రం విడి భాగాలన్నీ - కచ్చితమైన ధరకు
లభిస్తున్నాయి"

ఇప్పుడు బయట మనకు డబ్బుంటే దొరకని వస్తువు అంటూ లేదు. పైకి కనిపించేవన్నీ అందమైనవి కాదు. చివరికి మానవ శరీరంలో భాగాలు కూడా కచ్చితమైన ధరలకు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. అంతగా మనం అభివృద్ధి చెందిపోయామా? అంటూ నిలదీశారు కవి ఈతకోట వారు.

'లక్ష్మణ రేఖ' కవిత నేడు సమాజంలో ముఖ్యంగా ఆడపిల్లలపైన జరుగుతున్న లైంగిక దోపిడీ, దౌర్జన్యాలు ప్రస్తావించారు.

'అయస్కాంత పూలు' కవితలో పబ్బులు, డిస్కోల సంస్కృతిని వివరించారు కవి ఈతకోటవారు.

"నవ్వు ముఖాలతో నమ్మించే భేషజాలతో - కోర్కెల
గుర్రాల్ని రెచ్చగొట్టను
క్లబ్బుల హంగామాని వాడుకుంటాయి -
మొహాల దాహం తీర్చుకోను,
పబ్బుల నిషా అలవాటు చేస్తాయి"
"డిస్కోల్లో యవ్వనాల కిక్కుల కసక్కుల్లో-కాలుజారే
మేనకలు, కదం తొక్కే విశ్వామిత్రులు
కాల్ సెంటర్లలో, సేల్స్ కౌంటర్లలో - స్పర్శారతి జరిపే
జమిలి చేతులు"

ఓ పిల్లా...నువ్వు ఉంటుంది రెండు కాళ్ల మృగాల మధ్యలోఎంతో జాగరూకులై ఉండాలి. నవ్వు ముఖాలతో నమ్మించి, కోర్కెల గుర్రాలను రెచ్చగొట్టి, క్లబ్బులు, పబ్బులు అంటూ హంగామా చేసి నిన్ను నిలువునా మోసం చేస్తారంటూ హెచ్చరించారు కవి. ప్లబ్బులు, డిస్కోలు అంటూ మద్యంలో మునిగితేలుతున్నారు నేటితరం. కాల్ సెంటర్‌లో, సేల్స్ కౌంటర్‌లలో జరుగుతున్న లైంగిక దాడులు పూర్తిగా రూపుమాపాలని అందుకు అందరూ సహకరించాలని కవి ఈతకోట ఆశిస్తున్నారు.

'ఏకాకి' కవితలో నేడు ప్రజలంతా రోజు వారి పనులతోనే సరిపెడుతున్నారు. ఒత్తిడిని అధిగమించే ప్రయత్నం చేయక ఎవరికి వారు ఏకాకిగా మారుతున్నారనే విషయాన్ని వివరించారు రచయిత.

"జీవితం చుట్టూ ఒక్కొక్క ఊచ నాటు కొంటూ
పంజరం దాటి బయటికి చూళ్ళేని బ్రతుకై పోవటం
నగరమంటి అందమైన బంధిఖానాలో అరెస్టై
పోవటమేనా?
ఒక చిరునవ్వు పంచుకోవటం, ఓ కన్నీటి చారని
తుడవటం
ఒక ఆత్మాలింగనం, వెచ్చని అనుభూతి ఏమీలేని"

జీవితం చుట్టూ ఎవరికి వాళ్ళు పరిమితులు పెట్టుకుని ఒక పంజరంలో చిక్కుకుపోతున్నారు. నగరంలో ఆనందంగా బతికేయాలని బందిఖానా అవుతున్నారు.ఒక చిరునవ్వు పంచుకోవటంకాని, కన్నీరు తుడవటంకాని ఎవరికి చేత కావడం లేదు. అదే ఇప్పటి సగటు మనిషి అవసరం అంటారు రచయిత.

'రుజువు' కవితలో రోజురోజూకి తగ్గిపోతున్న మానవతా విలువలు, అనుబంధాల గురించి ఇలా చెప్పారు.

"తాతకి దగ్గులు నేర్పే - పాఠం ఏదైనా ఉంటే
చెప్పండి
తెలుగు పురాతత్వాన్ని - విప్పి చెప్పాల్సి ఉంది
అమ్మకు పరిచయం వాక్యం - ఎక్కడైనా ఉందేమో
వెతకండి
తెలుగు పలుకుల మూలం - రుజువు చేయాల్సి
ఉంది"

అమ్మకి పరిచయ వాక్యాలు ఎక్కువగా ఉన్నాయని వెతకాల్సిన సమయం వచ్చింది. మాతృభాష అయిన తెలుగుకి మూలం రుజువు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. మనం మూలాల్ని, విలువల్ని మరిచిపోవడమే అంటారు కవి.

## పర్యావరణ దృక్పథ కవిత్వం :

నేడు సమాజంలోనే కాక, సాహిత్యంలో కూడా పర్యావరణంపై పెద్దఎత్తున ప్రజలకు చైతన్యాన్ని దేశ, రాష్ట్ర, స్థానిక, ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, రచయితలు కూడా ప్రత్యేకదృష్టి పెట్టటం జరిగింది. స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ రహిత భారత్, జలకాలుష్యం, మొక్కలు నాటి సంరక్షించటం, అడవులను కాపాడటం, నదులను శుద్ధి చేయటం మొదలైనవి. మానవులకు నీరే కదా ప్రాణాధారం ఆ నీరే లేకపోతే మానవ మనుగడ ఉండదని కవి ఇలా తెలిపారు.

"నీరే కదా ప్రాణాధారం - నేల చిగురించినా
విత్తు మొలకెత్తినా - పచ్చని నవ్వు పూచినా......
నీళ్ళంటే మాటలా - దేహంలో ప్రాణం

నేలకి నింగికి పచ్చని రాయబారి - విత్తు చెట్టై
మొలకెత్తుతుంది....
తడి ఉంటేనే కదా - నేలకి ఐదోతనం"

వానలు కురిస్తేనే వ్యవసాయం ఉంటుంది. దాన్ని నమ్ముకున్న రైతులు బాగుపడతారు. వర్షాలు కురవకపోతే సేద్యం లేదు. పంటలు పండితేనే రైతులు బతుకుతారు. లేకపోతే అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరం. గ్రామాల్లో చెరువులు, బావులు, వాగులు, వంకలు, బోరులు ఎండిపోతే చుక్క నీరు కూడా దొరకదు. నీళ్ళు కూడా అమ్ముకుంటారు అనే దశ నుండి నీరు అమ్మడం, కొనడం సర్వసాధారణమనే స్థితికి వచ్చేశాం నేడు. అందుకే ప్రకృతినీ, పర్యావరణాన్ని కాపాడాలని కవి ఆకాంక్ష. ఇంకా ఈతకోట వారు పర్యావరణ పరిరక్షణ కావాలని భూమ్మీద మనుషులతోపాటు పశుపక్ష్యాదులు కూడా బతకాలని, ముఖ్యంగా పక్షులను రక్షించాలని 'పక్షితీర్థం' 'నీటిచుక్క' అనే రెండు దీర్ఘకావ్యాల్ని కూడా రాశారు.

**ఆధార గ్రంథాలు :**

1. ఈతకోట సుబ్బారావు - హృదయలిపి
2. ఈతకోట సుబ్బారావు - కాకిముద్ద
3. ఈతకోట సుబ్బారావు - చీలినమనిషి
4. ఈతకోట సుబ్బారావు - ఈతకోట సంపాదకీయాలు
5. ఈతకోట సుబ్బారావు - నీటిచుక్క
6. ఈతకోట సుబ్బారావు - పక్షి తీర్థం

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# శ్రీమద్భాగవతం - కృష్ణతత్త్వం

- డా॥. కొప్పు సుభాష్ చంద్రబోష్

శ్రీమద్భాగవతము వేదాంతసారము, ఇందు అనుష్ఠాన వేదాంతము కూడ మిళితమైయున్నది. వేదాంతము వృక్షమైతే భాగవతము దాని యొక్క మధుర ఫలము. ప్రస్థానత్రయము (ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత) నందుండే సారము ఈ గ్రంథములో పొందుపరచబడినప్పటికీ, భక్తి, ప్రేమ, తత్త్వాల ద్వారా సగుణోపాసన చేయడానికి వీలుగా, జన సామాన్యానికి సులభగ్రాహ్య మయ్యేటట్లు రచింప బడినది. శ్రీమద్భాగవతము పురాణాలకు శిరోభూషణము వంటిది. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు తగు పాళ్లలో మిశ్రితమైన అమృతమిది. సామాన్య భక్తి పరాభక్తిగా పక్వమైనప్పుడు జ్ఞానాంకుర మవుతుంది. సగుణ రూపములో భగవానుని ప్రేమించడం ద్వారా సర్వ సృష్టినీ ప్రేమించిన వాడైన భక్తుడు జ్ఞానియౌతాడు. భగవద్భక్తిని చవిచూచిన భక్తుడు ఇంక దేనియందూ ఆసక్తి చూపలేడు. అతనిలో భక్తి వృద్ధి చెందుతున్న కొద్దీ, విషయానురక్తీ, కార్యాసక్తీ, క్షీణిస్తూ వైరాగ్యము పెరుగుతుంటుంది. భక్తుడు జ్ఞానమయు డౌతాడు.

'కృష్ణస్తు భగవాన్ స్వయం' అనే మూల సూత్రము మీద, శ్రీమద్భాగవత రచన జరిగినది. శ్రీకృష్ణ చరిత్రను ప్రధానముగా తీసుకొని, సృష్టి ఆది నుండి శ్రీకృష్ణావ తారము వరకు సంభవించిన, భగవానుని పూర్వ - అవతారగాథలు కూడా సూక్ష్మముగా వివరింపబడినవి. అవ్యక్త పరమాత్మ, వ్యక్త స్వరూపుడై విశ్వవిరాట్ పురుషునిగా నవతరించి, బ్రహ్మదేవుని ఉద్భవింపజేసి, కొనసాగించిన సృష్టిక్రమము, అంతరిక్షద్యులోకాది చతుర్దశ భువన నిర్మాణము, సప్త సముద్ర వర్ష విభజన, దేవ మానవ దానవ జంతు పశుపక్షి వృక్షాదులైన జీవ జాతుల సృష్టి, మనువులు, రాజులు, వారి వంశాలు విస్తరించడం, దుష్టశిక్షణ, శిష్ట రక్షణాది కార్యాలను నిర్వహించడానికి, భగవానుడు ధరించిన అవతార విశేషాలూ భగవానుని అనుగ్రహానికి పాత్రులైన సాధు సజ్జన భక్తుల గాథలూ, భాగవతములో చెప్పబడినవి.

శ్రీవిష్ణు గాథా శ్రవణముచే పరీక్షిత్తు, కీర్తనచే వ్యాస పుత్రుడైన శుకుడు, స్మరణచే ప్రహ్లాదుడు, పాదసేవచే లక్ష్మీదేవి, పూజలచే పృథు చక్రవర్తి, అభివందనముచే అక్రూరుడు, దాస్యముచే హనుమంతుడు, సఖ్యముచే అర్జునుడు, సర్వస్వమూ ఆత్మ సమర్పణచేసి బలిచక్రవర్తి, ఈ నవవిధ భక్తులచే కృతార్థులైనారు. శ్రీకృష్ణభక్తి ఇంత గొప్పది. ఈ భాగవతత్త్వాన్ని బ్రహ్మ నారదునికి చెప్పాడు. నారదుడు వ్యాస మహర్షికి చెప్పాడు. వ్యాసుడు దానిని గ్రంథముగ రచించి, శుకునకు చెప్పాడు. శుక మహర్షి శాపగ్రస్తుడైన పాండవ పౌత్రుడు (అభిమన్యుపుత్రుడు) అయిన పరీక్షిత్తునకు సంపూర్ణ భాగవతాన్ని ఏడు దినాల్లో చెప్పగా పరీక్షిత్తు జనన మరణ సంసార వలయం నుండి ముక్తుడైనాడు. ఆదిశేషుడు ఈ భాగవతాన్ని పాతాళ లోకములో వ్యాపింపజేశాడు. దీనిని, బృహస్పతి స్వర్గలోకములోనూ, పరాశరుడు భూలోకములోనూ, సనక సనందాదులు స్వర్గాతీతలోకాల్లోనూ వ్యాపింప చేశారు.

'ఓ వేదమూర్తీ ! నీవు వేదములను నాలుగు విభాగము లుగా విభజించావు. ఎంతో విజ్ఞానము కలవాడవు. నీ ఈ విషాదానికి కారణము ఏమిటీ? అందుకు వ్యాసుడు ఇలా బదులు చెప్పాడు. 'నారద మహర్షీ! నేను వేదాలను విభజించాను. జయము అనే పేరుతో మహాభారతాన్ని రచించాను. ఆధ్యాత్మ రామాయణం అనే గొప్ప గ్రంథాన్ని కూడా రచించాను. పద్దెమిది పురాణాలు వ్రాశాను. అయినా నాకు తృప్తి లేదు మనసుకు శాంతి లేదు. అక్షర దాహం ఇంకా తీరలేదు. మహర్షీ ! ఏమి చేస్తే నా మనసుకు తృప్తి కలుగుతుందో దేవ ఋషి, త్రిలోక

సంచారి అయిన మీరే చెప్పాలి. నా జీవితం సార్ధకం అయ్యే మార్గం ఏమిటి దేవ ఋషీ ?'

నారదుడు వ్యాసుని మాటలు విని చిరునవ్వు నవ్వాడు. 'నాయనా! నీవు చేసిన రచనలు అసాధారణ మైనవి. వేదాలను విభజించడానికి ఎంతో విజ్ఞానం కావాలి. భారతాన్ని రచించటానికి ఎంతో విజ్ఞత కావాలి. 'పురాణాలు చెప్పటానికి అపారమైన భక్తి, తత్త్వ జ్ఞానం ఉండాలి. నీవు చేసిన సాహిత్య సేవ చాలా అద్భుతమైనది. కాని సామాన్యులకు అర్థమయ్యేలాగా మహాభాగవతాన్ని చెప్పిన నాడు నీ మనసులోని కొరత తీరుతుంది. పూర్తి మనశ్శాంతి కలుగుతుంది. ప్రజలకు భావితరాల వారికి మహాభాగవతం చదవటం, వినటం కళ్యానదాయకం అవుతుంది. శుభమస్తు' అని వ్యాసునికి హితవు చెప్పి ఆశీర్వదించి నారదుడు వెళ్ళిపోయాడు. వ్యాస భగ వానుడు మంచి ముమూర్తం చూచుకుని భాగవత రచన మొదలుపెట్టాడు. దానిని పూర్తి చేసిన తరువాత ముందుగా తన కుమారుడైన శుక మహర్షికి వినిపించాడు. ఆ తరువాత చాలా కాలానికి శుకుడు భాగవతాన్ని పరీక్షిత్తు మహారాజుకు ఒక వారం రోజులలో చెప్పాడు. దీనిని చెప్పిన వారు విన్నవారు తరించారు. మహా భాగవతం పన్నెండు భాగాలు. ఒక్కో భాగాన్ని స్కంధము అంటారు. ఈ సృష్టి ఎలా జరిగినది? కాలం ఎలా నడుస్తుంది? అనే విషయాలతో పాటు భగవంతుని దశావతారాలు సగర చరిత్ర, భగీరధుడి కథలు మొదటి తొమ్మిది స్కంధాలు వివరిస్తాయి. పదవ స్కంధము శ్రీకృష్ణుని అద్భుత లీలలు, కథలూ ఉంటాయి. మిగిలిన రెండు స్కంధాలలో యదువంశం అంతరించి పోవడం కలి ప్రవేశం లాంటి మరికొన్ని వివరాలు ఉంటాయి.

ఈ భాగవతంలో వ్యాసుడు రచించిన శ్లోకాలు పద్దె నిమిది వేలు. ఇది భక్తికి, ముక్తికి కేంద్రం అయి విరాజిల్లింది. ఎన్నో వేదాంత రహస్యాలు దీనిలో అందరికీ అర్థమయ్యేలా సులభంగా చెప్పాడు. ఎందరో భక్తుల కథలను వ్యాసుడు కమనీయంగా వర్ణించాడు. మొదటి స్కంధంలో శుక మహర్షి, పరీక్షిత్తు మహారాజుల సంభాషణ ఉంది. భగవంతుని సాక్షాత్కారానికి చక్కని భక్తి, వైరాగ్య, జ్ఞాన మార్గాలను వ్యాసుడు చెప్పాడు. రెండవ స్కంధంలో యోగం ఎలా వుంటుందో, స్వర్గం ఎలా దొరుకుతుందో బ్రహ్మ, నారదుల సంభాషణలో వర్ణించాడు. మూడవ సంకధంలో ప్రళయం వచ్చినప్పుడు భగవంతుడు ఎలా ఉంటాడో, వరాహావతారం ఏమిటో జయవిజయులు, హిరణాక్ష-హిరణ్యకశ్యపుల కథలు, కపిల చరిత్ర వివరించాడు. నాల్గవ స్కంధములో ప్రజాపతులు, దక్షుడు, ధృవుడు, పృధువు మొదలైన వారి గురించి వ్రాశాడు. పంచమ స్కంధంలో ప్రకృతి, భూమి మీద విచిత్రాలు, ఆకాశ చక్రము, స్వర్గ నరకాలు వర్ణించాడు. ఆరవ స్కంధంలో ఉపాఖ్యానం ముఖ్యమైనది. ఏడవ స్కంధం ప్రహ్లాదుని కథ ఎనిమిదవ స్కంధం గజేంద్ర మోక్షం నించి క్షీరసాగర మధనం వరకూ అన్నీ అద్భుత కథలే సాగాయి.

తొమ్మిదవ స్కంధంలో రాముడు, పరశురాముడు, రాజులలో సూర్య చంద్ర వంశాల వారి చరిత్రలు విపులీ కరించాడు. దశమ స్కంధంలో లీలాకృష్ణుని బాల క్రీడలు, రాసలీల, కంసుని చంపడం, కృష్ణుని వివాహం వంటి దివ్యకథలు వున్నాయి. పదకొండవ స్కంధంలో యదు వంశం అంతరించిపోవడం, ఉద్ధవుని కథ, శ్రీకృష్ణ నిర్యాణం ఉన్నాయి. పన్నెండవ స్కంధములో సృష్టి జరగడం ప్రళయంలో వినాశనం, త్రిపురాసురుడు మార్కండేయుడి కథ, సూర్యగోళం వివరాలు వున్నాయి. ఈ విధంగా భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో నిండిన ఈ భాగవతం మామిడి చెట్టులా ఎంతో ముచ్చట గొలుపు తుంది. చవులూరిస్తుంది. ఈ భాగవతాన్ని వ్యాసభగ వానుడు సంస్కృత భాషలో రచించాడు.

భగవంతుని ఏకాగ్ర చిత్తముతో ధ్యానించిన తప్పక అనుగ్రహిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మరి స్వామి అనుగ్రహం పొందడానికి ప్రధానంగా అతనిపై ఉంచ వలసింది భక్తి, నమ్మకం, విశ్వాసం భగవంతుడిని ఏ విధంగా పిలిచినా, ఎలా పిలిచినా అనుగ్రహిస్తాడు. స్వామి సర్వాంతర్యామి అని మహానుభావులు, మహర్షులు

చెప్పారు. నేను వైకుంఠమందే గాక యోగుల హృదయాలలో పవిత్రమైన మనస్సుతో ఏకాగ్ర చిత్తముతో కొలిచే వారి మనస్సులలో ఉంటాను. నన్ను ఎవరైతే గానం చేస్తారో, ధ్యానిస్తారో, కీర్తిస్తారో, వారి స్వచ్ఛమైన హృదయాంతరాలలో నివాసం ఉంటాను అన్నారట. భాగవతం అమృతసముద్రం వంటిది. ఈ భాగవతసుధ కర్ణగోచరం కానంతవరకే ఇతర పురాణాలు సత్పురుషుల లెక్కలోకి వస్తాయి. భాగవతం విన్నాక తక్కిన పురాణాలపై మనస్సు పోదు. భాగవతం సర్వవేదాంతాల సారభూతం. ఈ భాగవత రసాస్వాదన చేసి సంతృప్తులైన వారికి అన్యత్ర ఆసక్తి ఏమాత్రం ఉండదు.

నదులలో గంగానది, దేవతలలో శ్రీమహావిష్ణువు, వైష్ణవులలో పరమశివుడు శ్రేష్ఠులైనట్లే సమస్త పురాణాలలో శ్రీమద్భాగవతం ఉత్తమమైనది. సమస్తక్షేత్రాలలో కాశీ క్షేత్రం ఉత్తమోత్తమం. అదేవిధంగా పురాణాలలో శ్రీమద్భాగవతం సర్వోత్తమం.

శ్రీమద్భాగవత పురాణ ప్రవచనాన్ని సమాప్తం చేయ సంకల్పించి, మహాత్ముడైన సూతుడు, పరమేశ్వరుడైన శ్రీమన్నారాయణుని, భాగవతాన్ని లోకానికి అందించిన చతుర్ముఖ బ్రహ్మనూ, నారద మహర్షినీ, వ్యాసభగవానునీ, శుకయోగీంద్రునీ స్మరించి, నమస్కరించి, శౌనకాది ఋషులతో ఇలా చెప్పాడు. 'మునీంద్రులారా ! ఈ భాగవతపురాణము పరమాద్భుతమైనది. శ్రవణమాత్రాన పాపాలు హరించిపోతాయి. బంధాలు తొలగిపోతాయి. ఇందు, జగత్సృష్టి స్థితిలయలకు కారకుడైన పరమేశ్వరుని గురించిన జ్ఞానము చెప్పబడినది. ప్రకృతిపురుషజనితమైన సృష్టి రహస్యమును, భగవంతుని రూపగుణ విశేషాలను, పరమభాగవతుల చరిత్రలను, జ్ఞాన వైరాగ్యాలతో కూడిన భక్తియోగమును, ఇందు వివరించుట జరిగినది.

పాండవ పౌత్రుడైన పరీక్షిత్తు జననము, విప్రశాపము, శ్రీశుకుడు భాగవతగాథను పరీక్షిత్తుకు చెప్పనారంభించడం, నారదుని జన్మము, నారద బ్రహ్మ సంవాదము, భగవంతుని అవతార వివరణ, విదుర ఉద్ధవ సంభాషణం, విదురమైత్రేయుల సంభాషణ, సృష్టి క్రమము, ప్రళయముల వివరణ, విరాట్ పురుసుని ఆవిర్భావము, కాలగతి, ఆదివరాహ రూపంలో విష్ణువు హిరణ్యాక్షుని వధించడం, స్వాయంభువమనువు, శతరూపలు, ఆదిదంపతులుగ ఉద్భవించడం చెప్పబడినది. కర్దమ ప్రజాపతి, దేవహూతులకు శ్రీహరి, కపిలునిగా జన్మించడం. కపిలుడు తల్లియైన దేవహూతికి యోగము నుపదేశించడం, దక్షయజ్ఞ ధ్వంసము, ధ్రువచరిత్ర, ప్రియవ్రతుని చరిత్ర, భరతుని చరిత్ర, వృత్రాసురుని చరిత్ర, ప్రహ్లాదుని చరిత్ర, గజేంద్రమోక్ష గాథ, కూర్మావతారము, క్షీరసాగర మథనము, రాజుల వంశవర్ణన, సుకన్య చరిత్ర, మాంధాత, శౌభరి, సగరుడు, భగీరథుడు, మొదలైన రాజుల చరిత్రలు, గంగావతరణము, శ్రీరామచంద్రుని చరిత్ర, పరశురాముడు, యయాతి, నహుషుడు, దుష్యంతుడు, శంతనుడు, యదువు మొదలైన వారి చరిత్రలూ వర్ణించబడినవి.

యదువంశ చంద్రుడైన శ్రీకృష్ణ భగవానుడు జన్మించడం, దివ్యలీలలను ప్రదర్శించడం, పూతన, శకటాసురాది రాక్షసులను సంహరించడం, కాళియమర్దనం, గోవర్ధనోద్ధరణం, నందగోకులాన్ని విడిచి బలరామునితో సహా మధురకు వెళ్లడం, కువలయాపీడమనే ఏనుగునూ, కంసచాణూర ముష్టికాది దుష్టులనూ వధించడం, కాలయవన జరాసంధులను అంతము చేయడం, రుక్మిణీ కల్యాణము, నరకాసురవధ, శిశుపాల దంతవక్త్రాది దుష్టులను శిక్షించడం, కురుక్షేత్ర రణరంగములో అనేకులైన రాజులను అంతము చేయించి, భూభారాన్ని తగ్గించడం, చివరకు బ్రాహ్మణ శాపాన్ని నిమిత్తంగా పెట్టుకొని, తన యాదవ వంశాన్నే నిర్మూలించడం మొదలైన ఘట్టాలెన్నో వర్ణింపబడినవి.

శ్రీకృష్ణుడు అవతారాన్ని చాలించేముందు ఉద్ధవునికి చేసిన తత్త్వబోధ అమూల్యమైనది. వేదాంతసారమంతా నిండియున్న ఆ బోధను ఉద్ధవ గీత అంటారు. మార్కండేయుని దివ్యానుభూతి గురించి చెప్పబడినది. భగవంతుని యొక్క ప్రతి అంగాన్ని, ఆయుధాన్ని, ఆశ్రయించిన దేవతల ఆరాధనలు చెప్పబడినవి. భగవానుడు

సూర్యరూపంలో నెలకొక సౌరగణముతో లోకాలను సంచరించడం చెప్పబడినది.

ఓ బ్రహ్మవేత్తలారా ! శ్రీశుకదేవుని నుండి నేను విని, స్మరణచేయ గలిగినదంతా మీకు చెప్పాను. భాగవత సారమంతా ఒక్క మాటలో చెప్పాలంటే, కాలు జారినప్పుడు గాని, స్పృహ తప్పిగాని, కలలోగాని, ఆపద వచ్చినప్పుడు గాని 'హరియేనమః' అని, ఆ పవిత్ర నామాన్ని గట్టిగా ఉచ్చరిస్తే చాలు సకల పాపాలు నశిస్తాయి. ఆ దివ్యనామ మహిమ అలాంటిది. వాసుదేవుని కథలు, గుణగణాలూ ముచ్చటించుకొనే మాటలే మధురమూ, మనోహరమూ, నిత్యనూతనమూ అయినట్టివి. మిగిలిన మాటలన్నీ వ్యర్థ ప్రలాపాలే. భగవన్నామాన్ని పాడుకొంటూ, వింటూ, వినిపిస్తూ ఉండే సమయమే జీవితమంతటిలోనూ సద్వినియోగం చేయబడిన సమయము. భగవంతుని గురించి తెలియజేయని జ్ఞానము మిణుగురు పురుగులిచ్చే కాంతివంటిది. శ్రీకృష్ణ పదారవిందాల స్మరణయే అమంగళాలను, అజ్ఞానాన్నీ, సంఘదోషాన్నీ తొలగించి, అంతఃకరణశుద్ధినీ, పరమ శాంతినీ ప్రసాదించే పవిత్ర సాధనం.

ఈ దివ్యభాగవత పురాణాన్ని భగవానుడు బ్రహ్మకు నాలుగు శ్లోకాల్లో చెప్పాడు. సర్వవేదాంత సారమైన బ్రహ్మస్వరూపము, ఆత్మస్వరూపము ఇందు చెప్పబడినవి. ఏ విషయంలోనూ భగవంతుని మించిన వారు ఎవ్వరూ లేరు గనుక అతడు బ్రహ్మము అనబడ్డాడు. అతడే సకల చరాచర వస్తుప్రపంచమంతటా వ్యాపించియుండడం చేత పరమాత్మ అనబడుతాడు. ఈ రెండు సర్వోత్తమ లక్షణాలు ఇంకెవ్వరియందూ లేనందున, అతడు అద్వితీయుడు. ఆ పరబ్రహ్మతత్త్వాన్ని ఆరాధించి, కైవల్యపదాన్ని పొందడమే ఈ భాగవత పురాణము యొక్క ప్రయోజనము.

భగవంతునియొక్క లీలావైభవ విలాసాలను విపులంగా కీర్తించడం, పురాణశ్రేష్ఠమైన ఈ భాగవతములోనే జరిగినది. ఆద్యంతములు లేనివాడును, బ్రహ్మ రుద్రేంద్రాదులకు కూడ అగోచరుడును, సర్వమూ తానే అయినట్టివాడును, అయిన ఆ వాసుదేవునకు నమస్కరిస్తున్నాను.

సర్వస్వానికీ ఆ భగవానుడే కారణమైన వాడు, సర్వసాక్షి, స్వయం ప్రకాశుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, పరిశుద్ధాంతరాత్ములైన యోగులకు, భక్తులకు తప్ప, ఇంకెవ్వరి దేహేంద్రియ మనోబుద్ధులకును గోచరింపని వాడు. ఆనందానికి నిధి. అందరినీ ఆనందింపజేసేవాడు. ఈ లక్షణాలన్నీ ఉన్న శ్రీకృష్ణుడే భగవంతుడు. అతని నామమును, సత్కీర్తి గాథలను వినినంత మాత్రము చేతనే సర్వపాపపరిహారము, సకల మంగళాలు, పుణ్యఫలాలు కలుగుతాయి. శ్రీకృష్ణ భగవానుడు మానవ మాత్రులమైన మనల్ని కాపాడుగాక!'

భక్తి ద్వారా మోక్షాన్ని సాధించడం భాగవతం ఆవిర్భావ లక్ష్యం. భాగవతాన్ని వినడం ద్వారా పరీక్షిత్తు మహారాజు వారం రోజుల్లో ముక్తిని పొందడం వల్ల కొందరు దీన్ని మోక్షశాస్త్రంగానూ వ్యాఖ్యానించారు. భాగవతంలో ఉన్న భక్తుల చరిత్రలన్నింటిలో భక్తి ప్రాశస్త్యం చెప్పబడింది. భగవంతున్ని పొందడానికి, చేరడానికి భక్తి మార్గానికి మించింది మరేది లేదని భాగవతం నొక్కి చెపుతుంది. కాగా శాస్త్రాలలో వివిధ భక్తి భేదాలు తెలుపబడ్డాయి. ఆర్తభక్తి, జిజ్ఞాసభక్తి, ఆర్థార్థభక్తి, జ్ఞానభక్తి అని భక్తి నాలుగు విధాలుగా ఉంటుందని భగవద్గీత తెలుపుతుంది. నారదభక్తి సూత్రాలలో భక్తి 11 విధాలుగా వర్గీకరించబడింది. భాగవత పురాణం మూడవ స్కందంలో కపిలుడు తన తల్లి దేవహూతికి భక్తి, యోగ, జ్ఞాన రహస్యాలను అందించే సమయంలో సాధకుని స్వభావ భేదాల చేత భక్తి అనేక రకాలు అయినప్పటికీ ప్రధానంగా 3 విధాలుగా ఉంటుందని అవి తామస, రాజస, సాత్త్విక భక్తులని పేర్కొనడం జరిగింది. భారత, రామాయణలతో పాటు భాగవతాన్ని కూడా నేటికి ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారు. దీనికి గల కారణం భాగవతంలోని కృష్ణతత్వాన్ని తెలిపే కథలే అని చెప్పవచ్చు. దీనిని తెలుగు సాహిత్యంలో కృష్ణతత్వాన్ని పోతన మహాపుణ్య కావ్యంగా రచించారు. సంస్కృతంలో వ్యాస భాగవతానికి ఎంత పేరుందో అదేవిధంగా తెలుగు సాహిత్యంలో పోతన భాగవతానికి అంతే పేరుంది.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# జాషువా కవిత్వం - మానవత్వం

- సైదయ్య మల్లెపాకుల, లెక్చరర్, శ్రీ ఉమామహేశ్వరీ డిగ్రీ కాలేజ్, కొండనాగుల, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ.

ప్రపంచంలో అత్యున్నత సాహితీవేత్తలెవరికీ తీసిపోని మహాకవి - గుర్రం జాషువా. మానవతావాదం, మానవ సంవేదనల గురించి వ్రాసిన పాశ్చాత్తులు గానీ, జాషువా ముందూ తర్వాత జీవన మూల్యాలను అక్షరబద్ధం చేసిన ఎంతోమంది కవులు గానీ, జాషువా అక్షర ఆయుధం ముందు నిలువగల స్థాయి వున్నవాళ్ళు కాదు. ఇందులో అతిశయోక్తి లేదు. ఇది అతస్యం కానే కాదు.

పల్నాడు సీమలోని గుంటూరు జిల్లా వినుకొండలో 1895 సెప్టెంబర్ 28న ఆయన జన్మించారు. జాషువా తల్లి లింగమ్మ మాదిగ - జాతికి చెందిన స్త్రీ. ఆయన తండ్రి వీరయ్య యాదవ కులస్తుడు. ఆయన లింగమ్మను వలచి పెళ్లిచేసుకున్నాడు. వీరయ్య క్రైస్తవాన్ని స్వీకరించి చర్చి పాస్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేశాడు. తల్లి దండ్రుల వారసత్వంతో పుట్టుకతో క్రైస్తవుడు అయినప్పటికీ ... జాషువాకి తక్కువ కులం అనే అవమానాలు తప్పలేదు. అందుకే జాషువా చిన్ననాటినుండే ఈ కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఆలోచించడం మొదలు పెట్టాడు. ఈ కుల వ్యవస్థని దిక్కరించి తన కవితా గళాన్ని ఎక్కుపెట్టాడు జాషువా. తెలుగు సాహిత్య చరిత్రలో మొత్తం బ్రాహ్మణ ఆధిపత్య కవిత్వమే నడుస్తున్న కాలంలో వాస్తవికతకు దూరమైన భావ కవిత్వ ప్రవాహంలో అందరు కొట్టుకు పోతున్న తరుణంలో ఒక్క జాషువా మాత్రం సామాజిక ప్రజాస్వామ్యం కోసం రచనలు చేశాడు.

కవి అంటే తత్త్వవేత్త, శాస్త్రవేత్త, సత్యాన్వేషకుడు, పరి శోధకుడై ఉండి, సమస్త ప్రకృతిని, మానవుణ్ణి,అతని అంతరంగాన్ని, మానవ సంబంధాల్ని, పదార్థాల్ని, దాని గుణాన్ని, మర్మాన్ని కూడ వెలికి తీసే మాంత్రిక లక్షణం కలిగి ఉండాలి. దాన్ని అత్యంత ప్రతిభావంతంగా సుందరంగా ప్రజలకు తెలియజేయడం కవిధర్మం. కవిత్వం అంటే కవితత్వం ఇవన్ని కలిగిన వాడు జాషువా.

వందల వేల సంవత్సరాలుగా తెలుగు సాహిత్యం అగ్ర వర్ణ బ్రాహ్మణ ఆధిపత్యంలోనే కొనసాగింది. కథకులు వాళ్ళే,విమర్శకులు వాళ్ళే నవలా కర్తలు వాళ్ళే. ఇలాంటి సందర్భంలో సామాజిక అసమానతలను తన కవిత్వంలో స్పష్టంగా ఎత్తిచూపి, ఒక సాంఘిక విప్లవాన్నే సృష్టించాడు జాషువా. జాషువా అయినా, రవిదాస్ అయినా,వేమన అయినా, వీర బ్రహ్మం అయినా వీరికంఠం నుండి, కలం నుండి అనంతమైన కవితా జలపాతం కురవడానికి, మెరవడానికి కారణం వీరు ఈ ప్రపంచాన్ని మోస్తున్న బాధిత సమాజం నుండి వచ్చారు కాబట్టే.

మహాకవి గుర్రం జాషువా ఈ దేశంలో కష్టపడుతున్న వారికి ఫలితం దక్కడం లేదన్నాడు. ఆధిపత్య కులాల దోపిడీ నడుస్తుందన్నాడు. కులాల పేరుతో సాటి మనిషిని పశువు కన్నా హీనంగా చేసే ఈ లోకం హృదయం లేని దన్నాడు. కుట్ర చేసి ఈ దేశ మాదిగ కులస్తుడి కులాన్ని, ధనాన్ని కబళించారనీ, అతని దేహాన్ని పీల్చి పిప్పి చేస్తున్నా రని ప్రకటించాడు. ఈ దేశంలో ఆధిపత్యం వెలగబెడు తున్న వారి పాదాలు కందకుండా చెప్పులు కుట్టి ఇచ్చి జీవిస్తున్నాడు. తనకు ఇంత అన్యాయం చేసినా ఎప్పుడూ అతడు సేవలందించేందుకు నిరాకరించలేదని, అందు వల్ల ఈ భారత దేశం అతని సేవలకు అప్పు వడ్డదని చెప్పాడు జాషువా. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అఖరి మెట్టుమీద నిలబడి సమస్త ప్రపంచపు బరువును మాదిగలే మోస్తున్నారు. చెమటోడ్చి ప్రపంచానికి అన్నం పెడుతున్నాడు కానీ, అతనికి బుక్కెడు బువ్వ లేదని అవేదన చెందుతాడు.

ఈ మాదిగ పేద రక్తం తాగి ఇనుప గజ్జెల ఈ దోపిడీ వ్యవస్థ జీవిస్తుందంటాడు. ఈ చాతుర్వర్ణ వ్యవస్థను ఆయన నాలుగు పడగల హైందవ నాగరాజు అని వర్ణిం చాడు. ఈ పంచమున్ని చూడంగనే హైందవ నాగరాజు

కసరిబుసకొడుతుందంటాడు. ఈ లోకంలో పంచముడి కన్నా నీచమైన జంతువేది లేదని కన్నీరు కారుస్తాడు. జాషువా జ్ఞానతృష్ణ అపారమైనది. క్రైస్తవ ధర్మాన్ని చిన్ననాటి నుండి జాషువా తండ్రి సమక్షంలో అభ్యసించాడు. బైబిల్ పఠనం వల్ల ఆయన వ్యక్తీకరణ శక్తి విపరీతంగా పెరిగింది. ఆయన అభివ్యక్తి చతురత బ్రాహ్మణ పండితులను సైతం ఆశ్చర్య పరిచేది. జాషువా బైబిల్‌తో పాటు భారత, ఇతి హాస పురాణాలు చదివాడు. ఆ ఇతిహాస కథలలోని చిన్న ఇతివృత్తాలను తీసుకొని తన శైలిలో కావ్య ఖండికలు రాశాడు. అంలంకార శాస్త్రం నిర్దేశించిన సూత్రాలు ఒంట బట్టించుకున్నాడు. ఛందస్సులతో ఆటలాడుకున్నాడు. పద్యాలను తన పాదాక్రాంతం చేసుకున్నాడు. అప్పుడు బ్రాహ్మణ పండితులందరు మొనగాడవు జాషువా అని మెచ్చుకున్నారు.

అంటరాని వాడు "కవిత్వం" రాయకూడదని శాసిస్తున్న సమాజంలో తన కవితా వధూటిని లోకానికి ఎత్తిచూపాడు. బ్రాహ్మణ,క్షత్రియా వర్ణం వాల్లే కావ్య నాయికా, నాయ కులుగా వుండాలనే నియమాన్ని ధిక్కరించాడు. బహిష్కృతుడైన మాదిగను కావ్య నాయకునిగా చేశాడు. జాషువా రాసిన "గబ్బిలం" ప్రపంచానికి కొత్తనడకను చూపించింది. పుట్టరాని చోట పుట్టడం వల్ల చిక్కు చీకటి వనసీమల్లో చిక్కుకొని కోయిల పాట ఎంతో వృధా అయ్యిందనీ కటిక కొండల మీద మిటకరించి ఎన్నో వెన్నెల వాగులింకి పోయాయనీ, మురికి తెన్నెల మీద పరిమళించి ఎన్ని కస్తూరి జింక లీడేరెనో అని రాశాడు. ఎంత గంధ వహనం, ఎంత తంగెటిజున్ను, ఎంత రత్నకాంతి, ఎంత శాంతి ప్రకృతి గర్భములో భగ్నమై పోయిందో అని వ్యాకుల పడ్డాడు.

వ్యక్తిగత ఆస్తికి వ్యతిరేకంగా రచనలు చేసిన రచయితలు కూడా ఆస్థులు కూడబెట్టుకున్నారు. కానీ జాషువా మాత్రం ఆలు, బిడ్డల కోసం ఏ ఆస్తులు కూడ బెట్టలేదు. నేను ఆచరించని నీతులు బోధించి రాని రాగము తీయలేను. సంసారయాత్రకు చాలినంతకు మించి గుడ్డి గవ్వయు కోరుకొనను నేను అని ప్రకటించాడు. అలాగే జీవించాడు వ్యక్తిగత ఆస్తులు లేని అసలు, సిసలు సామ్యవాది జాషువా.

మహాకవి జాషువా బౌద్ధం గురించి కావ్యం రాశాడు. బుద్ధుని మీద ఆయన రాసిన కావ్యం అపురూపమైనది. నాగార్జున సాగర్ మీద ఆయన రాసిన కావ్యంలో పల్నాడు సీమలో వికసించిన బౌద్ధ విప్లవాన్ని వర్ణించాడు. కాల కఠోర బూరి పరిఘాహతి కూలిన నాటి బౌద్ధ విద్యాలయ భగ్నసీమల యందు ననంత శతాబ్ద గర్భ నిద్రాలస సంస్కృతీరమ తథాగతు పుణ్య కదాన కంబులన్ జాలిగ బాడుచున్నది, దిశల్ పులకింప విపంచి మీటుచున్ అని రాశాడు. క్రైస్తవ ధర్మాన్ని బైబిల్ వాక్యరూపంలో చెబు తుంది. ఆ వాక్యాన్ని పద్యంలోకి తెచ్చి "క్రీస్తు చరిత్రను" రాశాడు మహాకవి జాషువా. క్రీస్తు చరిత్రను అద్భుతమైన ఖండ కావ్యంగా తీర్చిదిద్దాడు. కానీ క్రైస్తవ ధర్మాధి పతులు మాత్రం జాషువాను హిందూవాదిగ చిత్రించి వెలేశారు. తలదాచుకోవడానికి ఆయన మజీదును ఆశ్రయించాడు. ఒక మసీదులో ఉంటూనే తనరచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. షాజహాన్ ముంతాజ్ ప్రేమను "ఆయన ముంతాజ్ మహల్లో" అద్భుతంగా చిత్రించాడు. జాషువాకు మత పిచ్చి లేదు, మత బేధం లేదు, సర్వమానవ సోదర భావమే ఆయన ఆచరించిన సూత్రం.

జాషువా డా॥అంబేడ్కర్ సమకాలికుడు. కలడు అంబేడ్కరుడు నా సహోదరుడు అని జాషువా చెప్పు కున్నాడు. 1920 నుండి 1932 వరకు జాషువా తీవ్రమైన జీవన్మరణ పోరాటంలో ఉన్నాడు. కటిక దారిద్ర్యాన్ని అనుభవించాడు. వినుకొండలో ఆయన టీచరు ఉద్యోగంలో స్థిరపడ్డాక కొంత ఆర్థిక ఇబ్బందులు తగ్గాయి.

స్వాతంత్ర్యానంతరం గాంధీని హత్య చేసినప్పుడు, ఆయన స్మృత్యర్థం "బాపూజీ" అనే కావ్యం రాశాడు. ఆయన ఎమ్మెల్సీ గ వున్న సమయంలో చట్టసభల్లో నాయకత్వ స్థానాల్లో వున్న వాళ్ళదే పెత్తనమనే సంగతి తెలిసొచ్చింది. ఆయన మెల్లగా రాజకీయాలకుదూర మవుతూ వచ్చారు. కవిత్వంలో నవయుగ కవి చక్రవర్తి మహాకవి జాషువా కుల, మతాల పరిధిలో ఇమడ లేనని

మొత్తం ప్రపంచం ఏమనుకున్నా సరే .. నాకు తరుగు లేదు, నేను విశ్వనరుడను అని ప్రకటించుకున్నాడు. $XÇÈúq k|þ<ŠÁuÕy “•¿ÃsÁ&T.

J$Ôá Ôf j äÖ* n+f ñeTT+<ŠeTsÐ+ >Ö]Ì Ôf j äÖ* ., ~ m]Ðq C²wŸy »dÔáV²]Xø+ç<ŠH{ ¿Ì ` dŸXæq y{ ¿£Ë |<ŠT, <ˆqe+ÔáT HûÔ&† ýÅ£+&† eÖqe<ÛVŸ ú•, mý² Ôá\ ‹& ‹Ö&<ê Ôj Ö $e] dÖŸ… , #Ã³ Hûn Hû| ¥‘«“•ÔáÁä y &TÔáä n+<Š>Ü º e] ¿Ìº Ôû¿±<‘ nú ....

, #Ã³ HûdŸÔáäM+ç<ŠT ¿£T“
¿£eTT“|ðŸ\ ýËq ¿£Ðbþ‚T
, #Ã³ Hûu„ÖeTTý ñTs ÈqT«\
j Ta~ç±sÁeTTç~¿£\ +Ôáj+#î
, #Ã³ Hû.. @ýÔá, ý²¢ q\ ¢
|ŸdŸ kåsÁ>+>\ >\ d³bþ‚T
, #Ã³ Hû.. m“•|sÂ“•¿£Z•
º çÔáý ñÅ£“ Å£+º j Ta q¥sTT+#î ` n+³ Ö C²wŸy m+Ôáq ỳ &TÕ º e] ¿Ì, ¿Ø&ƒ Ö&<Š¿±e\ d¾<ûn+³ ÖeÖqe J$Ô“ ¿ÌeÚq•mHÃbÍs ÇÔ qT dŸÎ¥+# &T.

C²wŸy ¿$Ôáç+ýË uõe+,<ŠK+,\ j Ta, XøÜ, XøÝkå+<ŠÁÔáÁ>± TmesÃ$Xæç~ÞlÔÅ£“yû+º H«j Ta+ n&T>TÔáTq•³ T¢±n“|¾Ÿ+~. >T+&ÿË ¢ŸnDTeÚËç¿£|ŸT\ TdŸw¾Ÿ+~. C²wŸy ¿$Ôáç+ d¥|Ÿ+ýË ¢Ÿu²~ÔáT& V²Ÿ<ŠTadŸ+<ˆ, sÃ<ˆ.

C²wŸy ÿ¿£kÍ] ÂÕTýË¢ jŸ äÖDdŸq•|ðŸ&T ¢Ÿ¿£Ü“, eÖqeÚDÌn<ŠÖÔá>± Ôáq ¿$Ô XøÔÃ e]dŸq•|ðŸ&T€ ÂÕT|™f ý¼Ë y sÁ<ŠÁC²wŸy ¢Ÿu„Å£ eTT>TýeÕþ äsÁ º e]¿Ìú<Å£\ + n“

జాషువాని అడిగి‘మాదిగ’ ని చెప్పంగనే అప్పటి వరకు భళీ - భళీ అన్నవారే తన కులం తెలియగానే సరస్వతీ మైలపడిపోయిందన్నారు. ఆ రైలు పెట్టె నుండి అందరు పరుగులు తీశారు.

నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపురే
ఖా కమనీయ వైఖరుల గాంచి భళీ-భళీ యన్న వాడే
నీ
దే కులమన్న ప్రశ్నవెలయించి చివుక్కున లేచి పోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివ చంద్ర! వచింప
సిగ్గగున్.

జాషువా ఒంటరిగా కూర్చొని రోధించాడు. గుండెలు పగిలేలా ఏడ్చాడు. ఇలా తన జీవితంలో ఎన్నో అవ మానాలకు గురయ్యాడు జాషువా.

ఆ తర్వాత విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, ఆరుద్ర అప్పటి సమకాలీన అగ్రకుల కవులందరూ ఆయనను అడుగడుగున అవమాన పరిచారు. ఒకే వేదికపై కూర్చొని అనేక సాహితీ సభలలో పాల్గొనే వారు కానీ ... జాషువాకి మాత్రం అదే వేదికపై దూరంగా ఒక కుర్చీ వేసేవారు. ఈ కవులతో కలిసి భోజనం పెట్టేవారు కాదు. ఇది ఎంతటి అవమానం .....

ఇలా అనేక సందర్భాల్లో జాషువా ఎన్నో అవమానాలను భరిస్తూ ... ఆవేదన చెందాడు.

రాజు మరణించె ఒక తార (నేల) రాలిపోయె
సుకవి మరణించె ఒక తార గగన మెక్కె
రాజు జీవించె ఱాతి విగ్రహము లందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు
ఈ జగతికి అతిథిగా వచ్చిన జాషువా ! ఓ విశ్వనరుడా
....
నీ సాహితీ వనంలో పూవునై పూస్తాను.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆధునిక సాహిత్యంలో ప్రసిద్ధ ధోరణులు - వాదాలు

- పి. ఉమా భార్గవి

ఆధునిక కవిత్వంలో వివిధ ధోరణుల్ని, వాదాలను చూడవచ్చు. వాటిని గమనించడంవల్ల ఆధునిక కవిత్వ వికాసం బోధపడుతుంది.

కాల్పనికవాదం, అస్తిత్వవాదం, ప్రతీకవాదం, భావ చిత్రవాదం, దాడాయిజం, అధివాస్తవికతావాదం, హేతు వాదం, చైతన్యస్రవంతి, అనుభూతివాదం, మానవతా వాదం, స్త్రీవాదం, దళితవాదం మొదలైన ధోరణులు వాదాలు తెలుగు సాహిత్యంలో అనేకమంద కవులను ప్రభావితం చేశాయి. వీరిలో ముఖ్యంగా కందుకూరి వీరేశలింగం, గురజాడ, తిలక్, శ్రీశ్రీ, నారాయణబాబు, ఇస్మాయిల్, శేషేంధ్ర, సినారె మొదలైన ప్రసిద్ధ కవులందరూ ఈ వాదాలకు లోనై రచనలు చేసినవారే.

ఇంక ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రసిద్ధ ధోరణు లకు లోను కానివారు లేరని చెప్పడం అతిశయోక్తి కాదు. అయితే ఈ ధోరణులు వాదాలు పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో వచ్చిన సాహిత్యంగా విమర్శకులు గుర్తిస్తారు.

### కాల్పనికవాదం :

ఆంగ్లంలోని రొమాంటిసిజానికి సమానార్థకంగా వాడ బడుతోంది. ఇది సాంప్రదాయక వాదానికి వ్యతిరేకమని కొందరి భావన. ఈ కాల్పనికవాద కవిత్వం భావకవిత్వంగా కూడా పేరొందింది. భావకవిత్వంలో దేశభక్తి, ప్రణయం, ప్రకృతిప్రీతి, అద్భుతత్వం, గతవైభవ పునరుద్ధరణ, సాహసప్రియత్వం వంటివి ముఖ్యభాగాలని సి.నా.రెగారు అంగీకరించారు.

### అస్తిత్వవాదం :

ఈ వాదం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీలో ప్రారంభమై ప్రాన్స్, ఇటలీలకు పాకింది. వ్యక్తి స్వాతంత్ర్యం ఈ వాదానికి మూలం. మనిషి సర్వ స్వతంత్రుడని ఈ కవుల భావన, సంకల్ప స్వాతంత్ర్యం, వరణ స్వాతంత్ర్యం, భయం, వేదన, ఉత్కంఠ అన్నీ ఒక్కలాటివేనన్నది వీరి వాదన. దీన్ని ప్రతిపాదించినవాడు జీన్ పాల్ సార్త్రె. తెలుగులో వేగుంటమోహన్ ప్రసాద్, శేషేంద్ర, ఇస్మాయిల్, నగ్నముని కవితలు ఈ వాదానికి చేరినవి.

### ప్రతీకవాదం :

ప్రతీక అంటే ఆంగ్లంలో సింబల్ లేదా గుర్తు. బోద్లేర్ దీనికి ఆద్యుడు. ఇది కాల్పనికవాదం నుంచి పుట్టిందని చెప్పినా ఇది ఏ రాజకీయాది అవసరాలు లేనిది. వస్తువును వ్యాఖ్యానించటం, అంగీకారయోగ్యంగా చేయటం ఈ వాదలక్షణాలు. ఆరుద్రగారి త్వమేవాహం దీనికి చక్కని ఉదాహరణ.

### భావచిత్రవాదం :

దీన్ని ఆంగ్లంలో ఇమేజిజం అంటారు. స్థూలంగా, శబ్దచిత్రం భావచిత్రం మనోనయనానికి రూపుకట్టేది, ఇంద్రియ స్పర్శకలది అని తుమ్మపూడి కోటేశ్వరరావు నిర్వచిస్తూ ప్రతిమావాదమని చెప్పినా ఇది భావచిత్ర వాదానికి చక్కని నిర్వచనం. విషయం సూటిగా చెప్పటం, శ్రవ్యతకు ప్రాధాన్యత, వ్యర్థపదప్రయోగాన్ని అరికట్టడం, అమూర్తాలను వాడకపోవడం, స్వీయప్రతిభ వెల్వరిస్తూ రచించటం దీనికి ముఖ్యం. ఇస్మాయిల్, శేషేంద్ర ప్రముఖులు.

### దాడాయిజం :

యుద్ధాల ఫలితంగా నిరాశా, నిస్పృహల్లో కొట్టు మిట్టాడుతున్న యువహృదయాలు ఉద్యమిస్తే పుట్టిన వాదమిది. మానవుడి కళ, సామాజిక నైతిక విలువల్ని అస్తవ్యస్తం చేయటం ఉద్దేశంగా పుట్టిన ఈ కవిత్వాన్ని సి.నా.రెగారు విధ్వంసకవాదంగా పేర్కొనటం సమంజసం. ఈ వాదం పుట్టిన ఆరేళ్ళకే నశించిపోయింది.

### అధివాస్తవికతావాదం :

అంద్రె బ్రిటన్‌లో ప్రారంభించిన ఉద్యమమిది. ఫ్రాయిడ్ మనో విశ్లేషణ ఆధారంగా ఇది మొదలైంది. శ్రీశ్రీ రచనల్లో అదివాస్తవికత కన్పిస్తుందని కొందరన్నా వేల్చేరు నారాయణరావుగారన్నట్లు తెలుగులో ఈ వాదం ఉద్యమస్థాయి దాల్చలేదు.

### హేతువాదం :

ఇది తెలుగు సాహిత్యంలో ఒక ధోరణే తప్ప ఉద్యమం కాదు. హేతువాదమంటే, హేతువే అన్నిటికీ మూలమని, దాని అధికారాన్ని ఏ మాత్రం ప్రశ్నలేకుండా అంగీకరించటమనే అర్థం. హేతువు లేనిదే ఏదీ నిర్హేతుకంగా జరగదని భావం. మనిషే మూలమని చెప్పిన కందుకూరి, గురజాడలున్నా, ఈ వాదానికి త్రిపురనేని రామస్వామి చౌదరి మూలపురుషుడు. నార్లవెంకటేశ్వర రావు, ముద్దుకృష్ణ వంటివారి రచనల్లోనే కాక స్త్రీవాద, దళితవాదాల్లోనూ ఈవాద ధోరణులున్నాయి.

### చైతన్య స్రవంతి :

ఈ రచనాశిల్పాన్ని పెంచి పోషించినవాడు జేమ్స్ జాయిస్. పాత్రల అంతరంగాన్ని కథావస్తువుగా స్వీకరించి రచించవచ్చున్న వాదాన్ని, ఆ అంతరంగ ప్రపంచ చిత్రణ ద్వారా చక్కటి కవిత్వం రాయవచ్చని నిరూపించిన వారు ఈ కవులు. సుప్తచేతనను బహిర్గతం చేసే ఈ రకం రచనలు పాఠకుడిని కొంతవరకు ఇబ్బంది పెడతాయి. ఇది వచనానికి అనువైనదిగా భావించడంవల్ల తెలుగులో ఈ రకం కవిత్వం ఎక్కువగా వెలువడ లేదు. కొన్ని నవలలు - రావిశాస్త్రి-అల్పజీవి, వడ్డెరచండీదాస్- హిమ జ్వాల, బుచ్చిబాబు- చివరకు మిగిలేదేమిటి, శ్రీశ్రీ ఒసేతువ్వాలందుకో వంటి రచనలు ఈ రకానికి చెందినవి.

### అనుభూతివాదం :

కొందరు మధ్యతరగతి కవులకు రాజకీయం కవిత్వంలో చోటుచేసుకోవడం నచ్చదు. అందువల్లే అను భూతివాదం పేరిట కవిత్వంలో అనుభూతికే ప్రాధాన్యత నిస్తున్నారన్న వాదన వినిపిస్తున్నా అనుభూతివాదం కవుల్లో చాలా ప్రసిద్ధి పొందింది. తెలుగులో దీనికి ఆద్యుడు బాలగంగాధర్ తిలక్. వేగుంటమోహన్ ప్రసాద్, ఇస్మాయిల్, శేషంద్ర, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, సీతారాం, సిద్ధార్థ ముఖ్యులు.

### మానవతావాదం :

మానవుడే సర్వమనీ, మనిషిని మించినది లోకంలో లేదనే ఈ వాదానికి రాజారామోహన్ రాయ్, కందుకూరి ప్రతీకలు. గురజాడ మనిషి కవిత ఈ వాదానికి గొప్ప నిదర్శనం. ఈ నాటి స్త్రీవాద, దళితవాదాల్లో ఇది చాలా ప్రస్ఫుటంగా అగుపిస్తోంది.

మార్క్సిజం హెగెల్ అనే జర్మనీ తాత్వికవేత్త గతి తార్కికవాదానికి వేసిన పునాది, భౌతికవాదానికి పునాది అయ్యింది. కమ్యూనిష్టు పార్టీకి ప్రధాన భూమిక అయింది, ఈ మార్క్సిజం. శ్రీశ్రీ మహాప్రస్థానంలో చాలా కవితలు ఈ కోవకు చెందినవే. ముత్యాలసరాలు, గేయ కవిత్వం, గజల్, వచనగేయం/వచన కవిత్వం అని పేరొందిన కవిత్వాలన్నీ ఈ కోవకు చెందినవే. అయితే, పఠాభితోనే అసలైన వచన కవిత్వం ప్రారంభమైందని ఆరుద్రగారి అభిప్రాయం. శ్లిష్టా ఈ రకం రచనలకు తన నవమిచిలుక, విష్ణుధనువు'లతో నాంది పలికి రాబోయే వచన గేయాలకు దారిసుగమం చేశాడన్నది ఆరుద్రగారి భావం. దువ్వూరి రామిరెడ్డి, కొపెల్లజనార్థనరావు, ముద్దు కృష్ణ, కవికొండల వెంకటరావు, విప్లవం పేరిట విశ్వనాథ, శ్రీశ్రీ, నారాయణబాబు ఈ ప్రక్రియలో పేరెన్న దగ్గవారు. అభ్యుదయకవులు, విరసం, అరసం కవులు ఈ ప్రక్రియను పెంచిపోషించారు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ వెలు తురు పిట్టలు ప్రసిద్ధ రచన.

ఈ ప్రక్రియలో పేర్కొనదగిన కవులు - ఎమ్.కె. సుగుణబాబు, దేవీప్రియ, ఓల్గా, కిరణ్ బాబు, వరవర రావు, అశోక్, సంజీవరావు, సుధాకర్, సుదర్శన్, యాదగిరి రావు, కిషన్, వేగుంట మోహన్ ప్రసాద్.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

**స్త్రీవాదం :**

తొలి నుంచి స్త్రీని ఒక మాతృమూర్తిగా, త్యాగశీలిగా, పతివ్రతగా తీర్చిదిద్దారు భారతీయ సాహిత్యంలో కవులు. అది కాలక్రమేణా స్త్రీకి స్వాతంత్ర్యమే అక్కరలేదనే భావనకు దారితీసింది. స్త్రీ సౌందర్య నిధిగా, శృంగారరసాధి దేవతగా మొదలైన సాహిత్యంలో కేవలం లైంగికావసరాలు తీర్చే సాధనంగా, పిల్లల్ని కనే యంత్రంగా, మగవాడి ఆధిక్యానికి తలవంచి అతడు నేర్పించిన చిలకపలుకులు పలికే గూటి చిలుకలా, విద్యా, ఆర్థిక స్వాతంత్ర్యాలు లేని ద్వితీయశ్రేణి పౌరసత్వ ప్రతీకగా మారే దుర్గతి (సెకండ్ రేట్ సిటిజన్) ప్రాప్తించాక, స్త్రీని అంగడి బొమ్మలా చూసే సంస్కృతి పట్ల ఏహత్యతతో స్త్రీకి విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనీ, ఆచారాల పేరిట జరుగు తున్న అన్యాయాల్ని వ్యతిరేకించే రచనల్ని కవులు తమ కర్తవ్యంగా భావించి మొదలు పెట్టారు.

కందుకూరి, గురజాడ స్త్రీ స్వాతంత్ర్యం కోసం పోరా డితే, చలం స్త్రీకి లైంగిక స్వాతంత్ర్యం కూడా అవసర మన్నాడు. దీన్ని అంగీకరించినవారూ, వ్యతిరేకించిన వారూ కూడా ఉన్నారు.

కవయిత్రులు కొత్తభావాలతో ముందుకొచ్చి, రచనలు చేశారుం తమకు కావాల్సినదాని కోసం తావే పోరాడతామన్నది వీరి భావం. తెన్నేటి లత, రంగ నాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, మల్లాది సుబ్బమ్మ వంటివారు స్త్రీవాదానికి ప్రాతినిధ్యం వహించారు. అంతర్జాతీయ మహిళా దశాబ్దాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. పాశ్చాత్య దేశాల్లోని ఫెమినిజం ఇక్కడ స్త్రీవాదంగా మారింది. మార్క్సిష్టులు, విప్లవవాదులూ స్త్రీకి సముచితస్థానాన్ని ఇవ్వలేదనీ, పాక్షికమైన అసమగ్రమైన దృష్టి అనీ స్త్రీవాదలు భావించారు. సైమన్ బోవర్ సెకండ్ సెక్స్, వర్జీనియా వుల్ఫ్ ఎరూమ్ ఆఫ్ వన్స్ ఓన్ లు స్త్రీవాదానికి రూపుదిద్దిన రచనలు, పాశ్చాత్యదేశాల్లో నీరసించిపోతున్న ఈ వాదం ఇక్కడ నిలదొక్కుకోలేదని కొందరు వాదిస్తున్నారు.

త్రిపురనేని శ్రీనివాస్- గురి చూసి పాడేపాట అనే సంకలనాన్ని (1990) స్త్రీవాద కవిత్వం అన్నాడు. ఆ తర్వాత స్త్రీవాద కవిత్వం బలం పుంజుకొంది. 1993లో అస్మిత వారు - నీలిమేఘాలు అనే పెద్ద స్త్రీవాద కవితా సంకల నాన్ని వెలువరించారు. వసంత కన్నభిరాన్-స్త్రీగా రాయట మంటే, ఓల్గా - సంకెళ్ళు తెగుతున్న సంగీతం, అనే వ్యాసాలు స్త్రీవాద సిద్ధాంతాన్ని దృక్పధాన్ని వివరిస్తాయి. సావిత్రి - బందిపోట్లు, విమల - వంటిల్లు, పద్మావతి - గుక్కపట్టిన బాల్యం, జయప్రభ - వామనుడి మూడో పాదం యశోధర వగపెందుకే ఎన్.గోపి, ఎండ్లూరి సుధా కర్, భగ్వాన్, జూపాక సుభద్ర వంటివారు స్త్రీవాద కవిత్వం రాశారు. ఇప్పుడు దళిత స్త్రీవాదం వీరన్నది జూపాక సభద్ర వంటి వారి అభిప్రాయం.

**దళితవాదం :**

అతిప్రాచీన కాలం నుంచి జైన, బౌద్ధ, చార్వాక మతాలు సాంఘిక అసమానతల్ని, మత దురాచాల్ని నిర సిస్తూనే ఉన్నాయి. కులమత భేదాలు, ధనికపేదభేదాలు, అసమానతలులేవనీ, భగవంతుడి దృష్టిలో అందరూ సమానమేననీ అన్న మాటలు కేవలం ప్రవచనాలుగానే మిగిలిపోయాయి. వర్ణ వ్యవస్థ కొందరు అగ్రవర్ణాలవారి అభ్యున్నతికీ, మరికొందరు వర్ణాల అధోగతికీ కారణ మయ్యాయని ఎందరో భాదను వెలిబుచ్చారు. ప్రాచీన కాలంలోని వాగ్గేయకారులు, సంఘసంస్కరణ వాదకవులు ఈ రకం భావాల్ని పలువిధాల వెలిబుచ్చారు. చారిత్రకంగా చూస్తే గాంధీగారు హరిజనోద్యమాన్ని లేవదీశారు. అది కవిత్వంలోని వివిధ శాఖలమీద తనప్రభావాన్ని చూపింది. మాలపల్లితో నవలా సాహిత్యంలోను, జాషువా రచనల్తో కవిత్వంలోను దళితవాద సాహిత్యం ప్రారంభమైంది.

"హరిజన గిరిజన, వెనుకబడిన, మైనారిటీ వర్గాలకు సంబంధించిన జీవితవిధానానికి సంబంధించిన సాహిత్యం దళిత సాహిత్యమౌతుంది. దళిత వర్గాలు సృష్టించిందే దళిత సాహిత్యం అనేభావన సమంజసమైంది

కాదు. దళితవర్గాల అభ్యున్నతి కోసం అగ్రవర్ణాలవారు సృష్టించే సాహిత్యం కూడా దళిత సాహిత్యమే అవుతుంది" (కొండపల్లి సుదర్శనరాజు, దళిత సాహిత్యం).

కొలకలూరి ఇనాక్, జి.లక్ష్మీనారాయణలు కూడా తమ పరిశోధనల్లో ఈ దళిత సాహిత్యాన్ని గురించి వివరించారు. జాషువ (గబ్బిలం), బోయిభీమన్న (గుడిసెలు కాలి పోతున్నై), కుసుమధర్మన్నకవి, ఇనాక్ దళిత సాహిత్యాన్ని కవిత్వాన్ని ఉద్యమంగా మలిచారు. చిక్కనవుతున్నపాట, దళితకవిత, పదునెక్కిన పాట, దండోరా, మేమే, నిశాని వంటి దళిత సంకలనాలు, మద్దూరి నగేష్ బాబు, సతీష్ చందర్, జూలూరు గౌరీశంకర్, నాగప్పగారి సుందరరాజు, కత్తిపద్మారావు వంటికవులు దళిత సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా తీర్చిదిద్దారు. పి.సి.రాముల- గాయం కొత్తకాదు, శిఖామణి-వాడే అశుద్ధ మానవుడు ఈ ఉద్యమాన్ని పోషించారు. నాగప్పగారి సుందర్ రాజు - చండాల చాటింపు అనే మాదిగకూతలో దళిత సాహిత్యంలో తమకు అన్యాయం జరుగుతోందని అంటాడు.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో కాల్పనిక వాదం దగ్గర నుండి నేటి దళితవాదం వరకు అనేక పాశ్చత్య వాదాలు తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి.

BHAVAVEENA
Vol. 17, Issue. 6, June 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# అంబటిపూడి వెంకటరత్నం గారి - 'వనవాటి' కావ్య పరామర్శ

- డా॥. దోనెపూడి రామాంజనేయశర్మ, రీజనల్ డైరెక్టర్, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, మధురై, తమిళనాడు.

**సంక్షిప్త పరిచయం :**

శ్రీ అంబటిపూడి వెంకటరత్నం గారు రాసిన 12 పద్య కావ్యాలలో 'వనవాటి' ఒకటి. కవి ఏ కావ్యం లేదా నాటకం రాసినా ఒక ఉద్దేశ్యాన్ని, లేదా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని రాయడం జరుగుతుంది. ఈ వనవాటి కావ్య రచన వెనుక ఉన్న అంతర్యాన్ని పరిశీలించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

**కీలక పదాలు :**

ఖండకావ్యం, కావ్య ప్రయోజనం, సామాజిక చైతన్యం.

**కథా సారాంశం - వనవాటి :**

ఈ వనవాటి 16 పద్య కవితా ఖండికల సమాహారం. 20 సంవత్సరాల వయస్సులో పరమపదించిన తన తమ్ముని స్మృతికి చిహ్నంగా ఈ పద్య కవితా ఖండికల సమాహారాన్ని రచించినట్లు క్రింది ప్రారంభ పద్యంలో కవి గారు తెలియజేశారు -

"ఏడ నుండియు నా తమ్ము । డిర్వ దేండ్లు
నా బహిఃప్రాణమయ్యె; । నీ నా డతండు
లే డిహమ్మున, వెడలె ని । లింపపురుకి :
వాని స్మృతి చిహ్నముల । వనవాటి యొకటి"

ఈ 16 ఖండికలు వనవాటి పేరున కవితా కదంబంగా గుదిగుచ్చబడినా వస్తువు దృష్ట్యా అవన్నీ ప్రత్యేకమయినవే; దేని కదియే ఒక రస గుళిక. కొన్ని ఖండికలలో ఒక్కొక్క పద్యమే కలదు. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నారు కదా! ఒక్కటి చాలు; భావనా వీధులలో విహరింప జేయటానికి - సహృదయుల హృదయాల నాహరించ టానికి. "కంస సంహారానంతరం", "అద్వైతం" ఖండికలు ఈ కోవకు చెందినవి. "ప్రణయిని", "ఆకలి"లలో రెండు పద్యాలు కలవు. మిగతా ఖండికలలో ఆరింటిలో మూడేసి పద్యములు, "సాధన"లో నాల్గు పద్యములు, రెండింటిలో ఐదేసి; "రైతుచెఱ"లో ఆరు పద్యములు "అనుభూతి"లో పది పద్యములు కలవు. వెఱసి 65 పద్యముల ఈ కవితా కదంబము బహు విషయ సంకలి తమై పాఠకులను బాగా ఆకర్షిస్తున్నది.

వస్తువు దృష్ట్యా పరిశీలించినపుడు వీనిని ఈ క్రింది విధంగా విశ్లేషించవచ్చు.

1. ఆధ్యాత్మికం - 4, 6
2. పౌరాణికం - 7
3. ప్రాకృతికం - 1, 2, 3, 5, 11
4. సామాజికం - 8, 9, 10, 12, 13, 14, 15, 16.

సామాజిక విభాగములోని కవితలను మరల నాలుగు విధములుగ వర్గీకరింపవచ్చు -

1. పూర్వకవి ప్రశంస - 8
2. భాషాభిమానం - 9 16
3. అందం - ప్రేమ - 10, 12, 13
4. సామాజిక సమస్యలు - 14, 15.

ఇప్పుడా విభాగములలోని కవితా ఖండికలలోని విషయమును తలస్పర్శిగా పరిశీలిద్దాం..

**ఆధ్యాత్మికం :**

ఇందులో 'సాధన', 'ఆనంద భిక్షుకు'డనే రెండు ఖండికలున్నాయి. సాధనలో కవి ఒక సాధకునిగా కని పిస్తాడు. అందులో స్త్రీ పట్ల లోక సహజమయిన తన కాముక దృష్టిని ప్రయత్నపూర్వకంగా నివారించుకొనే సాధన చేసినట్లు స్పష్టమవుతుంది. ఇక 'ఆనంద భిక్షుకుడు'లో 'లోకం'లోని బాధను గమనించి, కవి వ్యథార్తుడై జగన్ని యంతను ఆనందమిమ్మని కోరుతున్నట్లు కనిపిస్తుంది.

**పౌరాణికం :**

'కంస సంహారానంతరం' అనే ఖండిక ఒక్కటే ఈ విభాగంలో ఉంది. ఇక్కడ దేవకీ వసుదేవులు కంస

సంహారానంతరం చెఱసాలలోని దుఃఖావస్థ నుండి బయటపడి సుఖద స్థితికి మారిన తీరు మోహనంగా వర్ణించబడింది. విషయం పురాణ కథా సంబంధి గనుక ఈ విభాగంలో చేర్చబడింది.

**ప్రాకృతికం :**

ఈ విభాగంలో ఐదు ఖండికలున్నాయి. మొదటి రెండూ చీకటిని, ప్రభాతాన్ని వర్ణించేవి కాగా, మూడవ దయిన 'అనుభూతి'లో కవి మనిషికి ప్రకృతియే నిజమయిన చెలికాడనీ, మనిషి మాటున కాలనాగులున్నా యనీ, అంతరించపోతున్న మానవ సంబంధాల పట్ల తన నిర్వేదాన్ని ప్రకటిస్తాడు కవి. మరొక అడుగు ముందుకు వేసి, మనిషి సాటి మనిషి కష్టాన్ని చూసి స్పందించక పోయినా, ప్రకృతి మాత్రం తన ఒడిలో పెరుగుతున్న మానవజాతి పట్ల నిరంతరం కరుణాంతరంగంతో స్పందిస్తూ, రోదిస్తున్నదని చెప్పిన తీరు అనిదంపూర్వం. మచ్చుకు ఈ క్రింది రెండు పద్యాలు గమనించండి.

ఆకొనిన యప్పు డే యాకు లలములొ తిని
తేటనీ రేడనో దూప దీఱఁ ద్రావి,
చిటుకు చిటుకున లేడి పచ్చిక బయళ్ల
భయపడుచునే పరుగిడు; నోర్వడు నరుండు.
పుడమి విడి గాలిలో దేలి పోవుచుండు
కలరవమ్ము నా పక్షికులము నేని
నిండు కనులను గని ఓర్చి యుండ లేదు,
చూపుతోడనె పంపును తూపు లతఁడు

చివరి పద్యంలో ప్రాకృతికమయిన తుఫానులు, అగ్ని పర్వతాల ప్రేలుళ్లు కూడా అలాంటి దుఃఖం వల్ల కలిగినవేనని చెప్పటం కవి భావనా వైశిష్ట్యానికి మచ్చు తునక.

ఇక ఈ విభాగంలోని చివరి ఖండిక "అద్వైతం". ప్రకృతిలోని చిలుక జంట నుండి ప్రేమానురాగాలు నేర్చుకొమ్మనీ, తనువులు రెండయినా మనసు లొకటిగా అద్వైత సాధన చేసుకోవాలనీ, హితవు పలికిన తీరు పరమ రమణీయం. అలాటి అద్వైతం నేర్పుతున్న చిలుక జంటకు నమస్కరించాలనే తలంపు కల్గుతున్నదని పల్కించటం కవి ప్రకృతిలో పరమేశ్వర దర్శనం చేసికొన్నారనుటకు నిదర్శనం. 'అద్వైతం' పరంలో అమరత్వ సాధనకే కాదు ఇహంలో ఆనంద సిద్ధికీ అవసరమేనని కవి బోధ.

**సామాజికం :**

ముందు చెప్పుకొన్నట్లుగా ఇందులో మరల నాల్గు అంతర్విభాగాలున్నాయి. వాటిలోని ఖండికల సారాంశాన్ని తలస్పర్శిగా మనవి చేస్తాను.

ఇందులో కూడ మొదటి విభాగమయిన పూర్వకవి ప్రశంసలో కవులు ఋషులనీ, వారి నాదరించాలనీ చెప్పటం గమనార్హం. తనకున్న పూర్వులయిన కవీశ్వరుల పట్ల ఆయన ఘటించిన అక్షర నివాళి యిది.

రెండవ విభాగమయిన భాషాభిమానంలో భాగంగా ఆంధ్ర భాషా ప్రశస్తిని, వైభవాన్ని, అవసరాన్ని, రెండు ఖండికలలో కొనియాడారు. ఆంగ్లేయులూ తెలుగు భాషలోని మాధుర్యాన్ని గమనించి దానిని నేర్చుకొనే ప్రయత్నం చేస్తుండగా, మనం మాత్రం పరాయి భాషా వ్యామోమంలో పడి మాతృభాష వదలుకోవడం జాతికి పట్టిన దౌర్భాగ్యమంటున్నారు కవిగారు. ఇందులో ఉన్న రెండు ఖండికలలో మొదటిదైన 'ఆంధ్రి' ఆంధ్ర పద్య కవితా ఖండిక కాగ రెండవదైన 'తెలుగు బ్రతుకు' మాత్రా ఛందస్సులో ప్రవహించే ఆంధ్రభాషాభిమాన ప్రవాహం.

మూడవ విభాగంలో 'అందం-ప్రేమ' విషయాలుగా, నాలుగు కవితా ఖండికలున్నాయి. చిత్రంగా 'అందం'లో రెండు ప్రేమకు సంబంధించినవి కాగా, రెండు స్త్రీ వర్ణనకు సంబంధించినవి. అందునా మొదటి రెండింటిలో ఒకటి దంపతీ ప్రణయానికి సంబంధించినది కాగా రెండవది యువతీ, యువకుల తొలి ప్రణయాన్ని వర్ణిం చినది. ఒక 'మౌగ్ధ్యం', 'అరగన్ను' అనే రెండూ స్త్రీ అందాన్ని వర్ణించేవి.

ఒక నాల్గవ అంతర్విభాగమయిన సామాజిక విషయాలకు సంబంధించి 'రైతుచెఱ', 'ఆకలి', 'శారద' అనే ఖండికలున్నాయి. ఇందులో 'రైతుచెఱ' చదవగానే

పాఠకులు ఆశ్చర్యమగ్నులు కాక తప్పదు. ఎందుకంటే - కృషీవలులకు నాటి నుండి నేటి వరకు 'కృషి'యే మిగిలింది. అప్పుల 'వల'లోనే పడ్తున్నారు; ప్రాణాలు పణంగా పెట్టి మానం కాపాడుకొంటున్నారు.

కాలము మోసపుచ్చి వలఁ । గప్పి బిగించిన, దింక లోన బం
దాలకుఁ జిక్కి ప్రాణములు । తల్లడిలన్ వెలికేగు యుక్తు లే
మూలను మొల్క లెత్తని వి । మూఢతలో మతిపోయి మృత్యు పా
దాల స్మరింతు రాల్ మగలు । తప్పు పరీభవ మన్న కాంక్షతో

రైతుల ఆత్మహత్యలు ఇవాళ కొత్తగా జరుగుతున్నవేమీ కాదు, నాటి నుండి ఈ సమస్య రావణకాష్టంలా రగులుతూనే ఉందని అర్థమవుతుంది. మొసలి కన్నీరు కార్చేవారే గాని, పూనుకొని వారి కష్టాలు తీర్చేవారు లేరు. ఇది ప్రభుత్వ విధానాల లోపమనీ నిక్కచ్చిగా, కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పారు కవి గారు. కనుకనే -

........................ నల్గి కుమారిలు రైతు బిడ్డ శో
కమ్ము లెడారి యేడుపులు । గావలెనే ప్రభుతల్ వెలింగియున్ !

అంటూ నిర్మొహమాటంగా ప్రశ్నించారు.

'ఆకలి' కవితా ఖండికలో ఆకలితో అలమటించే పేదలకు ప్రకృతి అందచందాలు పట్టవనీ, ముందు వారి ఆకలి తీర్చే పని చేయాలనీ, పేదల పక్షాల నిలిచి పలికారు. అభ్యుదయ కాంక్ష, సమసమాజ నిర్మాణ దృష్టి ఇందులో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కవి గారు ఎన్నుకున్నది పద్య కవతా ప్రక్రియయే అయినా, ఆనాటి అభ్యుదయ కవితా ప్రభావం వారినీ ప్రభావితం చేసింది. కనుకనే ఇలాంటి విషయాలు కవిత్వీకరించడం జరిగింది. సమాజానికి దూరంగా కవి ఎన్ని కల్పనలు చేసినా, సమకాలీన సమాజం అతనిపై తప్పక ప్రభావం చూపుతుంది. ఎక్కడో ఒకచోట అది బయట పడక మానదు.

ఈ విభాగంలో చివరి ఖండిక 'శారద'. నటి శారదకు కవి గారు అభిమాని. వారిరువురూ విభిన్న కళా రంగాలకు చెందిన వారయినా, వారి మధ్య సంబంధమున్నదనీ, ఆమె తనకు తోబుట్టువు వంటిదనీ చెప్తూ, ఆమె పట్ల తనకు గల ఆప్యాయతను వ్యక్తం చేశారు. అంతేకాదు ఆమె ధరించిన కృష్ణుని వేషం తనకు బాగా నచ్చినదని పేర్కొన్నారు.

అయితే, కళాకారులకు (తనకూ, శారదకూ) రావలసినంత ఖ్యాతి రాలేదనీ, మథన పడినట్లు క్రింది పద్య పంక్తుల వల్ల వ్యక్తమవుతున్నది.

నీవొక కళాజగత్తులో నే నొకంట
రోయ చరించు బాటసారులము. నీవు
నటివి, నేను కవిని : నిరంతరము బంధు
భావ మో చెల్లి ! నా కాడబడుచువమ్మ !

ఈ కవితా కదంబం భిన్న విషయ సమాహారమయినా, ముందు చెప్పుకున్నట్లు ఒక్కొక్కటి ఒక రస గుళిక కనుక దేనికదిగా ముక్తకంలా పాఠకులకు సద్యఃస్ఫూర్తిని కలిగించి, భావాంబర విహారులను చేసి, ఆనంద స్నిగ్ధలను చేస్తుంది.

**ముగింపు :**

ఎంత మహాకవి అయినా ఒక కావ్యము వ్రాయవలసి వచ్చినపుడు ముందస్తు ప్రణాళిక ఏర్పరచుకొని తదనుగుణముగా విషయ విభాగము చేసికొని రచన కొనసాగిస్తాడు. అటువంటి కావ్యములను రచించు కవి కూడ అప్పుడప్పుడు భావావేశమునకు లోనై పలు విషయములమీద కొన్ని పద్యములను, ఖండకావ్యములను ఆశువుగా రచించడం జరుగుతుంది. ఆ విధముగా శ్రీ అంబటిపూడి వెంకటరత్నం గారు ప్రకృతి, ఆధ్యాత్మికము, పౌరాణికము అయిన అంశముల గురించియే గాక, తన సమకాలిన సమాజములో ఉన్న కొన్ని విషయములను గురించి కూడా పద్య రచన చేశారు. వాటినన్నిం

టినీ సంకలితం చేసి 'వనవాటి' అనే పేరుతో ప్రచురించారు. ఈ పేరే విషయ వైవిధ్యాన్ని తెలియజేస్తూ ఉంది. వనంలో అనేక రకాల వృక్షములు ఉన్నట్లుగానే ఈ కావ్యములోని విషయము కూడ వివిధ అంశములపై ఆధారితమై ఉన్నదని శీర్షిక తెలియజేస్తూ ఉంది.

సమకాలీన సమాజం వల్ల ప్రభావితుడు కాని కవి ఎవరూ ఉండరు. ఆ ప్రభావము ఇలా బహు విషయ సంకలితమై 'ఖండకావ్యం'గా ఆవిష్కృతమైంది. ఇందులో కవి పౌరాణిక పరిజ్ఞానము, భాషాభిమానము, ఆధ్యాత్మిక ఆసక్తి, ప్రకృతి ప్రేమ వ్యక్తమవుతూ ఉన్నాయి.

❀ ❀ ❀

# The Necessity of Effective English Communication for Engineering Students from Rural Areas and its Remedies

- ***Dr. Gudige Chandraiah***, Research Scholar CALTS, Humanities,University of Hyderabad.

**Abstract :**

This research paper expresses the importance of English Communication for Engineering students from rural areas and the problem faced by them during Academic as well as professional life and its remedies. In present scenario, majority of the students in Engineering colleges are from rural areas. They have very good knowledge in subject wise. They have lot of intelligence and thinking power to get admission for higher education buy the have poor Communication Competence especially in English Communication. So, During Academics and career they face a lot of problems. To be successful in studies and campus interviews,GD's. It is an essential to achieve English Communication competence. For Engineering students. It is a need to master in Communication skills.Because they are responsible for continuous growth and advancement of a Society and Nation a large Technically. Eventhough major works Performed by Engineers are technical in nature, their accomplishment depends extremely on the effectiveness with which they assimilate or disseminate technical information. The teachers and students need to make integrated efforts which include intiative and active participation of Teachers and Students learning method Comprising question answering Session. Role plays, GD's and Language Lab Session.

**Key Words :**

Communication Competence, English Language Lab, Computer Assisted Language Learning, Language Acquisition.

**Introduction :**

Living in atomic world, we are well past an age when the blow of a sword would base any Considerable threat for us. Today verbal blows appear mightier than physical ones. Essentially ours is a society that moves on the wheels of Communication. Particularly in Professional world. It is Communication and is related skills that decide a Person's Career Curve. The better one's Communication Skills, the higher are the chances for him/her to touch the zenith of success. The poor one's Communication Skills, the greater is the possibility of not achieving one's goals. Today if we observe carefully in society. Many students of Engineering have been faced several problems due to lack of English Communication especially rural back ground students. English being a Global Language, Communicating fluently in English has become mandatory for those who aspire to Communicate well in the professional and Academic Areas. All the four Skills are equally important and proficiency is required to become good communicator. Reading and Listening are receptive skills. Writing and Speaking are called productive skills.

Engineering is a multi disciplinary profession. Where Engineers have to coordinate and Communicate effectively with a diverse team,

as well as express complicated concept to a non-techinical crowd. The importance of learning English language is as a key language of international business. It tells that English can be learnt by the students from rural areas by integrating different method of language acquisition. English Language is the current Lingua Fance of the international business, technology, aviation, diplomacy banking computing medicines, Engineering and Tourism. About one fifth of people all over the world know more or less about English. Today, English is spoken by 1.8 billion people in the world and the number still increasing. Almost every single University in the world are conducting Scientific studies in English. Today 60% of Ratio programmes are broadcast in English. More than 80%of the content or address of mailing letters are written in English. English plays an essential Role in the entire world.

**Importance of English Communication for Engineering students :**

Engineering is one of the biggest fields of study in the world. First of all English is a essential tool that particularly effect Engineering students in Academic life. English has become an essential one for internal communication and a fairly high degree of proficiency in English and excellent communication skills in speaking and writing enhance students employability. The career purposes of the Language has been gain importance of Engineering students. English for professional purposes, like facing interviews, writing resumes, writing reports, conducting campaigns, writing letters, participating in meetings, seminars conferences and group discussions are very demanded. English for social role and interacting in social contexts is considered essential more than two third of the world. Scientific papers published annually are written in English. While most of the theories in Engineering are taught in English. Every Engineering students should have good English communication competence. In Academic life, Engineering students have to deal with the innumerrable English Lectures, tutorial labs, project reports. Internet is the best resource for the Engineering students to enhance their skills in day today life. Even Internet also provides most of the information in English. During the job seeking process in Interviews, Group discussions. it is an essential tool to achieve mastery in English Proficiency. After getting the job.Every Engineering student should have to work in groups since their task seldom be solved by an individual .

Being an engineer requires to co-operate and communicate with different people from different part of the world. English is used as living Language or working Language on large extent . In order to co-operate and co- ordinate with the colleges , Engineers should have to speak fluent English. The ability to communicate ones ideas and attitude agreeing, disagreeing, convincing, narrating , requesting, ordering, explaining and apologizing is the expected skill not the ability to interpret to literary text .It is a communicate skill in English that are essential as we live in a global village. Where English is widely used not only between native speakers and not only native speakers of English but also among non native speakers themselves as it has become the language of business and commerce, trade and technology ,journalism and electronic media, the internet and **IT-**

enabled services. So ,English communication competence plays an essential role in the Academic life and career of Engineering students in day today life.

**Problems faced by Engineering Students from the Rural Areas :**

In our country about 80% students of the Engineering are from rural areas and most of them are coming through regional Language medium school. Here mother tongue is dominated among the students. Even though they have entered into Engineering colleges. They have not expressed their skills that is internal skills in English properly. They have lot of ideas and intelligence but lack of English fluency competence. They lose their chances in Interviews pannels, In the today globalization English is the key to open any locker in Academics as well as career in every Engineering students life. Now Let us examine the reasons which make English as a souring grape for rural students even today in this post modernism.

**Socio Economic Backgounding Family :**

Students are from different back ground of Family in every class room. Among some are poor, middle class and rich educated. Each students has different lifestyle. When we come to English fluence and knowledge. Few students have that much of capability to show his English fluence and accent. They do not express because of their family background. Some parents are Literally illiterate, and belong to below poverty Line. It is found that the English Communication competence of the students who's parents are Literate belongs to higher middle class is better than that of the students whose parents are illiterate and belongs lower middle class. Educated parents can provide good education to their childern in school level on wards especially in the development of English Language Skills. They consult the Teachers about childs progress and guide him/her at home to perform better. Incase of other students they lack of parental supervision and guidance from to the higher education. Here we observe that motivation, awareness, Language usage is very important to develop the student to enhance his English competence in day to day life.

**Lack of Skillful Teachers :**

The most important factor is the education system and lack of untrained skill Teachers make the students to become unsuccessful in the fluence of English competition in present days. Teachers do not have proper knowledge on English Langauge especially Vocabulary. Accent, Intonation and Phonetics knowledge. They don't know the present Advanced Technique of English Language [usage] Teaching. [ELT] The condition is same with the regional medium as well as the English medium primary and higher secondary schools in rural and Semi Urban Area. Teaching learning process is much exam result oriented. They conduct exam and make the students to get more marks and more memory power alone. Here, Indirectly students are habituated by heart method as a result, English seem to be a dreadful demon for the students. This right remains in the mind till higher education because lack of proper guidance. students also give more priority for exam oriented especially in Technical subjects. They have less knowledge in English communication potentiality.

**Education System :**

The other essential factor is the traditional education system which effects English Language Learning and Acquisition. Here students are trainined and well instructed to concentrate on reading and writing. We know very well reading, writing, listening and speaking skills are basic skills. [LSRW] . For long age students are concentrated on reading and writing. But listening and speaking skills are neglected and simply avoided. Learning is the basic skill which makes speaking possible. Here speaking depends on listening skill. Learning Language is taken place through active listening. When baby is born he/she is learnt by listening and learn the Language that is why Listening is the beginning of learning . Our present education neglects the importance of listening which result in lack of skill in speaking . Usage of computers and Internet , powerpoint presentation are very basic tools now days in education system to develop the students in English fluency acquisition especially for professional students like Engineering students.

**Lack of Exposure to the English Communication :**

The Engineering students who belongs to rural areas have lack of English communication in the family , society as well as in the college premises . Therefore , The meritorious students also fail to achieve success during personal interviews .

Many students do not have proper English communication skills , soft skills, interpersonal skills and personality development .During academic period students have no confidence to express his /her opinions effectively in English communication . They feel inferiority complex as a result students keep themselves lonely and isolated to each other.

**Remedies :**

Today in global erina every Engineering student should know the importance of English communication competence in present market everywhere. Students as well as teachers should make integrated efforts in order to become successful in the English communication Every student and teacher should feel moral responsibility to make more efforts to provide more exposure to English Language. The Role of English teachers have lot of responsibility to make the students well in speaking of English in every aspect. Every Teacher is creator. He creates wonderful result among the students for better society everywhere. The English Teacher should make the student to involve like group discussion, Individual Topics, Daily conversations, role play as well as Debates. Students also should take more responsible and keen interest in every Engineering Student should have more responsiblity to society. All the Student should feel free and Communicate freely to each other in various levels in their daily life . This kind of activities should start from higher secondary level to university level to become better English communication in society . The Technical teachers also should help the students to give various kind of Academic work like conducting workshops ,paper presentations , group discussion interviews as well as Debates in the subject wise for the growth of better way in the students life . Grammar should be taught in the form of application oriented to the students in daily life . The English teacher always remember and inspire to know the importance of English communication in professional way

of life .Every Engineering student should utilise the resources like English lab Internet ,Mobile usage ,Debates ,Group discussion ,Interview panels , Mock interviews, usage of vocabulary ,spoken English in every where in day today life .These resources are very useful to the students and make them successful in their career especially in English communication. Every student should focus on Technology and use it for sake of his /her better life in professional competition field .Unless and until students involve , there is no any fruit in his / her career. Even teacher also should take refresh courses which are conducted in various centers in the Universities. This type of Advanced knowledge always applicable to the students by teachers is very important to see the growth among the students of Engineers in present society. Students also read lot of journals. Listen various kind of Programmes, English News on Television or by Radio. English Novels magazines. Daily News paper like Hindu. Deccan chronicle, Times of India, Indian express are very very essential to make the students to boost in English Communication. At Last But Not Least I should conclude my paper that every Engineer is a wonderful creator in the present society. The Innovation is depend on the students communication Potentiality. When students acquire good and Commandable knowledge on English communication he/ she can do more wonders in his career. That type of students are very essential to our Country to become better country in the world. The English Language make the students to beautify in order to become beautiful communication in society.

**Conclusion :**

English Communication Skills are recognized as the important tools in the Academic life and Career of the engineering students. It require to make use of integrated method to facilitate advanced communication skills, which in very essential of Industry as well as society.

The rural students of Engineering should effectively make use of the faculty, education system and Technology in proper order. Every students should emerge as a competent use of English communication to become successful in life and his/her career.

**References :**

1. Communication Skills by Sanjay Kumar, Pushpa Latha Oxford University press. Published in 2015, New Delhi.
2. Communication and Soft Skills by The ICFAI University Hyderabad, 2003.
3. Fundamentals of Teaching English by Dr.R.A. Sharma. Meerut University, Meerut, 2004.
4. ISTE-International society for Technology in Education http/www.iste.org.

✿ ✿ ✿